# ప్రాచీనాంధ్ర నౌకాజీవనము



భావరాజు వేంకట కృష్ణరావు

# ప్రాచీనాంధ్ర నౌకాజీవనము

భావరాజు వేంకట కృష్ణరావు

ఫోన్: 24652387
నవోదయ బుక్ హౌస్
ఆర్య సమాజ్ ఎదురు సందు,
కాచిగూడ చౌరాస్తా,
హైదరాబాద్ - 500 027.

ప్రాచీ పబ్లికేషన్స్
హైదరాబాదు

915.484
C.14701

Pracheenaandhra Naukajeevanamu
(Maritime History of Ancient Andhra)
Bhavaraju Venkata Krishna Rao

All Rights reserved

Publication : First edition 1923
Second edition: January, 2003

Price : Rs. 75/-

**ISBN : 81-7443-012-1**

A C.No. 97674

Title Chandra

Edited & Published by PPC Joshi
for Prachee Publications
3-3-859/1/A, 2nd flr, lane opp Arya Samaj
Kachiguda, Hyderabad - 500 027
Ph . 040-2460 2009

Type setting Sai Graphics, Narayanaguda, Hyderabad - 29
Printed at · Charita Graphics, Chikkadpally, Hyderabad - 20

సుప్రసిద్ధ చరిత్ర పరిశోధకులు

## శ్రీ భావరాజు వేంకట కృష్ణరావు

సుప్రసిద్ధ చరిత్రకారులుగా, శాసనపరిశోధకులుగా, రాజమహేంద్రవరంలోని ఆంధ్రదేశీయేతిహాస పరిశోధక మండలి సంస్థాపకులలో ఒకరిగా, రచయితగా, న్యాయవాదిగా, అవిభక్త మద్రాసు రాష్ట్ర మతధర్మాదాయ శాఖ కమీషనర్‌గా ఖ్యాతినార్జించిన శ్రీ భావరాజు వేంకట కృష్ణరావుగారి జీవితంలోని స్మరణీయ ఘట్టాలు –

కృష్ణరావుగారు 1895లో రాజమహేంద్రవరంలో జన్మించారు. తల్లి శ్రీమతి శ్యామలాంబ, తండ్రి బాపిరాజు పంతులుగారు. బాపిరాజుగారు 'చిత్తబోధామృతం' అనే గ్రంథం రచించి ఖ్యాతినార్జించారు కృష్ణరావుగారు ప్రయిమరీ విద్య కైకలూరులోను, సెకండరీ విద్య బందరు నోబుల్ కాలేజీ హైస్కూలులోను అభ్యసించి 1912లో ఎస్ ఎస్.ఎల్ సి లో కృతార్థులయ్యారు. విశాఖపట్టణంలోని ఎ వి యన్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివి, మద్రాసులో బి ఏ. మరియు బి.యల్. డిగ్రీలు గైకొన్నారు వారు బి.యల్. డిగ్రీ ప్రథమ శ్రేణిలో మద్రాసు యూనివర్సిటీ అంతటికీ ద్వితీయులుగా 'ఉత్తీర్ణులవ్వడం విశేషం. వారు 'ఎర్లీ డైనాస్టీస్ ఆఫ్ ఆంధ్రా కంట్రీ'' (Early Dynasties of Andhra Country) అనే చరిత్ర గ్రంథం రచించి 1938 లో ఆంధ్ర విశ్వవిద్యాలయానికి సమర్పించగా, వారికి యూనివర్సిటీ ఎం.ఏ. డిగ్రీని ప్రసాదించింది.

1920 నుండి 1943 వరకు కృష్ణరావుగారు రాజమహేంద్రవరంలో న్యాయవాద వృత్తిలో నున్నారు 1943లో వారు అవిభక్త మద్రాసు రాష్ట్రంలో మతధర్మాదాయ శాఖ (Religious Endowments Department) కమీషనర్‌గా చేరి 1948 వరకు ఆ పదవిలో పనిచేశారు. 1948 నుండి వారు కొంతకాలం హైదరాబాదు రాజ్యంలో మత ధర్మాదాయ శాఖలో స్పెషల్ ఆఫీసర్‌గా ఉద్యోగించారు. తరువాత వారు రాజమహేంద్రవరం తిరిగి వచ్చి న్యాయవాద వృత్తిలో ఉంటూ, 1957లో పరమపదించారు. 1922 లో రాజమహేంద్రవరంలో ఆంధ్రదేశీయేతిహాస పరిశోధక మండలిని స్థాపించిన నలుగురు ప్రముఖ చరిత్రకారులలో కృష్ణరావు గారొకరు మిగతా ముగ్గురు శ్రీయుతులు చిలుకూరి వీరభద్రరావు, డా. చిలుకూరి నారాయణరావు, మల్లంపల్లి సోమశేఖర శర్మగారలు

కృష్ణరావుగారు ఈ పరిశోధక మండలి ప్రథమ కార్యదర్శియేకాక కొంతకాలం ఆంధ్రదేశీయేతిహాస పరిశోధకమండలి పత్రికా సంపాదకులుగా కూడా వ్యవహరించారు వారు పరిశోధక మండలి పక్షాన రాజరాజనరేంద్రుని నవమ శతవార్షికోత్సవ పట్టాభిషేక మహోత్సవాన్ని రాజమహేంద్రవరంలో జరిపి ఆ సందర్భంలో 'రాజరాజనరేంద్ర పట్టాభిషేక సంచిక'ను తమ సంపాదకత్వంలో ఆవిష్కరించడం విశేషం

వారు గొప్ప చారిత్రకులు, అనేక గ్రంధాలను రచించారు అందులో 1. రాజరాజనరేంద్రుడు 2. ప్రాచీనాంధ్ర నౌకాజీవన చారిత్రము 3 ఆంధ్ర దేశము, విదేశయాత్రికులు 4 Early Dynasties of Andhra Country (A D 200-625) 5. అప్పాజీ (నాటకం) 6. శ్రీనాథుని యింటవిందు (నాటకం) మొదలైన రచనలు గావించి ప్రకటించారు వారు 'తూర్పు చాళుక్యరాజు' లపై పరిశోధన గావించి ఒక గ్రంథాన్ని రచించి మరణించగా కృష్ణరావుగారి సతీమణి శ్రీమతి హైమవతిగారు దానిని ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీకి అందజేశారు దానిని అకాడమీ వారు 1973లో 'History of the Eastern Chalukyas of Vengi (A D 610-1210)' అన్న పేరుతో ప్రకటించారు.

కృష్ణరావుగారు రచించిన నూరుకు పైగా వ్యాసాలు (చరిత్ర, శాసనములు, కథలు, నాటకములు, మతము, దేవాలయములు, ప్రముఖుల జీవితములు, ఆంధ్రోద్యమము, ప్రాచీన నగరములు, పురావస్తు పరిశోధనము మొదలైన వివిధాంశాలపైన) భారతి, ప్రబుద్ధాంధ్ర, ఆంధ్రపత్రిక ఉగాది సంచిక, జయంతి, శారద, కిన్నెర మొదలైన తెలుగు పత్రికలలోను, చరిత్రకు, శాసనములకు సంబంధించినవి Epigraphia Indica, Journal of the Andhra Historical Research Society (Rajahmundry) మరియు Journal of the Bihar and Orissa Research Society అను పత్రికలలోను ప్రకటింపబడ్డాయి

కృష్ణరావుగారు మంచి వక్త వారు పలు చారిత్రకాంశాలపైన ఇంగ్లీషులోను, తెలుగులోను అనర్గళంగా తమ వాగ్విన్యాసవైఖరితో ఉపన్యసించి సభాసదులను ఆకట్టుకొనేవారు వారు నాటక, సంగీత, చిత్రలేఖనాల యెడల అనురక్తి కలిగి ఉండేవారు. ఎం.ఏ విద్యార్థులకు పరీక్షాధికారిగా కూడా వ్యవహరించారు.

వారు వృత్తిరీత్యా న్యాయవాదియైనా, ప్రవృత్తిమాత్రం చరిత్రపరిశోధకులుగా నుండి ఆంధ్రదేశంలో సుప్రసిద్ధ చరత్ర పరిశోధకులుగా అజరామరమైన ఖ్యాతి నార్జించారు.

– రాపాక ఏకాంబరాచార్యులు

# ఆంధ్రదేశీయేతిహాస పరిశోధక మండలి

ఆంధ్రుల సాంస్కృతిక రాజధానిగా ఖ్యాతి గాంచిన రాజమహేంద్రవరంలో 1922లో ప్రఖ్యాత చారిత్రకులు, సాహితీవేత్తలైన శ్రీయుతులు చిలుకూరి వీరభద్రరావు, చిలుకూరి నారాయణ రావు, భావరాజు వేంకట కృష్ణరావు, మల్లంపల్లి సోమశేఖర శర్మగారలు ఆంధ్రదేశీయేతిహాస పరిశోధక మండలిని నెలకొల్పారు ఈ సంస్థ స్థాపించిన నాటికే చరిత్రకారులుగా ఖ్యాతి నార్జించిన చిలుకూరి వీరభద్రరావుగారు ఆంధ్రుల చరిత్రము మూడు సంపుటాలు వెలువరించి ఆంధ్రుల గతవైభవాన్ని చాటిచెప్పారు. నారాయణరావుగారు చరిత్ర, సాహిత్యము, భాషలలో గొప్ప పండితులేకాక శతాధికగ్రంథాలను ప్రకటించిన ప్రఖ్యాత రచయిత కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు గారి తర్ఫీదు పొందిన మల్లంపల్లి వారు దరిమిలా శాసనాలశర్మగాను, హిష్టరీ ఆఫ్ ది రెడ్డీ కింగ్‌డమ్సు, ఎ ఫర్గాటెన్ చాప్టర్ ఆంధ్రా హిస్టరీ రచయితగా విజ్ఞాన సర్వస్వం – మూడు, నాలుగు సంపుటాల – (చరిత్ర – తెలుగు సంస్కృతి) రూపశిల్పిగా ఖ్యాతి గడించారు.

ఈ పరిశోధక మండలి నిర్వహించిన త్రైమాసిక పత్రిక – Journal of the Andhra Historical Research Society లో అనేకమంది చరిత్ర పరిశోధకులు, సాహితీవేత్తలు, భాషాశాస్త్రజ్ఞులు, లలితకళాకోవిదులు వివిధ విషయాలపై వ్యాసాలు వ్రాశారు. అందు శాసనములు, రాజుల చరిత్రలు, ప్రసిద్ధ చారిత్రక స్థలములు, పురావస్తుశాస్త్రమునకు సంబంధించిన విషయములు, దేవాలయ వాస్తువు, నాణెములు, తెలుగు సాహిత్యము – భాషావిషయికములు, మతములు, లలితకళలు, శాస్త్రములు, కులములు, విద్య, పరిపాలన మొదలైన పలు విషయాలపై అసంఖ్యాకంగా పరిశోధనా వ్యాసాలు ఈ పత్రికలో ప్రకటింపబడ్డాయి

ఈ పత్రికకు కొంతకాలం భావరాజు వేంకట కృష్ణరావు, మరికొంత కాలం రాళ్లబండి సుబ్బారావు, కొంతకాలం న్యాపతి కామేశ్వర రావుగారలు, ఈ సంస్థ

ప్రభుత్వంవారు స్వీకరించిన తరువాత శ్రీయుతులు డా॥ ఆర్.సుబ్రహ్మణ్యం, డా॥ ఎన్. రమేశన్ గారలు సంపాదకత్వం నిర్వహించారు

ఈ పరిశోధకమండలి ఆధ్వర్యంలో భావరాజువారి సంపాదకత్వంలో రాజరాజ నరేంద్ర పట్టాభిషేక సంచిక, వడ్డాది అప్పారావుగారి సంపాదకత్వంలో రెడ్డిసంచిక, రాళ్ళబండి సుబ్బారావుగారి సంపాదకత్వంలో కళింగ సంచిక, వేంగి సంచికలు, మారేమండ రామరావుగారి సంపాదకత్వంలో కాకతీయ సంచిక, భావరాజువారి సంపాదకత్వంలో విజయనగర సంచిక ప్రకటింపబడ్డాయి ప్రభుత్వం ఈ సంస్థను తీసుకొన్న తర్వాత డా॥ ఆర్. సుబ్రహ్మణ్యం గారి సంపాదకత్వంలో మల్లంపల్లివారి స్మారక సంచిక, నేలటూరివారి స్మారక సంచిక, వెలువడ్డాయి.

శ్రీ రాళ్ళబండి సుబ్బారావుగారు రాజమండ్రి ప్రభుత్వకళాశాలలో చివరగా పనిచేసి రిటైర్ అయిన తర్వాత ఈ సంస్థ నిర్వహణ బాధ్యతలు చేపట్టి దాని కార్యదర్శిగా 1966 వరకు దక్షతతో సమర్ధవంతంగా నిర్వహించారు. సంస్థ ఆర్థికంగా నిలదొక్కుకోలేని పరిస్థితిలో సుబ్బారావు గారు నిర్వహణ బాధ్యతలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అప్పజెప్పి, తాను అందులో గైడ్ లెక్చరర్‌గా బాధ్యతలు స్వీకరించి కొంతకాలం పనిచేసి 18-8-1969వ తేదీన పరమపదించారు

ఆ సంస్థ ఈ నాడు శ్రీ రాళ్ళబండి సుబ్బారావు ఆర్కియలాజికల్ మ్యూజియం అన్న పేరుతో గోదావరి గట్టుప్రక్కన రోడ్ కమ్ రైల్‌బ్రిడ్జి సమీపంలో విలసిల్లుతున్నది. ఇందులో అతి ప్రాచీనమైన గ్రంథాలయం ఒకటి ఉన్నది. అందు భారతదేశచరిత్రకు సంబంధించిన జర్నల్సు, ప్రఖ్యాత చరిత్రకారులు, సాహిత్యవేత్తలు రచించిన విలువైన గ్రంథాలు ఎన్నో ఉన్నాయి. అంతేకాక ఈ మ్యూజియంలో అనేక తామ్రశాసనాలు, శిలాశాసనాలు, శిలావిగ్రహాలు, తాళపత్ర గ్రంథాలు, స్వర్ణ, రజత, తామ్రలోహముల నాణెములు, పూసలు, మైక్రోలిత్సు, మృణ్మయపాత్రలు మొదలైనవి చాల ఉన్నాయి. ప్రతిదినము సందర్శకులు ఈ మ్యూజియంను దర్శించి ఆంధ్రుల గతవైభవాన్ని కన్నారా చూచి ఆనందించి వెళుతుంటారు.

ఆంధ్రుల గత చారిత్రక వైభవాన్ని చాటే పురాతన సంస్థలలో రాజమహేంద్రవరంలోని ఆంధ్రదేశీయేతిహాస పరిశోధక మండలి అగ్రగామిగా ఈ నాటికీ నిలచి ఉన్నది

– రాపాక ఏకాంబరాచార్యులు

# విషయసూచిక


ఈ కూర్పు గురించి

ముందుమాట డా॥ వి.వి.కృష్ణశాస్త్రి

తొలి కూర్పు : స్వవిషయము

గ్రంథకర్త విజ్ఞాపనము

1. ప్రస్తావన ... 1
2. ప్రాచీన హైందవ సారస్వతమునందాంధ్రుల సముద్రవాణిజ్య వ్యాపార సూచనలు .. 6
3 ప్రాచీన వస్తుసమూహమునందును, చిత్రకళలందును ఆంధ్రుల సముద్రవ్యాపార సూచనలు ... 17
4 హైందవవాణిజ్య ప్రాచీనత .... 22
5. ఆంధ్రమహాసామ్రాజ్య కాలము, క్రీ పూ 200-క్రీ.శ.250 .... 29
6. పల్లవ యుగము, క్రీ.శ.200-700ల .... 45
7. చాళుక్యరాజుల కాలము, క్రీ.శ. 700-1,200 .... 59
8. కాకతీయ త్రైలింగసామ్రాజ్య కాలము క్రీ.శ 1150-1350 వరకును ... 66
9. రెడ్డి, విజయనగర సామ్రాజ్య కాలములు క్రీ శ 1300 మొదలుకొని 1550వరకును ... 77
10. అంత్యదశ, క్రీ.శ. 1450 -1800 ... 90

ఉపసంహారము . ..102

అనుబంధాలు: ....106

1 ప్రాచీనాంధ్ర నౌకాజీవనము (1922) . ..121

2 ప్రాచీనాంధ్రదేశపు వర్తక పరిస్థితులు (1923) ....128

3. ప్రాచీనాంధ్రులు వారి వలసరాజ్య చిహ్నలు(1939)... 106

ఉపయోగపడిన గ్రంథములు ...134

పదసూచిక ....139

౨తరంగములు, 3.

# ప్రాచీనాంధ్ర నౌకాజీవనచారిత్రము.

గ్రంథకర్త

భావరాజు వేంకటకృష్ణరావుగారు,

బి. ఏ., బి. యల్.

(కార్యదర్శి : ఆంధ్రదేశీయేతిహాసమండలి.)

ప్రకాశకులు

జాతీయసారస్వతనిలయము,

రాజమహేంద్రవరము.

శా. శ. ౧౮౫౦; క్రీ. శ. ౧౯౨౮.

వెల ఒకరూపాయి.

తొలి కూర్పు ముఖచిత్రం (స్కాన్ ఇమేజ్)

# ఈ కూర్పు గురించి

1923 మార్చి లో యీ గ్రంథాన్ని ప్రచురించారు 'ప్రాచీనాంధ్ర నౌకాజీవన చారిత్రము' అని శీర్షికవున్నా, లోపలిపుటల్లో 'ప్రాచీనాంధ్ర నౌకాజీవనము, అనే వ్యవహరించారు ఈ కుదింపునే యీ కూర్పుకి శీర్షిక చేశాం

అప్పటికి సరళ గ్రాంథికభాషలో రాయడం ఎక్కువగా వాడుకలోకి వచ్చింది కృష్ణరావుగారు తమ తొలిరచన అయిన యీ గ్రంథాన్ని ఆ సరళ గ్రాంథికంలోనే రాశారు వారి శైలిని అలాగే వుంచుతూ, యిప్పటి పాఠకుల దృష్టితో కొన్ని మార్పుల్ని చేశాం 'అరసున్న'ల్ని విడిచిపెట్టి, అవసరమనిపించిన చోట్ల 'విసంధి' చేసి, ఎక్కువ మందికి తెలియని తెలుగు అంకెల బదులు అరబిక్ అంకెలు వాడాం కాని, శాసనాల, కావ్యాల ఉల్లేఖనాల్లో యీ మార్పులేవీ చెయ్యలేదు.

తొలి కూర్పులో అధ్యాయ శీర్షికలకి కంటె అధ్యాయ సంఖ్యకి ప్రాధాన్యత ఉండగా యిప్పుడు అధ్యాయ శీర్షికలకే ప్రాధాన్యతనిచ్చాం ఆయా పేజీల్లో వున్న 'అధోజ్ఞాపిక'లని ఆయా అధ్యాయాల చివరకి 'జ్ఞాపిక'లుగా జరిపాం. అలాగే 'గ్రంథసూచిక'ని గ్రంథకర్త పేర్ల అకారాదిక్రమం చేసి, జ్ఞాపికలలో సందర్భపడే గ్రంథనామాల్ని కూడా అందులో చేర్చాం. చివర్లో 'పదసూచిక'ను సమకూర్చాం.

తొలి కూర్పులో వున్న 'గ్రంథకర్త విజ్ఞాపనము'తోబాటు ప్రచురణకర్తల 'స్వవిషయము' మొదలైన ప్రచురణ చరిత్ర సూచించే సమాచారాన్ని విడవకుండా పొందుపరిచాం.

కృష్ణరావుగారు 1922-39 కాలంలో రాసిన సంబంధిత వ్యాసాలు మూడిటిని సేకరించి అనుబంధంగా సమకూర్చాం. వీటిలో, ఆయన శైలి వ్యావహారికంవైపు మొగ్గడాన్నే కాకుండా ఆంధ్రుల నౌకాజీవనము, వలసలు, నౌకావాణిజ్య వ్యాపారాల చరిత్ర పట్ల ఆయనకున్న నిరంతరాసక్తినీ, అస్తిగతమైన ఆంధ్ర జాతీయాభిమానాన్ని కూడా చూస్తాం.

ఈ మార్పుల్నీ చేర్పుల్నీ సహృదయులైన పాఠకులు ఆమోదిస్తారనీ, హర్షిస్తారనీ ఆశిస్తున్నాం.

ప్రాచీనాంధ్ర నౌకాజీవనము

ఈ గ్రంథాన్ని సంపాదించడంలోనూ, యీ కూర్పుని రూపుదిద్దడంలోనూ ఎందరో అప్తుల మిత్రుల శ్రేయోభిలాషుల సహృదయ సహకారం లభించింది

ముఖ్యంగా-

1996 ప్రాంతంలో యీ గ్రంథం గురించీ రచయిత గురించీ పిచ్చాపాటీగా చెప్పిన శ్రీ తిరుమల రామచంద్ర గారికి...

శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో వున్న యీ గ్రంథాన్ని యితర సమాచారాన్నీ కాపీ చేయించుకోవడానికి అనుమతినిచ్చిన శ్రీ ఎం ఎల్.నరసింహారావుగారికీ...

ఓపికగా పుస్తకాన్ని చదివి దీన్ని ప్రచురించాలన్న ఆలోచనని ప్రోత్సహించిన ఆచార్య వకుళాభరణం రామకృష్ణ గారికీ..

మొహమాటానికి కాకుండా పుస్తకాన్నంతటినీ శ్రద్ధాసక్తులతో చదివి ముందుమాట రాసిచ్చిన డా॥ వి.వి.కృష్ణశాస్త్రి గారికీ. .

కృష్ణరావు గారి గురించీ ఇతిహాసమండలి గురించీ ఎంతో సమాచారాన్ని సేకరించి సంక్షిప్తంగా రాసిచ్చిన శ్రీ రాపాక ఏకాంబరాచార్యులు గారికీ ..

అనుబంధ వ్యాసాల సేకరణకి తోడ్పడిన శ్రీయుతులు శ్రీరమణ, అన్నదానం చిదంబరశాస్త్రి, చలమచర్ల వేంకట శేషాచార్యులు, ఆర్వియార్.కె వి.యస్ అప్పాజీ గార్లకీ, రాజమండ్రి గౌతమీ గ్రంథాలయం, వేటపాలెం సరస్వతీ గ్రంథాలయం వారికీ..

కృష్ణ రావుగారిఫోటో వున్న 'విజ్ఞానసర్వస్వము' సంపుటాన్నందించిన శ్రీ బుడ్డిగ సుబ్బరాయన్ గారికీ...

ఓడ బొమ్మ వున్న శాతవాహన నాణెపు ఫోటోను అందజేసిన డా॥ ఇంగువ.కార్తికేయశర్మ గారికీ...

ముఖ పత్రాన్ని రూపొందించిన శ్రీ చంద్ర, సాయిగ్రాఫిక్స్ శ్రీ ఓ. వెంకటేశ్వర్లు, చరితగ్రాఫిక్స్ శ్రీ సుబ్బయ్య గార్లకీ..

కృతజ్ఞతాభివందనాలు

# ముందుమాట

కీర్తిశేషులు భావరాజు వేంకట కృష్ణరావు గారు భారతదేశ చరిత్రకారులలో అగ్రశ్రేణికి చెందినవారు వారి సమకాలీన చరిత్ర రచయితలకే గాక నేటివారికి గూడా తలమానిక మనడం అతిశయోక్తికాదు. వారి రెండు ముఖ్య గ్రంథాలు 1 Early Dynasties of Andhra Country 2 History of the Eastern Chalukyas of Vengi చరిత్ర రచనకు ఒరవడి దిద్దుతాయి అవి నేటికీ ప్రమాణ గ్రంథాలు. వారి పరిశోధనా పటిష్ఠతకు, విస్తృత విజ్ఞానానికి మరొక తార్కాణం ప్రాచీనాంధ్ర నౌకాజీవనం. వారి రచనలన్నీ ఆంధ్రదేశానికే పరిమితమవడంచేత విశిష్ఠ చరిత్రకారులయిన ఆర్.కె. ముఖర్జీ, భండార్కర్, జయస్వాల్, నీలకంఠ శాస్త్రి, హెచ్. కృష్ణశాస్త్రి మొదలయిన వారి రచనలతో నిస్సందేహంగా భావరాజువారి రచనలు సమాన లేక ఉన్నత స్థాయికి చెందినవయినప్పటికీ వారార్జించిన కీర్తి భావరాజువారికి లభింపలేదు. ఆంధ్రదేశ చరిత్ర వ్రాయబూనిన ప్రతివారు మూలస్తంభాలవంటి భావరాజువారి గ్రంథాలను పఠించకపోతే ఆ రచనలు అసంపూర్ణంగానే పరిగణింపబడతాయి.

భారతదేశానికీ పాశ్చాత్య దేశాలకు మధ్య వ్యాపార సంబంధాలు అలెగ్జాండరు దండయాత్ర తరువాతనే ప్రారంభమయినప్పటికి అంతకు చాలా శతాబ్దాల ముందునుండే భారతదేశం గురించి తెలుసుకోవాలని పాశ్చాత్య దేశాలలో చాలా కుతూహలం ఉండేది. క్రీ.పూ 5వ శతాబ్దపు వాడయిన హెరోడోటస్ భారతీయులు వారి రాజుకు బంగారపుపొడి రూపంలో పన్నులు చెల్లిస్తారని, అక్కడ అనేక జాతులవారున్నారని, వారు వేరువేరు భాషలు మాట్లాడుతుంటారని, అక్కడ మిగిలినదేశాలన్నింటి కంటె అత్యుత్తమమైన వస్తువులున్నాయని, సమతుల్యమైన వాతావరణం కలిగి ఉన్నదని, అన్ని రకాల జంతువులు, పక్షులు మిగిలిన దేశాలలోకంటె పెద్దగా ఉంటాయని, అక్కడ లెక్కలేనంత బంగారం లభిస్తుందని - కొంత త్రవ్వితీసినది, కొంత నదులలో లభించేది, కొంత చీమలు పోగు చేసింది - అక్కడ కొన్ని చెట్లు పళ్ళకు బదులు ఉన్ని (దూది) నిస్తాయని భారతీయులు ఆ ఉన్నితో చేసిన దుస్తులు ధరిస్తారని

వ్రాశాడు. రోమన్ చక్రవర్తి అగస్టటన్‌కు సమకాలీనుడైన (క్రీ.శ 1వ శతాబ్దం) స్ట్రాబో అనే రచయిత భారతదేశంలో ఔషధాలకు పనికివచ్చే మొక్కలు, వేళ్ళు లభిస్తాయని వీటిలో కొన్నింటితో రంగులు తయారుచేస్తారని, అక్కడి వాతావరణం సమతుల్యంగా ఉండి కావలిసినంత నీరు లభ్యమవడంచేత ఎక్కువ ఉత్పాదకతకల భూచర జలచరజంతువులు చాలా పెద్దగా పెరుగుతాయని వ్రాశాడు. భారతదేశం గురించి సత్యాలు, అసత్యాలు కలగాపులగం చేసి విపులీకరించిన వారిలో స్ట్రాబో ప్రథముడు

స్ట్రాబోకు సమకాలీనుడైన ప్లినీ భారతదేశాన్ని గురించి మరింత విపులంగా వ్రాశాడు ఒక విషయాన్ని పాఠకులచేత నమ్మింపజేయడానికి అభూతకల్పనలు అల్లడంలో ప్లినీకి ప్లినీయే సాటి. భారతదేశంలో ఒక ప్రాంతంలోని ప్రజలకు జరాభారమనేదే తెలయదని, కొందరు 130 సంవత్సరాలు జీవిస్తారని, కలింగమనిపిలిచే ప్రాంతంలో స్త్రీలు పంచవర్ష ప్రాయంలోనే గర్భం దాలుస్తారని కాని ఎనిమిది సంవత్సరాలకంటె ఎక్కువ కాలం బ్రతకరని వ్రాశాడు. ఎన్ని అసత్యాలు, అభూతకల్పనలు వున్నా ప్లినీ వ్రాసిన గ్రంథం క్రీ.శ ఒకటవ శతాబ్దంనాటి భారతదేశ పరిస్థితులను తెలిసికొనడానికి అమూల్యమైనది.

సెలూసిడ్ రాజులకు ప్రతినిధులయిన మెగస్తనీస్, తరువాత దీమెకోస్‌లు మౌర్య దర్బారులో ఉండేవారు. ఫిలడెల్ఫస్ టోలమీ అనే ఈజిప్టుదేశపు రాజు 'డియోనిసియో'ను తన ప్రతినిధిగా మౌర్య దర్బారుకు పంపాడు. ఈ పైన చెప్పిన ముగ్గురు రాయబారులు నాటి భారతదేశ స్థితిగతులను ప్రత్యక్షంగా చూసి, గ్రంథస్థం చేశారు. క్రీ.శ. మొదటి శతాబ్దంలో ఒక అజ్ఞాత రచయిత దక్షిణ భారతదేశంలోను, సింహళద్వీపంలోను పర్యటించి 'పెరిప్లస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సీ' అనే గ్రంథాన్ని వ్రాశాడు క్రీ శ. రెండవ శతాబ్దిలో ఈజిప్టుదేశీయుడు టోలమీ వ్రాసిన 'ప్రాచీన భారతీయ భూగోళం' అనే గ్రంథం పైన చెప్పిన రచయితల గ్రంథాలన్నింటికంటె అమూల్యమైనది, వాస్తవమైనది ఈ గ్రంథం మీద సమగ్రంగా పరిశోధన చేయగల్గితే క్రీస్తుశకం రెండవ శతాబ్దినాటి, తరువాతి చారిత్రకయుగాలనాటి ఓడరేవుల, వ్యాపారకేంద్రాల, నదుల, పరిపాలనావిభాగాల పేర్లు మొదలయిన విశేషాలను గుర్తించడానికి వీలవుతుంది

తరతరాలుగా యుద్ధాలతో ఛిన్నాభిన్నమయిన యూరపును ఏకీకరణచేసి, శాంతి సౌభాగ్యాల కాలవాలమయిన రోమను సామ్రాజ్యకాలంలో భారతదేశానికీ పశ్చిమ దేశాలకూ మధ్య వ్యాపారసంబంధాలు ఉత్కృష్ట స్థాయికి చేరాయి. మధ్యధరాప్రాంత రాజ్యాలను మట్టుబెట్టి ప్రోగుచేసిన ధనరాసులతో

తులతూగుచున్న రోమను సామ్రాజ్యం తూర్పుదేశాల ప్రశస్త వస్తుసంపదలమీద మక్కువ పెంచుకుంది రోమను వ్యాపారులు ధనబలాన్ని, రాజకీయ బలాన్ని జోడించి విదేశవ్యాపారాన్ని చేజిక్కించుకున్నారు క్రీస్తుశకం ఒకటి, రెండు శతాబ్దాలలో రోమను చక్రవర్తులు మధ్యవర్తులు లేకుండా భారతదేశంతో నేరుగా వ్యాపారం చేయడానికి ప్రోత్సాహమిచ్చారు సముద్రతీరాలవెంట ప్రయాణం చేయడం కష్టనష్టాలతోకూడి ఉండటంచేత చాలామంది నావికులకు ధైర్యం చాలేదికాదు. అదృష్టవశాత్తు హిప్పోలస్ అనేవాడు క్రీ.శ. 45 ప్రాంతంలో దక్షిణ ఆసియా ప్రాంతంలో వర్షరుతువుంటుందని, ఆ రుతువుల్లో నైరుతి రుతుపవనాల ప్రభావంవల్ల ఎఱ్ఱసముద్ర ప్రాంతంనుండి ఇండియాకు సముద్రయానం సులభతరమై అతితక్కువ కాలంలో రాకపోకలు సాగింపవచ్చని తెలియజేశాడు. ఆరుతువులో సముద్రతీరం వెంట ప్రయాణం చేయాల్సిన బెడదలేకుండా భారతదేశానికి నేరుగా ప్రయాణింప వీలవుతుంది తీరాల వెంట ప్రయాణం సాగించే ఓడలను దొంగలు చుట్టుముట్టి దోచుకునేవారు నదులు సముద్రంతో కలసినచోట పెద్దపెద్ద ఇసుక దిబ్బలు ఏర్పడి ఓడలు కూరుకుపోయేవి. మరికొన్ని చోట్ల సముద్రంలో దాగిన కొండలకు ఓడలు తగిలి విచ్ఛిన్నమయేవి సముద్రపు లోతుప్రాంతాలలో ప్రయాణించే ఓడలకుగూడా కొన్ని ప్రమాదాలు తప్పేవికావు చైనా యాత్రికుడు ఫాహియాన్ క్రీ.శ. 399–413 ప్రాంతంలో భారతదేశాన్ని సందర్శించాడు తన తిరుగు ప్రయాణం గురించి ఇలా వ్రాశాడు.

'ఈ సముద్రంలో చాలామంది ఓడదొంగలున్నారు. వారు క్షణంలో ఓడమీద పడి సర్వనాశనం చేస్తారు. సముద్ర గర్భం అంతూదరీ కానరాకుండా ఉన్నది. తూర్పుదిశగా ప్రయాణిస్తున్నదో, పడమటకు ప్రయాణిస్తోందో తెలుసుకోవడం అసంభవం. సూర్యచంద్రుల, నక్షత్రాల ఉనికిబట్టే దిక్కులు తెలిసికొనగలం వానకురుస్తున్న రాత్రి అయితే గాలివాలునుబట్టి ఓడను నడిపించడం తప్ప వేరే మార్గంలేదు చీకటి రాత్రుల గాఢాంధకారంలో పెద్దపెద్ద అలలు ఒకదానికొకటి కొట్టుకుని నిప్పులా మెరుస్తూంటాయి. రకరకాల భయంకర జలచరాలు గుంపులు గుంపులుగా ఓడచుట్టూ తిరుగు తుంటాయి. ఓడ ఏదిశగా పయనిస్తున్నదో తెలియక నావికులు చేష్టలుడిగి, భయభ్రాంతులవుతారు. సముద్రం అగాధం. ఎల్లలు కానరావు లంగరుదింపి ఓడను నిలిపే అవకాశమేలేదు వాతావరణ పరిస్థితులు చక్కబడ్డాక సరియైన త్రోవలో ఓడ నడుస్తుంది. ప్రతికూల వాతావరణంలో నీళ్ళలో దాగిన రాతిగుట్టలను ఓడలు తాకితే బ్రతికి బయటపడటం కష్టం.' ఈవిధంగా 90 రోజుల ప్రయాణం చేసి ఫాహియాన్ జావాద్వీపం చేరుకున్నానని వ్రాశాడు.

దక్షిణ భారతదేశంలో పెద్ద పెద్ద ఓడలు కోస్తాతీరంవెంట తిరుగుతాయని, అవి తమిళనాడు ప్రాంతాన్ని చుట్టి వస్తాయని 'పెరిప్లస్' గ్రంథం ద్వారా తెలుస్తుంది. దుంగలను దగ్గరకు చేర్చి పెద్ద నావలను నిర్మించేవారట, వీటిని 'సంగర' అని పిల్చేవారట. తూర్పుదేశాలకు, గంగానదీ ముఖద్వారం వైపు తిరిగే ఓడలను 'కొలందియా' లని పిల్చేవారని పైగ్రంథంలో ఉన్నది. సంగర (సంగ్రామ) అనే పడవలు యుద్ధాలకు కూడా వాడి ఉండటం చేత ఆపేరు వచ్చి వుంటుంది. 'కొలందియా' అనే పదం కళింగకు భ్రష్టరూపంగా తోస్తున్నది. ప్రాచీన కాలంనుండి కళింగదేశం, కాళింగులు నౌకాయానానికి ప్రసిద్ధిచెందారు విదేశాలకు ఎగుమతి కావలసిన సరుకును – చిన్నచిన్న పడవల మీద నదీ మార్గాల ద్వారాను, బండ్లమీద భూమార్గాల ద్వారాను – సముద్రతీర రేవులకు చేర్చేవారు. అక్కడ నుండి బర్మా, కాంబోడియా, జావా, ఈజిప్టు మొదలయిన సమీప దేశాలకు భారతీయ నావలు చేరవేసేవి. గ్రీకులు, రోమన్లు పెద్ద పెద్ద ఓడలతో భారతీయ ఓడరేవులకు వచ్చి, వారికి కావలసిన సరుకులను నింపుకుని తిరిగిపోయేవారు. క్రీ.శ 13వ శతాబ్దిలో భారతదేశాన్ని సందర్శించిన మార్కోపోలో మనదేశంలో తయారయ్యే చిన్న నావల గురించి ఇలా వ్రాశాడు:

'ఇక్కడి నావలు చాలా నాసిరకమైనవి. చాలా నావలు మునిగి పోతూంటాయి. ఎందుకంటే వాటిని ఇనుపకొక్కాలతో బిగించరు. పెద్దపెద్ద చెక్కలను దగ్గరకు చేర్చి కొబ్బరితాళ్ళతో కడతారు. సముద్రపు నీటికి తుప్పుపట్టి చెడిపోయే ఆస్కారం లేదుగాని తుఫాను తాకిళ్ళకి తట్టుకోలేవు. ఓడల్లోనికి నీరు చొరకుండా తారువంటి పదార్థాన్ని వాడతారు ఒకరకం చేపనూనె (తిమింగలం) పూస్తారు. ఆ ఓడలకు ఒకే తెరచాపకొయ్య, ఒకే చుక్కాని ఉంటాయి. ఓడకు అంతస్తులు (decks) ఉండవు సరుకులు కుప్పలుగా పోసి తోళ్ళతో కప్పుతారు ఆ కప్పిన తోళ్ళమీద అమ్మకానికి తెచ్చే గుఱ్ఱాలను ఎక్కించి వాటిని ఇతర దేశాలలో లాభాలకు అమ్ముకుంటారు.' మార్కోపోలో వ్రాసిన ఓడలు అరేబియా దేశాలని కావచ్చు. భారతదేశానికి అరేబియానుంచే గుఱ్ఱాలు దిగుమతి అయేవి

భారతదేశంతో వ్యాపారం చేయడానికి రోమను వ్యాపారులను ప్రప్రథమంగా ప్రోత్సహించిన వారు అగస్టన్ చక్రవర్తి (27 B C - A D 14) అనేక భారత రాజప్రతినిధి బృందాలు రోమను చక్రవర్తి వద్దకు పంపబడ్డాయి. భారతదేశ రాజప్రతినిధులు రోమను చక్రవర్తులైన అగస్టన్, ట్రాజన్ (A D 98-117), హేడ్రియన్ (A D 117-138), ఆంటోనినస్ పయస్ (A D 138-161), హీలియో

బాలస్ (A D 218 - 222), అరీలియన్ (A D 270 - 275), కాన్స్టాంటైన్ (A D. 323-353), జూలియన్ (A D 361 - 363), మొదలయిన వారి వద్దకు వెళ్ళారు. మరొక రెండు బృందాలు జస్టినియన్ (A D 530 - 552) కాలంలో రోముకు చేరాయి

అమియానస్ మార్సెలినస్ అనేవాడు భారతదేశం నలుదిక్కులనుండి రోమను చక్రవర్తి జూలియన్ (A D 361) వద్దకు ప్రతినిధిబృందాలు వెళ్ళాయని వ్రాశాడు. క్రీస్తుశకం ఒకటవ శతాబ్ది లగాయితు రోమను సామ్రాజ్యంతో వ్యాపార సంబంధాలు శాతవాహన, పల్లవ, సాలంకాయన, చోళ, పాండ్య, చేరరాజుల కాలాలలో సాగినాయి. పర్యవసానంగా వ్యాపారం విపరీతంగా పెరిగింది ఒక చైనాదేశస్తుని వ్రాతనుబట్టి రోమను సామ్రాజ్యం పది వంతులు ఇండియాతోను ఒకవంతు పార్థియాతోను వ్యాపారంచేసేదట రోమను దేశీయుడు ప్లినీ వ్రాతలనుబట్టి ప్రతిసంవత్సరం ఇండియాకు అయిదుకోట్ల సెస్టర్‌సెస్‌లు (దీనారంలో నాల్గవభాగం) – అంటే 1 కోటి 25 లక్షల దీనారాలు – రోమను సామ్రాజ్యంనుండి చేరేవట

ఉత్తర భారతదేశంతో జరిగిన వ్యాపారం అంతా ఉపరితలమార్గాల ద్వారాను, దక్షిణ భారతదేశంతో సముద్రమార్గాల ద్వారాను జరిగేది ఉత్తరాదితో జరిగిన వ్యాపారం లాభనష్టాలు లేకుండా సరిసమానంగా ఉంటే దక్షిణ భారతదేశానికి విదేశవ్యాపారం చాలా లాభసాటిగా ఉండేది. ఫలితంగా దక్షిణాన కొన్నివేల రోమను బంగారు, వెండి నాణాలు లభించాయి. దక్షిణాది రాష్ట్రాలన్నింటి కంటె ఆంధ్రలో ఎక్కువగా ఈ నాణాలు లభించాయి. దేశీయ నాణాలకంటె రోమను నాణాలు గుండ్రంగా రోమను చక్రవర్తుల, రాణుల బొమ్మలు కలిగి కంటికింపుగా ఉండటం చేతను, విదేశీనాణాలు దేశీయంగా చలామణి కావడానికి నిషేధం లేకపోవడం చేతను శాతవాహన, చోళ, పాండ్య చక్రవర్తులకు తమతమ బంగారు నాణాలు ముద్రించాల్సిన అవసరమే లేకపోయింది. అప్పటి నాణాలకు ముఖవిలువలకంటె తూకపు విలువకే ప్రాధాన్యత ఉండేది. రోమను నాణాలకు చిల్లులు పెట్టిగాని, నకిలీ రోమను నాణాలు తయారుచేసి చిల్లులు పెట్టిగాని మెడలోధరించడాన్ని బట్టి వాటికి ఎంత ప్రజాదరణం ఉండేదో తెలుస్తుంది. చిల్లుబెట్టిన రోమను నాణాలు శాతవాహనకాలంనాటి పాటిదిబ్బల త్రవ్వకాలలో అనేకం లభించాయి.

క్రీస్తుశకం ఒకటవ శతాబ్దంనాటి ఆంధ్రలోని కొన్ని ముఖ్యవ్యాపార కేంద్రాల పేర్లు పెరిప్లస్ గ్రంథం ద్వారా తెలుస్తాయి. వీటిలో వరాలియా లేక వడనాడు

(నెల్లూరు, ఉత్తర ఆర్కాటు జిల్లాలు) లోని కమర, పొదుక (పూదూరు), సపాటమ (కొత్తపట్నం లేక కాల్పట్టణం) – ఇవి పల్లవులకాలంలో గూడా ముఖ్యవాపార కేంద్రాలు నెల్లూరు జిల్లాలోని పూదూరు త్రవ్వకాలలో పల్లవుల కాలంనాటి కోట, చుట్టూ అగడ్త, లోపల ఇటుకలతో నిర్మించిన భవనాలు లంభించాయి. కొత్తపట్నం లేక కోటపట్నం సమీపంలో శాతవాహనులకాలంనాటి పాటిదిబ్బ త్రవ్వకం జరిగింది పరాలియాలేక పడనాడుకు ఉత్తరాన మసాలియా (గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లా ప్రాంతాలు) విస్తరించిందని వ్రాశాడు. ఇక్కడ అతిసున్నితమయిన మస్లినులు (రవసెల్లాలు) లభిస్తాయని, అంతకు ఉత్తరాదినగల దొసరిన్ (కళింగ) ప్రాంతం ఏనుగుదంతాలకు ప్రసిద్ధి అని వ్రాశాడు.

పెరిప్లస్ గ్రంథంకంటె ఈజిప్టుదేశంలోని అలెగ్జాండ్రియా పట్టణవాసి అయిన టోలమీ వ్రాసిన 'ప్రాచీన భూగోళం' అనే గ్రంథంలో ఆంధ్రదేశానికి సంబంధించిన వివరాలు మరింత విపులంగా యథార్థంగా లభిస్తాయి. టోలమీ పరాలియా (నెల్లూరి ప్రాంతం)కు ఉత్తరాన అరవరనాయి అనే ప్రాంతాన్ని పేర్కొన్నాడు. ఈ అరవరనాయి ప్రాంతమే ఆరువేలనాడు లేక షట్‌సహస్ర దేశం. ఆరువేలనాడు రానురాను ఏరువనాడయింది ఆరువేలలో 'ఆరు' మరుగునపడి వెలనాడు అయింది.

ఈ 'అరవరనాయి' లేక ఆరువేలనాడులో పుదుకె (పూదూరు), మలంగ (మల్లంగూరు లేక నేటి గుంటూరుజిల్లాలోని అమీనాబాద్), టినానది (పెన్నా) ముఖద్వారం దగ్గరి కొట్టిస్, మనార్పాలు ముఖ్యవ్యాపార కేంద్రాలు. మలంగ లేక మల్లంగూరు బసర్‌నాగోస్ (బసవ నాగుడు) అనేరాజుకు ముఖ్యపట్టణం, ఈ బసవ నాగుని మనమడో మనిమడో పల్లవ వంశ మూలపురుషుడు 'చూత పుల్లవుడు'నే వానికి కన్యాదానంతో పాటు రాజ్యదానం గూడా చేశాడు.

అరవరనాయి (ఆరువేలనాడు) ప్రాంతంలోని ముఖ్య వ్యాపారనగరాలు కరుగ (కడప), పొలూర (నేటి పాలూరు), పికెండక (నేటి పెనుకొండ), అయిటూరు, ఇసుకపోలూరు, కందిపట్టణం మొదలయినవి పేర్కొనబడ్డాయి. అరవరనాయికి ఉత్తరాన మైసోలియా ప్రాంతం ఉందని టోలమీ వ్రాశాడు. ఈ మైసోలియా మహిషక పదానికి భ్రష్టరూపం. గతంలో విజయవాడనుండి రాజమండ్రి వరకు ఉన్న ప్రాంతాన్ని 'మహిషక' దేశం అని శాసనాలలో చెప్పబడింది. మైసోలియాలో మైసోలోస్‌నది (కృష్ణానది) ముఖద్వారం (హంసలదీవి?), కంటకశిల లేక ఘంటశాల, కొడ్డూర (కోడూరు), అలోసైని

(అవనిగడ్డ?) మొదలయిన నగరాలున్నాయని వ్రాశాడు. అలోసైని ఒక వ్యాపారకేంద్రమని ఇక్కడనుండి ఓడలు జావా, మలయా ద్వీపాలకు బయల్దేరుతాయని చెప్పాడు

దక్షిణ భారతదేశానికి రోమను సామ్రాజ్యానికి మధ్య జరిగిన వ్యాపారంలో మానవ, జంతు, వృక్ష, ఖనిజ సంబంధమయిన వస్తువులున్నాయి కొందరు బానిసస్త్రీలను (వారాంగనలు?) ఏడెన్ సమీపంలోని సాకొత్రానగరానికి పంపి అక్కడనుండి రోముకు ఎగుమతి చేసేవారు కొందరు పరిచారికలుగాను, కొందరు కొజ్జాలు, ఏనుగు తర్ఫీదుగాళ్ళు, వంటవాళ్ళుగాను పంపబడేవారు

ఎగుమతి చేయబడ్డ జంతువులలో ఖడ్గమృగాలు, ఏనుగులు, సింహాలు, చిరుతలు, చిలుకలు, కోతులు, నెమళ్ళు, పులులు, వేటకుక్కలుండేవి మూపురం గల వృషభాలు అనేకం పర్షియా, సిరియా, ఆఫ్రికా దేశాలకు చేరేవి.

క్రీస్తుపూర్వం 241 నాటికే హిందూదేశపు ఏనుగులు రోముకు ఎగుమతి కాబడ్డాయి అగస్టస్ చక్రవర్తి (1వ శతాబ్దం) కాలంలో తెల్ల ఏనుగులకు విపరీతమైన ఆకర్షణ ఉండేది. భారతీయ పక్షులలో అతిసుందరమయిన పింఛాలుగల నెమళ్ళు పర్షియాదేశం ద్వారా రోముకు చేరేవి. సర్పజాతులలో త్రాచుపాములు, కొండచిలువలు ఎగుమతి చేయబడేవి.

జంతు, వృక్షసంబంధమయిన వస్తువులలో నెయ్యి, నువ్వుల నూనె, పట్టు, పట్టువస్త్రాలు, నూలు బట్టలు, రవసెల్లాలు, మిరియాలు (గుండ్రనివి), పిప్పళ్ళు శొంఠి, తమలపాకులు, జటామాంసి, బాలింతబోలు, గుగ్గిలం, బెల్లం, చందనపు చెక్కలు, టేకు చెక్కలు, నల్లమద్ది, ఎఱ్ఱచందనం, కొబ్బరి కాయలు, కొబ్బరి నూనె, ఉల్లిపాయలు, కర్పూరం, చింతపండు, ఉసిరికాయలు, అరటికాయలు లేక పండ్లు, అనేక రకాల సుగంధ ద్రవ్యాలు (ఏలకులు మొదలయినవి) పంపబడ్డాయి

కళింగదేశంనుండి ఏనుగులు, ఏనుగుదంతాలు ఎగుమతి అయేవి. ఏనుగుదంతాలతో బొమ్మలు, కుర్చీలు, మంచాలు, కత్తిపిడులు, ఒరలు, రథాలు బళ్ళు, పుస్తకాల అట్టలు, టేబిలు కాళ్ళు, పిన్నులు, ఆభరణాల పెట్టెలు, పక్షుల పంజరాలు తయారుచేసేవారు. గైయస్ చక్రవర్తి తన గుఱ్ఱాలశాలను ఏనుగుదంతాలతో నిర్మింపచేశాడు.

పర్షియా సింధుశాఖ నుండి రోమన్లు కొంతవరకు ముత్యాలను దిగుమతి చేసుకునేవారు. కాని చాలాభాగం ఇండియా, శ్రీలంకలనుండే ఎగుమతి

కాబడేవి. మనదేశంలో తయారయిన శంఖాలతో చేసిన గిన్నెలు, చేతిగాజులు, చెవిపోగులను వాడడానికి రోమను స్త్రీలు మక్కువ చూపేవారు. ఖనిజాలలో రోమన్లకు బంగారంకంటె వజ్రాలంటే విపరీతమయిన ఆసక్తి. ప్రశస్తమైన వజ్రాలకు అనంతపురం జిల్లాలోని వజ్రకరూరు, కర్నూలు జిల్లాలోని రామళ్ళకోట, గుంటూరు జిల్లాలోని కొల్లూరు, కృష్ణాజిల్లాలోని పరిటాల అనాదిగా ప్రసిద్ధి. వజ్రాలతోపాటు అగేట్, కార్నీలియన్ (లేత ఎరుపురాయి), స్ఫార్ట్ (చంద్రకాంత), ఆనిక్స్ (గోమేధికం) మొదలయిన రాళ్ళు గూడా ఎగుమతి అయ్యేవి. అత్యుత్తమమైన చంద్రకాంతమణులకు, స్వచ్ఛమైన ఎఱుపురంగు రాళ్ళకు భారతదేశం ప్రసిద్ధి. రోమన్లు భారతదేశాన్ని ( భారతదేశంలో తయారయిన చంద్రకాంత పాన పాత్రలు) చేతధరిస్తేగాని మధుపానమత్తులు కాలేరని ప్లినీ వాపోయాడు. స్ఫటికపు రాతితో చేసిన పూసలు, చెవికమ్మలు, వేలి ఉంగరాలు (పొదిగినవి) రోమను సామాన్యుల కందుబాటులో ఉన్న ఆభరణాలు. గ్రీకులు, రోమన్లు స్ఫటికంతో చేసిన మధుపాత్రలు వాడేవారు. భారతదేశంలో లభించే స్ఫటికాలు నిరుపమానమైనవని ప్లినీ వ్రాశాడు.

వీటి అన్నింటికంటె ప్రపంచ ప్రఖ్యాతి గాంచినది మూసలలో తయారయిన భారతదేశము ఉక్కు. 'ఉక్కు' అనే తెలుగు పదమే ఊజ్‌గా ప్రఖ్యాతిపొందింది. సిరియాలోని డమాస్కస్ నగరంలో తయారయిన కత్తులన్నీ భారతదేశపు ఉక్కుతోనే చేయబడేవి. ఊజ్‌తో చేసిన కత్తులు చాలా ప్రశస్తమైనవి గావటంచేత ధరకూడా ఎక్కువగా ఉండేది. క్రీ పూ. 5వ శతాబ్దివాడయిన సిసియాస్ అనేగ్రీకు వైద్యుడు పర్షియను చక్రవర్తి తనకు భారతీయ ఉక్కుతో తయారయిన రెండు ఖడ్గాలను బహూకరించాడని చెప్పుకున్నాడు. క్రీ పూ. 4వ శతాబ్దిలో (356 - 323 B C) భారత దేశదండయాత్రకు వచ్చిన గ్రీకు విజేత అలెగ్జాండరుకు భారతీయ రాజులు మూడు టన్నుల ఉక్కును బహూకరించారని ఒకటవ శతాబ్దికి చెందిన 'క్వింటస్ కర్టియస్' అనేవాడు వ్రాశాడు భారతదేశంలో సేరస్ జాతికి చెందినవారు ఉక్కును తయారు చేసేవారని ప్లినీ వ్రాశాడు. పెరిప్లస్ అనే గ్రంథంలో భారతీయ ఇనుము, ఉక్కు అరియక (మహారాష్ట్ర) రేవు నుండి ఎఱ్ఱసముద్ర ప్రాంతాలకు ఎగుమతి అవుతుందని వ్రాశాడు. అలెగ్జాండ్రియా (ఈజిప్టు) కు చెందిన క్లెమెంట్ అనేవాడు మాంసాన్ని ముక్కలు చేసే కత్తిని తయారు చేయడానికి గూడా భారతీయ ఉక్కును వాడనవసరంలేదని ఎద్దేవా చేశాడు తెలంగాణా ప్రాంతంలోని నిజామాబాదు, కరీంనగరు, వరంగల్లు, మెదక్ జిల్లాలు ఉక్కు పరిశ్రమకు అనాదిగా ప్రసిద్ధి పొందాయి కరీంనగరు

జిల్లాలో శాతవాహనుల కాలంనాటి పాటిదిబ్బల త్రవ్వకాలలో ఇనుప ఖనిజాన్ని కరిగించిన మూసలు, చిట్లాలు అనేకం లభ్యమయినాయి కరీంనగరు, నల్గొండ జిల్లాలలో లభ్యమయిన రోమను బంగారు, వెండినాణాలు చాలావరకు ఉక్కు ఎగుమతుల ద్వారా ఇక్కడకు చేరినవి కావచ్చును.

కీ.శే. భావరాజు వేంకట కృష్ణరావుగారు రమారమి 80 సంవత్సరాలకు పూర్వం రచించిన ప్రాచీనాంధ్ర నౌకాజీవనము అనే ఈ గ్రంథం అమూల్యమైనది. అప్పటికి లభించిన ఆధార గ్రంథాలను పరిశీలించి, విషయ సేకరణచేసి, రచించిన ఈ గ్రంథంద్వారా దేశవిదేశాలతో వ్యాపార సంబంధాలకు, దేశ ఆర్థిక పరిపుష్టికి, దేశీయ పారిశ్రామిక, వ్యావసాయికోత్పత్తులకు భారతీయ సంస్కృతీ విస్తరణకు, హైందవ బౌద్ధ మతముల వ్యాప్తికి, ఆంధ్రుల నౌకాయానం ఎంతగా దోహద పడిందో తేటతెల్లమవుతుంది. చరిత్ర పరిశోధకులకు ఇది ఒక పవిత్ర గ్రంథం వంటిది. ఈ పుస్తకాన్ని పునర్ముద్రించాలని తలపెట్టిన ప్రాచీ ప్రచురణలవారు ముఖ్యంగా పి.పి.సి. జోషిగారు ధన్యులు.

హైదరాబాదు — వి వి కృష్ణశాస్త్రి

29 ఏప్రిలు 2002

# స్వవిషయము

నవయుగ వాఙ్మయ తరంగములలో మూడవది యగు నీ 'ప్రాచీనాంధ్ర నౌకాజీవనము'ను మావిధుల ననుసరించి చాలకాలము క్రితమే మా చంధాదారుల కందజేయవలసి యుండెను. కాని దైవికముగ సంభవించిన పెక్కు విఘ్న పరంపరల చేతను, అనివార్యములైన యితర కారణముల చేతను ఇంతవఱకట్లు గావింపలేకపోతిమి. ఇందులకుగల కారణములన్నిటిని బేర్కొనుట యిచ్చుటనవసరము; నప్రస్తుతమును; కాని పర్యవసానమిది: ఈ తృతీయగ్రంథ ప్రకటనము నిశ్చయముగ మాకార్యదీక్షను బరీక్షించు పరీక్షాఘట్టమయ్యెను. ప్రాచీనాంధ్రుల నౌకాజీవనముకు గ్రీస్తుశక ప్రారంభము నుండి విజయనగర సామ్రాజ్యపతనము వఱకు నెన్నెన్ని యవాంతరములు సంభవించెనో మాకును ఈ గ్రంథప్రకటనమున నన్ని యవాంతరములు సంభవించెను. ఉప్పెనలు వచ్చినవి. సౌభాగ్యలక్ష్మితో గలకలలాడు సముద్రపురేవులు దిబ్బయైనవి: తలయెత్తికొనకుండ వీచిన గాలితుపానులకు లెక్కయేలేదు. వీటికి గారణమెవరని యెవరు చెప్పగలరు? మేలిమిపన్నె దెచ్చుటకై లోకమునంతను మూసలో బెట్టి కరిగించు ననంత మహిమాంచితుడు, ననంత శక్తిసంపన్నుడును, సృష్టి స్థితిలయకారణ భూతుడునైన పరమేశ్వరునికే తెలియువలెను. ఎట్లయిననేమి భగవదనుగ్రహమున జాతీయ సారస్వతనిలయ నౌక నవయుగవాఙ్మయ సముద్రమున మూడవ తరంగము వఱకు బ్రయాణము చేసినది. అయిన యాలస్యమునకు మమ్ము మన్నించి, దరిగనరాని మహాసముద్రమున గ్రొత్తదారులు తీసి, ఆంధ్రుల యొక్కయు, ఆంధ్రేతరులైన దేశీయుల యొక్కయు తేజోవైభవముతో బ్రకాశించి, నేడు దేశీయుల దృష్టి పథమునుండి మఱుగుపడి కానరాకయున్న ప్రాచీన చారిత్ర ద్వీపములను గనిపెట్టి జాతీయజీవనమునకు నవ్య వికాసమును గూర్చుటకై బయలు వెడలిన యీ సారస్వతనిలయ నౌకపై నాంధ్రపాఠకమహాశయు లెప్పటియట్ల నాదరాభిమానములు చూపి, దానికి సుఖప్రయాణము సేకూరున ట్లాశీర్వ దింతురుగాక!

ఇక గ్రంథవిషయము 'ప్రాచీనాంధ్ర నౌకాజీవనము' ఆంధ్ర భాషలో నపూర్వమైన గ్రంథము ఇందు ప్రాచీనాంధ్రుల సముద్ర యానోత్సుకత, అధినివేశ రాజ్యస్థాపనాభిలాష, సముద్రవాణిజ్యము – ఈ మొదలగు విషయములు సవిస్తరముగను, సోదాహరణముగను దెలుపబడినవి. ప్రాచీనాంధ్ర నౌకాజీవన వైభవమును సవిస్తరముగ ప్రదర్శించిన యీ గ్రంథప్రాశస్త్యమును నిర్ణయించుటకు బారకులే సమర్థులు ఇట్టి యుత్తమ గ్రంథము వ్రాసి, మొదటి కూర్పును మా నిలయమున కొసంగి దీనిని బహూకరించిన శ్రీయుత భావరాజు వేంకటకృష్ణరావు పంతులు, బి.యే ,బి.యల్ గారికి మేమెంతయు గృతజ్ఞులము. కారణాంతరములచే 'నావికా పరిభాష' నిందు పొందుపరుపజాలనందులకు జింతిల్లెదము.

ఇంక నిట్టిగ్రంథములు చాల వెలువడనై యున్నవి గ్రంథములను బ్రకటించుటలో నుందింత కాలవిలంబము జరుగకుండునట్లు ప్రయత్నించెదము. అయినను సత్కార్యముల కంతరాయములు మెండు. ఆంధ్ర పాఠకలోకము యొక్క దృష్టి నవలల మీదను, నాటకములమీద నున్నది కాని యిట్టి చారిత్రములమీద లేదు ఉన్నత పరీక్షలనిచ్చుటకై విదేశచారిత్రములను నిర్బంధముగ బఠియించిన దేశీయులగు నాంగ్లభాషా పారంగతులలో జాలమంది కింకను దేశచారిత్ర పఠనమునందు తగినంత యభిరుచి కలుగలేదు జనసామాన్యమునకు జారిత్రము లక్ష్యఅలేదు. ఎటుచూచినను కాలము చారిత్రములకు విషమముగ నున్నది. ఎదురుగాలి వీచుచుండుటచే చారిత్రక గ్రంథములకు నడక చక్కగ సాగకున్నయది. అందువలన గ్రంథము చందాదారుల కొకవేళ నాలస్యముగ జేరినను అందులకు వారు దయయుంచి మన్నింపవలసి యుండును నిండేటి కెదురీదవలసివచ్చు చున్నది. ఇట్టి సందర్భములలో జారిత్రక గ్రంథోపయోగమును దెలిసిన మహనీయులును, జాతీయ పురోభివృద్ధి గోరు దేశాభిమానులును, ఆంధ్ర భాషా సౌభాగ్యము నభిలషించు భాషాభిమానులును, భాషాపోషకులగు శ్రీమంతులును, జమీందారులను మా యీ యుద్యమమునకు జేయూత యొసగి తగు ప్రోత్సాహ మీయ బ్రార్థితులు. తగిన ప్రోత్సాహము లభించుచో జిత్రపటములనుగూడ జేర్చి గ్రంథములు హృదయంగమముగను, దర్శనీయముగను ఉండునట్లు చేయుటకుదగు నవకాశము చిక్కగలదు.

* * *

ఇంతవఱకు సంపాదించిన మా యనుభవము ననుసరించి మా జాతీయ సారస్వతనిలయపు నిబంధనల విషయమున నీ నిర్ణయములం జేయవలసి వచ్చినది. అవి యేవన (౧) ఇంతటినుంచి మూడు నాలుగు మాసముల కొకగ్రంథము చొప్పున నీయబడును (౨) ప్రతి గ్రంథము నింతటినుండి నూఱు పుటలకు అ ౬ లు చొప్పుననే యీయబడును (3) చందాదారులగువారు ప్రవేశరుసుము క్రింద నొక రూపాయ చెల్లింపవలసియుండును. లేనిచో నింతవఱకు బ్రకటింపబడిన గ్రంథములన్నిటిని గొనవలసియుండును. చందాదారులకు మొదటిగ్రంథము అ ౧౨లు; రెండవగ్రంథము రు ౧-౦-౦. ప్రకటింపబడిన గ్రంథము లోకేతడవ కొనజాలని వారు ఒక్కటొకటిగ గొనవచ్చును. ఇయ్యవి ముందునుంచి చందాదారులగువారు గమనింపవలసి యుందురు. ఇంతటినుంచి ప్రతిమూడు గ్రంధములకు నొక్క నవల చొప్పున బ్రకటించుచుందుము.

రాజమహేంద్రవరము, ఇట్లు విన్నవించు,
దుందుభి సం॥ర ఫాల్గుణ. శు ౧౪ ''ప్రకాశకులు''
(౨-3-౧౯౨3.)

జాతీయ సారస్వతనిలయము, రాజమహేంద్రవరము

పోషకులు :
ఇవటూరి బసవరాజుగారు. నందివాడ రాజారావుగారు, ఓవరుసీరు. దింటకుర్తి వేంకట రాజుగారు. తేతలి వీరిరెడ్డిగారు.

అభిమానులు :
వత్సవాయ రాయజగపతివర్మగారు. సోమిన కామేశ్వరరావుగారు, బి.యే., బి యల్. చాగంటి అచ్యుతలింగంగారు. ఇవటూరి సోమసుందరంగారు.

# గ్రంథకర్త్ర విజ్ఞాపనము

ఎన్నఁడో సంకల్పించిన నా ప్రయత్నము అదృష్టవశమున నిప్పటికి రూపము దాల్చినది నేను పట్టపరీక్షకు చదువుచుండిన కాలమున రాధా కుముద ముఖర్జీ పండితుని 'ఇండియన్ షిప్పింగ్ అండ్ మేరిటైమ్ ఆక్టివిటీ ఫ్రమ్ ది ఎర్లియెస్టు టైమ్స్' అను గ్రంథమును జదువుట తటస్థించెను అంతట నాకు ప్రాచీన భరతవర్షమునకు అత్యంత వైభవైశ్వర్యములంజేకూర్చిన నౌకావ్యాపార విదేశవాణిజ్యముల యందు అంధ్రు లితర జాతీయులకంటె నెక్కువ శక్తిసామర్థ్యముల జూపుచు దోడ్పడి యుండినట్లు బొడగట్టెను. ఆ గ్రంథము నందు ఆ బంగాలీ పండితుడు తన జాతిని గూర్చి జెప్పుకొని నంత గొప్పలో, దానికంటె నన్నివిధముల నుత్కృష్టతరమైన మన యాంధ్రజాతియొక్క ప్రతిభను నొక్కయంశమైనను పక్షపాతముబూని వర్ణింపడయ్యెను అట్టియెడ నప్పటి కప్రమాణరహితమైన నా యభిప్రాయములను నాయాంధ్రసోదరులకు స్పష్టముగ జరిత్రరూపమున దెలుప సంకల్పించితిని. ఆ సంకల్ప ఫలితమే యిది. దీనిని నాకుగల స్వల్ప శక్తితో ఆంధ్రజాతి పైగల యభిమానము చొప్పున రచియించితిని గాని మఱియొండు కాదు. మనజాతి నేడు దైవయోగము వలన ప్రాచీన వైభవము గోల్పోయి జీవకళ దక్కి యున్నది ఇప్పటికి కొంతకాలమునుండి మనజాతి పూర్వచారిత్రమును విస్మరించియున్నది. ఈ విషయము కడుశోచనీయము. ఏలయన, చరిత్రజ్ఞానములేని జాతికి నైతికమోక్షము లేదు. స్వాతంత్ర్య ముండదు. ఐహికసుఖానందము చేకూరదు పూర్వయుగమందు విరాజిల్లిన కాంతులన్నియు జరిత్రరూపమున జాతి కట్టెదుట మెరసినప్పుడు కాని పురోభివృద్ధికి మార్గము కానరాదు. ఆ పూర్వపు వ్యక్తులను దలంచుకొని నప్పుడుకాని, యా సాహసాభినివేశ శౌర్యకృత్యములు స్మరించినప్పుడుకాని జాతికి మరల కార్యశూరత్వమును అభ్యుదయమును జేకూరవు. మనకు నింతగ గర్వింప దగినట్టి చరిత్ర ముండియు నింతవఱకు జరిత్రలేని జాతివలె మన పూర్వతేజస్సును మఱచియుండుట భావ్యమే?

ఈ పుస్తకమునందు నేనెఱింగిన దోషము లెన్నియేని గలవు. కాని, యవి, ఇది నా ప్రథమ ప్రయత్నమగుటచే అనివార్యములయ్యెను. నాకు దెలియనివింకను అనేకము లుండవచ్చును; కాని ఒకటి మాత్రము చెప్పగలను

నే నీ చరిత్రరచనయందు ఎంత యుత్సాహపూరితుడనై యుండినను బుద్ధిపూర్వకముగ సత్యదూరములైన విషయములను జేర్చియుండలేదు. కావున ఆంధ్రసోదరులు నా పుస్తకము నందలి గుణదోషము లెట్లున్నను తమ ప్రాచీన వైభవమును ఈ పుస్తక రూపకముగ స్మరించి పులకాంకితులై యానందించిన నాయాశయము ఫలించును.

ఈ పుస్తకమును నేను ప్రకటించుటకు సందేహించుచుండిన కాలమున నన్ను ప్రోత్సహించి యీ ప్రథమముద్రణమును దీసికొనివచ్చిన నామిత్రులగు జాతీయ సారస్వతనిలయము వారికి ననేక కృతజ్ఞతావందనము లర్పించుచున్నాను.

*"నానావిదేశ నౌకానీక విపులాశ్ర*
*యంబైన రేవు రూపఱిన లావు*
*పాడయి శిలావశిష్టమై ప్రాప్తకాల*
*మనుభవించుచునుండియు నక్కటకట!*
*బ్రదికిచెడ్డ యాంధ్రుల పూర్వవైభవంబు*
*చాటెడిని నాలకింపుడు శాంతమతులు!"*



భావరాజు వేంకట కృష్ణరావు

(విజ్ఞానసర్వస్వము, సం.4, తెలుగు భాషాసమితి, మద్రాసు, 1961)

# ప్రాచీనాంధ్ర నౌకాజీవనము

## 1. ప్రస్తావన

ప్రాచీనకాలము నుండియు నాంధ్రులు ప్రజ్ఞావంతులై సాహసిక జీవనము నందభిలాష గలిగి యుండిరి వారి వైదగ్ధ్యమును, కృషియు, నుత్కృష్ట సాంప్రదాయమును అఖిలభారతీయాభ్యుదయమునకు దోడ్పడ జాలి యుండెను వారల భాగ్యవశమున నాంధ్రదేశము నైసర్గిక పరిస్థితుల చేతనే తూర్పుతీరమున సముద్రమునంటి పశ్చిమముగ వ్యాపించి జీవవాహినులగు కృష్ణా, గోదావరీ, పినాకినీ, వంశధారా మున్నగు మహానదుల ముఖద్వారములందు సహజముగ నేర్పడిననౌకాశ్రయములచే శోభిల్లుచు, విదేశాభిగమనమునకును, సముద్రవ్యాపారమునకును అనుకూలముగ నుండి వారిని ప్రోత్సాహించుచు వచ్చెను ఆంధ్రుల ప్రతిభయు, సాహసిక జీవనమును మొట్టమొదట బౌద్ధమత విజృంభణ కాలమున వికసించెను అట్లు వికసించిన సాహసిక జీవనోద్యమము పశ్చిమఖండవాసుల సంపర్కము వలన గలిగిన యంతర్జాతీయ జీవనమువలన విజృంభించి అఖిల భారతీయ నాగరికతా వ్యాపనకు, తదభివృద్ధికి దోడ్పడియుండి ప్రపంచచారిత్రమునందు సైతము సాటిలేని మహత్తరకార్యములను నిర్వహింప జేసెను. ప్రాచీనాంధ్రులు కార్యదీక్షాపరులై, హిందూదేశము ప్రపంచమాధ్యస్థముగ నుండుటచే గలిగిన యవకాశములను సాధ్యమైనంతవఱకు బూర్ణముగ నుపయోగించుకొనుచు, ప్రాచీన ప్రపంచవాణిజ్య శరీరమునకు హృదయము వగిది ప్రకాశించి, హిందూదేశ వర్తకాభివృద్ధికి దోడ్పడియుండిరి. మఱియు వారు భరత ఖండమునకు 'ప్రాక్సముద్రరాజ్ఞి' యను కీర్తిచిహ్నము లభింపజేసి తమచేత నైనంతవఱ కాబిరుదువాచకము చాలకాలము నిలిచియుండుటకు వలయు సామర్థ్యమును కార్యరూపమున జూపియుండిరి.

ప్రాచీనాంధ్రుల పావనవైభవచారిత్రమును గాలానుసరణముగ నిర్మింప బూనుటకు వలయు సాధన, ప్రమాణములు విపులముగ గానరావు; గాని నిర్జనభూములై, నిర్జీవములై, శిథిలావస్థ యందుండిన నౌకాశ్రయములు, వర్తకస్థానములు, తమ ప్రాచీన వైభవమును నేటివఱకు సందర్శన మాత్రము

చేత సంస్మరణమునకు దెచ్చుచున్నవి మన చారిత్రనిర్మాణమునకు వలయు మూలాధారములు దేశీయములనియు, విదేశీయములనియు రెండు విధములుగ నున్నవి దేశీయము లైనవానిలో పాలీ, సంస్కృత వాఙ్మయములును, ప్రాచీన చిత్రకళా శిల్ప ప్రదర్శనములును, ప్రాచీనవస్తు పరిశోధన శాఖవారు వెలికి తీసిన శిలా, తామ్రశాసనములును, కీర్తిచిహ్నము లగు స్థూప, చైత్య, విహారాది నిర్మాణములును, పురాతన, నాణెములును ముఖ్యమైనవి కొన్ని సమయములందు పాలీ, సంస్కృత సారస్వతములేగాక దేశభాషా గ్రంథములలోని ప్రమాణవచనములును చరిత్ర నిర్మాణమునకు ఉపయోగ పడుచున్నవి. విదేశీయము లైనవానిలో అన్యదేశస్థులగు చరిత్రకారుల యొక్కయు, యాత్రికుల యొక్కయు లేఖ్యములు ప్రధానములు. ఈ విదేశీయుల లేఖ్యములందు సమకాలీన చారిత్రక విషయములు చాల వఱకు గాన్పించుచున్నవి. ఇవిగాక హిందూమహాసముద్ర మందున్న జావా, సుమత్రా మొదలగు దీవులయందు ప్రాచీనవస్తు పరిశోధన శాఖవారు వెలికిదీసిన పురాతన భవనములు, దేవాలయములు, శిలాశాసనములు మున్నగునవి చాలవఱకుపయోగ పడుచున్నవి.

ఈ మూలాధారములతో చరిత్రనిర్మాణమును జేయబూనునపుడు తొలుత దేశీయములైన వానిని బరీక్షించి యంతట దేలిన సిద్ధాంతములను విదేశీయములైన ప్రమాణములను బట్టి విమర్శించి సమర్థింప బ్రయత్నించెదము హైందవ సారస్వతమును విమర్శించునపుడు ప్రత్యేకముగ నాంధ్రజాతికి సంబంధించు విషయములు విశేషముగ గానరాక పోయినను ఆంధ్రులు భరతసంతతిలోని వారనియు, భారతజాతి యొక్క సాంప్రదాయములు, విజ్ఞానము ఆంధ్రులకు గూడ వర్తించుననియు మనము జ్ఞాపకముంచు కొనవలయును ఈ కారణమున హిందూమహాసముద్ర మంతయు విహరించి, పశ్చిమమున రోము దేశము మొదలుకొని దక్షిణమున ఆఫ్రికా సమీపముననున్న మెడగాస్కరు ద్వీపమునుండి తూర్పున చీనా, జపాను దేశములవఱకుగల దేశములతోడను, ద్వీపములతోడను సముద్ర వాణిజ్యము నెఱపి, హిందూదేశమునకు మహదైశ్వర్యమును చేకూర్చిన వారలగు మనపూర్వులు నౌకానిర్మాణమును, సముద్ర యానమును, విదేశ వాణిజ్యము నెఱిగియుండ లేదని నుడువలేము.

హిందూదేశమునందు ప్రాచీనకాలము నుండియు విదేశవాణిజ్యము వర్ధిల్లియుండుటచే నౌకానిర్మాణ శాస్త్రములనేకము లుండియుండ వలయును

ఇదివఱ కిట్టియూహయేగాని యితర శాస్త్రగ్రంథములతో బాటు నౌకానిర్మాణ శాస్త్ర గ్రంథము మొన్నమొన్నటి వఱకు లభింపదయ్యె భారతీయులు తమవిజ్ఞానమును గ్రంథాంతర్గతము చేయుటకంటె వంశానుగతము చేయుటయందు అభిలాష గలిగియుండుటయు, బ్రిటీష్ప్రభుత్వ మీదేశమునందు స్థాపింపబడు కాలమున దేశీయ నౌకావర్తకమును బోషించు దేశీయ పరిశ్రమలు నాశము జేయబడుటయు, బ్రిటీష్ప్రభువులు దేశీయ నౌకాపరిశ్రమ నడచివేయుటయు దీనికి గారణములని చెప్పవచ్చును ఇటీవల మన యదృష్టవశమున నౌకానిర్మాణశాస్త్రమొకటి బయలుపడెను. అయ్యది భోజుడను నృపాలునిచే రచియింపబడినట్లు కానవచ్చెడిని; కాని యాత డేకాలపువాడో, యేప్రాంతమును బరిపాలించియుండెనో స్పష్టముగ దెలియవచ్చుట లేదు భోజ నరపతి ప్రణీతమైన 'యుక్తికల్పతరు'[1] నందు రత్న, అశ్వ, గజపరీక్షాది విషయములు, రాజ్యాంగనీతి మున్నగు వానితోబాటు నౌకానిర్మాణశాస్త్రము కూడ జేర్పబడి యుండెను.

'యుక్తికల్పతరు' నందలి నౌకాశాస్త్ర విషయములలో నౌకా నిర్మాణమున కనుకూలములని చెప్పబడిన కలపను గూర్చియు, పిదప నౌకాలక్షణములను గూర్చియు, దరువాత వాని యుపయోగములను గూర్చియు సంగ్రహముగ దెలిపి, పిమ్మట ప్రధానవిషయమునకు బోవుదము

పూర్వపు వడ్రంగులు ఓడలు కట్టుట కుపయోగపడు కలపను, వాటిలక్షణములను ఆయుర్వేద వృక్షశాస్త్రమునుండి గైకొని బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్రజాతులుగ విభజించియుండిరి బ్రహ్మజాతికఱ్ఱ తేలికగను, మృదువుగ నుండి మఱి యేయితర జాతి కలపతోనైనను జేర్చుట కనుకూలముగ నుండును క్షత్రియజాతిది లఘువుగను, దృఢముగ నుండి, యితరజాతి కలపతో నతుకుటకు వీలుగ నుండదు. వైశ్యజాతిది కోమలముగ నుండినను బరువుగ నుండును. శూద్రజాతిది దృఢముగను బరువుగను కూడ నుండి పనికిరాక యుండును ఈ నాలుగు జాతులుగాక యొకప్పు డేరెండు జాతుల లక్షణములనైనను గలిగి ద్విజాతి యని పిలువబడు కఱ్ఱకూడ గలదు ఈ నాలుగు జాతులలో క్షత్రియజాతి దారువుతో నిర్మింపబడిన నౌక సుఖసంపద లొసంగగలదట. క్షత్రియజాతి దారువుతో నిర్మింపబడిన యోడ లగాధసముద్రములందు బ్రయాణము చేయుట కనుకూలముగ నుండును. భిన్నజాతి దారువులచే నిర్మింపబడిన యోడ లాయాజాతుల భిన్నలక్షణములను

గలిగియుండి యెంతమాత్రము శ్రేయస్సౌఖ్యముల నొసంగజాలవు అవి నీటియందు జాలకాలము మన్నక త్వరలో జీకిపోవుటయేగాక యేమాత్రము చిన్న దెబ్బతగిలినను సత్వరముగ బ్రద్దలై మునిగిపోవును.

మఱియు సముద్రము మీదనే ప్రత్యేకము ప్రయాణము చేయుటకు నిర్మింపబడిన యోడల యడుగుభాగము నందలి చెక్కల నొకదానికొకటి యతికించునపు డినుపమేకుల నుపయోగింపరాదనియు, నట్లుపయోగించినచో ఆ యోడలు సముద్రమధ్యమున నుండు నయస్కాంతపు శిలలచే నాకర్షింపబడి బ్రద్దలైపోవుననియు భోజుడు హెచ్చరించియుండెను[2]. ఈ సూచనను పరికించినవారి కాకాలపు హైందవ నౌకలు సముద్రమునందు బహుదూరము ప్రయాణము చేయుచుండినట్లును, హైందవ నావికులు సముద్రములందలి ప్రమాదములను గుర్తెఱిగియుండినట్లును గోచరింపగలదు.

'యుక్తికల్పతరు' నందు నౌకలు వానివాని పరిమాణములను బట్టియు, నితర లక్షణములను బట్టియు, 'సామాన్య' లనియు, 'విశేష'లనియు జెప్పబడియెను. 'సామాన్య' తరగతి నౌకలు నదులందును, సరస్సులందును ప్రయాణము చేయుట కనుకూలములు. ప్రత్యేకముగ సముద్రముమీద బోవుటకు 'విశేష' లక్షణముగల నౌక లనుకూలములని చెప్పబడెను. సామాన్య తరగతియందు క్షుద్ర, మధ్యమ, భీమ, చపల, పటల, భయ, దీర్ఘ, పత్రపుట, గర్భర, మందర యని పది విధములగు నౌకలు కలవు. వీని పరిమాణములు యుక్తికల్పతరు నందు వివరింపబడియున్నవి. వీనిలో భీమ, భయ, గర్భర యనునవి పొడుగునకు దగిన యెత్తును, ఎత్తునకు దగిన వెడల్పును గలిగియుండక పోవుటవలన గాబోలు శుభప్రదములు కావని నిశ్చయింపబడెను 'విశేష' జాతినౌకలు దీర్ఘములనియు, ఉన్నతములనియు రెండువిధములు. అందు దీర్ఘతరగతి యందు పది విధములు, ఉన్నత జాతి యందైదు విధములు నగు నౌకలు గలవు. దీర్ఘజాతియందు దీర్ఘిక, తారిణీ, లోలా, గత్వరా, గామినీ, తరీ, జంఘాలా, ప్లావినీ, ధారిణీ, వేగినీ యనునవి కలవు. వీనిలో లోలా మొదలు ప్లావినీ వఱకుగల నౌకలు శుభప్రదములు గావనియు, దుఃఖదాయకములనియు నిర్ణయింపబడెను. దీర్ఘజాతి నౌకలకు వెడల్పునకు నెత్తునకు మించిన పొడవు గలిగియుండుటవలన ఆపేరు కలిగెను. భోజుడు వీని పరిమాణములను వివరించి పిదప నెట్టివి కులమును, బలమును, ధనమును నాశము గావించి యజమానునికి నష్టము కలుగజేయునో తెలిపియున్నాడు. ఇక నున్నత తరగతియందు ఊర్ధ్వ, అనూర్ధ్వ, స్వరముఖీ, గర్భిణీ, మంథరా యనునవి చెప్పబడియెను. వీనిలో

నూర్ధ్వజాతి రాజులకు మిక్కిలి శుభదాయకములు

నౌకల యలంకరణార్థమునకు బంగారము, వెండి, రాగి- వీని మూడింటి క్రమ మిశ్రమలోహము శ్రేయోదాయకమని చెప్పబడెను తెల్లరంగు, ఎఱ్ఱరంగు, పచ్చరంగు, నీలిరంగు – ఇవి నౌకకు వేయదగిన రంగులని శాసింపబడెను. నాలుగు కొయ్యలుగల యోడలకు తెల్లరంగును, మూడు కొయ్యల యోడకు ఎఱ్ఱరంగును, రెండు కొయ్యలదానికి పచ్చరంగును, ఒంటికొయ్యదానికి నీలిరంగును జెప్పబడియెను ఈ నౌకల యగ్రభాగము సింహ, మహిష, నాగ, గజ, వ్యాఘ్ర, పక్షి, భేక, మనుష్య ముఖాకృతి నుండవలయును.

యాత్రికుల సౌకర్యార్థము ఓడలందు మందిరములను గూర్చియు భోజుడు వివరించెను ఓడలను సర్వమందిరములనియు, అగ్ర మందిరములనియు, మధ్యమందిరములనియు విభజించెను. సర్వమందిరములు ముఖభాగమునుండి కొసవఱకు విశాలములైన గదులు గలిగియుండి రాజుల ధనమును, అశ్వములను, అవరోధజనమును గొనిపోవుట కుపయోగింప బడుచుండును. మధ్యమందిరములు మధ్యభాగమున గదులను గలిగియుండి వర్షకాలమునందును, రాజు విలాసార్థముచేయు ప్రయాణమునందును విశేషముగ నుపయోగపడు చుండును. అగ్రమందిరములు ముందు, బాగమునందు మాత్రమే గదులను గలిగి, వర్షకాలమునందుతక్క యితర ఋతువులందును, చిర ప్రవాసయాత్రలందును, నౌకా యుద్ధములందును ఉపయోగకరములని చెప్పబడెను.

జ్ఞాపికలు :

1 ఈ పుస్తకము వ్రాతప్రత యొకటి కీర్తి శేషులైన డాక్టరు రాజేంద్ర లాల మైత్ర గారి స్వకీయ పుస్తక భాండాగారమునందు గానవచ్చెను దాని నిటీవల కలకత్తాలో 'Sanskrit Press Depositary' వారు ముద్రించి యుండిరి.

2 న సింధుగాద్యాఽర్హతి లోహబంధమ్। తల్లోహకాంతై ర్హ్రియతే హి లోహమ్, విపద్యతే తేన జలేషు నౌకా గుణేన బంధం నిజగాద భోజః॥ ( యుక్తికల్పతరు )

# 2. ప్రాచీన హైందవ సారస్వతమునందాంధ్రుల సముద్రవాణిజ్య వ్యాపార సూచనలు

ప్రాచీన పాలీ, సంస్కృతవాఙ్మయములందు ప్రాచీనాంధ్రుల సముద్రవాణిజ్య, వ్యాపార చారిత్ర నిర్మాణమునకు వలయు ప్రత్యక్ష ప్రమాణములు కానరావు, గాని యచ్చటచటమాత్రము సందర్భములు కొన్ని ప్రాచీనాంధ్రుల విదేశవాణిజ్యమును, సముద్రవ్యాపారమును, నౌకాయానమును అవ్యక్తముగ సూచింప జాలియున్నవి అట్టి సందర్భములందు విదేశవాణిజ్యాభిగమనమును, చిరప్రవాస నౌకాయానములును విశేషముగ వర్ణింపబడియున్నవి ఈ కారణముననే సంస్కృతభాషా పండితుడగు బూలరు (George Buhler) మనీషి యొుక సందర్భమున బ్రాచీన హైందవ సారస్వతమునందు హిందువుల నౌకాయానమును గూర్చియు, వ్యాపారము నిమిత్తము చేయు ప్రయాణములను గూర్చియు దెలుపు సందర్భములనేకములు కలవని వచించి యుండెను[1]. ఈ హైందవ సారస్వతమంతయు సంస్కృత, పాలీ భాషలయందిమిడియున్నది సంస్కృత వాఙ్మయమంతయు బ్రాహ్మణ మతముతో నభివృద్ధిజెందుచుండ పాలీ సారస్వతమంతయు బౌద్ధమతముతో నభివృద్ధి గాంచియుండెను సంస్కృత వాఙ్మయమునందుకంటె పాలీ సారస్వతమునందాంధ్రుల ప్రశంస యెక్కుడు తావులందు గాననగుచున్నది. దీనికి ముఖ్యకారణము మగధదేశమునకు దరువాత నాంధ్రదేశము నందే బౌద్ధమత మెక్కుడభివృద్ధిగాంచి విజృంభించియుండెను బౌద్ధమతము విజృంభించి యుండినను బ్రాహ్మణమతము కూడ వర్ధిల్లియుండుటచేత బ్రాహ్మణ సంస్కృత వాఙ్మయమును గూడ మనము విమర్శింపవలసి యుండును బౌద్ధయుగముననే యాంధ్రదేశమునందు సముద్రయాన కాంక్షయు, విదేశవాణిజ్యాభిగమనాభిలాషయు బ్రజాహృదయము నాకర్షించినట్లు కాన్పించినను అంతకుబూర్వ మాంధ్రదేశ మనాగరిక దేశ మనియు, విదేశములతోడ సహవాససంపర్కములు లేనిదనియు నూహింపజాలము

ఋగ్వేదాది చతుర్వేదములందు, రామాయణ మహాభారతాది మహాకావ్య పురాణేతిహాసములందును, ఇతర పురాణ కావ్య నాటక ప్రబంధము లందును, ఇతర వాఙ్మయమందును సముద్రవ్యాపార సూచనలు పెక్కుగలవు; కాని ప్రత్యేకముగ నాంధ్రులకు సంబంధించినవి కనబడవు అట్టి సూచనలుగల సందర్భములందు హిందువులకు బ్రాచీనకాలమున బూర్వదిశను శాంత మహాసముద్ర ద్వీపములు మొదలుకొని, పశ్చిమమున ఆఫ్రికా ఖండము వఱకుగల ద్వీపములు, ద్వీపకల్పములు, దేశములు, సముద్రములు, నదులు, రేవు పట్టణములు, వర్తకస్థానములు మొదలగున వన్నియు దెలిసియుండెననియు, హిందూ వర్తకులించుమించుగ బూర్వార్ధగోళమందలి సమస్త దేశములతో వర్తకము చేయుచుండిరనియు, నావికులు నీదేశములమధ్య సముద్ర మార్గములను జక్కగ నెఱిగియుండిరనియు నూహించుట కవకాశము కలదు[2] ఋగ్వేదమునందొక సందర్భమున[3] తుగ్రుడను రాజర్షి తనకుమారుడగు భుజ్యుని నాయకత్వము క్రింద సముద్రమునందు దూరముగనున్న ద్వీపవాసులగు శత్రువులను సంహరించుటకై యొక యుద్ధనౌకాదళమును బంపెననియు, నంత మార్గమధ్యమున నొక ప్రచండవాయువు వీచి ఆ భుజ్యుని నౌకాదళముతో గూడ సముద్రమున ముంచివేసెననియు, ఆసమయమున అశ్వనీదేవతలు భుజ్యునియెడ గరుణ గలిగి శతారిత్రములుగల యొక యోడతో నేతెంచి ఆరాజకుమారుని ప్రాణము గాపాడిరనియు వర్ణింపబడినది ఇట్లే మహాభారతము నందు ధర్మరాజు రాజసూయము సేయ సమకట్టినప్పుడు మహామతియగు నకులుడు విశేష నౌకాదళముతో బోయి సముద్రమందలి ద్వీపముల నేలు మ్లేచ్ఛ రాజులు, మనుష్యభక్షకులు మున్నగు వారిని జయించి, వారల నుండి కప్పములు కొనితెచ్చియుండెనని చెప్పబడినది. రామాయణములోని కిష్కింధకాండమునందు సుగ్రీవుడు సీతాన్వేషణమునకై కపివీరులను నానాదేశములకు బనుపునపుడు కోషకారాణములు పుట్టు దేశమునకుగూడ బోయి వెదకవలసినదని యాజ్ఞాపించి యుండెను. కోషకారాణములు పుట్టు దేశ మనగా చీనాదేశమని సంస్కృతపండితుల యభిప్రాయము[4]. ఆసందర్భముననే సుగ్రీవుడు మఱియొక కపివీరునకు పశ్చిమదిశకు బోయి లోహితసముద్రమున[5] వెదకి రావలయునని యాజ్ఞాపించియుండెను. మఱియు గొందఱిని యవ (జావా), సువర్ణ (సుమత్రా) ద్వీపములకు బోయి యరసిరావలసినదని యాదేశించెను[6]. రామాయణమునం దయోధ్యకాండము నందొక సందర్భమున నౌకా యుద్ధమునకై సలుపబడిన ప్రయత్నములు వర్ణింపబడియెను అచట 'వందలకొలది కైవర్తులు అయిదువందల నౌకలతో శత్రువులను నిరోధించుటకై

సముద్రమునం దచ్చటచ్చట యుద్ధసన్నద్ధులయి యుండవలసిన' దని యాజ్ఞాపింపబడిరి

మహాభారతమునందు ధర్మరాజు రాజసూయఘట్టమున నకులార్జునుల దిగ్విజయము వర్ణించు సందర్భమున హిందూదేశముతో వర్తక సంబంధము కలిగియుండిన దేశములెన్నియో జయింపబడినట్లు తెలుపబడినది.

ఇంతటితో పురాణములను వదలి, సూత్రసారస్వతము నన్వేషింప బోవుదము. ఈ సూత్రసారస్వతమునందు హిందూదేశమున కితర దేశములతోగల వర్తక సంబంధములను, సముద్రవర్తకమును సూచింపగల ప్రమాణములు పెక్కు గలవు. అంతియగాక సూత్రసారస్వతము నందాంధ్రుల ప్రశంస కొలదిగనో గొప్పగనో కాన్పించును. ఇంచుమించుగ సూత్ర యుగము తోడనే యాంధ్రులచారిత్రము గోచరమగుచుండుట దీనికి గొంత కారణమని చెప్పకతప్పదు. సూత్రసారస్వత మంతటియందు నిరువురు సూత్రకారులు మాత్రమే సముద్రయానమును గూర్చి సూచన జేసియుండిరి జర్మను దేశీయుడును, సంస్కృతభాషాపండితుడునగు బూలరు మనీషియే బోధాయన ధర్మసూత్రములకు వ్రాసిన పీఠిక యందీ యభిప్రాయ మొసంగియున్నాడు[7]. సూత్రకారులలో సుప్రసిద్ధులగు బోధాయన, ఆపస్తంబులును, గౌతముడును మనకుగావలసినంతవఱకు బ్రధానులు. ఇంచుమించుగ నీముగ్గురును దక్షిణాపథములోనివారని తెలియుచున్నది కాని వీరిలో ఆపస్తంబుడాంధ్రుడని ప్రతీతి కలదు[8]. ఈతడు చాల ప్రాచీనుడు ఇతని కాలనిర్ణయమునుకూడ నింతవఱకు దృప్తికరముగ గావింపబడి యుండలేదు ఈతని కాలమునాటి కార్యులనేకులు వింధ్యపర్వతములను దాటి దక్షిణాపథ భూములందు స్థిరనివాసము లేర్పఱచుకొనిరి. అప్పటికే ఆర్యసంఘము నందు స్థిరనివాసము వలన దేశ, కాల, పాత్రానుసారముగ భాషయందును, మతమునందును, ఆచార వ్యవహారములందును విశేషమగు మార్పులు వచ్చియుండెను. ఆపస్తంబుడు తన కాలమునం దాచారము లైనవానిలో నీతిదూరములు కాని వానిని ఆచరణీయము లని స్వీకరించి, ధర్మసూత్రములను రచించెను ఈతడు వదలిపెట్టిన విషయములను అంతకంటె బ్రాచీనుడని చెప్పబడుచున్న బోధాయనుడు విపులముగ నెత్తి వ్రాసి యుండెను. బోధాయన, ఆపస్తంబుల కాలమునాటి సాంఘిక, మత పరిస్థితులు మన చరిత్రకు చాల యుపయోగకరములు ఆ కాలమున ఔత్తరాహులకు మాత్రమే యాచారములుగ బరిగణింపబడినవానిని దాక్షిణాత్యులకు బోధాయన, ఆపస్తంబులు అనాచారములని నిషేధించి

యుండిరి[9] బోధాయనుడు వైదికాచారపరాయణులగు బ్రాహ్మణులు సముద్రయానము చేయుటవలన వర్ణభ్రష్టులగుదురని విధించెను[10]. కాని యిట్టి సముద్రయానము ఔత్తరాహుల యందు సామాన్యమనికూడ వచియించెను సముద్రయానముతోబాటు గొఱ్ఱె మొదలగు కొన్ని జంతువుల రోమములతో వ్యాపారము చేయుటయు, బెల్లపుసారాయి త్రాగుటయు, క్రిందిదౌడలు, పండ్లు కలిగిన జంతువులను మాత్రమే విక్రయించుటయు, నాయుధ వ్యాపార మవలంబించుటయు ఔత్తరాహులకు దప్పని యాచారములుగ నుండెను. ఔత్తరాహులు దాక్షిణాత్యుల యాచారములుగాని దాక్షిణాత్యులౌత్తరాహుల యాచారములుగాని యవలంబించుట పాపముచేయుటగ శాసింపబడు చుండెను పైనిపేర్కొనబడిన విషయములనుబట్టి యాకాలమున బశ్చిమ దేశములతో విశేషముగ వర్తకము జరుగుచుండినట్లు గానవచ్చుచున్నది

బోధాయనుడు సముద్రయానముచేయుట పాపకర్మగా నెంచి యుండినను ఇంకొక సందర్భమున సముద్రముమీద తేబడిన సరకులలో వర్తకులు రాజున కీయవలసిన సుంకమును వివరించెను[11]. అందులకు సూత్రకారుడగు గౌతము డంగీకరించుచున్నాడు[12] సముద్రముమీద తేబడినయట్టి సరకులలో వర్తకుడు తన యిష్టమువచ్చిన సరకును తీసికొని మిగిలిన వానిపై నూటికి బదింటిచొప్పున ఱేనికి సుంకము కట్టవలయునని బోధాయనుడు శాసించెను బోధాయన, ఆపస్తంబుల కాలమునాటికి వర్ణసాంకర్యము చెందుచున్న సంఘము నుద్ధరించుటకై ధర్మసూత్రములు వెలువడియుండెను ఆపస్తంబునికి బూర్వికుడగు బోధాయనుని కాలమున సముద్రయానము విశేషముగ సాగుచుండినట్లును, వైదికకర్మలను బాసి బ్రాహ్మణులు సముద్రములను దాటి విదేశగమనము చేయుచుండినట్లు నూహించుట కవకాశము కన్పట్టుచున్నది

సూత్రకారులవలెనె తరువాతి కాలపువారగు స్మృతికర్తలుకూడ సముద్రముమీద విదేశములతోడ జరిపెడు వర్తకమును గూర్చి సూచనగ దెలిపియుండిరి ఈ స్మృతికర్తలలో ప్రముఖుడగు మనువు[13] సముద్రయానము చేసివచ్చు బ్రాహ్మణుడు శ్రాద్ధసమయమున భోక్తగ నుండరాదని శాసించెను ఇంకొకచోట రాజు సముద్రముమీద తేబడిన సరకులపై సుంకము రాబట్టుటకై సముద్రయానమునందును, విదేశవాణిజ్యమునందును కుశలుడైనట్టివానిని నియమింప వలయుననియు, నాతడు విధించిన సుంకము వర్తకులీయ వలయుననియు శాసించెను

అంతియేగాక, నౌకావర్తకముకొఱకై బదులీయబడిన మూలధనము మీద వృద్ధియు, లాభమును సముద్రయానములందును, చిరప్రవాసము లందును

ఆరితేరినవారిచే నిర్ణయింపబడవలయునని సూచించెను[14]. అట్టిసమయమున నోడల 'కేవు' నిర్ణయింపవలసినప్పుడు సముద్రయానకుశలురచే దేశ, కాల, పాత్రములనుబట్టి న్యాయముగ నిర్ణయింపబడవలయుననియు, ఈనియమము నదులయందును, గాల్వలయందును బ్రయాణముచేయు నౌకలకే కలదుగాని గాలిచే సముద్రము మీద సంచరింపవలసిన నౌకలకు లేదనియు, నావికుడావిషయమున దానుపడిన ప్రయాసమునకు దగినట్లు కేవు నేర్పాటు చేసికొనవలయుననియు గూడ శాసించెను[15]. మనుస్మృతియం దీప్రకరణమున పైని వివరించిన నియమములకంటె విశేషాంశ మొకటి తెలుపబడినది. సముద్రముమీద సరకుల నోడలలో భద్రముగ గొనితెచ్చుటకై మనువు కొన్ని నియమములను జేసియుండెను. సరకులు సముద్రముమీద నోడలలో వచ్చునపుడు నావికుల యజాగ్రతవలన నవి చెడిపోవుటగాని, తగ్గిపోవుటకాని తటస్థించినచో నందువలనగలుగు నష్టము నంతయు నపరాధము క్రింద నావికు లిచ్చుకొనవలయును అట్లుగాక యొకవేళ నానష్టమంతయు దైవికమగుచో నావికులు తద్దోష పరిహారార్థ మేమియు నిచ్చుకొన నక్కఱలేదు[16]. ఈ యొక్కవిషయమే యాకాలమున తేబడువస్తువుల క్షేమవిధానకరణము నేటికాలపు బీమా (Marine insurance) విధానమును స్ఫురింపజేయుచున్నదని ముఖర్జీపండితు డభిప్రాయ పడుచున్నాడు[17]. విదేశములతో వర్తకము నెఱపుటకును, ఆయాదేశముల యందు విశేషముగ బేరమగు వస్తుసామగ్రిని, యందందు లభించు సరకులను దెలిసికొనుటకును, అచ్చటి జనులు మాటలాడు భాషను మాటలాడగలిగి యుండుటకును బ్రత్యేకముగ నొకవర్ణమువారిని మనువు నియోగించియున్నాడు. యాజ్ఞవల్క్య సంహితయందు హిందువులు ప్రాణభీతి లేక సముద్రగాములై యితరదేశములతో విశేషధనము గూర్చుకొని వర్తకముచేసి యిరువదిరెట్లును, నూఱురెట్లును లాభము తీయుచున్నారని చెప్పబడియున్నది[18].

పైన వివరింపబడిన విషయము లన్నియు శృతి, సూత్ర, స్మృతి, పౌరాణిక యుగములందలి మత, సాంఘిక పరిస్థితులను మాత్రమే తెలుప జాలియున్నవి గాని క్రమాగతమైన చరిత్రనిర్మాణమునకు వీలుగా లేవు. కాని ఆయా కాలములందు విదేశములతో సముద్రముమీద వర్తకమును బెంపొందించుటకై సూత్రకారులు, స్మృతికర్తలు, రాజులు నెట్టెట్టి నిబంధన లేర్పఱచియుండిరో, వానినిబట్టి యాకాలపు నౌకావర్తక పరిస్థితు లెంత యుచ్చదశ యందుండెనో మనకు విశదము కాగలదు ఆంధ్రుల నౌకావర్తక చారిత్రమునకు ప్రత్యక్ష ప్రమాణము లింతవఱకు మనకు లభింపకపోయినను ఇకముందు మనము పరిశీలింపబోవు పాలీ సారస్వతము నందు మాత్రము సూచనలు కాననగును

పాలీ సారస్వతమునం దీవిషయములన్నియు స్పష్టముగ దృఢపడుట యేగాక యాకాలములం దుపయోగింపబడుచుండెడి యోడల పరిమాణమును, హిందూదేశమునందలి వర్తకస్థానములును, రేవుపట్టణములును, సముద్రమార్గములు మొదలుగాగల విషయములుకూడ దెలియవచ్చుచున్నవి. ఇంచుమించుగ నీ పాలీ భాషాసారస్వతమంతయు బౌద్ధధర్మ గ్రంథములతో నిండియున్నది మగధదేశము తరువాత నాంధ్రదేశమునందు బౌద్ధమత మత్యున్నత స్థితిని గాంచెను బౌద్ధగ్రంథములలో సింహళద్వీప చారిత్రమగు 'మహావంశము'ను, ధర్మగ్రంథములును, జాతకకథలును ముఖ్యములైనవి. మహావంశమునందు వర్ణింపబడిన విజయరాజకుమారుని గూర్చిన గాథలన్నియు క్రీస్తుశకమునకు బూర్వము చాలకాలమునాటి సముద్రయానమును, విదేశ వాణిజ్యమును సూచించుచున్నవి. మహావంశము తరువాత చరిత్రాంశములను దెలుపగల ముఖ్యగ్రంథము 'దత ధాతువంశము' ఈ గ్రంథమునందు రాజకుమారుడగు దంతకుమారుడును, రాజపుత్రికయు, నాతని దేవేరియగు హేమాచలదేవియు బుద్ధునిదంతములను దీసికొని యోడనెక్కి సింహళ ద్వీపమునకు బాఱిపోయిన వృత్తాంతమంతయు వర్ణింపబడినది. ఈ దంతకుమారుడు దంతపురమున ఓడ నెక్కి పాఱిపోయెనని చెప్పబడినది దంతపురము కళింగదేశమునకు రాజధానియై యుండెను. దంతకుమారుడును, హేమాచలయునట్లు దంతముతో బాఱిపోవుచుండగా వారెక్కిన యోడ వజ్రాలదిన్నె కడ మెట్టయెక్కెనని చెప్పబడినది. కృష్ణాముఖద్వారమున కనతిదూరముననున్న ధరణికోట ప్రాంతము పురాతనకాలము నుండియు వజ్రములకు బ్రసిద్ధిచెంది యుండుటచేత దంతకుమారుని యోడ మెట్టపట్టిన వజ్రాలదిన్నె కృష్ణానదీముఖద్వార మని యూహింపబడుచున్నది[19]. దంతకుమారుడు సింహళమునకు బోయినకార్యము వృథ యగుటచే దిరిగి స్వదేశమునకు వచ్చునపుడు వజ్రాలదిన్నె కడ నోడదిగి మున్నొక జ్యోస్యుడు తెలిపినరీతి ధర్మశోకుడను రాజుచే నిర్మింపబడిన దేవాలయమును జూచుకొని మఱల గొంతకాలమునకు దంతపురమునకు బోయెను. బుద్ధునిదంతమును గూర్చియు, దంతకుమారుని గూర్చియు గాథలు బౌద్ధగ్రంథములం దనేక విధములుగ వర్ణింపబడెను ఈ గాథల సారాంశ మేదయియుండినను కళింగదేశములోని దంతపురమును, కృష్ణానదీ ముఖద్వారము కడనని విశ్వసింపబడుచున్న వజ్రాలదిన్నెయును, తామ్రలిప్తి నగరమునుండి సింహళద్వీపమునకుబోవు నోడల మార్గమున తగులుచుండు రేవుపట్టణములని యూహించుట కవకాశము గలుగుచున్నది ఆకాలమున ప్రాచీనాంధ్ర రాజధానియైన శ్రీకాకుళనగరమే కృష్ణానదిపైనుండి సముద్రమున

కనతిదూరమున నుండుటచేతను తరువాతి కాలపు రాజధానియైన అమరావతీ ప్రాంత దేశము పురాతనకాలమునుండి వజ్రపు గనులకు ప్రసిద్ధి జెందియుండుట చేతను బౌద్ధగాధలలోని వజ్రాలదిన్నె శ్రీకాకుళమునకు వర్తించుననుకొనుట కొంతవఱకు భావ్యము; గాని డాక్టరు ఫెర్గూసను (Dr Fergusson) గారు విశ్వసించుచుండినట్లు ధరణికోటయని యనుట అసంభవము. మహావంశము అను సింహళద్వీప చారిత్రమునందు వర్ణింపబడిన నాగరాజులు పాలించిన నాగులదేశము ఆంధ్రదేశమునకు దప్పక వర్తించుచున్నది[20]

దంతకుమారునికథ తరువాత పూర్ణుడను వర్తకునికథ మనకు విశేషచరిత్రాంశముల నొసగుచున్నది. ఈ వృత్తాంతము 'వినయపిటక' మను బౌద్ధధర్మగ్రంథమునందు వర్ణింపబడియున్నది[21]. పశ్చిమ సముద్రతీరమున గల శూర్పరాగ నగరనివాసియగు నీ పూర్ణు డేడుపర్యాయములు వాణిజ్యలాభ కాంక్షచే సముద్రయానము చేయుచు విదేశములకు బోవుచు, వచ్చుచు, నేడవసారి యుత్తరకోసల యందుండిన సమయమున బౌద్ధమతము స్వీకరించెననియు, తరువాత స్వగ్రామమునకు మఱలివచ్చినపు డానగరమునందు బుద్ధునికొక చైత్యమును, విహారమును నిర్మించెననియు, అందుల కుపయోగింపబడిన చందనదారువు లన్నియు నాతనిసోదరుడగు చూళపూర్ణుడు శూర్పరాగ నగరమునుండి బయిలుదేరి సింహళద్వీపమును జుట్టివచ్చి యుత్తరపినాకినీ ముఖద్వారమున నుండిన యొకానొక పట్టణమున దిగి దేశములోనికి బోయి కొనివచ్చెననియు నాగాథ నుడువుచున్నది. మరియు నీ చూళపూర్ణు డుపయోగించిన యోడ మూడువందలమంది వర్తకులు సుఖముగ బ్రయాణము చేయుటకు చాలియుండుటయేగాక విశేషమగు సరకునుగూడ గొంపోవ జాలినంత విశాలముగ నుండెనట[22] ఈ గాథ లోని యుత్తరపినాకినీ ముఖ ద్వారమునందుండిన రేవుపట్టణం బెద్దియో మున్ముందు అన్వేషింతము.

వణిక్కుడగు పూర్ణునికథ తరువాత చరిత్రోపయోగకరమైనది బర్మాదేశపు గాథలలో జెప్పుకొనబడు తపూసా, పాలికాటను నిరువురు వర్తకులకథ. ఈ సోదరవర్తకులు ఏనూఱుబండ్ల సరకులను దమసొంత యోడలలో వేసికొని బంగాళాఖాతమును దాటి, కళింగదేశములోని 'అడ్జిటా' యను రేవుపట్టణము కడ దిగి మగధదేశములోని సువర్ణపురి (సువమ్) కి బోయిరని తెలుపబడినది[23].

ఈకథ లిట్టులుండ బౌద్ధజాతకములలో గొన్నిటి యందు ప్రత్యేకముగ సముద్రవ్యాపారమును గూర్చిన విశ్వసనీయములగు నూతనవిషయములు కానవచ్చుచున్నవి. ఈ బౌద్ధ జాతకకథలు క్రీస్తుశకమునకు బూర్వము 500లు మొదలుకొని క్రీ శ. 400ల వఱకు గల కాలమునందు రచింపబడిన

ట్లూహింపబడుచున్నవి ఇందు బూర్వకాలపు చరిత్రాంశవములనేకములు కథారూపమున వర్ణింపబడియెను జాతకకథలలో బవేరు జాతకకథ పారశీక దేశపు రాజధానియగు బాబిలోను పట్టణముతోడి వర్తకమును సూచించు చున్నది పశ్చిమదేశపు వణిక్కులీ బాబిలోను నగరమునకు దొలుత మయూరము లను గూడ గొంపోయియుండిరని యీ కథ వలన దెలియుచున్నది ఇంతేయ గాక యిందు వర్ణింపబడిన వర్తకపరిస్థితులు క్రీస్తునకు బూర్వ మేడాఱు శతాబ్దములకు బూర్వ మనేక సంవత్సరముల నుండి వర్ధిల్లుచుండినట్లు తెలియుచున్నది[24] పశ్చిమదేశపు వర్తకులు భరుకచ్ఛ (బ్రోచ్), శూర్పరాగ (సోపార-సూరతు)రేవుల నుండి విశాలములు, నున్నతములు నగు నోడలలో సముద్రము మీద బహుదూరము నిర్భయముగ, సాహసముతో వాణిజ్యార్థమై ప్రయాణములు సలుపుచుండిరి[25]. సముద్దవణిజజాతక మను మఱియొక కథయం దొకగ్రామమునగల వడ్రపు బనివాండ్రందఱు తమయజమానులకు బనిచేసియిచ్చుటకై యొడంబడి, తమకు రావలసిన కూలిలో గొంతభాగమును ముందుగనే 'బజానా' పుచ్చుకొని, సకాలములో జేసి యొప్పగింపవలసిన పనిని చేయజాలక రహస్యముగ నౌక నొకదాని నిర్మించి తమతమ కుటుంబములతో నాయోడ నెక్కి 'బజానా' సొమ్ము తిరిగి యీయకయే గంగానది గుండ సముద్రద్వీపములకు బారిపోయిరని వర్ణింపబడినది సుప్పరకజాతక మనుకథయందేనూఱుమంది వర్తకు లొకయోడలో భరుకచ్ఛ నౌకాశ్రయము నుండి బయలుదేరిరనియు, ఆ నౌకకు అనుభవశాలియగు నంధుడొకడు కర్ణధారుడుగ నుండెననియు, ఆ వర్తకులు నాలుగు మాసముల వఱకు దూరదేశములకు త్రోవతప్పి బ్రయాణము చేయుచుండిరనియు, తుద కొక్కదినములో భరుకచ్ఛ నౌకాశ్రయమును జేరగలిగిరనియు వర్ణింపబడినది. సంఖజాతకమునందు దెలుపబడిన యోడ యెనిమిదివందల మూరలు పొడవును, నాలుగువందల మూరలు వెడల్పును, ఇరువది నిలువుల యెత్తును, మూడు తెరచాపకొయ్యలను గలిగి యుండెను. ఈ యోడలో కాశీనగర నివాసియగు బ్రాహ్మణుడొకడు దానము చేయుటచేత తన భాగ్యమునంతయు గోల్పోయి, తుదకు ధనసంపాదనార్థమై సువర్ణభూమికి (బర్మాదేశము) ప్రయాణము చేసి యుండెను సువర్ణభూమికి వర్తకులు ప్రాచీనకాలము నుండియు బంగారము తెచ్చుటకై పోవుచుండినట్లీ సంఖజాతకము వలననేగాక మహాజనక జాతకకథ వలనగూడ దెలియుచున్నది ఈ జాతకకథల వలన నాకాలమున సువర్ణభూమియు, సింహళముకూడ వర్తకుల నాకర్షించుచుండినట్లు తెలియుచున్నది మఱియు నాకాలపు టోడలయొక్క పరిమాణమును, వర్తకులు వాణిజ్యార్థమై యేగు దూరదేశములును దెలియవచ్చుటయేగాక భోజనృపతి

ప్రణీతమయిన యుక్తికల్పతరు నందలి నౌకాశాస్త్రములోని విషయములుగూడ బలపఱుపబడుచున్నవి

ఈ జాతకకథలుగాక బౌద్ధధర్మగ్రంధము లనేకములందీ విషయములు కానవచ్చు చున్నవి 'దిఘనికయ' మనునొక గ్రంధమునందొక సందర్భమున (1-122) సముద్రముమీద దూరప్రయాణములను గూర్చి తెలుపబడినది నావికులు సముద్రముమీద బహుదూరమరిగి మార్గము గానలేకయుండినపుడు తమతో గొంపోయిన పెంపుడుపక్షులను వదలుదురనియు, నవి నానాముఖముల నెగిరిపోయి సమీపమున భూప్రదేశము గానబడియెనేని తిరిగిరాక యుండు ననియు నొకవేళ నవి తిరిగివచ్చినచో భూమి గనబడలేదని నావికులు భావించుకొనుట కలదనికూడ దెలుపబడినది ఈ విషయమువలన పూర్వకాలపు వర్తకులు, నావికులు సాహసికులై ధనార్జనాపేక్షతో సముద్రములమీద బహుదూరము క్రొత్త దేశముల నన్వేషించుచు బోవుచుండినట్లు విశదపడగలదు ఈ కథ వలన నాకాలమున హిందూనావికులు హిందూమహాసముద్రమును దాటిపోవ బ్రయత్నములు సలుపుచుండినట్లుకూడ నూహింపవచ్చును

బుద్ధుని దంతకథయు, దంతకుమారుని వృత్తాంతమును, పూర్ణుడు మొదలుగాగల వర్తకుల వర్తకవ్యాపారమును, జాతకకథలును క్రీస్తు పుట్టుటకు బూర్వము నాలుగవశతాబ్దమునాటికే యాంధ్రదేశము నాగరికత కాలవాలమై యలరారుచుండినట్లు తెలుపుచున్నవి. ఈ విషయము సూత్రకారుల వలనగూడ ధృవపడుచున్నది. పై గాథల వలన నాంధ్రదేశమున మూడు సుప్రసిద్ధములగు రేవుపట్టణముల నామములు మాత్రము తెలియవచ్చు చున్నవి. వర్తకమునకును, సముద్రయానమునకును మిగుల ననుకూలములయిన ప్రసిద్ధ నౌకాశ్రయములు గోదావరి, కృష్ణ, పినాకిని, వంశధార మున్నగు మహానదుల ముఖద్వారములందు వర్థిల్లియుండును[26]. నైసర్గికపరిస్థితుల చేతనే యీ తూర్పుతీరమంతయు అందులకు అనుకూలముగ నున్నది బౌద్ధగాథలందు దంతపురము, అడ్జిటా, వజ్రాలదిన్నె మొదలగు రేవుస్థలముల నామములు వినబడుచున్నవి[27] ఇందు దంతపుర మెుకప్పుడు కళింగదేశమునకు రాజధానిగ నుండెను. ఆంధ్రదేశములోని తూర్పుతీరమునకు కళింగమని ప్రాచీనకాలము నుండియు నామాంతరముండెను. పూర్వ మాంధ్రులును, కాళింగులు నొక్క తెగలోని వారైనట్లును, ఇరుజాతివార లొక్క భాషయే మాటలాడుచుండినట్లును దెలియుచున్నది, అందువలన దంతపుర మాంధ్రదేశములోనిదై యుండవలయునని నిర్ణయింపవచ్చును

ఇన్ని రేవుపట్టణములును, వర్తకస్థానములునుగల యాంధ్రదేశము పూర్వకాలమున విదేశములతో వర్తకము చేయుచుండెననుటకు సందియము లేదు ఆకాలమున గంగానది ముఖద్వారము నందుండిన తామ్రలిప్తి

నగరమునుండి పశ్చిమతీరమున భరుకచ్ఛమునకు ఓడలు పోవుటకు బాహాటములయిన సముద్రమార్గములుండెను ఈ భరుకచ్ఛ, సోపార నౌకాశ్రయములు ఆంధ్రచక్రవర్తుల కాలమున నుచ్ఛదశలో నుండెను వర్తక వ్యాపారమునకై తామ్రలిప్తి నగరమునుండి బయలు వెడలిన వర్తకపుటోడలు తూర్పుతీరము వెంబడిని వచ్చి కళింగదేశమునందలి రేవుపట్టణములను, చోళమండలములోని కావేరి పట్టణమును, కాల్పట్టణమును జూచుకొని సింహళమును జుట్టి భరుకచ్ఛ, సోపార నగరములకు బోవుచుండెను. సాహసముగల వర్తకులు సముద్రముమీద దూరదేశములకు బోయి, వాణిజ్యము సాగించుచు, దేశమున కభ్యుదయమును గూర్చుచుండ మతాభినివేశముగల బౌద్ధభిక్షువులు మతబోధసేయు తలంపుతో సముద్రయానము చేయుచు, విదేశముల కరుగుచు, భారతీయనాగరికతను లోకమున విస్తరింపజేయుచుండిరి ఈ యంశములు రెండును ప్రాచీనాంధ్ర శిల్పప్రదర్శనముల వలన సువ్యక్తమగుచున్నవి.

జ్ఞాపికలు :


1. Buhler George, On the Origin of the Brahmi Alphabet, page 84
2 Mukherjee R K , Indian Shipping and Maritime Activity from the Earliest Times, pages 55-59
3 ఋగ్వేదము, ప్రథమ మండలము, 116 అను, 3 వ సూ.
4 ఒకానొక టీకాకారుడు 'కోషకారాణభూమిశ్చ' యనుపదము నకు పట్టుబట్టల నిచ్చు పురుగు లుండు దేశమని వ్యాఖ్యానము చేసియున్నాడు ఆదికాలమునుండియు చీనాదేశము పట్టునకు ప్రసిద్ధి జెందియుండుటయు, పట్టుబట్టలకు 'చీనాంశుకము' లనియు, 'చీనాంబరము' లనియు నామాంతర ముండుటంబట్టియు 'కోషకారాణభూమి' యన చీనాదేశమని నిస్సందేహముగ నూహించుకొనవచ్చును
5 తతోరక్తజలం భీమం లోహితం నామ సాగరమ్
6. Mukherjee, Indian Shipping, page 57
7. ibid, page 59
8 వీరభద్రరావు చిలుకూరి, ఆంధ్రులచరిత్రము, ప్రథమభాగము, పుట 74 ఈ కారణము చేతనేకాబోలు ఆంధ్రులలో బెక్కుమంది ఆపస్తంబసూత్రులుగ నుండుట తటస్థించెను.
9 ఆంధ్రుల చరిత్రము, ప్రథమ భాగము, పుట 74,75
10 బోధాయన ధర్మ సూత్రములు
11 బోధాయన ధర్మ సూత్రములు
12 గౌతమ ధర్మ సూత్రములు

13. మనుస్మృతి, తృతీయాధ్యాయము, శ్లో 158
14. శ్లో. సముద్రయానకుశలా దేశకాలార్థ దర్శినః,
స్థాపయంతి తు యాం వృద్ధిం సాపన్నాధిగమంప్రతి
15 ద్వీర్ఘాధ్వని యథాదేశం యథాకాలం తరీభవేత్
నదీతీరేషు తద్విద్యాత్ సముద్రే నాస్తి లక్షణమ్. మనుస్మృతి, అష్టమాధ్యాయము
శ్లో. 149–151
16 శ్లో యన్నాతి కించిదాశానాం ఫిశీర్యేతాపరాధతః
తద్దాశైరేవ దాతవ్యం సమాగమ్య స్వతో శతః
ఏషనౌయాయినా ముక్తో వ్యవహారస్య నిర్ణయః,
దాసాపరాధత స్తోయే దైవికో నాస్తి విగ్రహః
మనుస్మృతి, అష్టమాధ్యాయము, శ్లో 409
17. Mukherjee, Indian Shipping, page 61
18 యేసముద్రగావృద్ధా ధనం గృహీత్వా అధికలాభార్థం ప్రాణ ధనవినాశ శంకాస్థానం సముద్రం గచ్ఛతి తే వింశం శతకం మాసి మాసి దద్యుః (యాజ్ఞవల్క్య సంహిత)
19. Dr Fergusson, Tree and Serpent worship, pages 157-159
20. ఆంధ్రుల చరిత్రము, పూర్వయుగము, పుట 74.
21. Hardy, Manual of Buddhism, Pages 56-57 and 60
22. పూర్వోక్త ప్రమాణము
23. Bishop Bigandot, Life of Godama, Page 101
24. Mukehrjee, Indian shipping, Page 74
25. పూర్వోక్త ప్రమాణము
26. Henry Morris, Godavary District Gazetteer, Ch VII
27 పూర్వోక్త ప్రమాణము, మఱియు, ఆంధ్రులచరిత్రము, ప్రథమ భాగము, పుటలు 73–74.

## 3. ప్రాచీన వస్తుసమూహమునందును, చిత్రకళలందును ఆంధ్రుల సముద్రవ్యాపార సూచనలు

హైందవ సారస్వత పరిశోధన వలన దేలిన సిద్ధాంతములు ప్రాచీన శిల్ప ప్రదర్శనముల వలనను, నాణెముల వలనను ధృవపడుచున్నవి. శిథిలావస్థ యందున్న స్థూపములును, చైత్యములును, విహారములును, అందుగల చిత్రకళా ప్రదర్శనములును ప్రాచీనాంధ్రుల సముద్రవాణిజ్య వ్యాపారమును మనకు జ్ఞప్తికి దెచ్చు శాశ్వతచిహ్నములుగ నుండి చారిత్రరచనకు దోడ్పడు చున్నవి. ఆంధ్ర మహాసామ్రాజ్య కాలమున శిల్పకళ శాతవాహనులచే బోషింపబడి, మిక్కిలి యభివృద్ధిచెందెననుట చరిత్రప్రసిద్ధము. సుప్రసిద్ధములైన అమరావతి, ధరణికోట, సాంచీ (మాళవదేశములోని భిల్సా నగర సమీపమున నున్నది) స్థూపములందలి చిత్తరువులును, శిల్పప్రదర్శనములును ప్రాచీనాంధ్రుల సాహసిక జీవనమును సూచించుచున్నవి. అమరావతీ స్థూపమునందలి చిత్తరువులలో నొకచోట నిద్దఱుమనుష్యులు బుద్ధుని బొమికలను బట్టుకొని, యోడతట్టుపై నిలువబడి యొడ్డునకు జేరుచుండగా నాగరాజొకడు వారలకు స్వాగత మొసంగుచున్నట్లు చిత్రింపబడియెను[1]. ఈ చిత్తరువు నందలి విషయము 'దత ధాతువంశము' లోని దంతకుమారునికథ లోని వృత్తాంతమును స్ఫురింపజేయు చున్నదని చరిత్రకారుల యభిప్రాయము అమరావతీ స్థూపము తరువాత మిక్కిలి ప్రాచీనమైనది భోపాల సంస్థానములోని సాంచీ స్థూపము. ఇది యాంధ్ర చక్రవర్తుల కాలమున నిర్మింపబడినట్లును, తృతీయాంధ్ర చక్రవర్తియగు శ్రీశాతకర్ణి (?) యాస్థూపమునకు శిల్పకళాశోభితము లైన బహిర్ద్వారములను నాల్గువైపులను నిర్మింపజేసెననియు దెలియుచున్నది[2]. సాంచీ యందలి ప్రథమ స్థూపమున ప్రాగ్ద్వారమునందు త్రాళ్లతో గట్టబడిన నౌక యొకటి చిత్రింపబడియున్నది ఆ నౌక అచ్చట నొక నది వలెనుండిన తియ్యనీటి ప్రవాహమును దాటు చున్నట్లును, అందు సన్యాసివేషధారులైన ముప్వురు మనుష్యులున్నట్లును, వారిలో నొకడు తెడ్డను చేత బట్టుకొని యానావను నడపుచుండినట్లును, ఇంకొకడు చుక్కాని వద్ద గూరుచుండి యోడనడుపు చుండినట్లును, ఓడ నడుమనుండిన సన్యాసి యొకడు నావయొక్క పార్శ్వపు చెక్కపై జేతు లుంచి యొడ్డున భక్తి వినయములతో శిరములపై జేతులు మోడ్చుకొని నిలువబడిన నలువురు సన్యాసుల వంక జూచుచున్నట్లును

చిత్రింపబడెను. సర్ అలెగ్జాండరు ఫ్లెమింగ్‌హాము (Sir Alexjander Flemingham) గారీ చిత్తరువునందు విశేషార్థమును సూచించుచు, నచ్చట చిత్రింపబడిన జలము సంసారసాగరమనియు నచ్చటి నౌకలోని ముచ్చురలో నొకడు గౌతమశాక్యముని యనియు, మిగిలినవా రతనిశిష్యులనియు బౌద్ధ ధర్మగ్రంథములలోని వ్రాతలనుబట్టి యాధ్యాత్మిక పరముగ నర్థము చెప్పుచున్నారు[3] కాని జనరల్ మెయిస్లీ (Gen F C Maisley) గారా చిత్తరువునందు బౌద్ధ సన్యాసులు మతవ్యాపనార్థమై యోడనెక్కి సముద్రము మీద విదేశముల కరుగుచుండ, వారిశిష్యులు, ననుచరులు భక్తివినయములతో వారిని వీడ్కొలుపుచున్న విషయములు సూచింపబడుచున్నవని యూహించుచున్నారు[4]. ఇందు మెయిస్లీ దొర యభిప్రాయమే యథార్థ మనిదోచెడిని

ఇట్టి చిత్తరు వింకొకటి ఆ ప్రథమ స్థూపము యొక్క పశ్చిమ ద్వారము నందు గలదు అందు జలమును, జలము పై దేలియాడుచున్న నావయు జిత్రింపబడియున్నవి[5] ఆ నావ యగ్రభాగమున సింహాకృతి నున్న యొక పక్షిముఖమును, చుక్కానికడ చేపతోకయు రచియింపబడియున్నవి ఆ నావ యందొక మందిరమును, మందిరము నందొక సింహాసనమును, దాని ప్రక్క ఛత్ర చామరధారులైన యిరువురు పరిచారకులును, మఱియొకడు తెడ్డుతో నావను నడపుచుండినట్లును, ఆ నావచుట్టు నైదుగురు మనుష్యులు తిత్తులవంటి పరికరముల సహాయమున నీదుకొని వచ్చుచున్నట్లును, మఱియొకడు నీటిలోనుండి రక్షింపవలసినదని చుక్కాని పట్టుకొనిన వానిని ప్రార్థించు చున్నట్లును చెక్కబడియున్నదో. ఈ ప్రదర్శనము నందు చిత్రింపబడిన జలము మంచినీరని తెలుపుటకుగాబోలు పర్ణములు, పద్మములు, మత్స్యములు, మొగ్గలు రచియించి యుండిరి. ఇందు జూపబడిన నౌక యాకాలమున సాధారణముగ మహారాజులు, రాజులు, సామంత ప్రభువులు మున్నగువారు నదీ ప్రవాహము లందును, సరస్సులందును విలాసార్థము విహరించుటకై యుపయోగించెడు నౌక వలెనున్నదని ముఖర్జీ పండితుడు నుడువుచున్నాడు[7]. లెఫ్టినెంటు మాసీ గారీచిత్తరువు బుద్ధదేవుని బొమికలు మొదలగువానిని హిందూదేశము నుండి సింహళద్వీపమునకు దీసికొని పోవుచుండగా నాగులు వారినడ్డగించి యాబొమికల నపహరించుట మొదలగు బుద్ధుని దంతకధన గాధలను స్ఫురింపజేయుచున్నదని చెప్పుచున్నారు[8].

సాంచీ స్థూపములందలి చిత్తరువుల తరువాత బొంబాయి సమీపమం దున్న సాల్సెట్టి ద్వీపమునందు గల 'కన్హేరి' గుహలయందు చెక్కబడిన శిల్పకళా ప్రదర్శనములు చాలా ముఖ్యమైనవి ఇచ్చట శాసనములను బరిశోధింపగా నీగుహలు క్రీస్తుశకము రెండవశతాబ్దమునందు దొలువబడి యుండ వచ్చు

నవియు, నాంధ్ర భృత్యులలో వాసిష్ఠీపుత్ర శ్రీపులమావి చక్రవర్తి కాలమునాటివనియు (క్రీ శ 133-162), ద్వితీయ గౌతమీపుత్ర యజ్ఞశ్రీ శాతకర్ణి కాలమునాటివనియు (క్రీ శ.177-196) స్పష్టముగ దెలియుచున్నది ఆంధ్రచక్రవర్తులగు వీరికాలమున ఆంధ్రమహాసామ్రాజ్య ముత్తరమున మాళవదేశము మొదలుకొని దక్షిణమున గాంచీ నగరము వఱకు వ్యాపించియుండి, పూర్వపశ్చిమసముద్రములను దాకుచుండెను 'కన్హేరి' ప్రదర్శనములలో నొకచోట నోడ యొకటి సముద్ర మధ్యమున బద్ధలైపోయినట్లును, అంత నిరువురు నావికులు పద్మపాణి యను దేవుని ఆత్మసంరక్షణార్థమయి ప్రార్థించుచున్నట్లును, అంత నాదేవుడిరువురు దూతలను వారలసహాయార్థము పంపుచున్నట్లును చిత్రింపబడియున్నది. అమరావతీ స్థూపమునందలి శిల్పకళా ప్రదర్శనములును, సాంచీ స్థూపమునందలి చిత్తరువులును ఆంధ్రుల సముద్రవాణిజ్య విదేశ వ్యాపారమును గూర్చియు, సాహసికజీవనమును గూర్చియు నిస్సంశయముగను, స్పష్టముగను దెలుపలేకపోయిన బోవచ్చునుగాని ఈ 'కన్హేరి' గుహలలోని శిల్పకళా ప్రదర్శనములు మాత్రము మనపూర్వుల చిరసముద్రప్రవాసమును, అచట నావికులు పడుకష్టములను సప్రమాణముగ సూచించుచున్నవని నుడువవచ్చును. ఇట్టి యభిప్రాయమునే ముఖర్జీ పండితుడు కూడ వెలిబుచ్చి యుండెను[9] ఈ విధమున శిల్పకళాంతర్గతమై యిప్పటికిని లీలగ దోచుచున్న ప్రాచీనాంధ్రుల సముద్రయాన విదేశవర్తకవ్యాపార జీవనముల గూర్చియు, వానిని బోషించిన యాంధ్రచక్రవర్తులను గూర్చియు మనమెంతయు గర్వింపవలసియున్నది

ఇవిగాక యాంధ్రచక్రవర్తులకాలమున దొలువబడుట కారంభింపబడి క్రీస్తుశక మేడవశతాబ్దారంభము వఱకు నిర్మింపబడుచుండిన 'అజంతా', 'కార్లీ' గుహాలయములందలి ప్రదర్శనములుకొన్ని విదేశములతోడి వర్తక సంబంధమును, సముద్రయానమును సూచించుచున్నవని గ్రిఫ్ఫిత్సు (J Griffiths) పండితుడు నుడివియున్నాడు[10]. ఆంధ్రసామ్రాజ్యకాలమున నారంభమై గుప్త, పల్లవ సామ్రాజ్యకాలములందు విజృంభించియుండిన యధినివేశస్థాపనా ప్రయత్నములు, పలసరాజ్య సంపాదనోద్యమమును, విదేశ వాణిజ్యవ్యాపారమును ఈ గుహలలోని శిల్పప్రదర్శనములందు ప్రతిబింబించుచున్నవి ఆ కాలపుటాంధ్రుల నౌకానిర్మాణ కుశలత, సముద్రవాణిజ్యవైభవము చిత్రకళలందు మూర్తిగైకొని కాలగర్భమున జీర్ణింపక నేటివఱకు జీవించియుండి యవ్యక్తముగనైన నాకాలపుటౌన్నత్యమును దలపునకు దెచ్చుచున్నవి ఆంధ్ర మహాసామ్రాజ్య మంతరించిన వెనుక మఱల పల్లవ సామ్రాజ్య కాలమునందు తొలుతనే తూర్పుతీరవాసులగు నాంధ్రులును, కళింగులును సాహసధైర్యములతో స్వదేశమును వీడి, దూరస్థములగు జావా,

సుమత్రా ద్వీపములకును, బర్మా, సయాము, కాంబోడియా, హిందూ - చైనా మున్నగు ప్రాగ్దేశములకును వాణిజ్య వాంఛచే వలసపోయి యధినివేశ రాజ్యముల నేర్పఱచుకొని యాంధ్రదేశమునకే గాక భరతఖండమునకుగూడ దిగంతవిశ్రాంతమైన కీర్తి నాపాదించియుండిరి. కళింగులును, ఆంధ్రులును మార్గదర్శకులైన తరువాత పశ్చిమతీరవాసులగు ఘూర్జరులును అధినివేశ రాజ్యస్థాపనమునందు వారి ననుగమించి యుండిరి

ఇంతటితో ప్రాచీన శిల్పకళా ప్రదర్శనములను విమర్శించుట నిల్పి మన దేశమునందు లభించిన పురాతన నాణెములను బరీక్షింపబోవుదము. ఇచ్చట గానవచ్చిన రోమక నాణెముల మాట యటుంచి యాంధ్రనాణెములను ముందు పరిశీలింతము. ఇంతవఱకు లభించిన పురాతనాంధ్ర నాణెముల మీద ముద్రింపబడిన విషయములు ప్రాచీనాంధ్ర సముద్ర వాణిజ్యవ్యాపారమును స్పష్టముగ సూచించుచున్నవి ఈ నాణెములలో గొన్నిటిపై రెండు కొయ్యలుగల విశాలమైన యోడలు ముద్రింపబడియున్నవి. సుప్రసిద్ధ చరిత్రకారు లగు విన్సెంటు స్మిత్తు (Vincent A Smith) గారీ నాణెములపై ముద్రింపబడియున్న ప్రతిమలను బరీక్షించి యవి క్రీస్తుశకము రెండు మూడు శతాబ్దముల నాటివనియు, నందుగొన్ని గౌతమీపుత్ర యజ్ఞశ్రీ శాతకర్ణి మహారాజుచే ముద్రింపబడెననియు, నందువలన నాకాలపుటాంధ్ర చక్రవర్తుల ప్రభుత్వాధికారము హిందూదేశమునందేగాక సముద్రాంతర దేశములందుగూడ చెల్లుచుండెననియు నూహించుచున్నారు[11] మఱియు యజ్ఞశ్రీశాతకర్ణి కాలమునాటి నాణెములందు ఓడయొకటి చిత్రింపబడుటచేత నతని కాలమున బ్రజ లోడలను గూర్చియు, సముద్రయానమును గూర్చియు ననుభవజ్ఞాన కౌశలములను గలిగియున్నారనియు, సుమత్రా, జావా, బోర్నియో, సింహళము మొదలగు ప్రాగ్ద్వీప సమూహముతోడను, బర్మా, సయాము, చీనా మొదలగు దేశముల తోడను విశేషవర్తక వ్యాపారమును జరుపుచుండిరనియు నూహించుట కవకాశము గలుగుచున్నదనికూడ నుడువుచున్నారు[12] వీరేకాక ఆంధ్రదేశము నందు లభించిన రోమక నాణెములను బరిశీలించిన రాబర్టు సూయెల్ దొరగారు కూడ ఆంధ్రదేశము పశ్చిమమున ఆసియా, ఈజిప్టు, గ్రీసు, రోము దేశములతోడను, తూర్పున చీనా మొదలగు దేశములతోడను వర్తకవ్యాపారము జరుపుచుండెనని యభిప్రాయపడుచున్నారు[13].

అలెగ్జాండరు రీ యనునాతడు[14] దక్షిణాపథమందలి ప్రాచీన నిర్మాణములను గూర్చి వ్రాయుచు నాంధ్రరాజుల నాణెముల చిత్రపటములను ముద్రించియుండెను ఆ నాణెములు సీసముతో జేయబడి కొన్ని 101 వడ్లగింజయెత్తు మఱికొన్ని 65, మఱికొన్ని 29 వడ్లగింజల యెత్తును బరువుగలిగి యున్నవని చెప్పియున్నాడు ''ఆనాణెములపై జిత్రింపబడిన యోడలు 'దోనె' లను బోలి ధనురాకారమున నున్నవి ఓడముఖము గుండ్రని బంతియాకృతిగ

నున్నది చుక్కాని యొక పెద్ద తెడ్డువలె నీటిలోనికి వ్రేలాడుచున్నది ఓడపైతట్టు వంకరలేక చదునుగ నున్నది అందుపై నమర్చబడియున్న గుబ్బలలో నుండి యోడకొయ్యలు పైకి లేచుచున్నవి. ఆ కొయ్యల చివరనుండి మ్రోకులు (rigging)నాలుగు వైపులకును గట్టబడినట్లు కాన్పించుచున్నవి మఱికొన్ని నాణెములందు ఓడ మొదటిదాని యందువలెనె ముద్రింపబడియున్నదిగాని, కొన్ని విషయములందు మాత్ర మా నౌక మొదటిదానికంటె కొంచెము విలక్షణముగ నున్నది ఇందలి యోడ పైతట్టు చదునుగలేక విదియ చంద్రాకృతినున్నది ఈ యోడలు రెండును కుడివైపునకు దిరిగి యున్నట్లు ముద్రింపబడి యున్నవి ఇక గొన్ని నాణెములపై నోడ లెడమ వైపునకు దిరిగి యున్నట్లున్నవి ఆ యోడలముఖము గుండ్రని మూడుబంతులను గలియజేర్చినట్లున్నది. ఓడత్రాళ్లు మొదలగునవి యోడకొయ్యల నడుమనుండి కాన్పించుచున్నవి. ఆయోడల క్రింద నీటిలోనికి రెండు తెడ్లు వ్రేలాడుచున్నట్లు ముద్రింపబడియున్నవి. ఈ నాణెములపై నున్న యోడ ప్రతిమ లన్నియు నిలువుగమధ్యకు జీల్చినయెడల నెట్లగపడునో యట్లు చిత్రింపబడియున్నవి.''

జ్ఞాపికలు ·


1. ఆంధ్రుల చరిత్రము, మొదటిభాగము, పుట 68
2 Sir John Marshall, Guide to Sanchi, Page 12
3. Cunningham A , Bhilsa Topes, Page 27
4 General F C Maisley, Sanchi and its Remains, Page 12
5 హైందవశిల్పకారులు సముద్రమును ప్రదర్శింపదలచినపుడు మకరములను సముద్రపు పక్షులను, కెరటములను చిత్రించి, కెరటములను వంకరగీతలతో సూచించుచుండిరి నదీప్రవాహములు, తియ్యనీటి సరస్సులు మొదలయినవానిని మత్స్యములతోడను, పద్మములతోడను, ఆకులతోడను నిరూపించుచుండిరి
6 Sanchi and its Remains, page 59
7 Mukherjee, Indian Shipping, page 34
8. Mrs Spier, Life in Ancient India, page 320 ఈ నాగులాంధ్ర దేశవాసులైనట్లును, కృష్ణా, గోదావరీ నదుల నడుమగల దేశమును బరిపాలించినట్లును బౌద్ధగ్రంథములవలన దెలియగలదు చూడుము! ఆంధ్రుల చరిత్ర, ప్రథమ భాగము, పుట 62.
9 Mukherjee, Indian Shipping, page 35, Bombay Gazetteer, Vol XIV, p 165
10 J Griffiths, The Paintings in the Buddhist cave-temples of Ajanta
11 Early History of India, 3rd Edition, page 202
12 పూర్వోక్త ప్రమాణము
13 Archaeological Survey of India, New Imperial Series, Vol XV, page 19
14 Imperial Gazetteer, New Edn Vol II, page 825

# 4. హైందవవాణిజ్య ప్రాచీనత

ఇంతవఱకు ప్రాచీనశిల్పమునందును, చిత్రకళలందును పాలీ, సంస్కృత వాఙ్మయములందును ఆంధ్రుల సాహసికజీవనము వలన గలిగిన సముద్రవాణిజ్యవ్యాపారమును సూచించి విమర్శించియుంటిమి. ఇప్పుడంతట దేలిన పర్యవసానములను మనకు లభించినంతవఱకు పాశ్చాత్యలేఖ్యములబట్టి పరిచూచి, యంతట సుప్రసిద్ధ చరిత్రకారుల యభిప్రాయముల ననుసరించి చారిత్ర నిర్మాణమునకు బూనెదము. పూర్వము మనదేశ మేయేదేశములతో వర్తకవ్యాపారము జరిపియుండెనో యాదేశములందలి వర్తకులు, నావికులు, చరిత్రకారులు, శాస్త్రజ్ఞులు మున్నగువారు మనదేశమునుగూర్చియు, వర్తక వ్యాపారమును గూర్చియు, మఱియితర విషయములగూర్చియు వ్రాసియుండుట చే వారిలేఖ్యములు దేశీయప్రమాణములను ధృవపఱుచుచున్నవి

క్రీస్తునకు బూర్వము పెక్కువందల సంవత్సరముల నుండి ప్రపంచము నందు ప్రాచీన భరతవర్షము వాణిజ్యము పట్ల హృదయముపగిది బ్రకాశించి యఖండవైభవము నందియుండెను. అతి ప్రాచీనకాలమున భారతీయులు ఫినీషియనుల తోడను, యూదుల తోడను, గ్రీకుల తోడను, ఈజిప్టు దేశీయులు తుదకు రోమకులతోడను వాణిజ్యసంబంధము కలిగియుండినట్లును, తరువాతి కాలమున తురుష్కుల తోడను, వెనీషియనులతోను, బుడతకీచుల తోడను (Portugeese), వలందుల తోడను (Dutch), పరాసు వారితోడను (French), ఇంగ్లీషువారి తోడను వర్తకము చేయుచు మహదైశ్వర్యమును దేశమునకు గూర్చియుండినట్లు నిస్సంశయముగ నిర్ణయింపగల ప్రమాణము లనేకము గలవు[1].

అదృష్టవశమున హిందూదేశమునం దితరసముద్ర ప్రాంత దేశములవలె నాంధ్రదేశముకూడ జక్కని నైసర్గిక పరిస్థితులు కలిగియుండి నౌకానిర్మాణమునకును, సముద్రయానమునకును, విదేశములతోడి సముద్రవర్తక వ్యాపారమునకును అనుకూలములయిన నదీముఖద్వారముల తోడను, నౌకాశ్రయముల తోడను, వర్తకస్థానముల తోడను, విదేశ వాణిజ్యము నకు వలయు నమూల్య వస్తుసామగ్రి తోడను, పరిశ్రమల తోడను

అలరారుచుండుటవలన, తొలుతనుండియు నీప్రాంతవాసులకు వర్తక వాంఛగలుగుట కవకాశములు గలిగెను అదియునుగాక, నీ దేశము సకలసంపదల తోడను, పాడిపంటల తోడను సమృద్ధిగనుండి, భోగవస్తువులకై యితర దేశములపై నాధారపడియుండవలసిన యావశ్యకత లేకపోవుట మన దేశీయుల బుద్ధికుశలతకును, ఓరిమికిని, సాహసిక జీవనమునకు దోడగుచుండ, ప్రజాహృదయమున వాణిజ్యవాంఛయు లాభాపేక్షయు నెట్లు జనింపకుండును? మన దేశమునందు జనులకుగల వాంఛలు స్వల్పములు; భోగవస్తువులు సయితము మనదేశము నందుకంటె నితర దేశములందు నెక్కువగా లభింపవు ఆవశ్యకములయిన విదేశవస్తువులలో తగరము, సీసము, అద్దములు, గాజాసామానులు, ఆయుధముల కుపయోగపడు ఉక్కు, ఔషధములలోనికి పగడము, కొంతవఱకు అంబరము (సుగంధ ద్రవ్యము) మున్నగునవి య్యైరోపాఖండము నుండియు, ఖర్జూరము, సాంబ్రాణియు నరేబియా దేశము నుండియు దప్ప హిందూదేశమున కితర దేశములనుండి తెప్పించుకొనదగిన వేవియు లేకుండెను[2] కర్పూరము, పట్టును హిందూదేశమునందే విశేషముగ లభించుచుండినను, విదేశముల కెగుమతి చేయుటకై చీనాదేశమునుండి గొనిరాబడుచుండెను. హిందూదేశము నందు నానాభాగములందు లభించు మణులు, రత్నములు, ముత్యములు, అగరు, ఉన్ని, హింగువ, కస్తూరి, చందనము మున్నగునవి యితర సుగంధ ద్రవ్యములతోబాటు య్యైరోపాఖండమునకు విపరీతముగ నెగుమతి యగుచుండెను ప్రాచీనకాలము నుండియు కాశ్మీరశాలువలు, డాకా మజ్లినులు, తూర్పుతీరపు రవసెల్లాలు, కలంకారిగుడ్డలు, రత్నకబంళ్ళు మున్నగునవి పారశీకదేశమున కెగుమతి యగుచుండెను ఈ కాలమున, లండను, పారిసు నగరములందు కాశ్మీరశాలువలకును, రత్నకంబళులకును ఎంతబేరమున్నదో ఆ కాలమున బాబిలోను, రోమకనగరములం దంత అమ్మక ముండెను. వీని అన్నిటికంటెను, దూర్పుతీరమునుండియు, వంగదేశము, మగధదేశముల నుండియు పట్టు విశేషముగ నెగుమతి యగుచుండెను. పారశీకసామ్రాజ్యమున జనులాకాలమున పట్టున కెత్తునకెత్తు బంగారమిచ్చి కొనుచుండిరి. పట్టు తరువాత నూలుబట్టలు – జముఖానములంతటి ముతుకరకము మొదలుకొని, యొడలిపై గప్పుకొనిన యొడలంతయు గన్పడచేయునంతటి రవసెల్లాల వఱకును – విశేషముగ నెగుమతి యగుచుండెను[3]. ఇవిగాక, తైలములు, యిత్తడి సామానులు, తేనె (చెఱకుపానకము), ఉప్పు, ఓషధులు, రంగులు, సుగంధద్రవ్యములు,

జాజికాయలు, జాపత్రి, మిరియములు, యేలకుపండ్లు, లవంగములు, పోకచెక్కలు మున్నగునవి యనేకములగు భోగవస్తువులు విపరీతముగ నేటేట నెగుమతియగుచుండెను.

ప్రపంచమందలి యన్ని దేశములవారికి గావలసిన భోగవస్తువులన్నిటిని అవిచ్ఛిన్నముగ సమకూర్పగలిగియుండిన యీ భరతఖండమునకును, ఆంధ్ర దేశమునకును, విదేశములతోడి వాణిజ్యమెట్లు లాభకారిగ నుండకపోగలదు? వర్తకపు త్రాసు ఆకాలమున మనవైపుననే 'మ్రొగ్గు' చూపించుచుండెను. విదేశీయులకు గావలసిన వస్తుసముదాయమునంతయు మనదేశీయులే బంపవలసివచ్చుటచేతను, మనకు వారిదేశములనుండి కొనితీసికొని రావలసిన వస్తువులు కడుస్వల్పములగుటచేతను ఆయావిదేశములనుండి వెండి బంగారములు మనదేశములలోనికి నేటేట వర్ణించుటకు నలవిగాకుండ ప్రవహించుచుండెను. అట్లగుటవలన గాబోలు పదునాఱవశతాబ్దము నాటికి ప్రపంచమునందుగల వెండి బంగారములంతయు, హిందూదేశమునందే మూల్గుచుండెనని యొక చరిత్రకారుడు వ్రాసియున్నాడు ఐరోపియనులు మనదేశముతో పదునాఱవ శతాబ్దమున వర్తక మారంభించుటకు గారణము గూడ, హిందూదేశపు వెండి బంగారములపైగల యాశయే. తుదకు హిందూ దేశపుటైశ్వర్యము వారలకు మాటసామెత గూడ నయ్యెను

ఇట్టి వర్తక మెపుడు ప్రారంభమయి యెట్లు వర్ధిల్లియుండెనో యీ వఱకె గొంతవఱకు సూచించియుంటిమి. ఒక చోట జాతకకథల గూర్చి వ్రాయుచు నా కథలవలన క్రీస్తునకు బూర్వమేడాఱు శతాబ్దముల కాలమునుండి పశ్చిమతీరపు వర్తకులు విదేశములతో వాణిజ్యము నెఱపు చుండినట్లును భరుకచ్ఛ, సోపార రేవులనుండి వర్తకపుటోడలు బయలుదేరి పారశీక సింధుశాఖ గుండ బాబిలోను, అర్మిజా నగరములను గూర్చి బోవుచు వచ్చుచుండెననియు జెప్పియుంటిమి. హిందూదేశమునుండి పారశీక సామ్రాజ్యముగుండ యీజిప్టు, గ్రీసు, రోమక దేశములవఱకును సరకులు కొంతదూరము సముద్రముమీద నోడలలోను, కొంతదూరము నాటునను గొంపోవబడుచుండెను క్రీస్తునకుబూర్వము ఐదవశతాబ్దము నాటినుండియు, గ్రీసుదేశమునకు గొంపోవబడుచుండిన సరకులకు గ్రీకుభాషయందు ప్రత్యేకపదములలేమిచే వరిధాన్యములు, నెమళ్లు, మంచిగంధము మొదలగువానికి దక్షిణహిందూదేశము నందుపయోగించెడి పదములనే వారును ఉపయోగించుచుండిరో[4]. పై విషయములన్నిటిని జర్చించుచు, హిందూదేశమునుండి బాబిలోనునగరము మీదుగా జరుగుచుండిన వర్తక

వ్యాపారమునుగూర్చి కెన్నడీదొర యిట్లు వ్రాయుచున్నాడు[5]. 'మనకున్న ప్రమాణములనుబట్టి చూడ క్రీస్తు పూర్వ మేడాఱు శతాబ్దముల కాలము నాటినుండియు మధ్యహిందూ స్థానమునకును బాబిలోనుకును, సముద్ర వాణిజ్యము జరుగుచుండినట్లు నమ్మకము పుట్టుచున్నది ఈ వర్తకమంతయు దక్షిణహిందూదేశ వాస్తవ్యులగు ద్రావిడజాతుల స్వాధీనములో నుండుచుండెను, గాని యార్యజాతు లెప్పుడు నందుపాలుగొనలేదనుటకు వీలులేదు.' ఈ ద్రావిడజాతులు తరువాతి కాలమునందు అరేబియా దేశమునందును, ఆఫ్రికా ఖండముయొక్క తూర్పుతీరమునందును, తుదకు చీనాదేశమునందును వలస లేర్పఱచుకొని యుండినట్లు గన్పడుటవలన ఆకాలమునందే వాణిజ్యార్థమై బాబిలోను, పారశీకరాజ్యములందు అధినివేశములు స్థాపించి యుండిరని చెప్ప సాహసింపవచ్చును[6] కాని హిందూవర్తక నౌకలు, ఓడదొంగల భయముచేత, జెడ్రోసియా తీరమునంటి పయనముచేయక హుటాహుటి నడిసముద్రముమీద బడిపోయి పారశీక సింధుశాఖను ప్రవేశించు చుండెను

ఈవిషయమును గూర్చి వ్రాయునవసరమున రైసు డేవిడ్సు[7] పండితుడు (Rhys Davids) గూడ నిట్టి సిద్ధాంతమును చేయుచు 'సముద్రగాములయిన యోడల వర్తకులు క్రీస్తునకుబూర్వ మేడెనిమిది శతాబ్దములకాలమునుండి పశ్చిమతీరమందలి భరుకచ్ఛ, సోపార నౌకాశ్రయములనుండి బయిలుదేరి వ్యాపారార్థమై అర్మజు, బాబిలోను నగరములకరుగుచుండిరి భరుకచ్ఛ, సోపారనగర రేవులనుండి యెగుమతి యగుచుండిన సరకులకు హీబ్రూభాషా నామములు ద్రావిడభాషలందు గాననగుచున్నవిగాని, సంస్కృత, పాలీ పదవికృతరూపములుగ బొడగట్టకపోవుటచే, నీ వర్తకముచేయుచుండిన వర్తకులందఱు ద్రావిడులని చెప్పవలసి వచ్చుచున్నది' యనినుడివి యుండెను[8]. జాక్సను దొరగూడ నీసంగతులనే ధృవపఱచుచు బొంబాయి గెజటీరునందు వ్రాసి యుండెను. ఆయన యభిప్రాయము ననుసరించి క్రీస్తునకు బూర్వమేడెనిమిది శతాబ్దములనుండియు, హిందూదేశము లోని భరుకచ్ఛ, సోపార (సూరతు) నగరములకును, బాబిలోను నగరమునకు నడుమ ఓడలవర్తకము విరివిగా సాగుచుండెను[9]

హిందూదేశముయొక్క ప్రాచీనమైన వాణిజ్యమును బ్రశంసించుచు నితర పాశ్చాత్య చరిత్రకారులు మఱికొందఱు వ్రాసియుండిరి. ప్రపంచమునందలి జనసామాన్యమునకు జ్ఞానోదయ కాలమునుండి అరేబియాదేశము హిందూ దేశము నుండి సరకులను దెప్పించుకొనుచుండినట్లు ప్రమాణములు గలవు. ప్రప్రథమము నుండి హిందూదేశమునుండి యెగుమతి యగుచుండిన వస్తువులలో

దంతము, ఏనుగులు, బంగారము, నవరత్నములు, మంచిగంధము, క్రోతులు, నెమళ్లు ముఖ్యమయినవిగ నుండెను. ఇవిగాక రత్నకంబళ్లు, రవసెల్లాలు, మల్లులు, చీటిగుడ్డలు, పట్టుబట్టలు గూడ యెగుమతి యగు చుండెను ఆ కాలమున మనదేశమునుండి గొంపోయి యమ్మబడిన రవసెల్లాలు నేటివఱకు ఈజిప్తుదేశమునందు మూగబొమ్మలకు (మమ్మీలనబడు మృతకళేబరము) గప్పబడి జూపరులకు నాశ్చర్యమును, విషాదమును గలుగజేయుచున్నవి. ఈ మూగబొమ్మలు, క్రీస్తునకు బూర్వము రెండు మూడువేల సంవత్సరముల క్రిందట చనిపోయిన రాజులయొక్క కళేబరము లగుటచే నాకాలమునాటికే మనదేశపు రవసెల్లాలు జగద్విఖ్యాతములయ్యెననియు, మనదేశ వర్తకులు, విదేశములతో వాణిజ్యము నెఱపుచుండినట్లు ఊహించుట కవకాశము గల్గుచున్నది.

ప్రాచీన హైందవ సముద్రవాణిజ్యము దక్షిణాపథవాస్తవ్యులగు ద్రావిడజాతుల చేతిలో నుండెనని చెప్పుటకు కొన్ని నిదర్శనములను కాల్డువెలు (Robert Caldwell) దొర దెలుపుచున్నాడు[10]. మొట్టమొదట మయూరము లీజిప్తుదేశమునకు గొంపోవబడినపు డీయందమైన తోకగల పక్షుల కాదేశపు హీబ్రూభాషయందు పదములేకుండెను. ఆ కారణమున అందమైన తోక గల పక్షియగుటచేత తూకి యనుపద మాపక్షికి హీబ్రూ భాషయందు ఉపయోగింప బడెను ఇట్లే అగరునకును, కర్పూరమునకును, దాల్చినచెక్క (లవంగపట్ట) కును గూడ హీబ్రూ భాషయందు ద్రావిడభాషావికృతములగు పదములే గానిపించు చున్నవి.

ఇంత ప్రాచీనత గల్గిన వర్తకము మొట్టమొదట నీదేశీయుల చేతులలో నుండినను దానిని క్రమక్రమముగా పారశీకులు, అరబ్బులు, ఫినీషియనులు, గ్రీకులు, రోమనులు మున్నగువారనేకులు వశపఱచుకొనగల్గిరి. పారశీకులు, అరబ్బులు మనదేశమునందు పరిశ్రమ లభివృద్ధిలోనున్న చోటులందు వలస లేర్పఱచుకొని వర్తకము చేసికొననారంభించిరి. ఇట్లే తరువాత వచ్చిన రోమనులుగూడ వర్తకాభివృద్ధికై తమ వర్తకశాలలను మనదేశపు రేవులందు నెలకొల్పియుండిరి. పశ్చిమతీరమున కల్లికోటయు, తూర్పుతీరమున కావేరిపట్టణమును, సుపట్టణమును, మైసాలియా నగరమును, కటకశాలయు, కూడూరు, పాలూర మొదలగు నగరములందొకకాలమున విదేశీయులు వర్తకశాలలు నెలకొల్పియుండినట్లు దెలియుచున్నది.

కావున, విదేశీయులవ్రాతల నొక్కసారి బరీక్షించి వారికాలమున మనదేశము నందెచ్చటెచ్చట సుప్రసిద్ధ వర్తకస్థానములు, రేవుపట్టణములుండెనో

నిర్ణయింతము క్రీస్తుశకారంభకాలమున ఆంధ్రమహాసామ్రాజ్యమునందు ఆంధ్ర చక్రవర్తుల బాహుఛాయల విదేశవాణిజ్య మభివృద్ధిలో నుండినపుడు రోమను దేశీయులగూడ మనదేశమునకు వర్తకార్థమై యేతెంచియుండిరి. అంతకుబూర్వము అలెగ్జాండరు కాలమునుండియు, నాతనిరాయబారి మెగాస్థనీసు కాలమునుండియు హిందూదేశమును గూర్చిన వింతలు పాశ్చాత్యఖండవాసుల కభిరుచి గల్గించుటచే వారికి మనదేశమునుగురించి నూతనవిషయములు స్వయముగ దెలిసికొన కుతూహల ముదయించు చుండెను. వర్తకులతోబాటు నావికులు, చరిత్రకారులు, శాస్త్రజ్ఞులుగూడ మనదేశమును జూడ తలంపుగొని యీదేశముకేతెంచి తాముస్వయముగ జూచినదానిని, వినిన దానిలో తమకు సత్యమనిదోచినవానిని తమగ్రంథములందు జేర్చియుండిరి ఈ పాశ్చాత్యదేశీయులలో ప్లైనీ (Pliny) చరిత్రకారుని 'నాచురల్ హిస్టరీ' యును, పెరిప్లసు గ్రంథకారుని 'పెరిప్లసు ఆఫ్ ది యెరిత్రియను సీ' యును, టోలమీ (Ptolemy) యను భూగోళశాస్త్రజ్ఞుని 'భూగోళశాస్త్రమును' మన యాంధ్రదేశ సంబంధమును గూర్చిన విషయములను గలిగియున్నవి. ప్లైనీ చరిత్రకారుడు హిందూదేశమునకుగాని యాంధ్రదేశమునకు గాని వచ్చియుండలేదు అయిన నీతనికి భూగోళశాస్త్రమునందును, విదేశ చారిత్రములందును, అభిమానమెక్కువగుటచేత తనదేశమునకు నేటేట సరకులనమ్మ తెచ్చెడి విదేశవర్తకుల నడుగుచు వారివలన తనకు తెలిసిన వృత్తాంతములను గ్రంథస్థము చేసియుండెను. హిందూమహాసముద్రము నంతయు దిరిగివచ్చిన సుప్రసిద్ధనావికులుగూడ తమకు దెలిసినవృత్తాంతము లీతని చెవిని బడవేయుచుండిరి టోలమీ పండితుని గ్రంథముగూడ చాలవఱకు వినికిడివలన దెలియవచ్చిన సంగతులబట్టి వ్రాయబడినదే. అందువలన మన దేశపు నగరనామములు, నౌకాశ్రయముల నామములు వికృతరూపమును పొంది ఎఱుకబడకపోవుచున్నవి. కొన్నివేళలం దాచరిత్రకారుల కీదేశపు వ్యవహారములను దెలుపుచువచ్చిన నావికులు మొదలగువారు అక్షరజ్ఞానశూన్యులగు విద్యావిహీనులగుటచే, నొకప్పుడు తప్పులుకూడ దెలుపుచువచ్చిరి. వారల కీహిందూదేశముయొక్క స్వరూపమును స్థల నిర్ణయమును జక్కగ దెలియకపోవుటచేత వారు దెలుపుచుండిన విషయములు నాగ్రంథకర్తలకుగూడ దుర్గ్రాహ్యమయియుండెను. ఇక పెరిప్లసు గ్రంథకారుడు స్వయముగ నావికుడును, పండితుడు నగుటచే, నాతడొక్కడు విషయములు స్వయముగ నెఱుగగోరి బంగాళఖాతమువఱకుగూడ వచ్చి చూచి వర్ణించెను

ఈ గ్రంథకారులలో ప్లైనీ రోమనుదేశీయుడు. టోలమీ భూగోళ శాస్త్రజ్ఞుడు, ఈజిప్తుదేశీయుడు పెరిప్లసుగ్రంథకారుడగు హిప్పాలను తొలుత బానిసీడుగనుండి, విముక్తుడై తన యజమానుని యనుగ్రహమువలన నౌకయోడను బడయగలిగి హిందూమహాసముద్రమున బ్రయాణముచేయ బయల్వెడలియుండెను. ఈతడును ఈజిప్తు వాస్తవ్యుడే

జ్ఞాపికలు:

1 Mukherjee, Indian Shipping, page 81
2 Mukherjee, Indian Shipping page 82
3 ఒకప్పుడొక సెల్లానుదెచ్చి, పచ్చగడ్డిపై పరుచగా, పచ్చగడ్డి తప్ప, యా సెల్లా గానరాలేదట. Birdwood Industrial Arts of India.
4 Caldwell, Grammar of the Dravidian Languages, S P pages 91, 105
5 Mukherjee, Indian Shipping, page 88
6 Mukherjee, Indian Shipping, page 88.
7 Buddhistic India, page 116
8 Mukherjee, Indian Shipping, page 90
9 Rhys Davids, Buddhistic India page 116
10 Caldwell, Grammar of the Dravidian Languages, pages 91, 105

# 5. ఆంధ్రమహాసామ్రాజ్య కాలము
## క్రీ.పూ.200-క్రీ.శ.250

మౌర్యసామ్రాజ్య మంతరించిన తరువాత ప్రథమమున దక్షిణమున ఆంధ్రులును, ఉత్తరమున కుషానులును విశేషముగ విదేశవాణిజ్యవ్యాపారమును పోషించుచు, విదేశములతో బరస్పరసంబంధము కలిగియుండి, భరత ఖండమునకు జగద్విఖ్యాతమైన యైశ్వర్యము జేకూర్చియుండిరి. కుషానుసామ్రాజ్యము సింధునదీప్రాంతమునుండి పారశీకదేశమువఱకు వ్యాపించియుండుటచే నాప్రాంతపు విదేశవాణిజ్య మంతయు నాటుననే సాగుచు, మధ్యధరాసముద్రపు రేవులను జేరుచుండెను. ఆంధ్రమహాసామ్రాజ్యము మహోచ్చదశయందు గంగానది మొదలుకొని కాంచీపురమువఱకును, పూర్వసముద్రమునుండి పశ్చిమసముద్రము వఱకును వ్యాపించియుండెను. మౌర్యసామ్రాజ్యమునకు వెనుక ఆంధ్రమహాసామ్రాజ్యమే హిందూదేశమునకు ఐశ్వర్యమును ప్రఖ్యాతిని సమకూర్పగలిగియుండెను. ఆంధ్రసామ్రాజ్యకాలమున అనగా క్రీ పూ. 200లు మొదలుకొని క్రీ శ. 250 వఱకును ఆంధ్రదేశము నందేగాక సకల దక్షిణహిందూస్థానమునందును విదేశములతోడి సముద్ర వాణిజ్యము ప్రబలముగ జరుగుచుండినట్లు గ్రీకు, రోమను, చీనా చరిత్రకారులు వ్రాసియుండిన గ్రంథములును, మనదేశమునందు దొరకిన ప్రాచీననాణెము లనేకములును సాక్ష్యమిచ్చుచున్నవి.

ఆంధ్రసామ్రాజ్యకాలమున జరుగుచుండిన విదేశవాణిజ్యము గ్రీసు, రోము మొదలగు పాశ్చాత్యదేశములతో జరుగుచుండినట్లు తెలియుచున్నది రోమకసామ్రాజ్య విజృంభణముతో అస్సీరియా, బాబిలోను, అరేబియా, ఈజిప్టు మున్నగు దేశములు తమతొంటివైభవమును దక్కియుండెను. ఆకారణమున హిందూదేశముతోడి వర్తకము అరబ్బులు, పారశీకుల చేతులనుండి జారిపోయి రోమకుల పాలయ్యెను. రోము నగరమందు ప్రజాప్రతినిధిప్రభుత్వ (Republic) మంతరించిన కాలమునుండి యాదేశీయులు హిందూదేశముతోడి వర్తకమును ప్రోత్సహింప నారంభించిరి.

రోమకసామ్రాజ్యము పూర్వఖండముతో వర్తకమారంభింపక పూర్వము హిందూదేశము ఈజిప్టు మొదలగు దేశములతో నెరపుచుండిన వర్తకమునుగూర్చి

యొకింత చెప్పవలసియున్నది. ఫైలోడెల్ఫస్ టాలెమీ యను ఈజిప్టుచక్రవర్తి తనకాలమున జరుగుచుండిన హిందూదేశముతోడి వ్యాపారమును మెట్టదారినుండి మఱల్చుటకై నైలు నదీముఖద్వారమున అలెగ్జాండ్రియా యను రేవుపట్టణమును నిర్మించెను. అది ప్రాక్పశ్చిమ సముద్రవాణిజ్య వ్యాపారమును మేళవించు ప్రధానస్థానముగనుండెనని తెలియుచున్నది. ఈ పట్టణనిర్మాత యగు టాలెమీ చక్రవర్తికడ కశోకచక్రవర్తి తనబౌద్ధరాయబారులను బంపి మైత్రి నెఱపియుండెను. అలెగ్జాండ్రియా పట్టణముతోబాటు పారశీక సింధుశాఖ యందు బెరినికా, మయాస్ హోర్మజ్ అను రేవుపట్టణములుకూడ లేచెను ఈ మయాస్ హోర్మజ్ పట్టణము నుండి వచ్చిన సరకులకే ఆంధ్రమున హురుమంజియని పేరు వచ్చెను. అలెగ్జాండ్రియా, మయాస్ హోర్మజ్ పట్టణములు లేచుటతోడనే హిందూదేశముతో నంతవఱకు నాటున జరుగుచుండిన వ్యాపారము సముద్రముదారిబట్టెను. భరతఖండమునుండి వచ్చుచుబోవుచుండిన వర్తకపుటోడలు హోర్మజ్‌నగరము నుండి బైలుదేఱి, సూటిగ నడిసముద్రము మీదబడివచ్చి సింధునదీ ముఖద్వారమునందలి రేవుపట్టణములను జూచుకొని, యంత టనుండి బైలుదేఱి పశ్చిమాంధ్ర రాష్ట్రమునందలి సుప్రసిద్ధ నౌకాశ్రయములగు భరుకచ్ఛ, సోపారములకు బోవుచుండెను అచ్చటినుండి బైలుదేఱిన యోడలు దక్షిణముగ సముద్రతీరమునంటియే మలబారుమీదుగ బోయి యచ్చటి ముజిరిస్ మొదలగు రేవులను జూచుకొని సింహళద్వీపమును జుట్టి చోళమండలతీరముననే పూర్వాంధ్రదేశములోని రేవుపట్టణములను జూచుకొనుచు, తామ్రలిప్తినగరమునకు బోవుచువచ్చుచుండెను. హిందూ దేశమునకు వచ్చు నోడలసంఖ్య యొక్కొక్కప్పుడు వందలకొలది యుండెను స్ట్రేబో యనునాతడు తనకాలమున మయాస్ హోర్మజ్ నుండి నూటయిరువది యోడలు బైలుదేఱుట యొకప్పుడు తాను స్వయముగ జూచితినని వ్రాసెను

ఆంధ్రమహాసామ్రాజ్యముతో రోమకసామ్రాజ్యము క్లాడియస్ చక్రవర్తి కాలమున వర్తక మారంభించెను. ఈ వర్తకము ఆంధ్ర చక్రవర్తుల ప్రాపక పోషణములక్రింద నభివృద్ధిగాంచి ఆంధ్రదేశముకేగాక హిందూదేశమునకుగూడ నైశ్వర్యప్రదాయక మయ్యెను. ఆకాలమున శ్రీమంతులగు రోమనులకు దక్షిణహిందూస్థానమునుండి యెగుమతి చేయబడుచుండిన భోగ్యవస్తువు లెక్కుడుగ గావలసియుండుటచే రోముతోడి వర్తక మాంధ్రసామ్రాజ్యమునకు లాభదాయకముగనుండెను. ఆ వర్తక స్వభావ మెట్టిదో ప్లైనీ చరిత్రకారుని వాక్యముల వలన దేటవడగలదు[1]. ఆతడు (క్రీ శ. 77) రోమక సంపన్నులిట్లు తమధనమును కేవలము భోగ్యవస్తువులపై వినియోగించుట సదసద్వివేక పరిజ్ఞాతలకు హృదయవేదన కలిగించుచుండెనని వ్రాసియుండెను. మఱియు నాతడు తన యక్కసుపట్టజాలక పొక్కుచు దనదేశీయు లనవసరముగ

సుగంధపరిమళద్రవ్యముల కొఱకును, అలంకారములకొఱకును, ఆభరణములకొఱకును ధనమును బాడుచేయుచుండిరనియు, నావస్తువులకై యేసంవత్సరమును హిందూదేశమున కఱువదిలక్షల రూప్యముల విలువగల బంగారమునకు దక్కువ పంపబడియుండలేదనియు, నా ధనమునకు బదులుగా దన దేశమునకు బంపబడిన సరకు లసలుఖరీదుకంటె నూఱురెట్లెక్కువధరకు విక్రయింపబడుచుండెననియు,దమ స్త్రీల విలాసముకొఱ కంతధనము వ్యయపఱచుట మిక్కిలి శోచనీయమనియు వ్రాసియున్నాడు. దక్షిణ హిందూ దేశమున కింతలాభకరమగు వర్తకము రోమకులకు ద్వరలో నసూయ కలిగించినదయ్యెను ఈ యసూయతవలన హిందూదేశముతో స్వయముగ వర్తకముచేయు తలంపు రోమకులకు గలిగెను అంతవఱకు హిందూ మహాసముద్రమందును, అరేబియాసముద్రమందును ఓడమార్గములు హిందువులకు, నరబ్బులకుదప్ప నితరులకు దెలియకుండెను మఱియు నీసముద్రములం దేయే ఋతువులు నౌకాయానము కనుకూలములోగూడ గ్రీకులకును, రోమకులకును తెలియకుండెను. మొట్టమొదట నీ రహస్యమును క్రీ.శ 47 సంవత్సరమునందు హిప్పాలస్ అనునాతడు కనిపెట్టెను. ఈతడు హిందూమహాసముద్రమును, బంగాళాఖాతము నంతయును సంపూర్ణముగ బ్రయాణము చేసి 'పెరిప్లస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సీ' అను గ్రంధమును రచియించియుండెను[2]

రోమకసామ్రాజ్యమున కెగుమతి యగుచుండిన వస్తువులలో సుగంధపరిమళద్రవ్యములు, మణులు, ముత్యములు, పట్టుబట్టలు, రవసెల్లాలు, మల్లులు, ప్రత్తి ముఖ్యమైనవిగ నుండెను రోమునగరమునందు శుభాశుభకర్మల యందును, దేవాలయములలో పూజాసమయములందును ధూపములు వేయు నాచారము ప్రబలముగ నుండుటచే పరిమళద్రవ్యముల కావశ్యకత యెక్కుడుగ నుండెను. రోమక సామ్రాజ్యాధ్యక్షుడగు సిల్లా చనిపోయినపుడు వాని దహనకర్మయందు రెండువందలపది 'మలగ'ల సుగంధద్రవ్యముల నుపయోగించిరట! ఇట్లే నీరోచక్రవర్తి 'పాపీయ' యనువాని యంత్యకర్మ యందు సరిగ నొక్క సంవత్సరమునందు దిగుమతియగు నంతటి దాల్చినచెక్కను, ఆకుపత్రిని వినియోగించిరి. ఈ పరిమళద్రవ్యములు దక్షిణహిందూస్థానము నుండి వచ్చు వర్తకులకడ అరబ్బులు కొని, రోమునగరమున మారుబేరమున కమ్ముచుండువారు. ఆ కాలమున రోమునగరమునందు మిరియములు, అల్లమును విశేషముగ అమ్మకము గలిగియుండెననియు, వానిధర వెండి, బంగారములవలె నెత్తున కెత్తుచొప్పున నుండెననియు ప్లైనీ చరిత్రకారుడు వ్రాసియున్నాడు[3]. పరిమళ వస్తువులును, సుగంధద్రవ్యములునుగాక మణులు,

ముత్యములు, పట్టుబట్టలు, మల్లులు, రవసెల్లాలుగూడ విశేషముగ బేరమగుచుండుటవలన నవియు విపరీతమైన ధరల కమ్ముడగు చుండెను. అరీలియస్ చక్రవర్తి కాలమున పట్టుబట్టల కెత్తునకెత్తు బంగారము చొప్పున ధరయుండెను. అట్లయినను శ్రీమంతులగు రోమను లీయమూల్యములగు పట్టుబట్టలనే ధరించు చుండిరి. ప్రజ లీమిక్కిలి సున్నితములైన పట్టుబట్టలను ధరించుటచే నొడలంతయు గాన్పించుచున్నదనియు, స్త్రీపురుషులకవి యుచితమైన యుడుపులు కావనియు టైబీరియస్ సీజరు చక్రవర్తి శాసించియుండెను[4]

రోమునగరముతోడి సముద్ర వాణిజ్యవ్యాపారము క్రీ.శ.68వ సంవత్సరమువఱకు విశేషముగ నుండినట్లును, అంతటినుండి క్రీ శ.217వ సంవత్సరమువఱకును కొంచెము హీనదశలో నుండినట్లును కొందఱు చరిత్రకారు లూహించుచున్నారు మనదేశమునం దాకాలమునాటి నాణెములు కొద్దిగ లభించుటచే వర్తకము క్షీణించియుండెనని వారియభిప్రాయము[5] కాని యాకాలమున బరిమళద్రవ్యములకును, భోగ్యవస్తువులకును, మణులు లోనగువాటికి బేరము తగ్గి పోయెనేమోకాని యావశ్యకములగు పట్టుబట్టలకును, రవసెల్లాలకును, మల్లుగుడ్డలకును అమ్మక మేమాత్రమును తగ్గియుండలేదని తెలియుచున్నది ఏలయన నీకాలపునాణెములు ఆంధ్రదేశమునందు ప్రత్తి పండించు ప్రాంతములందును విశేషముగ గానవచ్చుచున్నవి[6]. ఈ కాలముననే చాలమంది రోమకవర్తకులు వాణిజ్యార్థ మేతెంచి దక్షిణహిందూదేశమందలి ముఖ్యనగరములందును, రేవుపట్టణములందును నివాస మేర్పఱుచుకొని యుండిరని సుప్రసిద్ధ చరిత్రకారు లగు విన్సెంటు స్మిత్తుగారు నుడువుచున్నారు[7]

ఆంధ్రరాజుల పరిపాలనమున రోము మొదలగు దేశములతో నోడలవర్తకము జరుగుచుండినట్లు దృష్టాంతము లనేకములు చూపవచ్చును. రోముతో మనదేశము విశేషముగ వర్తకవ్యాపారము చేయుచుండుటవలన రోమకనాణెము లనేకము లీప్రాంతమున విరివిగ దొరికెను. ఈ విషయమును గూర్చి దక్షిణహిందూస్థాన ప్రాచీనచారిత్ర పండితులగు రాబర్టు స్యూయెల్‌గారు (Sewell R.) ఈ విధముగ వ్రాసియున్నారు. 'ఆంధ్రయుగమునందు దేశమంతయు సకలైశ్వర్యములతో దులతూగుచుండినట్లు కాన్పించుచున్నది. ఆ కాలమున పశ్చిమమున ఆసియా, గ్రీసు, రోము, ఈజిప్టు దేశములతోడను, తూర్పున బర్మా, సయాము, చీనా, ప్రాక్సముద్రద్వీపసమూహము మున్నగు దేశముల తోడను, నాటునను సముద్రము మీదను గూడ వాణిజ్యము జరుగుచుండెను. దక్షిణ హిందూస్థానమునుండి రోమక సామ్రాజ్యమునకును,

రోమక సామ్రాజ్యమునుండి యాంధ్ర సామ్రాజ్యమునకును, ఇతర దక్షిణదేశములకును రాయబారములు నడచుచుండెను హిందూదేశపు టేనుగులు సిరియాను యుద్ధములందుపయోగింపబడుచుండెను ప్లైనీ చరిత్రకారుడు రోమునగరము నుండి ప్రతిసంవత్సరమును ఇంతింతయని చెప్పజాలని వెండిబంగారములు హిందూదేశీయులు గొనిపోవుచుండిరని చెప్పుచున్నాడు. ఈ యంశమునే పెరిప్లస్ గ్రంథకారుడగు హిప్పాలస్కూడ ధృవపఱిచి యున్నాడు. ఉత్తర హిందూస్థానము నందుకంటె దక్షిణ హిందూస్థానమునందు విశేషముగ రోమకనాణెములు దొరకెను[8] '

డాక్టరు భండార్కరు గారు కూడ తమ ప్రాచీన దక్షిణ హిందూస్థాన చారిత్రమునందు నిట్టియభిప్రాయమే తెలుపుచు నాంధ్రయుగమునందు వర్తకమును, వాణిజ్యమును అంతటి ప్రాచీనకాలముననే యభివృద్ధినొందినట్లు నుడువుచున్నారు[9].

దక్షిణ హిందూదేశములో దొరకిన పురాతన నాణెములు ప్రాచీనాంధ్రుల సముద్రవ్యాపారవైభవమును జాటుచున్నవి. ఆంధ్రచక్రవర్తుల కాలమునాటి నాణెములు మనకు లభించినంతవఱకు సీసము, రాగి, వెండి, బంగారము మొదలగు లోహములతో జేయబడి, ధరణికోటలోను, గుడివాడ ప్రాంతమునందును, నెల్లూరు ప్రాంతమునందును, పశ్చిమ దేశమందలి సముద్రతీరపు స్థలములందును గానవచ్చినవి. వీటినిగూర్చి ముఖర్జీ పండితుడు 'ఆంధ్రనాణెముల నీ సందర్భముగ ప్రత్యేకముగ బరిశోధించి యభిప్రాయమొసగ వలసియున్నది ఏలయన నాంధ్రరాజులకాలమున సముద్రవాణిజ్యవ్యాపారము నిస్సంశయముగ జరుగుచుండెనని చెప్పుట కవకాశములుకలవు. హిందూదేశపు తూర్పుతీరమున దొరకిన రెండుకొయ్యలు గల పెద్దయోడలు ముద్రింప బడియున్న నాణెములు నాయభిప్రాయమును బలపఱచుచున్నవి ' అని వ్రాయుచున్నాడు[10].

రోమక నాణెములుగానివి యితరనాణెము లాంధ్రచక్రవర్తులలో గౌతమీ పుత్త్రశాతకర్ణి, రెండవ పులుమావి, యజ్ఞశ్రీ శాతకర్ణి, చంద్రశ్రీ శాతకర్ణుల కాలమునాటివిగ నున్నవి ఇవి క్రీ.శ. రెండుమూడు శతాబ్దములనాటివిగ గాన్పించుచున్నవి వీనిలో గొన్నిటిపై రెండు తెరచాపకొయ్యలుగల పెద్దనౌకలు ముద్రింపబడియుండెను. ఇట్టియోడ ప్రతిమను ఆనాణెములపై ముద్రించుటయందలి భావమునుగూర్చి విన్సెంటు స్మిత్తుగారు 'ఇందు గొన్నినాణెములపై గౌతమీపుత్త్ర యజ్ఞశ్రీ శాతకర్ణి (క్రీ.శ. 184-230) నామముండుటచే నాతని యధికారము భూమిమీదనేగాక సముద్రము మీదను,

ఉత్తరదేశమునందును వ్యాపించియుండినట్లు తోపజేయుచున్నవి యజ్ఞశ్రీ కాలమునాటి యోడముద్రగల నాణెములు క్రీస్తుశక మొకటిరెండు శతాబ్దములందు చోళమండల తీరమున జరుగుచుండిన విదేశసముద్రవాణిజ్య వ్యాపారమునకు నిదర్శనముగ నున్నవి' అని నుడివియుండిరి[11] అలెగ్జాండరు రీ యనునాతడుకూడ దక్షిణ హిందూస్థానమునందలి బౌద్ధుల ప్రాచీన కట్టడములనుగూర్చి వ్రాసిన గ్రంథమునందు ఆంధ్ర నాణెముల చిత్రపటములను బ్రకటించుచు, వానిని వర్ణించుసందర్భమున నిట్టియభిప్రాయమునే వెలిబుచ్చి యుండెను[12].

ఆంధ్ర చరిత్రకారులగు శ్రీ చిలుకూరి వీరభద్రరావు పంతులుగారు ప్రాచీనాంధ్ర సముద్రవాణిజ్యమునుగూర్చి యిట్టి సదభిప్రాయమునే యొసంగియున్నారు 'ఆంధ్రరాజుల పరిపాలనమున రోము మొదలగు విదేశములతో వర్తకవ్యాపారము జరుగుచుండినట్లు దృష్టాంతము రోమను చక్రవర్తుల నాణెము లీదక్షిణ హిందూస్థానమునందు చెల్లుబడి యగుచుండుట కన్న మఱియేమి కావలయును? రోముతోడ దక్షిణ హిందూస్థాన మాకాలమున వర్తకవ్యాపారము కలిగియుండుటచే రోమకనాణెము లీప్రాంతమున విరివిగ దొరకెను. అంతేగాక యాంధ్రచక్రవర్తులు కుషానుచక్రవర్తుల వలె రోమక నాణెములను కరగించి క్రొత్త నాణెములక్రింద ముద్రింపక, యావిధముననే చెలామణీ చేయుచుండిరి. ఈ దేశమునందు రోమకనాణెములు దొరకుట వలన గలిగినయభిప్రాయములను ధ్రువపఱచు విశేషాంశ మింకొక్కటి: హీబ్రూభాష యందు దక్షిణ హిందూదేశీయ పదములు వాడుకలోనికి వచ్చి యుండుటయే[13].' మరియు నీయాంధ్రరోమక నాణెములనుబట్టి చూడగా ఆంధ్రులకును, రోమకులకును వర్తకవ్యాపార సంబంధముండినట్లు తోచుచున్నదని రాలిన్సను (Rawlinson) పండితుడు కూడ చెప్పియున్నాడు[14].

'ఆంధ్రయుగమున అరేబియా, ఈజిప్టు, రోము, గ్రీసు, పారశీకము మొదలగు దేశములనుండి యోడలు పశ్చిమాంధ్ర రాష్ట్రమునందలి భరుకచ్ఛము (Broach), సింహపురము, శూర్పరాగము (సోపారము) మొదలగు రేవు పట్టణములకు వాణిజ్యార్థమై వచ్చుచు బోవుచుండెను. భరుకచ్ఛము పశ్చిమాంధ్రరాష్ట్రమునం దాకాలమున సుప్రసిద్ధ వర్తకస్థానమై యలరారు చుండెను. ఇచ్చటినుండి సింహళమునకును, సింహళము మీదుగా గంగానదీ ముఖద్వారమందుండిన తామ్రలిప్తి (Tamluk) నగరమునకును సముద్రమార్గము కలదు ఈ మార్గమున నోడలు రాకపోకలు సలుపుచుండెను. తామ్రలిప్తి నగరమున బైలుదేఱిన యోడలు తూర్పుతీరము వెంబడివచ్చి, కళింగదేశము

నందలి రేవుపట్టణములను, ఆంధ్రదేశమునందలి రేవుపట్టణములను జూచుకొని, చోళమండల తీరమునంటి సింహళద్వీపమునకు బోవుచుండెను[15]. 'ఆ కాలమున నీసముద్రమార్గముగాక తూర్పుతీరమునుండి ధాన్యకటకము, ప్రతిష్ఠానపురముల మీదుగా మెట్టదారిని భరుకచ్ఛము వఱకును సరకులు పంపబడుచుండెను. పశ్చిమఖండములనుండి వచ్చు సరకులు కూడ భరుకచ్ఛము నుండి మెట్టదారిని ప్రతిష్ఠానపురము మీదుగా దేశములోనికి గొనిరాబడు చుండెను'[16]

ఇట్లు ఖండఖండాంతరములతో సముద్రవాణిజ్యవ్యాపారము నెఱపుచుండిన యాంధ్రదేశములోని వర్తకస్థానములును, నౌకాశ్రయములు, నెవ్వియో తెలిసికొనుట యావశ్యకము. పూర్వప్రకరణములయందు విమర్శించి యుండిన బౌద్ధసారస్వతమునందు బర్మా, సయాము దేశములలో జెప్పుకొను గాథలయందును మహేంద్రగిరి మొదలుకొని పినాకినీ తీరము వఱకు గల పూర్వాంధ్రదేశమునందు నాలుగైదు రేవుపట్టణములుండినట్లు చెప్పబడెను వానిలో గళింగదేశమునందలి 'అడ్జీటా' యను రేవుపట్టణము మొదటిది ఈ పేరాంధ్రకళింగ దేశములలో నీ కాలమున నేనగరమునకు వర్తించునో తెలియరాకున్నది.

రెండవది, ఆంధ్రదేశమునందొక మహానదీముఖద్వారమున 'దంతపుర' మనునొక మహానగర ముండినట్లు, నయ్యది యొకప్పుడు కళింగదేశమునకు రాజధానిగ నుండినట్లును బౌద్ధగ్రంథములందు జెప్పబడియున్నది బుద్ధుని దంతకథన గాథలన్నియు నీమహానగరమునకు సంబంధించియున్నవి. ఈ మహానగరము గోదావరీముఖద్వారము నందుండెననియు, నీ కాలపు రాజమహేంద్రవరమే ప్రాచీనబౌద్ధగాథలలోని దంతపురము కావచ్చుననియు జనరలు కన్నింగుహాముగారు వ్రాయుచున్నారు[17]. కాని యీయభిప్రాయమును ఫెర్గూసన్ పండితు డంగీకరింపలేదు గోదావరీముఖద్వారముననున్న కోరంగి పూర్వకాలమునుండియు బ్రసిద్ధనౌకాశ్రయమై యలరారుచుండుటచే దానికో, లేక యాప్రాంతమున నుండిన మఱియొక గ్రామమునకో దంతపురమును ముడిపెట్టుచున్నాడు. దంతపురము గోదావరీముఖద్వారమం దుండెననుమాట నిజమైయుండవచ్చును. పెరిప్లస్ గ్రంథకారుడగు హిప్పాలస్ కూడ గోదావరీ ముఖద్వారమున నొక రేవుపట్టణ ముండినట్లు చెప్పియుండెనుగాని దాని పేరు పేర్కొనజాలకపోయెను. ప్లైనీ చరిత్రకారుడు దంతపురమును 'దండాగుల'[18] యని పేర్కొనుచు నయ్యది గంగానదీముఖద్వారమునకు నాకాలపు కొలత ననుసరించి 625 రోమను మైళ్ల దూరమున, అనగా 574 మైళ్ల దూరమున దక్షిణముగ నొకమహానదీముఖద్వారమున గల కోరి యగ్రమం (Cape Cori)

దుండెనని చెప్పియున్నాడు. ఈ కోరి అనుపే రీకాలపు కోరంగికి సాదృశ్యము గలిగియున్నది అతడు గోదావరిని గొయరెస్ అని పేర్కొనియుండెను. ఈ గోదావరీముఖద్వారమునకు సమీపముగ నిప్పుడు దొంతికుఱ్ఱు అనుగ్రామము కలదు ఈ గ్రామనామమును బట్టి యొకవేళ నిదియే దంతపురమై యుండవచ్చునని యూహింపవచ్చును. ఈప్రాంతమున నిండ్లకు బునాదులు, నూతులు, చెఱువులు త్రవ్వించునపుడు భూగర్భమున ప్రాచీనకట్టడముల చిహ్నములు కాన్పించుచుండుటచే నీగ్రామవాసు లీస్థలమునం దొకప్పుడొక మహానగరము వర్ధిల్లియుండినట్లు తలంచుచున్నారు. ఇచ్చట జెప్పుకొనబడు స్థలపురాణమునందుగూడ నిచ్చట నొకకాలమున దంతాసురుడనురాజొ పరిపాలించియుండినట్లును, అతని నగరము ఉప్పెనమూలమున దిబ్బయిపోగా భూగర్భమునందనేక దేవాలయములు, విహారములు, సౌధములు పూడి పోయెననియు జెప్పబడుచున్నది.

కళింగదేశపు నగరములలో సింహపురముకూడ నొకప్పుడు రాజధానిగనుండి వర్తకస్థానమని ప్రఖ్యాతిగాంచెను. ఈ సింహపురముకూడ బౌద్ధగాథలయందు విశేషముగ గానబడుచున్నది. ఈ నౌకాశ్రయమునుండి కళింగదేశపు రాజకుమారియగు తిలకసుందరి సింహళద్వీపమునకు బ్రయాణము చేసియుండెనని మహావంశమునందు జెప్పబడియున్నది[19]. జనరలు కన్నింగ్‌హాముగా రీనగరమునకు స్థాననిర్ణయముచేయుట సాధ్యముకాదనియు, కాని గంజాము మండలములోని నరసన్నపేట కెనిమిది మైళ్ల దూరమున నాగావళీతీరమున నున్న సింహపురమే యొకవేళ గాథలలోని కళింగ రాజధానియై యుండవచ్చుననియు సూచించియున్నారు[20].

ఇవిగాక, కృష్ణానదీముఖద్వారమున నొకటిరెండు రేవుపట్టణము లుండినట్లు బౌద్ధగాథలు సూచించియున్నవి. అందొకటి అమరావతియై యుండవచ్చునని ఫెర్గూసన్‌పండితుడు సూచించియుండెను. అమరావతి యాంధ్రసామ్రాజ్యమునకు రాజధానీనగరము కాకమునుపు దానికి దిగువ కృష్ణానది మీద సముద్రమున కనతిదూరమున నుండిన శ్రీకాకుళనగరము రాజధానిగ నుండినట్లు చరిత్రవలన దెలియుచున్నది. ఇదిగాక, కృష్ణానది కిరుప్రక్కల నుత్తరముఖద్వారము నందుండిన ఘంటసాల, కూడూరు? లను సుప్రసిద్ధమహానగరములు క్రీ.శ. ఒకటిరెండు శతాబ్దములందు వర్తకస్థానములు నౌకాశ్రయములునై ప్రఖ్యాతిలో నుండినట్లు తెలియ వచ్చుచున్నది[21]. అట్లగుటచే ఫెర్గూసన్‌పండితుని సిద్ధాంతము పూర్వపక్ష మగుచున్నది. ఈ మూడు నగరములునుగాక కృష్ణానదికి దక్షిణముఖ ద్వారమునకు సమీపమున

మోసలపురమును నౌకాశ్రయమొకటి యుండినట్లుకూడ ప్రాచీనాంధ్ర చరిత్రవలననేగాక పాశ్చాత్త్యుల వ్రాతలనుబట్టికూడ దెలియుచున్నది. ఈ మోసలపుర మీకాలమున మోటుపల్లి యనబఱగుచు గుంటూరుమండలములోని బాపట్ల గ్రామమున కెనిమిది మైళ్ల దూరమున నున్నది

ఈ పట్టణము లాంధ్రచక్రవర్తుల పరిపాలనమున ప్రాక్పశ్చిమ దేశములతోడను, హిందూమహాసముద్రపు దీవులతోడను సముద్రముమీద వర్తకవ్యాపారము చేయుచుండినట్లు దెలియగలదు ఈ పట్టణములనుగూర్చి విదేశస్థులు వ్రాసిన గ్రంధములను బరిశోధింప నందందు యీ నగరనామములు వికృతరూపమును జెంది గనవచ్చుచున్నవి. టోలెమీ యను భూగోళ శాస్త్రజ్ఞుడు (క్రీ శ.140) ఆంధ్రదేశమునందు టిన్నా (Tynna) యనియు, మైసోలస్ (Maisolus)అనియు రెండు మహానదులను బేర్కొని యందు మైసోలస్ ప్రాంతమున మైసోలియా (Maisolia) యను రేవుపట్టణమును బేర్కొనెను పాశ్చాత్య చరిత్రకారులు టిన్నా యనునామము కృష్ణానదికిని, మైసోలస్ యనునామము గోదావరికిని ముడివెట్టిరి. కాని టిన్నాయనుపేరు, పినాకిని లేక పెన్నకు, సరిపోవుటచే, టిన్నా పినాకినికిని, మైసోలస్ కృష్ణానదికిని గ్రీకునావికు లుపయోగించిన నామములుగ గనపట్టుచున్నవి. మైసోలస్ గోదావరికి మాత్రము చెందదనుటకు ప్లైనీ చరిత్రకారుడు గోదావరిని గొయరిస్ అని పేర్కొనుట తార్కాణము. మోసలపురమునకు (మైసోలియా) సమీపమున నుండటచే కృష్ణానదిని గ్రీకులు మైసోలస్ అని బిలచియుందురు.

టోలెమీకి పూర్వపువాడగు హిప్పాలస్ అను నాతడు (క్రీ శ.100) హిందూమహాసముద్రమంతయు వాణిజ్యము కొఱకు బ్రయాణముచేసి యందందుగల వర్తకస్థానములను జూచి యాకాలపు స్థితిగతులను 'పెరిప్లస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సీ' యనుగ్రంథమున వ్రాసియుండెను ఈతడు చాలకాలము భరుకచ్ఛమున నివసించి, తరువాత మలబారుతీరము వెంబడి బైలుదేఱి సింహళమును జుట్టివచ్చి తూర్పుతీరము వెంబడి కృష్ణానదీముఖద్వారమువఱకు బోయి మఱలివచ్చెను. ఈతడు కూడ తూర్పుతీరపు రేవునగరములలో దాను స్వయముగ జూచిన నౌకాశ్రయము మసాలియాయని చెప్పియుండెను. టోలెమీ పేర్కొనిన మైసోలియాయును, హిప్పాలస్ స్వయముగ జూచియుండిన మసాలియా రేవును ఒక్కటేయై యుండునని నిశ్చయముగ జెప్పవచ్చును.

ఆంధ్రచరిత్రకారులు మసాలియా యనుపురము కృష్ణామండలములోని మసూలా యను మచిలీపట్టణమునకో, యరువది డెబ్బదిమైళ్ళదూరమున దిగువగానున్న మోటుపల్లికో సంబంధించియుండునని వ్రాసియుండిరి[22] ఈ

పేరు మచిలీపట్టణమునకు సంబంధించినదని మఱికొందఱు వ్రాసియుండిరి గాని వారి వాదము సాహసమని జెప్పవచ్చును మచిలీపట్టణము వారనుకొనునంత ప్రాచీనమైనదిగాదు. బహమనీ రాజ్యస్థాపనాంతరము అరబ్బులు, పారశీకులు ఇచ్చటికి వలసవచ్చి నౌకావర్తకమునకు వీలుగనుండుటచే దీనిని ప్రాముఖ్యత లోనికి దెచ్చిరి ఈ విషయమునుగూర్చి ముందుముందు వ్రాయబడును ఈ మసాలియా యనునది మోసలపుర మను మోటుపల్లికే వికృత నామమనుట నిస్సంశయము. మోటుపల్లికి మోసలపురమనియు, ముకుళపురమనియు నామాంతరములున్నట్లు మనదేశములో లభించిన శాసనములబట్టి తెలియు చున్నది. ఈ పట్టణము, నీ పట్టణప్రాంతము రహసెల్లాలు, నద్దకపు గుడ్డలకు, సున్నితములయిన మల్లుబట్టలకు బ్రాచీనకాలమునుండియు బ్రసిద్ధి వహించియుండెను. ఈ విషయమును టోలమీ, పెరిప్లసు గ్రంధకారు లిరువురును ధృవపఱచుచున్నారు. సున్నితములయిన రహసెల్లాలును, మల్లుగుడ్డలు నీ మసాలియా రేవునుండియే యెగుమతియగుచుండుటవలన అరబ్బు లానాలుబట్టలను మసాలియా పదవికృతమగు మజ్లిను పదమున బిలుచుచుండిరని యొకానొక చరిత్రకారుడు వచించియుండెను. ఇట్టి జగద్విఖ్యాతమయిన మసాలియా రేవుపట్టణమునకు చీనా, జపాను, బర్మా, కాంబోడియా దేశములనుండియు జావా, బోర్నియో, సుమత్రా ద్వీపముల నుండియు వంగదేశమునుండియు నోడలు సరకులను గొనివచ్చుచు మఱల సరకులను గొనిపోవుచుండెను[23]. టోలమీ కృష్ణానదీముఖద్వారమునకు సమీపమునగల మసాలియాపురమును మాత్రమేగాక యిక్కడ కెగువనున్న ఘంటసాల, కూడూరు నగరములను కూడ పేర్కొనియుండెను[24]. క్రీస్తుశక మొకటవశతాబ్దమునందు ఘంటసాల, కూడూరునగరములు మహావైభవముతో వర్ధిల్లుచుండుటచే టోలమీ యాపట్టణముల గూర్చి బాగుగ నెఱిగియుండెను. అతడీదేశమునకు రాకపోయినను యాతని కీదేశస్థితిని వర్ణించినవార లీనగరమును దప్పకచూచియేయుండిరనవలయును. టోలమీ చోళమండల తీరమునందలి యితర రేవుపట్టణములను బేర్కొనుచు కావేరిపట్టణము తరువాత పుదుక (పుదుచ్చేరి) నగరమును, సుపట్టణమును, పినాకినీ ముఖద్వారమున కొట్టిస్ (Kottis), మనార్ఫా (Manarpha) పట్టణములను, మైసోలసు నదీముఖద్వారమునందు ఘంటసాలయు (Kontokossyla), కూడూరును (Koddura), అక్కడనుండి మహానదీముఖద్వారము వఱకు నీనడుమగల పాలూర, నెయింగ్గైనా (Naingaina), కటికర్దమ (Katikardama), కన్నగర (Kannagara) ములను బేర్కొనియుండెను. ఇన్నినగరముల నామములు జెప్పగలిగియుండినను గోదావరీముఖద్వారముననున్న నౌకాశ్రయమును బేర్కొనజాలకపోయెను

టోలమీ మయిసోలసు నదీముఖద్వారముననున్న ఘంటసాలనగరము (Kontokossyla) వర్తక స్థానమనియు కూడూరు బర్మా, కాంబోడియా, మలాకా, సయాం దేశములకు నోడలుబయలుదేరుస్థానమనియు బ్రశంసించియుండెను టోలమీ పేర్కొనిన కొడ్డూర కృష్ణానది యుత్తర పాయ సముద్రమును గలియుచోటున కుత్తరముగానున్న కోడూరను గ్రామమునకు సరిపోవుచున్నది గాని, యాతని కాలమున బ్రసిద్ధిలో నుండినది, మచిలీబందరునకు సమీపముననున్న గూడూరని (కూడూరు) చరిత్రవలన దెలియవచ్చుటజేసి కొడ్డూర గూడూరనియే నిశ్చయింపవలయును కోడూరును ప్రాచీనప్రాశస్త్యముగల్గిన గ్రామమువలె గాన్పించునుగాని, క్రీస్తుశకారంభ కాలమునుండియున్నట్లు దెలియరాదు. ఆకాలమున, వేంగిదేశము నేలుచుండిన బృహత్పాలాయనులను పల్లవులకు గూడూరు నగరము రాజధానిగనుండెను.

టోలమీ పేర్కొనిన కొంటకొస్సైల ఘంటసాలకును, కొడ్డూర మచిలీపట్టణ సమీపముననున్న గూడూరునకును సరిపోవుచుండుటచే నూతన చరిత్రాంశమొకటి ద్యోతకమగుచున్నది ఈ రెండునగరములు మిక్కిలి ప్రాచీనప్రశస్తిగల్గినవనుటయేగాని, ఇటీవలివఱకు విశేషములు దెలియ రాకుండెను బర్మా, కాంబోడియా, మలాకా, సయామదేశములలోని నాగరికత దక్షిణహిందూస్థానమునుండి గొనిపోవబడినదని ప్రతీతియేగాని యానాగరికతను గొంపోయిన సాహసికులకు దూర్పుతీరమున నిర్గమద్వార మెద్దియో చరిత్రకారు లన్వేషింపలేకుండిరి, కాని టోలెమీ పేర్కొనిన నగరము లాంధ్రదేశములోనివైనట్లు చరిత్రకారు లిప్పుడు నిశ్చయింపగలుగుటచే, ఆంధ్రదేశమునుండియే బర్మామొదలుకొని చీనాదేశమువఱకునుగల దేశముల కన్నిటికిని హిందూనాగరికత, హిందూదేశపు మతములు, చిత్రకళలు మున్నగునవి గొంపోవబడెనని నిశ్చయముగ జెప్పుట కవకాశము కలుగుచున్నది. ఈ విషయమును గూర్చి వ్రాయుచు డూబ్రీలు (G J Dubreuil) పండితుడు టోలెమీ కాలమున బర్మా, మలాకా, కాంబోడియా, అనాము, జావా దేశములకు హిందూనాగరికత ఘంటసాల, కూడూరు రేవులనుండియే బైలుదేఱి వ్యాపించెనని నిస్సంశయముగ సిద్ధాంతీకరింపవచ్చునని నుడివియున్నాడు[25].

ఈ ఘంటసాలయు, కూడూరును ఇంచుమించుగ టోలెమీకాలమం దేస్థలమందుండెనో, యిప్పుడు నక్కడనే యున్నవి కాని, యానగరముల కైశ్వర్యమును గూర్చగలిగిన కృష్ణానదీ ప్రవాహముగాని, ముఖద్వారముగాని పూర్వముండినచోట్ల మాత్రము లేవు. టోలెమీ కాలమునాటికి ఆంధ్రమహా సామ్రాజ్యము మహోన్నతస్థితి యందుండెను ఆకాలమున నాంధ్రచక్రవర్తులకు

రాజధానియు దక్షిణ హిందూస్థానమునందలి బౌద్ధక్షేత్రములలో ప్రఖ్యాతి గాంచినదియునగు అమరావతి–ధాన్యకటకము కృష్ణానదిమీద కొంచెమెగువున నుండెను. ఆంధ్రచక్రవర్తులకడ సామంతులుగ నుండి పూర్వాంధ్రదేశమును బరిపాలించియుండిన బృహత్పలాయను (గోత్రోద్భవులమని చెప్పుకొను పల్లవరాజు)లకు నీ కూడూరునగరము రాజధానియై యుండెను. ఆంధ్ర సామ్రాజ్య మంతరించిపోయిన తరువాత నీబృహత్పలాయను లేమికారణముననో తమరాజధానిని కూడూరుపురము నుండి వేంగిపురమునకు మార్చివైచిరి. అప్పటినుండియు కూడూరు ప్రసిద్ధి తగ్గిపోయెను.

ఇంక టోలమీ పేర్కొనియుండిన యితర నగరనామము లేరేవు పట్టణములకు వర్తించునో ఆరయవలసి యున్నది. కొట్టిస్ అను నగరము నాతడు మసాలియానగరమునకు కొంచెము దిగువగా నొక నదీముఖద్వారమునకు సమీపముగ నున్నదనుటచేత, నెల్లూరిమండలము లోని కొత్తపట్టణమునకు సరిపోవుచున్నది. ఈ కొత్తపట్టణము సముద్రమునంటి గుండ్లకమ్మ నదీముఖద్వారమున నుండుటచే నొకకాలమున రేవుపట్టణమై యుండవచ్చును. ఇంతకన్న ప్రస్తుత మీనగరముగూర్చి వేఱు తెలియరాదు. మనార్పా యను పేరాప్రాంతమున నేనగరమునకు వర్తించునో ఊహింప శక్యముగాకయున్నది ఏటేట వచ్చు పినాకినీ వఱదలు దెచ్చిపోయు నిసుకయందేమి కూరుకొనిపోయి యుండెనో? సముద్రపుటుప్పెనల వలన ఏనగరములు నామరూపాదులు లేకుండబోయెనో ఎవరు చెప్పగలరు! ఈ రెండునగరముల ప్రాంతముగూడ పెరిప్లసు, టోలమీ చరిత్రకారులు రవసెల్లాలకు ప్రసిద్ధిచెందియున్నట్లు వ్రాసియుండిరి.

మయిసోలసు నదీముఖద్వారమును దాటినపిదప పాలూర, నెయింగయినా, కటికర్దమ, కన్నగరములు ప్రసిద్ధిచెందిన రేవులని టోలమీ పేర్కొనియుండెను. ఈ నామము లాంధ్రదేశమున నేనగరములకు వర్తించునో, అవి యెచ్చటనుండెనో తెలిసికొనుటకు వీలుగాదు. కన్నగర యనునది కళింగదేశపు రాజధానియగు కళింగనగరమునకు వర్తింపవచ్చును. నెయింగ యినా, కటికర్దమ నామములు పూర్తిగ వికృతరూపము పొంది యుండుటచే నీకాలపునగరములలో నేపేరునకును సాదృశ్యము బొడసూపకున్నవి.

పశ్చిమాంధ్ర రాష్ట్రమందలి భరుకచ్ఛనౌకాశ్రయమున పెరిప్లస్ గ్రంథకారుడగు హిప్పాలస్ చాలకాలము నివసించియుండినకతన ఆంధ్ర సామ్రాజ్యము యొక్క విదేశ సముద్రవాణిజ్యమును గొంతవఱకు వర్ణింపగలిగియుండెను పశ్చిమాంధ్రరాష్ట్రమున నాతడు తాగర(Ter ?), సోపార

(Surat), కల్యాణపురములు ముఖ్య రేవుపట్టణములని పేర్కొని యుండెను. పశ్చిమాంధ్ర రాష్ట్రమున గోదావరి నదిమీద నున్న ప్రతిష్ఠానగరము (Paithan) (శాతవాహన?) యువరాజులకు రాజధానిగనుండెను. మధ్య హిందూస్థానము నుండియు, దక్షిణాపథ పీఠభూమినుండియు, తూర్పుతీరమునుండియు నానావిధములగు సరకులు దేవగిరి మీదుగ ప్రతిష్ఠానపురమునకు బోవు రాజమార్గముగుండ గొనిపోవబడుచు, పైనుదహరింపబడిన రేవుపట్టణముల నుండి పశ్చిమదేశములకు నెగుమతి యగుచుండెను. హిప్పాలసు జ్యేష్ఠ శాతకర్ణుని కాలమున భరుకచ్ఛ, కల్యాణ, సోపార నగరములు ముఖ్యమైన నౌకాశ్రయములును, వర్తకస్థానములు నైయుండెననియు, నాతనితరువాత బరిపాలించిన సుందర శాతకర్ణి కాలమున నాతడు బలహీనుడగుటచే వర్తకము క్షీణించిపోయెననియు, నంత భరుకచ్ఛ నౌకాశ్రయమును శత్రువుడగు క్షాత్రప సహపానుడు వశము చేసికొనెననియు, నాతనియుద్ధనౌకలు కల్యాణ, సోపారనగరముల కేతెంచిన వర్తకపుటోడలను బలాత్కారముగ మఱలించుకొనిపోయి, భరుకచ్ఛనౌకాశ్రయమున సరకులను దింపించుచుండెననియు వ్రాసియున్నాడు[26] పెరిప్లస్‌చే జ్యేష్ఠ శాతకర్ణి (Elder Saraganus) యని పేర్కొనబడిన ఆంధ్రచక్రవర్తి అరిష్ట శాతకర్ణి చక్రవర్తియనియు, 'కింగ్ సాండనీస్' (King Sandanes)అను నాతడు సుందర శాతకర్ణి యైయుండుననియు రాలిన్సను పండితు డూహించుచున్నాడు[27]. ఆ కాలమున ఘూర్జరదేశమునందు క్షాత్రవ భూమకుడును, వానితరువాత నాతనితనయుడగు సహపానుడును విజృంభించి పశ్చిమాంధ్ర రాష్ట్రములోని యుత్తరభాగమంతయు నాక్రమించుకొని యాంధ్రసామ్రాజ్యమును నామమాత్రావశిష్టముగ జేయ నుంకించుచుండిరి పెరిప్లస్ పేర్కొనిన అరిష్ట శాతకర్ణియే క్షాత్రపవిజృంభణమునకు బూర్వము పరిపాలించిన యాంధ్రచక్రవర్తులలో బలవంతులలో గడపటివాడు ఆతని వెనుకబరిపాలించిన సుందర శాతకర్ణి మొదలగువారు బలహీనులగుటజేసి యాంధ్రసామ్రాజ్యముయొక్క విదేశవాణిజ్యము సన్నగిల్లుటకు హేతు వయ్యెను.

పెరిప్లస్ గ్రంథకారుడాకాలపు నౌకానిర్మాణమును గూర్చి వ్రాయుచు, చోళమండలతీరవాసులు తాను జూచిన మలబారుదేశములో దమస్వంత యోడలలో వర్తకము చేయుచుండిరనియు, నేకాలమున జూచినను వీరియోడలచట నుండుననియు దెలిపియున్నాడు[28] తూర్పుతీరపు రేవు పట్టణములనుండి యోడలు బైలుదేఱి 'లిమూరిక్'నకు ప్రయాణము చేయుచుండుననియు, నవి మిక్కిలి పెద్దవిగ నుండి యొంటికొయ్య గలిగి,

'సంగార' (మళయాళమునందు జంఘాల, కొలండియోఫోంట) అనుపేరులు గలిగియుండెననియు, నవియొక ప్రక్క గంగానదీముఖద్వారము నందలి రేవులతోడను మఱియొక ప్రక్క బర్మా, మలాకా, కాంబోడియా, జావా, అనాము దేశములతోడను వ్యాపారము చేయుచుండెననియు వ్రాసియున్నాడు.

ఆ కాలమున రోము మొదలగు పాశ్చాత్యదేశముల తోడనేగాక ప్రాగ్దేశములతోడను గూడ ఆంధ్రసామ్రాజ్యము వర్తకముచేయుచుండినట్లు దృష్టాంతములు కానవచ్చుయున్నవి. ఆంధ్రరాజులను గూర్చి చీనాదేశమందలి చారిత్రములందును, సుమత్రా, జావాద్వీపములందును బ్రశంసలు గానవచ్చుటచే నాకాలమున నాంధ్రదేశమునకును, ఆదేశీయులకును విశేషసంబంధముకలదని నిశ్చయింపవచ్చును. చీనాదేశ చరిత్రకారులు 'యజ్ఞాయ్' అని గౌతమీపుత్ర యజ్ఞశ్రీ శాతకర్ణిని బేర్కొనుచు వానిని మగధచక్రవర్తియనియు, హిందూదేశ చక్రవర్తియనియు జెప్పియున్నారు. ఈతడాంధ్రచక్రవర్తులలోనివాడని యీవఱకే మనము తెలిసికొంటిమి ఇందువలన విన్సెంటు స్మిత్తుగారు ఈతని గూర్చి చెప్పిన వాక్యమునందలి యథార్థము మనకిప్పుడు గోచరమగుచున్నది. ఆంధ్రచక్రవర్తులలో కడపటివాడైన మూడవ పులుమావిని 'పౌలోమీణ' అనియు 'హౌలోమీణ' అనియు, 'హౌలోమీణతో' యనియు పేర్కొనుచు హిందూదేశమును పౌలోమీనుచే బరిపాలింపబడు దేశమని యర్థమిచ్చు 'పౌలోమీణకోవె' యనియు బిలచియున్నారు. కడపటి చక్రవర్తియైన యీ పౌలోమి మరణానంతరము దేశ మల్లకల్లోల మయ్యెనని 'డిగ్గైన్సు ఓలోనాచెన్ (Degiunes Olonachen) అనునాతడు వ్రాసియున్నాడు. అతడు వ్రాసిన తరువాతి వృత్తాంత మంతయు మూడవ పులుమావి కాలమున నాంధ్రసామ్రాజ్యమునందు బొడసూపిన యల్లకల్లోలములను దెలుపుచున్నది. ఈ పౌలోమికి చీనా చక్రవర్తి మిత్రుడగుటచే దనసేనలనంపి యావిప్లవకారుల నణచివైచెను[29]. ఈ విషయములనుబట్టి చూడగా ఆంధ్ర, చీనా చక్రవర్తులకు బరస్పర మైత్రి కలదనియు, నీ రెండు దేశములకు వర్తకవ్యాపారము జరుగుచుండెననియు దేటపడక మానదు. మఱియు నీయాంధ్రరాజులను మగధ చక్రవర్తులనియు, మహాకర్ణులనియు, జావా మొదలగు ప్రాగ్ద్వీపములందు జనులు పేర్కొనుచుండిరి. వీరిని గూర్చి యాకాలమున నాదీవులయందు కథలు చెప్పుకొనబడుచుండెను. ఆంధ్రచక్రవర్తులనుగూర్చిన మహాకావ్యమొకటి జావాద్వీపమునందు గలదు. జావావారిభాష తెలిసికొని యాగ్రంథమును జూచినచో నందాంధ్రచక్రవర్తులగురించి నూతన చరిత్రాంశము లనేకములు దెలియగలవని జెప్పవచ్చును

ఇంతటి వ్యాపారమును జేయుచుండిన వర్తకు లాకాలమున విశేషభాగ్యమును సంపాదించియుండుటలో నాశ్చర్యమేమియు లేదు సముద్రవ్యాపారము సులభముగ సాగుటకును, దమలోదమకు పోటీలు లేకుండుటకును వర్తకులు శ్రేణులు (Corporations) నెలకొల్పికొనియుండిరి ఇట్లే యీ కాలమున నేతగాండ్రకు, గాంధికుల (సుగంధద్రవ్యములను అమ్మువారు) ధాన్యకశ్రేణులకు, నూనెమొదలగువానిని తయారుచేయు వారలకు - వర్తకులకు వలె - ప్రత్యేక సంఘములు, శ్రేణులు (Trade guilds and Merchant corporations) నుండినట్లు కన్పట్టుచున్నది. ఈ వర్తక శ్రేణులకు శ్రేణిసభామందిరములు పశ్చిమదేశమునందలి కొండలలో దొలవబడి నేటివఱకు గాన్పించుచున్నవి. ఇట్టి మందిర మొకటి జయంతీనగర వాసియగు నొకసేర్ కార్లీగుహలో నిర్మింపజేసెనని చెప్పబడియున్నది. ఈ సేటను ప్రాకృతపద మాధునికాంధ్రభాషయందు సెట్టి యని మాఱెను[30].

ఈ యాంధ్రచక్రవర్తులకాలమున బౌద్ధమతము ద్వీపద్వీపములకు వ్యాపించెను. హిందూనాగరికత క్రీస్తుశకారంభ కాలముననే ప్రాక్సముద్రద్వీపములకు వ్యాపింపనారంభించెను కటకశాల, కూడూరు రేవులనుండి క్రీ.శ.75వ సంవత్సరప్రాంతమున ఆంధ్రదేశీయులు వలసపోయి జావాద్వీపమునందు అధినివేశరాజ్యము లేర్పఱుచుకొనిరి. ఈ మహత్కార్యము ఆదిత్యుడను రాజొకడు నిర్వహించెనని తెలియుచున్నది. ఈ మహత్కార్యమును నిర్వహించుటబట్టి యాంధ్రులు తరువాతికాలమున బౌద్ధులగు ఘూర్జరులకుగూడ మార్గదర్శకులైరి. ఆంధ్రదేశమునుండి, ఆంధ్రసామ్రాజ్యమునుండి బౌద్ధభిక్షువులు, హిందూమతబోధకులు, వర్తకులు నానాదేశములకు బోవుచు దమమతవైభవమును జాటియుండిరి. ఈయాంధ్ర సామ్రాజ్యకాలముననే భరతఖండము మహదైశ్వర్యమును బడయగల్గెను భరతఖండముయొక్క నాగరికత, విజ్ఞానము నభివృద్ధిగాంచి, వికసించెను మన దేశము యొక్క ప్రతిష్ఠ ఖండఖండాంతరముల వఱకు వ్యాపించి మాఱుమ్రోగెను.

జ్ఞాపికలు :

1 Mukherjee, Indian Shipping, page 122
2 ibid page 123
3 Natural History, XII, 7, (14)
4 Mukherjee, Indian Shipping, pages 123-125
5 Ibid page 126

6 కృష్ణా, నెల్లూరుమండలములం దీనాణెములు విశేషముగ దొరకెను- చూడుము ఆంధ్రుల చరిత్ర, పూర్వయుగము, పుట 190
7 Early History of India, 3rd Edn pages 400-401
8 Imperial Gazetteer, New Edition, Vol II page 325
9 Early History of the Deccan, page 32
10 Mukherjee, Indian Shipping, page 109
11 Early History of India, page 202
12 Mukherjee, Indian Shipping, page 50
13 ఆంధ్రుల చరిత్ర, పూర్వయుగము, పుటలు 187–190.
14 Rawlinson, Intercourse between India and the Western World, page 120
15 ఆంధ్రుల చరిత్ర, పూర్వయుగము, పుట 187.
16 పూర్వోక్త ప్రమాణము, పుట 190
17 Cunningham, Ancient Geography of India, page 515
18 Cunningham, Ancient Geography of India, page 516
19 Turnour, Mahavamso, pages 88-89
20 Cunningham, Ancient Geography of India, pages 517-518
21 Indian Antiquary, Vol XIII, page 332.
22 ఆంధ్రుల చరిత్ర, పూర్వయుగము, పుట 188
23 Marsedan, Asiatic Researches Vol II, page 331
24 G J Dubreuil, Ancient History of the Deccan, pages 85-88, Indian Antiquary Vol XIII, page 332
25 Dubreuil, Ancient History of the Deccan, pages 86-88
26 Indian Antiquary, Vol XLVIII, page 83
27 Rawlinson, Intercourse between India and Western World, pages 118-119
28 డాక్టరు విన్సెంటుగారు ఆదినములలో గట్టబడు నోడలు మధ్యయుగమునందు గట్టబడుచుండిన యోడలను బోలియుండవచ్చుననియు నట్టి ఒంటికొయ్యయోడ లిప్పటికిని గట్టబడుచున్నవనియు, నాయోడలలో నూఱు, నూటయేబదిమంది ప్రయాణము చేయుటకు వీలుండుననియు నవి బంగాళాఖాతమున కిరుప్రక్కల నున్న రేవుపట్టణములతో వర్తకవ్యాపారము చేయుట కుపయోగించుచుండె ననియు, పెర్లిషస్ చరిత్రకారుడు వర్ణించియుండిన కొలండియోఫోంటా యనునోడలు మిక్కిలి పెద్దవై స్థూలముగా నుండి మలాకా, చీనా, మలబారు మొదలగుదూరదేశములకు సైతము పోవుటకు సమర్థత గలిగియుండెననియు, నవియే మార్కొపోలోచే 'కొలంకోంటి' యని పేర్కొనబడినవాటికి సరిపోవున్నవనియు వ్రాసియున్నాడు Commerce of the Ancients, Vol II, page 52
29 Marsedan, Asiatic Researches, Vol II, page 331, ఆంధ్రుల చరిత్ర, పూర్వయుగము, పుట 191
30 ఆంధ్రుల చరిత్ర, పూర్వయుగము, పుట 184

# 6. పల్లవ యుగము

## క్రీ.శ. 200-700ల వఱకు. అధినివేశరాజ్య స్థాపనకాలము

ప్రాచీనాంధ్రు లెంతయుత్సాహముతో ఎంతపట్టుదలతో నాంధ్రసామ్రాజ్య కాలమున తమ వర్తకమును రోమకసామ్రాజ్యము మొదలగు పశ్చిమదేశములతో జరుపుచు భరతఖండమునకు మహైశ్వర్యమును జేకూర్చియుండిరో యంతకంటె వేయిమడుంగు లధికోత్సాహముతో, గార్యదీక్షతో నీపల్లవయుగమున వాణిజ్యార్థమై యేగుచు నొకప్పుడు ప్రాగ్ద్వీప సమూహమునందును, బర్మా (పెగూ), సయామ, కాంబోడియా (చంపకదేశము) లోనగు దేశములందును, అధినివేశరాజ్యములను నెలకొల్పి జగద్విఖ్యాతిని బడసియుండినట్లు సమకాలీన చారిత్రములు ఘోషించుచున్నవి. ఈ యధినివేశరాజ్య సంస్థాపన ప్రయత్నమెుక్క వాణిజ్యాభివృద్ధికే గాక హిందూదేశములోని బౌద్ధ బ్రాహ్మణమతములను, నాగరికతను, చిత్రకళలను, విజ్ఞానమును విస్తరింపజేయుటకుగూడ జరిగినట్లు చరిత్రకారుల యభిప్రాయము[1]. ఈ వలసరాజ్యస్థాపనమందు ప్రాచీనాంధ్రులును కాళింగులును జూపియుండిన యుత్సాహమును, కార్యనిర్వహణదీక్షను బొగడుచు ఫెర్గుసను పండితుడు వ్రాసియుండెను. ధరణికోట, అమరావతీ స్తూపములం దిప్పటికిని జీర్ణావస్థయందు నిలిచియున్న కట్టడభాగములను, అందలి చిత్తరువులను, పూర్వ మొకప్పుడు కృష్ణా గోదావరీముఖద్వారములం దుండిన రేవు పట్టణములనుండి - హిందూదేశములోని నానాప్రాంతముల నుండి వచ్చుచుండిన - బౌద్ధభిక్షువులు సువర్ణభూమి యనబరగు పెగూ (దక్షిణ బర్మా) దేశమునకును, కాంబోడియా, సయామ దేశములకును, జావా, బోర్నియో, సుమత్రా మున్నగు ప్రాగ్ద్వీపములకును, మతవ్యాపనార్థము వలసపోయినటులు సాక్ష్యమిచ్చుచున్నవి[2]. ఆంధ్రులందాకాలమున జాతీయ జీవనోత్సాహము వెల్లివిరియుచుండుట యీ సాహసికజీవనమునకు ప్రబలకారణ మయ్యెను. దీనికితోడాకాలమున అప్పుడప్పుడు దేశమును కలగుండు వఱుచుచుండిన

మత, సాంఘిక, రాజకీయ పరిస్థితులు కూడ దానిని పురికొల్పుటకు సాధనభూతము లయ్యెను.

ప్రాక్పశ్చిమసముద్రములవఱకు వ్యాపించి యుండిన యాంధ్ర మహాసామ్రాజ్యము మూడవ శతాబ్దాంతమునకు బూర్వమే క్షీణింప నారంభించెను ఆ సామ్రాజ్యమును పరిపాలించిన శాతవాహనవంశజులలో గడపటివాడగు మూడవ పులుమావి చక్రవర్తి మరణానంతరము సామ్రాజ్యమున నల్లకల్లోలములు సంభవించుటచే నయ్యది అచిరకాలముననే భగ్నమై యదృశ్యమయ్యెను. అంతట నేప్రాంతమును పాలించుచుండిన జాతులవార లాప్రాంతమున స్వాతంత్ర్యమును బ్రకటించి, చిన్నచిన్న రాజ్యములను నిర్మించియుండిరి. అట్టి సమయమున బూర్వాంధ్రరాష్ట్రమున గాంచీపురము మొదలుకొని యుత్తరమున కళింగ, వేంగీ దేశముల పర్యంతముగల దేశమును పల్లవులను నొకతెగవారు స్వాధీనపఱచుకొని స్వతంత్రముగ పరిపాలనము జేయ బ్రారంభించిరి. శాతవాహనచక్రవర్తులలో కొందఱు బౌద్ధమతావలం బకులుగను బౌద్ధమత పోషకులుగనుండ, వారికి సామంతులుగ నుండిన యీ పల్లవరాజులు బ్రాహ్మణమతాభిమానులై బ్రాహ్మణమతము నుద్ధరింప నిరంతరము ప్రయత్నించియుండిరి. ఆ కారణమున నాంధ్రసామ్రాజ్య మంతరించి, పల్లవులు విజృభించిన కాలమున బ్రాహ్మణ బౌద్ధమతములకు నొకవిధముగ సంఘర్షణ మారంభమయ్యెను రాజాదరణ గలిగిన బ్రాహ్మణమత మప్పటినుండి దినదినాభివృద్ధిగాంచుచు బ్రజాహృదయము నాకర్షించుచుండ బౌద్ధమతమునకు దేశమున నిలువ నీడయును బోషణయు లేకుండ బోవు చుండెను.

ఈ మత పరిస్థితులే గాక ఆర్థిక రాజకీయపరిస్థితులు కూడ నాంధ్రుల నాకాలమున సాహసికజీవనమునకు బురికొల్పియుండినట్లు కాన్పించుచున్నది. నానాటికి మహైశ్వర్యము నొందుచుండిన ఆంధ్రసామ్రాజ్యమున జనసంఖ్యయు నభివృద్ధినొందు చుండెను జనసంఖ్య యభివృద్ధినొందుకొలది ప్రజల యందు వాణిజ్యాభిరుచియు విదేశగమనాభిలాషయు గలిగియుండెను. అట్లు వాణిజ్యాభివృద్ధికై జనులందు గలిగిన విదేశగమనాభిలాష విదేశములందు వలసలను నెలకొల్పుటకు బ్రోత్సహించియుండెను. ఆంధ్రులందాకాలమున ఆవిర్భవించిన ఆశయము లన్నియు గార్యరూపమున బుష్పించి ఫలించుచుండ, మతబోధకులు భిక్షువులు మత సంరక్షణార్థము, మత వ్యాపనార్థమును గూడ తమంతట తామె వర్తకులతోబాటు విదేశముల కరుగుచు నచ్చటి జనులకు మతబోధచేయుచు నాగరికులను జేయుచుండిరి. ఆకాలపు టాంధ్రులిట్టి

సాహసికజీవనమునందును వాణిజ్యమునందును విశేషముగ నభిలాష గలిగియుండినను ఈ కాలపు బాశ్చాత్యులవలె ననాగరికులైన విదేశస్థులతో వర్తకము చేయుచు గ్రమక్రమముగ వారి రాజ్యము నపహరించి, వారి స్వాతంత్ర్యమును మంటగలిపి, వారి ననేకవిధముల బీడించి మాతృదేశమున కన్యాయార్జితమైన యైశ్వర్యమును అపయశస్సును ఏమాత్రము చేకూర్పలేదు

బౌద్ధగాథలను విమర్శించుచో గ్రీస్తునకు బూర్వమేడవశతాబ్ది నుండియు హిందూనావికులు దక్షిణమహాసముద్రముల నన్నిటిని జుట్టివచ్చుచుండి రనియు, హిందూదేశపు వర్తకులు దక్షిణమున సింహళద్వీపము, తూర్పున బర్మా, సయాము, కాంబోడియా దేశములతోను వాణిజ్యసంబంధము గలిగియుండి రనియు మాత్రము దేటపడెను బౌద్ధగ్రంథములిట్లు సందిగ్ధములైన సూచనలకు మాత్రము తావొసంగుచుండ, బర్మా, సయాము దేశములందును, జావా, సుమత్రా, బోర్నియెా మున్నగు ప్రాగ్ద్వీపములందును నేటివఱకు గాలానుగతముగ వచ్చుచుండిన గాథలు బౌద్ధసారస్వతములోని విషయములను ధ్రువపఱచుచున్నవి ఇంత ప్రాచీనకాలమున ఆంధ్రులయందు బొడసూపిన సాహసికజీవనోద్యమముయొక్క విపులచారిత్రరచనము, తత్కాల నిర్ణయము మనకు వీలుగాక యున్నవి. ప్రాచీనాంధ్రభాషతోబాటు ప్రాచీనసారస్వతము గూడ గాలక్రమమున నాశమొందిపబడుటకతన చాలవఱకు మన పూర్వుల చారిత్రము కూడ లుప్తమైపోయెను. కాని బర్మా దేశచరిత్రలందును, అచ్చటచ్చట మనదేశమందు నేటివఱకు జెప్పుకొనబడుచున్న స్థలపురాణములందును ప్రాచీనాంధ్ర సాహసికజీవనము లీలగ గాన్పించుచునే యున్నది. పెగూదేశములోని గాథలు, ఆంధ్రులు మొదటిమాఱు బుద్ధునికి బూర్వమే సువర్ణభూమి యనబరగిన దక్షిణ బర్మాదేశమునకు వలసపోయి రాజ్యములు స్థాపించినట్లు సాక్ష్యమొసంగుచున్నవి. బర్మాదేశ చరిత్రము వ్రాయు సందర్భమున ఫెయిరు గారు ''మిక్కిలి ప్రాచీనకాలముననే గోదావరీ, కృష్ణానదీముఖద్వార ప్రాంత దేశములనుండి హిందూదేశీయులు బంగాళాఖాతమును దాటివచ్చి, ఐరావతీ డెల్టాభూములందును తత్పరిసర ప్రాంతములందును వలస లేర్పఱచుకొనినట్లు ఇచ్చటి స్థలపురాణముల వలన దెలియుచున్నది వారాక్రమించుకొనిన ప్రదేశము బౌద్ధగాథలందు సువర్ణభూమి యనబరగుచుండెను ఈ సువర్ణభూమికి రాజధానియై ప్రఖ్యాతిగాంచిన 'తటోను' రేవునగరమునకు 'మన్' భాషయందు సువర్ణభూమి యనుయర్థము కలదు ఈ ప్రాంతమునకు సువర్ణభూమి యను పేరచట సువర్ణము లభించుటచే గలిగెనని దలపగూడదు. ప్రాచీనకాలము నుండి ఐరావతిమీదుగా చీనా దేశములోని వాయవ్య భాగమునుండి సువర్ణ మీప్రాంతమునకు కొనిరాబడుచు

నిచ్చటి 'తటోను' రేవుపట్టణమునుండి హిందూదేశమున కెగుమతియగుచుండిన కారణమున హిందూదేశీయు లీదేశమును 'సువర్ణభూమి' యని పిలచి యుండిరి.'' అని వ్రాసియున్నారు[3]. కృష్ణా గోదావరీ మధ్యప్రదేశవాసు లీప్రాంతమునకు దొలుత వాణిజ్యార్థమై వచ్చుచు బోవుచుండినట్లు కాన్పించు చున్నది ఆకాలమున దక్షిణబర్మాదేశమునకును, దక్షిణ హిందూస్థానము నకును వర్తక వ్యాపారము జరుగుచుండినందున వర్తకులు తఱచుగ వచ్చుచు బోవుచుండిరి సువర్ణభూమితో వర్తకము విశేషలాభకరముగ నుండుటచేత గాబోలు అవకాశము గలిగినప్పుడు కొందఱచ్చట వలస నేర్పఱచుకొని స్వదేశములతో వాణిజ్యము సాగించుకొను చుండిరి. అంతట వాణిజ్య మభివృద్ధినొందుకొలది ఆంధ్రులు విరివిగ బర్మాదేశమునకు వలసవచ్చుచు నైరావతీముఖద్వార ప్రాంతమునంతను దమవర్తక స్థానములతో నింపిరి. వలసవచ్చిన యాంధ్రులు మంచివర్తకు లగుటచేతను, నాగరికు లగుటచేతను ద్వరలో దమవర్తకము నభివృద్ధిచేసికొనుటయే గాక తమ వర్తకస్థానములను దేశములోనికి సైతము వ్యాపింపజేసియుండిరి అట్లు కొంతకాలము జరుగునప్పటికి మనవారు స్వతంత్రరాజ్యమును నెలకొల్పగలిగి క్రమముగ సువర్ణభూమి నంతయు దమ పరిపాలనముక్రిందికి దేజాలియుండిరి. ఆంధ్రులు తొలుత నాక్రమించుకొనిన ప్రాంతము బర్మాలో నేటివఱకు 'మఙ' రాష్ట్రమను పేరబరగుచున్నది[4]. నాగరికులైన తెలుగువారలమూలమున యాప్రాంతపుజనుల కందఱికి గూడ 'తైలైంగు' లనుపేరు కలిగినట్లు లెఫ్టినెంటు జనరలు ఫైట్చీ (Lt Gen. Fytche) గారు వ్రాసియున్నారు. ఈవిషయమును మఱియొక చరిత్రకారుడగు యస్.డబ్ల్యు. కాక్సు (S.W Cocks) గారు కూడ తమ బర్మాదేశపు చరిత్రయందు ధ్రువపఱచియున్నారు[5].

క్రమక్రమముగ దెలుగువారల వలస లభివృద్ధిగాంచుచుండ వలసవచ్చిన తెలుగువార లచ్చటి దేశీయులతో స్నేహభావమున మెలంగుచు, వారిని నాగరికులను జేయుచు, వారితో అన్నివిధములగు సంబంధబాంధవ్యములను గల్పించు కొనుచుండిరి. మఱియు నాకాలమున బర్మాదేశమునకు బోయిన తెలుగువారలు తమతో గూడ దమ స్త్రీలను దీసికొనివెళ్లియుండి రనుట కాధారములు కాన్పించుట లేదని ఫెయిర్‌గారు నుడువుచున్నారు[6]. ఇట్లు వలసపోయిన తెలుగువంశజులు బర్మాదేశమునందు గొంత కాలముండిన తరువాత నచ్చటివారితో నందువముఖ్యముగ 'మన్' జాతి స్త్రీలతో వివాహసంబంధములు చేసికొనియుండిరి. తెలుగువారికిని 'మన్' జాతి స్త్రీలకును జనించిన సంతతివారలు 'తలైంగ్', 'తైలింగ్' లని తరువాతి కాలమున వ్యవహరింపబడుచుండిరి. కావుననే చరిత్రకారులగు ఫెయిరుగారు

ఆధునికకాలమున బర్మాదేశమున 'తలైంగు' 'తైలింగు'లని పిలువబడుచున్న జాతివార లొకప్పుడు దక్షిణాపథమునందలి త్రిలింగదేశములోని తూర్పుతీరమునుండి వలసపోయిన తెలుగువారల సంతతివారలనియు, 'తలైంగు', 'తేలెంగ్' శబ్దములు తెలుంగు శబ్దభవములే యనియు నూహించుచున్నారు[7]. మనపూర్వులింతటి మహత్కార్యములను నిర్వహించి మాతృదేశమునకు ప్రఖ్యాతిని దెచ్చియుండిరని మన మిపుడు సంతోషభరితుల మగుచున్నను కాలవైపరీత్యమువలన వారు తమ ప్రత్యేకవ్యక్తిత్వమును నిలువుకొన జాలక యచ్చటిదేశీయులలో గలిసిపోయి మాతృదేశముతోడి సంబంధమును సంపూర్ణముగ విడగొట్టుకొనిరని తెలిసికొనినప్పుడు విషాదపూరితులము గాకమానము.

ఈ 'తైలింగ్', 'తలైంగ్' శబ్దములు తెలుగు శబ్దభవములేయని నిరూపించుటకు నొకటి రెండుకారణములు గన్పించుచున్నవి అందొకటి యాంధ్రపదమునకు బర్యాయపదముగనున్న తెలుగు లేక తెలుంగు క్రీస్తుశకారంభ కాలమునకు బూర్వమునుండియు వాడుకలో నుండినట్లు కన్పట్టుట – పైశాచీభాషయందీ తెలుగుపదము 'తెలింగో' గా గానవచ్చుచున్నదో. ప్రాచీనమైన పైశాచీభాషయందు తెలుంగు పదము గానవచ్చుటచే తెలుంగు భాషయు నంతటి పురాతనమైనదనియే యూహింప వచ్చును. ఈ తెలుంగుభాష మొదటనుండియు ద్రిలింగదేశమునందు నివసించు ఆంధ్రులకు మాతృభాషగా నుండిన కతన త్రిలింగదేశమునుబట్టి భాషకును జనులకును గూడ త్రిలింగశబ్దభవమగు తెలుగు పదము వాడబడుచువచ్చెను అట్లగుటవలన గొంతకాలమున కాంధ్ర, తెలుగు శబ్దము లొకదాని కొకటి పర్యాయపదములుగ వ్యవహరింప బడజొచ్చెను.

'తలైంగ్', 'తెలైంగ్' పదములకు దెలుగు పదమునకు గల పోలికనుబట్టి మాత్రమేగాక, తెలుగువారలు తొలుత విదేశగమనము నందును, సముద్రయానమునందును, వలసరాజ్య సంస్థాపనమునందును హిందూదేశీయుల కెల్లరకును మార్గదర్శకులయి బర్మాదేశమునకు, జావా సుమత్రాదీవులకును ముందుగా తమ నాగరకతను గొంపోయి వ్యాపింపజేసిన వారని నిర్ణయించుటకు మఱియొక ప్రమాణము గలదు. అయ్యది ప్రాచీనాంధ్రభాషా లిపికిని ప్రాచీన మన్‌భాషా లిపికినిగల సాదృశ్యమని చెప్పదగును. బర్మాదేశములో శాసన పరిశోధన శాఖవారిచే వెలికిదీయబడిన 'మన్' భాషాలిపి స్వరూపము త్రిలింగదేశపు ప్రాచీన తెలుగన్నడలిపి బోలియున్నదని అక్షరతత్త్వజ్ఞుల యభిప్రాయమై యున్నది. ఈ విషయమీ వఱకు

మన్‌జాతివారు తెలుగువారల సంతతివారని దెలిపియుండిన సుప్రసిద్ధచరిత్రకారుల యభిప్రాయమునకు బలమొసంగుచున్నది మన్‌భాషా శాసనలిపిని పరిశోధించిన అక్షరతత్వజ్ఞులు, ఆ లిపి ప్రాచీన కాలమునందిప్పటికి తెలుగువారలచే గొనిరాబడి క్రమక్రమముగా నభివృద్ధిచేయుబడినదని యూహించుచున్నారు. ఆ కాలమున హిందూదేశమునకును తూర్పుతీరము నందలి దేశములకు రాకపోకలు, వర్తకసంబంధములు నెక్కువగ నుండిన కతన, మనదేశమునందు వ్యవహారములోనుండిన ప్రతివిషయమును ప్రాగ్ద్వీప దేశములకుగూడ వ్యాపించి యచ్చటి పరిస్థితుల ననుసరించి వృద్ధిపొందు చుండెను. క్రీస్తుశకారంభకాలమున ఆంధ్రదేశమున వర్ధిల్లుచుండినది శాతవాహన సామ్రాజ్యము కావున శాతవాహనుల కాలపు టాంధ్రలిపినే ఆంధ్రనావికులు, వర్తకులు, వలసస్థాపకులు మున్నగు సాహసికజీవులు గొంపోయి యుందురు.

ఇప్పటికి బర్మాదేశమునకును ఆంధ్రదేశమునకును గల సంబంధమును సూచించియుంటిమి. ఇకముందాసంబంధ మేవిధముగ బరిణమించెనో తెలిసికొందము ఆఱవశతాబ్దిని సువర్ణభూమికి రాజధానియగు తటోను నగరమందలి రాజకీయపరిస్థితులు ఆంధ్ర సువర్ణభూములకుగల యన్యోన్య సంబంధములను సూచింపజాలియున్నవి. ఆకాలమందచ్చట రాజ్యము చేయుచుండిన రాజుయొక్క కుమారులిరువురు 'విమల', 'తమల' యనువారలు తమతల్లితో వివాదములు దెచ్చుకొని పైతృక రాజ్యమును గోల్పోయి, పిమ్మట కొంత సైన్యమును గూర్చుకొని తటోను నగరమున కుత్తరముగా జని, యాప్రాంతమును జయించి యచ్చట నొక రాజ్యమును స్థాపించి పరిపాలించియుండిరని చరిత్రవలన దెలియుచున్నది ఈ విషయమందలి యధార్థమెటులున్నను, 'తమల' 'విమల'యను నామములనుబట్టి చూడగా వీరుగాని వీరిపూర్వులుగాని యాంధ్రులయినట్లును మఱియు పల్లవులకో సాలంకాయనులకో, బృహత్పలాయనులకో, లేక విష్ణుకుండినులకో, లేక నంతకంటె తరువాతి వారైన పూర్వచాళుక్యవంశమునకో చెందిన యొకశాఖవా రనియు దోపక మానదు. సర్ ఆర్థరు ఫెయిరు గారుకూడ తమబర్మాదేశపు చరిత్రయం దిట్టియభిప్రాయమును వెలిబుచ్చిరి

ఆంధ్రదేశమునందు బౌద్ధమతము నిర్మూలము చేయబడిన తరువాత నాంధ్రుల ప్రాచీనచారిత్రమెట్లు నాశము చేయబడి విస్మరింపబడియెనో యట్లే బర్మాదేశమునందును తలైంగురాజ్య మస్తమించిన తరువాత వారి చారిత్రము కూడ శత్రురాజులచే బుద్ధిపూర్వకముగ నాశనము గావింపబడియెను అంతట కాలానుగతములైన స్థలపురాణములుతప్ప ఇతర చరిత్రాధారములన్నియు

A C.No 97674 ... హైదరాబాదు-500032

నదృశ్యమైపోయెను. ఈ స్థలపురాణములును, గాథలును [illegible] దోచుచుండుటచే విశ్వసనీయములుగ నున్నవి. మొట్టమొదట బర్మాదేశములోని పెగూ ప్రాంతమునకు వలసపోయినవారు తెలుగువారని నిర్ధారణచేయుట కిచట నేటివఱకు చెప్పుకొనబడుచున్న స్థలపురాణములు సత్యాధారములుగ నున్నవి ఈ కారణమున ఫెయిరుగారు తమ బర్మాదేశ చరిత్రమునందు, 'బర్మాదేశమునకు మొట్టమొదట వలసవచ్చి యుండినవారు తప్పక ప్రాచీన తెలుగు దేశమునుండి వచ్చినవారని యూహించుట కిచటిగాథలు ప్రబలకారణమగుచున్న' వని వ్రాసియుండిరి[10].

ఈ పూర్వోక్తసందర్భముల నన్నింటిని బాగుగ నెఱింగి యుండిన సుప్రసిద్ధచరిత్రకారుడగు ఎల్ఫిన్స్టన్ (Elphinstone) 'తూర్పుతీరవాసులు పశ్చిమతీరపు సోదరులకంటె ముందుగా సముద్రవ్యాపారమునందు ప్రసిద్ధిగాంచియుండి' రని చెప్పుచున్నాడు. దక్షిణమున గోదావరి మొదలుకొని యుత్తరమున గంగానది వఱకును వ్యాపించియుండిన కళింగదేశము ప్రాచీనకాలము నుండియు భరతఖండమున ప్రసిద్ధివడసిన రాజ్యములలో నొకటియై యుండుటయే గాక క్రీస్తునకు బూర్వము మూడవ శతాబ్దమునుండియు సముద్రవాణిజ్యము నడపుచుండినట్లు గాన వచ్చుచున్నది[11]. ఆంధ్రసామ్రాజ్యము శాతవాహనుల పరిపాలనమున నానాముఖముల విజృంభించినపుడు కళింగరాజ్యము దానిలో సమ్మేళనమై పోయెను అటుల సమ్మేళనమై పోవుటయేగాక కళింగదేశము క్రమక్రమముగా నాంధ్రదేశములోని వేంగి మొదలగు ప్రాంతములట్లు ఆంధ్రదేశములోని యొక ప్రాంతమునకు ప్రత్యేకనామమగుటగూడ తటస్థించెను[12]. అంతకుబూర్వము కళింగరాజ్యమును బరిపాలించిన బౌద్ధరాజులు పరమత, పరదేశ ద్వేషులుగాక సహనముగల్గి విదేశగమనమును సముద్రయాన వాణిజ్యములను విశేషముగ నభివృద్ధి పఱచియుండిరి.

నౌకాయానము, సముద్రవాణిజ్యము కళింగరాజకుమారులు తప్పక యభ్యసింపవలసిన విద్యలుగ నుండెనని శాసనములవలన దెలియుచున్నది[13]. కళింగాంధ్రులు తొలుత సింహళద్వీపముతో వ్యాపారముచేయనారంభించి రానురాను బంగాళాఖాతమునుగూడ దాటి హిందూమహాసముద్రమును సైతము ప్రవేశించియుండిరి. బర్మావారికి మతగ్రంథమైన 'బుద్ధగట' మందు కళింగదేశమునుండి బౌద్ధవర్తకులు బర్మాదేశమునకు బోయి వర్తక మారంభించి లాభము పొందుచుండ బౌద్ధ సన్యాసులు మతవ్యాప్తి గావించిరనియు మరికొందఱచ్చటనే కాపురముండుచు దేశముగూడ జయించి రాజ్యస్థాపనము గావించిరనియు వ్రాయబడియున్నది[14]. కళింగదేశమునకును

బర్మాదేశమునకును విశేషముగ పరస్పర సంబంధముండినట్లు పెగూదేశము నందు దొరకిన నాణెముల మీదగల హిందూదేశచిహ్నములు ధ్రువపఱచు చున్నవని ఫెయిరుగారు నుడువుచున్నారు[15]. ఈ సంబంధము ఇంచుమించుగ పండ్రెండవశతాబ్దమువఱకు వర్ధిల్లియుండి పిమ్మట తలైంగురాజ్య మంతరించిన కొలదికాలమునకు విడిపోయియుండెననియు గూడ తెలియుచున్నది.

ప్రాచీనాంధ్రులు బర్మాదేశమునందు వలసలేర్పఱచుకొనిన తరువాత క్రమముగ మలాకా ద్వీపకల్పములోనికి గూడ ప్రాకియుండిరి. తూర్పుతీరపుదేశములకును మలాకా ద్వీపకల్పమునకును రాకపోకలును వాణిజ్యసంబంధమునుండినట్లు మలయభాషలోని సంస్కృతభాషోద్భవము లగు కొన్నిపదములవలన మార్సెడను (Marsedan) గారు నిశ్చయించుచున్నారు[16]. మఱియు నచ్చటి జనులు జావాద్వీపమునందువలెనే తూర్పుతీరమునుండి వచ్చినవారి నీకాలమున క్లింగులని పిలుచుచున్నారని కూడ చెప్పియున్నారు. ఒకప్పు డా క్లింగుపదము కళింగదేశములోనుండి వచ్చినవారి కుపయోగింపబడి యుండినను, నేటికాలమున చెన్నరాజధానినుండి వచ్చి కూలినాలి చేసికొను తక్కువజాతి హిందూజనులకు వ్యవహరింపబడుచున్నది. తూర్పుతీర వాసులకును, మలాకా ద్వీపకల్ప వాసులకును విశేష సంబంధముండెననుట కేవిధమయిన సందేహము లేదనియు, నట్టిసంబంధము బౌద్ధమత మభివృద్ధిలో నుండినకాలమున-అనగా క్రీస్తుశక మైదాఱు శతాబ్దముల వఱకు-మిక్కిలి బలముగ నుండెననియు సర్ వాల్టరు ఎలియటు (Sir Walter Elliot) గారు అభిప్రాయపడుచున్నారు[17]. పినాకినీ ముఖద్వారముమొదలుకొని కాంచీపురమువఱకు గల ప్రాంతమునందు దొరకిన కురుంబా లను పల్లవులలోని నొకతెగవారి నాణెములను పరీక్షచేయు సందర్భమున 'నీ పల్లవరాజుల కాలమున విశేషముగ బశ్చిమదేశములతో సముద్రవాణిజ్యము లేకపోయినను, దూర్పున బర్మా, కాంబోడియా దేశములతోడను మలాకాద్వీపకల్పముతోడను సుమత్రా, జావా, మొదలగు ద్వీపములతోను జనులు తమసొంత యోడలలో సముద్రముమీద వర్తకము చేయుచుండినట్లు తెలియుచున్నదని' ఎలియటుగారు వ్రాసియుండిరి[18] ఈ వర్తక మేమికారణముననో బౌద్ధమతము జనాదరణములేక క్షీణించి బ్రాహ్మణ-పౌరాణిక-హిందూమత మభివృద్ధిజెందు కాలమున సన్నగిల్లి పోయెను.

పల్లవరాజుల కాలమున బౌద్ధమతమునకు దేశమునుండి యుద్వాసన మిప్పింపబడియెనని యీవఱకే తెలిపియుంటిమి. అట్టియెడ వర్తకులు వాణిజ్యార్థమై సముద్రాంతరములకు బోవుచుండ, బౌద్ధ భిక్షువులు మతసంరక్షణార్థము యితర దేశములందు మతవ్యాప్తి గావించుటకును

విదేశములకు బోవుచుండిరి. బౌద్ధభిక్షువు లల్లరగుచుండ, బ్రాహ్మణులు కూడ స్వమతవ్యాపనార్థమును, కొన్ని వేళలందు బౌద్ధమతము పైగల ద్వేషము చొప్పునను అరుగుచుండిరి[19] క్రీస్తుశకము ఐదవ శతాబ్దమున భరతఖండమును సందర్శింపవచ్చిన చీనాదేశ యాత్రికుడగు ఫాహియాను ఆకాలపు స్థితిగతులను గూర్చి వ్రాయు సందర్భమున వర్తకపుటోడలు, తామ్రలిప్తి నగరమునుండి బయలుదేఱి తూర్పుతీరము వెంబడి ప్రయాణము చేయుచు సింహళద్వీపపు రేవుపట్టణములను జూచుకొని జావాద్వీపమునకు బోవుచుండెనని చెప్పియున్నాడు[20] ఈ యాత్రికుడు హిందూదేశమునందు క్రీ శ 405 మొదలు 411వఱకును సంచారము చేసి పిదప, తామ్రలిప్తి నగరమున నోడ నెక్కి బహుదినములు పయనము సలిపి సింహళ ద్వీపమును జేరి యచ్చట గొంతకాలము నివసించి పిమ్మట వర్తకులు సరకులను గొంపోవునోడ నెక్కి తొంబదిదినములకు నతిప్రయాసము మీద జావాద్వీపము జేరెను. ఇతడిన్ని దినములు ప్రయాణము చేయుటకు కారణమునుగూడ దెలిపియున్నాడు. ఇతడెక్కిన యోడలో రెండువందలమంది బాటసారులుండిరి ఆ పెద్దనౌకకు చిన్న నావయొకటి త్రాటితో వ్రేలాడగట్టబడి యుండెను. తుపాను మొదలగునవి సంభవించినపుడా చిన్ననావ ప్రయాణికులను సంరక్షించుటకై యుపయోగింపబడుచుండెనని యూహింపవచ్చును ఈతడు సముద్రముమీద ప్రయాణము చేయుచున్నప్పుడు ఓడలోనున్న బ్రాహ్మణులందఱు నొకప్పుడు తుపాను రాగా 'నీ శ్రామణుడు మనతోగూడ నోడపై నుండుటచేత మన మదృష్టవిహీనులమై యీ విపత్తు పాలబడితిమి. ఒక్కని కొఱకు మన మందఱము చావరాదు ఏ ద్వీపము కానబడినను ఈ భిక్షువుని భూమిమీద విడిచిపెట్టి మనము పోదము' అని తమలోదాము వితర్కించుకొని నిశ్చయించిరట. ఈ విషయమువలన నాకాలమున బౌద్ధమత మెంత యనాదరణీయమగుచుండెనో విదితము ఈ యాత్రికుడు జావాద్వీపమునందు బౌద్ధులేగాక బ్రాహ్మణులును పాషండులును గూడ వర్థిల్లుచుండిరని నుడివియున్నాడు[21]. ఆంధ్రచరిత్రకారు లీ విషయమును గూర్చి వ్రాయుచు, నాంధ్రరాజుల కాలమున నారంభింపబడిన సముద్రవర్తకము ఫాహియాను కాలము వఱకును నిర్విఘ్నముగ కొనసాగు చుండెనని చెప్పుటకు వీలగుచున్నదని వ్రాసియుండిరి[22]. నాల్గవ శతాబ్దమందు వేంగీరాజులయిన పల్లవులు జావా, సుమత్రా ద్వీపములను జయించినట్లు గానబడుచున్నది ఈ విషయము ఆదీవులలో గానవచ్చిన కొన్ని శాసనములవలన నిశ్చయింపబడుచున్నది కళింగదేశములోని నాగరకత జావా, సుమత్రా దీవులక్కు వ్యాపించెనని గాథలలో జెప్పుకొనుటమాత్రముండెను, కాని చాలకాలమువఱకు ప్రత్యక్షనిదర్శన మేమియు గానరాకుండెను.

ఇటీవల కోహెను స్టూవర్టు గారిచే గనుగొనబడిన రెండు శాసనములవలన కాయి–జావా లిపుల యుత్పత్తి తత్త్వము బోధపడినది ఈ శాసనములు రెండును సంస్కృత భాషయందు రచియింపబడియున్నవి వీని లిపి ప్రాచీన వేంగీశాసనముల లిపిని బోలియున్నది[23]. ఆ ద్వీపములో బెయిటనుబర్గునకు అనతిదూరమున నున్న జాంపియా, జాంబో యను ప్రదేశములలోని కొండలపైని సంస్కృతశ్లోకము లతిమనోహరములుగా జెక్కబడియున్నవి. మఱియు నీకొండలపై హిందూరాజుల పాదములు చెక్కబడియున్నవి ఇవి యీద్వీపములను జయించినందులకు జ్ఞాపకార్థము చెక్కబడినవని యూహింపబడుచున్నవి. అచ్చటి శాసనము లందాద్వీపములను జయించి రాజ్యమును స్థాపించినవాడు పూర్ణవర్మయని తెలుపబడినది ఇంకను పూర్ణవర్మ శాసనములను బోలినశాసనములు మఱికొన్ని గలవు కాని యవి శిథిలములయి విశేషభాగము స్పష్టముగ దెలియరాకుండ నున్నవి. శాసనపరిశోధకులీ పూర్ణవర్మ కళింగమును, వేంగిని, కాంచీపురమును బరిపాలించిన పల్లవవంశములలోనివాడై యుండునని యభిప్రాయపడుచున్నారు. ఈతని శాసనలిపి ప్రాచీన వేంగీపల్లవ లిపిని బోలియుండుటచేత నైదవ శతాబ్దమున కీవలివాడు కాడని చెప్పవలసి యుండును ఆ కాలమునందలి పల్లవులందఱు నొక్కకూటములోనివారు గాని యన్యులుగా రని డాక్టరు బర్నెలు (Dr Burnell) గారు నుడువుచున్నారు[24]. అదియునుంగాక కాంచీపురమును బాలించిన ప్రాచీనపల్లవులు క్రమక్రమముగా నాంధ్రదేశమునుండి దక్షిణముగానరిగిన వారగుటచేతను, వారి రాజ్యములోని ఉత్తరభాగమంతయు నాంధ్రదేశమగుటచేతను పూర్ణవర్మయు నాంధ్ర దేశములోనివాడేయనియు వానితో జావాద్వీపమునకు బోయిన బ్రాహ్మణు లాంధ్ర ద్రావిడబ్రాహ్మణులై యుందురనియు జెప్పవచ్చును. సుమత్రా, జావాద్వీపములోని క్లింగులు కళింగదేశమునుండివచ్చిన తెలుగువాండ్రని పెక్కుమంది చరిత్రకారులు తలచుచుండగా డాక్టరు బర్నెలుగారు మాత్ర ముత్తర ద్రవిడదేశతీరమునుండి వచ్చిన తమిళులని యభిప్రాయపడుచున్నారు[25]. కాని యీ యభిప్రాయము సరిగాదు. తరువాతి కాలమున జావా సుమత్రా దీవులకు బోయినవారు ద్రావిడులయినను ప్రాచీనక్లింగులు మాత్రము కళింగదేశమునుండి బోయినవారని నిశ్చయింపక తప్పదు. ప్రాచీనక్లింగులు తొలుత త్రోవచూపిన తరువాతనే దక్షిణదేశీయు లాద్వీపములకు విశేషముగ బోవనారంభించిరి. ఏది యెట్లున్నను పల్లవ రాజులకాలమున నాంధ్రకళింగదేశములు, సుమత్రా జావా మున్నగు ద్వీపములతో వర్తకవ్యాపారము విశేషముగ జేయుచుండెననియు నాంధ్రద్రావిడబ్రాహ్మణులు సైతము సాంఘికాచార నిరోధములేవియు లేక

సముద్రయానమును విదేశగమనమును స్వేచ్ఛగజేయుచుండిరని నిశ్చయముగ జెప్పవచ్చును[26]

ప్రాచీనకాలమునం దావిర్భవించిన యీ సాహసిక జీవనోద్యమము సాహసికులగు నావికులను వర్తకసంఘములను క్రమక్రమముగా బంగాళా ఖాతమును దాటించి విశాల సముద్రములను బ్రవేశింపజేసి యచ్చటి ప్రాగ్ద్వీపములందు వర్తకస్థానములను వలసలను స్థాపింపజేసెను. కళింగదేశపు రేవులనుండియు కృష్ణా గోదావరీ ముఖద్వారములందుండిన రేవుల నుండియు వర్తకులు వాణిజ్యార్థమై నూతన దేశముల నాశ్రయించుచు సముద్రయానముచేసి వచ్చుచుండిరి అట్టియెడ మతాభినివేశము గల బౌద్ధులు మతవ్యాపనార్థమై వర్తకులతోగలసి ద్వీపద్వీపాంతరములకు బోవుచు తమ నాగరికతను మతమును నాటుచు పల్లవింపజేయుచుండిరి కావుననే ఎల్ఫిన్‌స్టను దొర కళింగాంధ్రుల యధినివేశ సంస్థాపనా చారిత్రమును వ్రాయుచు, స్వల్పసంఖ్యాకులగు నీదేశీయులు సాహసికులయి బయలుదేఱి బంగాళాఖాతమును దాటి హిందూమహాసముద్రమును జొచ్చి యచ్చటి సుమత్రా జావాద్వీపములను జేరి వలసలేర్పఱచుకొని యచ్చటి అనాగరికులగు ద్వీపవాసులను నాగరికులనుజేసి యుద్ధరించిరనియును, దమ యవద్వీపప్రవేశచిహ్నముగ క్రీస్తుశకము 75వ సంవత్సరమున నొకశకము ప్రారంభించి యుండిరనియు జావాద్వీప చారిత్రమువలన దెలియుచున్నదని వ్రాసియున్నాడు[27] ఆ సంవత్సరమునందే కృష్ణా, గోదావరీ ముఖద్వారములం దుండిన రేవుపట్టణములలో నొక దానినుండి యాదిత్యుడను రాకొమరు డొకడు సైన్యసమేతుడై జావాద్వీపముపై దాడివెడలి జయించెనని యాద్వీపమున మఱియొక ప్రతీతి గలదట మఱియు నాదేశమున నాంధ్రరాజుల గూర్చి దెలిపెడి మహాగ్రంథ మొకటిగూడ గలదని తెలియు చున్నది. జావాదేశభాషా జ్ఞానము సంపాదింప గలిగినచో నాంధ్రదేశ చరిత్రాత్మకములగు నూతనాంశము లెన్నియో వెలికి రాగలవు

ఈ పైయంశములను బరికించినచో పూర్ణవర్మ పరిపాలించు కాలమునాటికి జావాద్వీపమునందు ఆంధ్రుల వలసరాజ్యము లున్నతస్థితియం దుండెనని యూహింపదగును. జావా సుమత్రా బోర్నియో మొదలగు ప్రాగ్ద్వీపము లందాకారణమున నాకాలపు కళింగాంధ్రదేశపు పట్టణ గ్రామనామములతో నెన్నియో నగరములు వెలసి వర్ధిల్లుచుండెను ఈ దీవులందు గాక హిందూదేశీయుల వలసలు బర్మాదేశము మొదలుకొని మలాకా ద్వీపకల్పమువఱకును అనేకములు వెలసియుండెను అప్పటికే బౌద్ధమతము చీనాదేశమునకు వ్యాపించి యుండుటవలన బౌద్ధభిక్షువులు చీనాదేశము నుండి హిందూ దేశమునకు, హిందూదేశము నుండి చీనాదేశమునకు బోవుట

తఱుచుగ జరుగుచుండెను. ఇట్లు రాకపోకలు సలుపు బౌద్ధ సన్యాసులకును వర్తకవ్యాపారము చేసికొను వర్తకులకును అచ్చటి దీవులందు, మలాకా సముద్రప్రాంతములందును లేచియుండిన రేవుపట్టణములు, నడుమ విశ్రాంతిస్థలములుగ నుండెను అంతియగాక నవి యొకప్పుడు యాత్రికులకు నోడలు మార్చుకొనవలసిన స్థలములుగూడ నైయుండెను సుమత్రా ద్వీపములోని శ్రీభోజనగరమును జావా ద్వీపములోని కళింగనగరమును భరణి (బోర్నియో) ద్వీపములోని మహాసేనమును, బలిద్వీపము, భోజపురమును హిందూదేశపు నామములతో వెలసిన వర్తకస్థానములు రేవుపట్టణములు, వలసలని చెప్పవచ్చును. హిందూదేశమునకు బోయి విద్యల నభ్యసింపదలచుకొన్న చీనాదేశీయులగు బౌద్ధసన్యాసుల కీనగరములందు తొలుత హైందవనాగరికత, జీవనము, సాంప్రదాయములతో ప్రథమపరిచయము గలుగుచుండెను[28]. అట్లగుటవలన హిందూసామ్రాజ్యము సముద్రాంతరములకు వ్యాపించి విదేశీయులకు నమ్మోహముగ నుండెననుటలో వింతయేమి గలదు?

కావున సుమత్రా, జావా మొదలగు ప్రాగ్ద్వీపములలోని నాగరికత నిక్కముగా కళింగ, వేంగీదేశముల ప్రాంతములనుండి వ్యాపించెననుట నిర్వివాదాంశము. భండార్కరు పండితుడు గూడ నొకచోట కళింగాంధ్ర దేశములకును, ప్రాగ్ద్వీపములకునుగల సంబంధమును, జరుగుచుండిన విశేషసముద్రవాణిజ్యమునుగూర్చి యచ్చట చెప్పుకొనబడుచున్న గాథలును, జీర్ణావస్థయందు జీవించియున్న కట్టడభాగములును, గుహాలయములును, శిల్పకళాదులును గాక నచ్చట గానవచ్చిన శాసనములలోని లిపిగూడ స్పష్టముగ సూచించుచున్నదని చెప్పియుండిరి[29] క్రీ శ 1820వ ప్రాంతమున క్రాఫర్డు పండితుడు కూడ యవద్వీపచారిత్రమును వ్రాయుచు నొకసందర్భమున జావాద్వీపములోని హిందూనాగరికత, మతములు కళింగ, వేంగి దేశములోనుండి యొకప్పుడు వ్యాపించియుండ వలయునని వ్రాయుచున్నాడు[30]. ఇంతియేగాదు, హిందూనాగరికత ప్రాగ్దేశములకును ద్వీపములకును తెలుగుదేశమునుండి వ్యాపించెననుటకు సయామును, కాంబోడియా దేశములందు సయితము నేటివఱకు శాలివాహన శకము వాడుచుండుటకన్న మఱియేమి కావలయును?

క్రీస్తుశకారంభకాలముననే ప్రారంభమై యభివృద్ధిగాంచినట్టి యాంధ్రుల యధినివేశ సంస్థాపనోద్యమమును సముద్రవాణిజ్య వైభవమును భారతీయేతిహాసమునకంతకు జగజ్జేగీయమానములైన కీర్తిని సమకూర్చిన మహాకార్యములయి విరాజిల్లుచున్నవి ఇట్టి ఘనకార్యములు తొలుత మనపూర్వులే నిర్వహించిరని తెలియవచ్చు టెంతయు నుత్సాహజనకము!

ఆమహోచరిత్ర మంతయు విస్మరింపబడుట మన దౌర్భాగ్యము. ఆంధ్ర దేశమునందు బౌద్ధమతము ప్రజాహృదయపీఠము నాక్రమించి యుండినంత కాలము నిట్టి సాహసికజీవన మభివృద్ధిలో నుండి బౌద్ధమతావలంబకులచే బ్రోత్సహింపబడియుండెను పల్లవ సామ్రాజ్యమంతరించి పూర్వచాళుక్యరాజ్య సంస్థాపన కాలమున ననగా క్రీస్తుశక మేడవ శతాబ్దాదిని బౌద్ధమతమునకు సంపూర్ణముగ దేశమునుండి యుద్వాసన మిప్పింపబడియుండుటచే, హింసింపబడిన బౌద్ధులకు ప్రాణత్యాగమో, మతమును పరిత్యజించుటయో, లేక మతాభిమానముచే విదేశముల పాలగుటయో తటస్థించుచుండెను ఈకాలముననే, కడసారి యాంధ్రుల సాహసికజీవనమునకు నూతనోజ్జీవము గల్గింపబడియుండెను.

జ్ఞాపికలు :


1 Phayre Sir A P , History of Burma, page 24

2 Indian Architecture, page 103

3 Phayre Sir A , History of Burma, page 24

4 Fytche Lieut Gen , Note on 'Mon' in 'Burma' Vol I, page 125

5 Cocks S W , A Short History of Burma, Chap 2

6 Phayre Sir A , History of Pegu, in A S J 1873, page 12

7 Phayre, History of the Burma Race, A S J No 1 1864, No 2 1868

8 Walter Elliot, Numismata Orientala South Indian Coins, page 8

9 Phayre Arthur, History of Burma, page 30

10 ibid

11 Hunter, Orissa, Vol 1, page 197

12 Elliot Sir Walter, Numismata Orientala, South Indian Coins, page 40 కళింగదేశములోని కాళింగులును, ఆంధ్రులును ఒక్క తెగలోనివారే యని యాంధ్రచరిత్రకారుని యభిప్రాయము అదియునుగాక కళింగము ఉత్తరకళింగము, మధ్యకళింగము, కళింగము అని మూడువిధములుగ నుండుననియు నుత్తరకళింగ మీకాలపు ఒరిస్సాయని యనియు, మధ్యకళింగము గంజాం మండలములోని ముఖలింగప్రాంతమనియు, కళింగము గోదావరివఱకుగల యాంధ్రదేశమునకు నామాంతరమనియు, కన్నింగుహాముగారభిప్రాయము ఈ కళింగమునకే త్రికళింగమని నామాంతరముండెననియు, నదియే త్రిలింగమను సాధురూపమయ్యెననియుం జెప్పుదురు పైని యీమూడుకళింగములను పేర్కొనియుండెను

13 Hunter, Orissa, Vol 1, page 188
14 Phayre Col A P, History of the Burma Race in A S J No 1, 1864, No 2, 1868
15 Phayre Sir A P, History of Burma, page 31
16 "Mission Life," May 1867
17 Phayre A P, History of Pegu, A S J, 1873
18 ibid
19 Leggee, Fah-ian, page 113
20 ibid, page 111
21. ఆంధ్రుల చరిత్ర, పూర్వయుగము, పుట 250
22 పూర్వోక్త ప్రమాణము
23 Rawlinson, Intercrouse with India and the Western World, page 139
24 Burnell, South Indian Paleography, page 130
25 Ibid, page 131
26 ఆంధ్రుల చరిత్ర, పూర్వయుగము, పుటలు 251-252
27 Mukherjee, Indian shipping, page 148
28 Mukherjee, Indian shipping, page 172
29 Bombay Gazetter, part 1 Vol 1, page 493
30 Mukherjee, Indian Shipping, page 119

## 7. చాళుక్యరాజుల కాలము
### క్రీ.శ. 700 మొదలుకొని 1200 వఱకును

చాళుక్యుల రాజ్యపాలనారంభముతో దేశములోని మత, సాంఘిక, రాజకీయ పరిస్థితులందు మార్పులు గలుగసాగెను వెనుకటి శతాబ్దములందట్లు యీకాలమున మతపరిస్థితులు ఆంధ్రులను సాహసిక జీవనమునకు బురికొల్పియుండలేదు ఆంధ్రదేశమున నీకాలమున శాంతిలేకుండెను. క్రొత్తగా రాజ్యము స్థాపించిన చాళుక్యవంశము తనయధికారమును సుస్థిరముగ బాదుకొల్పుటకు బ్రయత్నము చేయుచుండెను దేశమునందు బ్రాహ్మణ మతము విశేషముగ వ్యాప్తినొందుచుండెను. అందుల కనుకూలముగ చాళుక్యులు గూడ బ్రాహ్మణమతాభిమానముగలిగి, అభివృద్ధిపఱచు చుండిరి బ్రాహ్మణమతముతోడి సంఘర్షణమున జైనమతము పరరాజులగు రాష్ట్రకూటులను దేశముపై దెండెత్తి రావించి, శాంతియు, మనః స్థిమితమును లేకుండజేసెను.

కాని, ఇట్టి పరిస్థితులాంధ్రదేశమున చాలకాలము వర్ధిల్లి యుండలేదు. చాళుక్యరాజులు బహుసమర్థులు, బలవంతులునగుటచే దేశమునకు, ప్రజలకు నెట్టివిపత్తును, పారతంత్రమును రాకుండ గాపాడుచుండిరి. తొమ్మిదవ శతాబ్దమునాటికి చాళుక్యులు పరరాజుల దండయాత్రలవలనను, శత్రుజనముల వలనను తమ రాజ్యమున కేవిధమగు నపాయము గలుగకుండ జేసికొనగలిగిరి. పల్లవయుగమందువలె, యీకాలమందు దేశమున విదేశసముద్ర వాణిజ్యాభిలాషగాని, వలస రాజ్యస్థాపనాభివేశముగాని విశేషముగ నుండినట్లు గానరాదు. ఎల్లవేళల స్వరాజ్యసంరక్షణమందే మునిగియుండిన ప్రభువులకు, సాహసికజీవులకు తగిన ప్రోత్సాహమొసంగుటకు సావకాశముగాని, తలంపుగాని యేమాత్రము లేకుండెను.

చాళుక్యయుగమున విదేశములందు, ద్వీపద్వీపాంతరములందు వలసరాజ్యములుగాని, వర్తకస్థానములుగాని స్థాపింపబడక పోయినను, జను లిదివఱకు స్థాపింపబడినవానితో వర్తకసంబంధమును రాకపోకలును గలిగి

యుండిరి కాని యావర్తకము విశేషముగానైన సాగుచుండినట్లు ప్రమాణములు గానవచ్చుటలేదు. దక్షిణమున పల్లవులు, కురుంబాలు, కొందఱు తెలుగు చోడవంశములు మాత్రము విదేశవర్తకమును బోషించుచు నదియభివృద్ధి నొందుటకు బ్రయత్నములు సలుపుచుండిరి

ఆంధ్రదేశమున చాళుక్యరాజుల ప్రోత్సాహములేని కతనను, వర్తకుల కభయమిచ్చువారు లేకపోవుటచేతను, సుప్రసిద్ధ నౌకాశ్రయములు, వర్తకస్థానము లన్నియు, నొకదానివెనుక నొకటి ఓడదొంగల కాటపట్టు లయ్యెను ఓడ దొంగలతో బాటు ఆయారేవుల యధిపతులు, సుంకకరణములు మొదలగు రాజకీయోద్యోగులు నీతిమాలి, స్వలాభాపేక్షగల్గి విదేశములనుండి సరకులతో వచ్చెడి యోడల నోడదొంగలచే దోపిడిచేయించుటయో, విచక్షణలేక సరకులపై సుంకములు విధించి, పూర్వపు కట్టుబాట్లను మన్నింపక వర్తకుల నిరుత్సాహ పఱచియో, పీడించియో, విదేశవర్తకమును ధ్వంసము గావించియుండిరి. ప్రమాదవశమున నెపుడైనను నిండుసరకుతో వచ్చిన యోడలు రేవునకు సమీపముగా మెట్టయెక్కుట తటస్థించినపుడు దుర్మార్గులగు ఓడదొంగలు వారి ధనమును కొల్లగొనుచుండ, స్థలాధికారులు నిర్లక్ష్యము జూపుటయేగాక రహస్యముగ నట్టివారి బ్రోత్సహింపు చుండెడివారు. దేశీయ వర్తకు లోడదొంగల దోపిడి భయమువలన, నౌకావర్తకమును మానుకొనుచుండ, విదేశనౌకలు దేశములోని రేవుల జేరుటకే భయపడుచుండెను. ఈ పరిస్థితులకు దోడు కొన్ని రేవుపట్టణముల సమీపమున సముద్రము ఇసుకతిప్పలు వేయుచుండుటయు మఱికొన్ని తావులందు మహానదుల ముఖద్వారములు నిసుకదిబ్బలతో పూడిపోవుచుండుటయు, మఱికొన్ని నౌకాశ్రయములందు సముద్రము దూరముగా వెనుకకుబోవుటచే లోతు తగ్గిపోవుచుండుటయు తటస్థించు చుండెను. ఈ కారణమున ముఖ్యముగా కూడూరు, కాల్పట్టణ రేవులును, ఘంటసాలయు నోడల రాకపోకలకు వీలుగ నుండక పోవుచుండుటచే గణనకు రాకయుండెను. ఈ పరిస్థితుల వలన విదేశనౌకలు ఆంధ్రదేశములోని నౌకాశ్రయములకు రాకపోవుటయు, వర్తకులు స్థలాంతరముల కరుగు చుండుటయు, నీ చాళుక్య యుగారంభమున విదేశవాణిజ్యము సన్నగిల్లుటకు బ్రబల కారణములని చెప్పవచ్చును

చాళుక్యరాజు లాంధ్రదేశములోని వేంగీ కళింగదేశములు బాలించు చుండిన కాలమున నించుమించుగ నెల్లూరి మండలము మొదలుకొని దక్షిణమున కాంచీపురము వఱకు గల దేశమున దెలుగు చోడవంశము లనేకములు

పరిపాలనము చేయుచుండెను. వీరు కొంతకాలము పల్లవులకును తరువాత తమిళచోళులకును సామంతులుగనుండి, కొంతకాలము స్వతంత్రముగను పరిపాలించియుండిరి తమిళచోళుల యధికారము ప్రబలనారంభించిన కాలమున, తెలుగుచోడులు కూడ - వారికడ సామంతులగుటచే - విజృభించియుండిరి ఈ యుభయుల పోషణ ప్రాపకముల నీడను సముద్రవాణిజ్యము అభివృద్ధిపొందసాగెను. చోళచక్రవర్తులు సముద్రాంతర దేశములను ద్వీపములను జయింపదలచి, గొప్ప నౌకాదళముల నిర్మించి యుండిరి పల్లవరాజులకు రాజధానిగా నుండిన మామల్లపుర రేవునందు చోళచక్రవర్తుల యుద్ధనౌకాదళము లుండెను. ఈ మామల్లపురము పల్లవరాజులలో నరసింహవర్మ మహామల్ల యనువాని పేరట నిర్మింపబడియెను ఈ నౌకాశ్రయమునుండి పల్లవులకాలమున ఆంధ్ర, ద్రావిడబ్రాహ్మణులు, బౌద్ధులు, వర్తకులు ప్రాగ్ద్వీపదేశములకు బయనమగుచుండిరి నావికులు విశాలమైన యోడలు నిర్మించి వలసస్థాపనముకై యరుగుచుండిన సాహసికజీవులను గొని పోవుచుండిరి ఇచ్చట నుండియే తరువాతి కాలమున చోళచక్రవర్తులు పెగూదేశమును జయించుటకై యుద్ధనౌకలతో బయలువెడలి యుండిరి.

దక్షిణమున చోళరాజుల నౌకావ్యాపార విజృంభణ సమయమున నాంధ్రదేశమున కూడ ప్రజలయందు మరల విదేశగమనాభిలాషయు సముద్ర వాణిజ్యాభిరుచియు మొలలెత్తెను అందుల కనుకూలముగ దేశమునందు శాంతిని చాళుక్యరాజులు నెలకొల్పియుండిరి చోళరాజులను చూసి యేమి, వారి సహవాస సంబంధ, బాంధవ్యముల వలన నేమి ఆంధ్రరాజులు మరల నౌకావర్తకము సాగుటకు తగిన ప్రోత్సాహ మిచ్చి యుండిరి

పదియవ శతాబ్దారంభమునుండి యాంధ్రదేశమున పరిస్థితులు మార్పుచెంద సాగెనని చెప్పవచ్చును. ఆ కాలమున వలసస్థాపనములు గావింపక బోయినను జనులుత్సాహముతో చీనా, జపాను, సయాం, బర్మా, కాంబోడియా దేశీయులతోడను మలాకా ద్వీపకల్పముతోడను, ప్రాగ్ద్వీప సమూహము తోడను వాణిజ్యమును మరల సాగించియుండిరి. అంతవఱకు జీవకళదొఱంగియున్న మోటుపల్లిరేవు తిరిగి వర్తకలక్ష్మి కాటపట్టయ్యెను

పదియవ శతాబ్దారంభమునుండి యభివృద్ధిలోనికి వచ్చిన వాణిజ్యము పదునేడవ శతాబ్దాంతము వఱకు నొక్కతీరున నుండెను ఈ వాణిజ్యము కొన్ని కారణములవలన పశ్చిమదేశములతో నంతగా లేకపోయినను ప్రాగ్దేశములతో మాత్రమెక్కువగనుండినట్లు చెప్పవలయును ఈ వర్తకము దానార్ణవుని

కాలమునుండియు మిక్కిలి యభివృద్ధిలోనికి వచ్చెను. కొన్ని సంవత్సరముల క్రింద, బర్మాదేశపు పశ్చిమతీరమున రాగ్రి ద్వీపము దగ్గర సముద్రపుటొడ్డున యిసుకలో గూరుకొనిపోయిన యోడభాగములందు కొన్ని బంగారు నాణెములు గాన్పించెను. వానిలో గొన్ని చాళుక్యరాజులలో 'చాళుక్య చంద్రు' డను బిరుదుగల మొదటి శక్తివర్మవిగను, మరికొన్ని యాతని తమ్ముని కుమారుడగు రాజరాజనరేంద్రునివిగను గన్పట్టినవి. అరాకాను దేశమందేగాక, ఇట్టి నాణెము లనేకములు సయాం దేశమున గూడ గాన్పించెను[1] ఈ నాణెములు సుమారు 65,66 వడ్లగింజల యెత్తు గలిగి వలచగానుండి, మోహరీలంత పెద్దవిగా నుండెను. ఇట్టి నాణెములు హిందూదేశములో నెచ్చటను గాన్పింపక, ఎక్కడనో దూరదేశములందు, సముద్రాంతర దీవులందు గాన్పించుటలో విశేషార్థముండ వలయును. మన పూర్వులు సాహసికులయి, విదేశములకు మతవ్యాప్తికై యేగుచు, వర్తకాభివృద్ధి కొఱకై, దూరదేశములందు, సముద్రాంతర దీవులందు వర్తకస్థానములను, వలసలను నెలకొల్పుచుండుట చేత, నీ నాణెము లంతదూరమున చెక్కు చెదరకుండ గాన్పించుట తటస్థించెను. ఈ నాణెములు సాహసికులగు మన వారిచేతనే గొంపోవబడి యుండవలయును గాని యితరముగాదు. అరాకాను దేశపు సముద్రతీరమున రాగ్రి ద్వీపమునందు బ్రద్దలైపోయిన యోడలో, నిసుకలో దొరకుట చూడ వర్తకపుటోడ యొకటి యాప్రాంతమున నెప్పుడో భగ్నమై యుండును. ఈ నాణెములు దొరకిన స్థలము మంచి నౌకాశ్రయమైన చెడూబా నగరమున కనతిదూరమున నున్నది. చెడూబా రేవును, ఆ పరిసరప్రాంతపు రేవులును ఒకప్పుడాంధ్రుల వలసలతో నిండి యుండిన కతన వర్తకపుటోడలు ఆంధ్రదేశము నందుండియు, నితర దేశముల నుండియు రాకపోకలు సలిపియుండవలయును రాగ్రీ ద్వీపము బ్రిటిషు బర్మాలో కియోకాహిపియా జిల్లాలో అరాకాను ప్రాంతమున చెడూబా సింధుశాఖ ముఖద్వారమున నున్నది[2].

రాజరాజనరేంద్రుని కాలపు నాణెములును, ఆతని పినతండ్రికాలపు నాణెములును, దూరదేశములందు గానవచ్చుటచే, వారికాలమున నితర యుద్యమములతోబాటు, నౌకావర్తకవ్యాపారము గూడ మంచిదశయం దుండెనని దెలియుచున్నది రాజరాజనరేంద్రుడు ఇదివఱకొక్క కావ్యగీతి ప్రియుడేయని యెఱుగుదుముగాని, సాహసికులయిన వర్తకులను, నావికులను ప్రోత్సహించి, విదేశవాణిజ్యము నిర్భయముగా సాగించుకొనుటకు - తరువాతికాలపు కాకతీయ ప్రభువులకు మార్గదర్శియై - అభయశాసనము లిచ్చియుండెనని యీవఱ కెఱుంగము.

రాజరాజుకాలమునకు బూర్వము విజృంభించిన యూ సముద్ర వాణిజ్యము, ఆతని తనయుని కాలమున మిగుల నభివృద్ధిచెందెను. తమిళభాషయందు 'కలింగట్టుపరణి' యనునొక కావ్యముగలదు. ఆ కావ్యమందు రాజరాజనరేంద్రుని కుమారుడగు కులోత్తుంగుని విజయములు వర్ణింపబడియున్నవి ఆంధ్రచాళుక్య-చోళులకు సంబంధించియున్న కొన్ని చరిత్రాంశములందు బొందుపరపబడి యున్నవి. చాళుక్య-చోళ చక్రవర్తులలో మొదటివాడగు కులోత్తుంగ చోళదేవుడు చీనా చక్రవర్తికడకు గానుకలంపి రాయబారమునడిపెనని యందు చెప్పబడియున్నది ఆ రాయబారము క్రీ.శ.1077 సంవత్సరమున బంపబడినట్లును ఆ రాయబారము నడిపినవారు పూర్వకాలమునుండియు చీనాదేశముతో వ్యాపారము చేయుచుండిన వర్తకులును, వారి భాగస్వాములనియును, అందు డెబ్బదియిద్దఱుమంది యుండిరనియు నాకావ్యమువలన దెలియుచున్నది[3]. ఈ విషయము చీనా గ్రంథములందుగూడ గానవచ్చుటవలన యథార్థముగాదని సందియ పడనక్కఱలేదు సుషింగ్ షిహి యను చీనా గ్రంథమున చాళుక్య-చోడ చక్రవర్తులు చీనాచక్రవర్తులకడకు తఱచుగా రాయబారములంపు చుండినట్లు వ్రాయబడియున్నది. ఈ కులోత్తుంగ చోళదేవునికి సమకాలీనుడైన బర్మా దేశపురాజు శ్రీ తిభువనదేవ చక్రవర్తి (బర్మాదేశపు పేరు: 'కియాన్ జిట్టా' క్రీ శ 1084-1112) యనువాడు తానొక చోళరాజుతో స్నేహమును బంధుత్వమును గూడ నెఱపియుండినట్లును, నాతడు తన ప్రేరేపణచే బౌద్ధమతము స్వీకరించి, యందులకు కృతజ్ఞతా సూచకముగా తన కాతడు కుమార్తెనిచ్చి పరిణయముగావించి ధనకనక, వస్తు, కరి, తురగ వాహనము లనేకములు కానుకగా బంపియున్నట్లును చెప్పుకొనియుండెను[4]. ఈచోళరాజెవ్వడో శాసనమునందు పేరుదహరింపబడకపోవుటచే దెలియ రాకున్నది. కాని యూ చోడరాజు తెలుగు చోడులకో, వెలనాటి చోళులకో చెందినవాడని తలపవచ్చును

ఏడవ శతాబ్దమునందు కృష్ణా, పినాకినీ నదుల మధ్యగల దేశమందు పల్లవరాజుల ప్రాభవ మణగిపోయెను అప్పటినుండి యూప్రాంతము చోళుల పరిపాలనముక్రిందకు బోయెను తమిళచోళుల గాక ఈ చోళులు తెలుగుచోళులు, రేనాటిచోళులు, వెలనాటిచోడులు అనుమూడు తెగలుగా నున్నారు. ఈ చోళులు చాలకాలము తమ స్వాతంత్ర్యమును గాపాడు కొనుచున్నను అంతఃకలహములతో మునిగియుండిరి ఉత్తరమున పూర్వ చాళుక్యుల విజృంభణమునకు తాళజాలక, వెలనాటి చోళులు తమ

స్వాతంత్ర్యమును వదలుకొని, వారలకు సామంతులుగనుండుటతో దృప్తినొంది యుండిరి.

వీరు మొదట కులోత్తుంగదేవ చక్రవర్తికిని, తరువాత కాకతీయ సామ్రాజ్యమునకును, సామంతులుగనుండి, దేశమును, విశేష శక్తి సామర్థ్యములతో బరిపాలించుచు, నించుమించుగ, స్వతంత్రులవలె మెలంగుచుండిరి. చాళుక్య చోడ చక్రవర్తుల కాలముననుు, కాకతీయ చక్రవర్తుల కాలముననుు, దేశమంతయు శాంతి ననుభవించుచుండుట వలన, నీ చోళమండలేశ్వరులు తమ చక్రవర్తుల వలెనే సముద్రవాణిజ్యమునకు విశేష ప్రోత్సాహమొసగి యుండిరి బర్మాదేశపు రాజగు శ్రీ త్రిభువనదేవ చక్రవర్తితో నెయ్యమును, బంధుత్వమును నెఱపియుండిన చోళరాజు, బహుశః నీ చోళమండలేశ్వరులలో నొకడై యుండవచ్చును చాళుక్య చోళ సామ్రాజ్యమంతరించిన తరువాతను గూడ సముద్రవ్యాపారము నిరాఘాటముగా జరగుచుండినట్లు గానవచ్చుచున్నది. పదమూడవ శతాబ్దమున నెల్లూరి ప్రాంతమును బరిపాలించియుండిన మనుమసిద్ధిరాజు వంశీయుల కాలమున గూడూరు సీమలోని కృష్ణాపట్టణము గొప్ప రేవుస్థలముగ నుండినట్లచటి శాసనములవలన దెలియుచున్నది. మనుమసిద్ధి రాజునకు బిమ్మట సింహాసనమెక్కిన యిమ్మడి తిక్కరాజు (క్రీ.శ 1278-1282) పట్టాభిషిక్తుడైన రెండవయేట అనగా శాలివాహనశకము 1200(?) సంవత్సరమున మీనమాసమున శుద్ధదశమీ గురువారము నాడు గండగోపాలపట్టణ మనియెడు కొల్లిత్తురై పట్టణమున నివసించుచున్నట్టి వర్తకులు తిరుక్కావనమునందు సమావేశమై తాముచేసుకున్న యొడంబడిక ప్రకార మా రేవుపట్టణములో నెగుమతిచేయబడునట్టియు దిగుమతిచేయబడు నట్టియు బస్తాలయొక్క మదింపు విలువనుబట్టి నూటికి నాలుగువంతున కొల్లిత్తురై గ్రామములోని మనుమసిద్ధీశ్వరుని యాలయముకొఱకును ధూపదీపనైవేద్యాలంకారముల కొఱకును వినియోగించు నటుల దానశాసనము వ్రాయించిరి.

ఈ శాసనమునందు కొల్లిత్తురై యనియు గండగోపాల పట్టణమనియు బేర్కొనంబడిన కృష్ణాపట్టము 13వ శతాబ్దమున గొప్ప రేవుపట్టణముగా నుండెనని స్పష్టమగుచున్నది 'పదునెనిమిది విదేశములనుండి యైదువందలమంది విదేశవర్తకులును ఆయానాడులనుండియు, పట్టణముల నుండియు పంచమండలముల నుండియు వచ్చినట్టి వర్తకులును అ రేవు పట్టణమున నివసించుచుండి' రని యాశాసనమందు జెప్పబడియున్నది.

ఆకాలమున కృష్ణాపట్టణపు వర్తకులు విదేశములతో వర్తకము విరివిగా జరుపుచుండిరి విదేశనౌక లా నౌకాశ్రయమున నెల్లవేళల నిండుగా సరకులతో తూగుటుయ్యెల లూగుచుండెను ఈ కృష్ణాపట్టణము రేవుపట్టణముగ నుండనారంభించు టెపుడో నిర్ణయింపజాలముగాని, రాజమహేంద్రనగర రెడ్లకాలము వఱకు మంచి వర్తకస్థానమని బేరుగాంచెను


జ్ఞాపికలు :

1 Indian Antiquary, Vol XIX, pages 79-82
2 Indian Antiquary, Vol XIX, pages 80-82
3 J R.A S , 1896, page 490 ff
4 Epigraphia Birmanica, Vol II, Part II, page 82
5 Nellore Inscirptions, Vol I, page 417, Gudur (45)
6 ఆంధ్రుల చరిత్రము, మధ్యయుగము, పుట 106-107.

# 8. కాకతీయ త్రైలింగసామ్రాజ్య కాలము

## క్రీ.శ. 1150 మొదలుకొని 1350 వఱకును

వేంగీదేశమున, చాళుక్య సామ్రాజ్య మంతరించిన తరువాత పశ్చిమమున నోరుగల్లు రాజధానిగ కాకతీయాంధ్ర సామ్రాజ్యము విజృంభింప నారంభించెను. కాకతీయాంధ్రులు మిగుల సమర్థులు, బలాఢ్యులు, మఱియును స్వజాత్యభిమానము గలవారగుట వలన దెలుగుభాష మాతృభాషగాగల యాంధ్రజనులనందఱి నొక్కసామ్రాజ్యము క్రిందకుదెచ్చి యాంధ్రజాతియొక్క పునరుద్ధరణమునకై కృషిసల్పియుండిరి. వీరిలో ప్రథమచక్రవర్తియగు గణపతిదేవుడు (క్రీ.శ.1199-1260) - తరువాతి కాలమున మహారాష్ట్ర నాయకుడగు శివాజీచక్రవర్తివలె - బద్ధకంకణుడై యాంధ్రదేశమును పునర్నిర్మాణము గావించి యాంధ్రజాతికి యైక్యతను సమకూర్చి యుండెను. ఇమ్మహాచక్రవర్తి సింహాసనారూఢుడైన వెనుక మహామండలేశ్వరులనెల్ల నొక్కొక్కరి జయించి కప్పములను గైకొనుచు దేశమునంతయు నేకచ్ఛత్రాధిపత్యము క్రిందకు దీసికొనివచ్చి సర్వవిధముల ప్రజల యైశ్వర్యాభ్యుదయములకై తన జీవితమునంతయు వినియోగించి సఫలీకృత మనోరథుడయ్యెను. ఇతడే త్రైలింగసామ్రాజ్య నిర్మాత.

'ఈ యాంధ్రచక్రవర్తికాలమున విదేశములతోడి వాణిజ్యమును, సముద్రయానమును మరల పోషింపబడి, విశేషముగ సాగుచువచ్చెను. ప్రాచీనకాలమునుండియు గుంటూరు మండలములో, బాపట్లకు సమీపమున, సముద్ర తీరమునందున్న మోటుపల్లి యను గ్రామము ప్రసిద్ధమైన రేవుపట్టణముగా నుండి ప్రాక్పశ్చిమదేశములతో సమానముగా వాణిజ్యము నెఱపుచు, నాంధ్రదేశములో నొక ప్రధాన వర్తకస్థానమై యుండెనని పూర్వ ప్రకరణమునందు దెలిసికొంటిమి. ఈ మోటుపల్లికే మైసాలియా, మసాలియా యను నామాంతరము లుండినట్లు గూడ నెఱింగితిమి. ఈ పట్టణమునకు వేలానగరమనియు దేశ్యుయక్కొండపట్టణమనియు, ముకుళపురమనియు కూడ నామాంతరములుండిన ట్లిచటి శాసనములవలన స్పష్టమగుచున్నది. మోటుపల్లి క్రీస్తుశకారంభకాలమునుండి రేవుపట్టణమని ప్రసిద్ధికెక్కినను

క్రమక్రమముగా, చాళుక్యసామ్రాజ్యము క్షీణించిపోయిన గొంతకాలము నుండియు గణనకు రాకయుండెను కాకతి గణపతిదేవ చక్రవర్తికి బూర్వము కొంతకాలమునుండి దేశమును సురక్షితముగ బాలించి, విదేశవ్యాపారము నడపునట్టి వర్తకుల కభయమివ్వగల చక్రవర్తిగాని మహారాజుగాని మండలేశ్వరుడుగాని లేకపోవుటచే నా ప్రఖ్యాత రేవునగరమున కాదుర్గతి పట్టెను. మోటుపల్లికడ మెట్టపట్టిన యోడలలోని సరకుల నాసమీపమునందలి మండలేశ్వరులు కొల్లగొనుచుండుటచే నావికులుగాని వర్తకులుగాని యారేవునకు జేరుటకే భయపడుచుండిరి మరియు నట్టి దుర్మార్గులును నీతిబాహ్యులునగు మండలేశ్వరుల ధాటికి నిలువజాలక ప్రసిద్ధిగాంచిన వర్తకులెవ్వరును నాపట్టణమున నివాసముగా నుండకపోయిరి[1] '

గణపతిదేవ చక్రవర్తికి వెలనాటిని జయించిన పిమ్మట నామహానగరము యొక్క దుస్థితి మనసునందు గాఢముగ నాటుకొని నగరము నుద్ధరించి మఱల విదేశవ్యాపారమును పెంపునొందింపవలయునన్న సంకల్పము నుదయింప జేసెను సంకల్ప మంకురించిన వెంటనే యామహాచక్రవర్తి మంత్రులతో నాలోచించి యందులకై తగుప్రయత్నములు గావించెను అప్పుడాతడు స్వయముగ వేలానగరమునకేగి, యచ్చట వర్తకుల కందఱకును 'నా జీవితముకన్నను సాహసికులగు నాప్రజల సంరక్షణమే నాకు నెక్కువ ప్రీతికరమైన విషయమని' యభయశాసనము వ్రాయించి ప్రకటించెను[2] అయ్యది, యిపుడాగ్రామమునందుగల వీరభద్రస్వామి వారి యాలయమున కెదురుగానున్న మంటపమునందొక స్థంభముపై లిఖియింపబడి గాననగుచున్నది[3]. ఆ శాసనమందిట్లున్నది-

**దక్షిణ ముఖము**

... ... ...

135 తేనానేన శ్రీగణపతిదేవ మ-
136 హారాజేన సకలద్వీపాంతరీ
137 పదేశాంతర పట్టణేషు గతా-
138 గతం కుర్వాణేభ్యః సాంయా
139 త్రికేభ్య ఏవ మభయశాస-
140 నం దత్తం। పూర్వరాజానః
141 పోతపాత్రే ష్వన్యదేశా ద్దేశాం
142 తరప్రవృత్తేషు దుర్వాతేన సమా-

143 పతితేషు భగ్నేష్వతీర్థసంగతే-
144 షు చ సంభృతాని కనక కరి తుర
145 గ రత్నాదీని వస్తూని సకలాని
146 బలా దపహరంతి । వయమ
147 పి ప్రాణేభ్యోపి గరీయో ఘ-
148 నమితి సముద్రయానకృత

**పశ్చిమ ముఖము**

149 మహాసాహసేభ్య స్తేభ్యః క్లుప్తశు-
150 ల్కాద [[ృ]]తే కృపయా కీర్త్యై ధర్మాయ చ
151 సర్వం వితరామ ఇతి॥ తచ్ఛుల్క
152 పరిమాణం ఏ క్కుమటి డిగుమ
153 టిని ముప్పయింటను ఒక్కటి ।
154 శ్రీగంధము తులాము ఒక
155 టికి । గ౧ ౢ । కర్పూరమునకూ
156 చీనికర్పూరానకూ ముత్యాల
157 కూ వేల । గ౧క్కి ౢ ॥। ≡ పంనీరు
158 దంతము, జవాది కర్పూరత్తై
159 లము రాగి తగరము రి(సే)
160 య సీసము పట్టునూలు ప-
161 వడమూ గ్రంధ్యద్రవ్యాలకూ-
162 ను వేల । గ౧ క్కి ౢ ౧। – మిరియా
163 ల వేల । గ౧క్కి ౢ ॥। – పటలు ఏల్ల
164 వానికిన్ని స్వరూపము ఒకటికి-
165 న్ని ౢ ౫ ॥ పోంకలు లక్ష ఒక్కటికి-
166 ని । గ౧ ! ౢ 3 । షట్షష్ట్యాది కైకాద
167 శ శత సంఖ్యే క్రోధి నామ్ని శ
168 క వర్షే। మోట్టుపల్ల్యభిధానే
169 [దేశ్యా]యకొండ పట్టణే మహా
170 [తి॥] (గ)ణపతిదేవః కీర్త్యైస్థాపిత
171 [వాంశ్చ] సనస్తంభం। కలికా
172 లకర్దమస్థల దనాది ధర్మా
173 వలంబయ యష్ఠి మీవ... శ్రీః॥

ఈ శాసనము శాలివాహనశకము 1162లకు సరిగా క్రోధి సంవత్సరమున (క్రీ.శ. 1244-1245) లిఖింపబడి ప్రకటింపబడి నట్లందు గానవచ్చుచున్నది ఈ శాసనమునందు, శుల్కపరిమాణములు దెలుపు భాగముతప్ప మిగిలిన భాగమంతయు సంస్కృతమునందున్నది. ఇందు ఆ కాలమున ప్రత్యేకముగ వర్తకులచే వాడుబడుచుండిన వ్యవహారపు గుర్తులు గొన్ని గానవచ్చుచున్నవి ఆ కాలపు నాణెములను గూర్చి కొంత దెలిసినగాని యా గుర్తులు బోధపడవు ఐనను కొన్ని మాత్ర మూహింప వీలుగనున్నవి. 'గ' యను అక్షరము ఒకవరహాను దెలుపుట కుపయోగింపబడు చుండెను 'గ' గద్యానమునకు సంజ్ఞ, గద్యానము వరహా కింకొకపేరు పూర్వకాలము నుండియు తెలుగుదేశము మొదలుకొని పాండ్యదేశమువఱకు నీ గద్యానములు నాణెములుగనుండెను. ఒక గద్యానమునకు 20 మాపులు, లేక 45రూకలు (పణములు) గద్యానము మనకాలపు లెఖ్ఖకు సరిగా మూడున్నర రూపాయలగుచున్నది మాపుల కంటెను, పణముల కంటెను చిన్న నాణెము లెవ్వియో పేరులు తెలియవచ్చుటలేదు పణములు లేక రూకలు, రాగిటంకములని యూహించుటకు శాసనప్రమాణములు గలవు [4] ఈ శాసనమున్న గుర్తు పణము లనబడియెడు రూకలకు సంజ్ఞ గావలయును. 'పణము' ద్రావిడ భాషాపదము, అయినను అది తెలుగుదేశమందు గూడ వ్యవహరింపబడు చుండెను; రూక యనునది తెలుగుమాట యగుటచే, నా పదమే యెక్కువగా వ్యవహారములో నుండెను రూక నాణెము రెండవ ప్రతాపరుద్రుని కాలమును గూర్చి దెలిపెడు క్రీడాభిరామమను వీథినాటకమందు గాన నగుచున్నది ఈ రూకటంక మీకాలపు నాణెమున 5 కానులగును.

ఈ అభయశాసనము సకలద్వీపములతోడను ద్వీపాంతరదేశముల తోడను విదేశములతోడను పట్టణములతోడను వ్యాపారముచేయు వర్తకుల కొసగబడెను. ఒక దేశమునుండి బయలుదేరి, మరియొక దేశమునకు బోవు సరకుతోనిండిన యోడలు, వాయువశమునగాని ప్రమాదవశమున గాని యాతీరమున మెఱకపట్టి బ్రద్దలగుచుండినపుడు పూర్వపు రాజులు వానిలోని బంగారము, ఏనుగులు, గుఱ్ఱములు, రత్నములు మొదలుగాగల సకలవస్తువులను బలాత్కారముగా నపహరించు చుండువారనియు, దాను కృపచేతను సత్రప్రభుత్వధర్మములను గాపాడుటకును, గీర్తికొఱకును, అధికాభినివేశ సాహసములతో సముద్రయానముచేసి, విదేశములతో వాణిజ్యముచేయు వర్తకులయందు తన ప్రాణముమీద కంటెను నెక్కువ ప్రేమయుండుటచేతను, ఒక్క క్లుప్తశుల్కము మాత్రముతప్ప తక్కినసుంకములన్నిటిని వదలివేసితినని,

యా చక్రవర్తి తన యభయశాసనమందు ప్రకటించెను. ఉత్తరమునుండి దక్షిణమునకుగాని దక్షిణమునుండి యుత్తరమునకుగాని పోవునట్టి యోడలలోని సరకులను యోడదొంగలు కొల్లగొనకుండ కట్టడిచేసి నౌకలు, వర్తకులు నిర్భయముగా రాకపోకలు జరుపుటకు అభయమిచ్చెను.

మఱియు నారేవుపట్టణమునందు యెగుమతి దిగుమతి సరకులపై న్యాయమైన క్లుప్తశుల్కమును (కొద్ది సుంకము) మాత్రము విధించెను. ఎగుమతిసరకులపై శుల్కపరిమాణము ముప్పదింట నొక్కటిగ నిర్ణయించెను. శ్రీగంధము తులము ఒక్కంటికి ఒక వరహాయును పావు పణమును; ఒక వరహావిలువగల కర్పూరమునకు, చీనికర్పూరమునకు, ముత్యాలకు, ఒక్కంటికి ముప్పాతికాముప్వీసపు పణము చొప్పునను, ఒక వరహా విలువగల పన్నీరు, జవాది, దంతము, కర్పూర తైలము, రాగి, తగరము, రిసేయ సీసము, పట్టునూలు, పగడములు, సుగంధద్రవ్యములకు వీనికి ఒక్కంటికి పణముపైన పాతికావీసము పణము చొప్పునను, ఒక వరహావిలువగల మిరియాలకు ముప్పావువీసపు పణమును; పట్టుబట్టల మూటలకు స్వరూపమున కొక్కంటికి అయిదున్నర పణముల చొప్పునను, ఒక లక్ష పోకచెక్కలకు ఒక వరహాపైన మూడుపణముల పాతిక చొప్పునను, క్లుప్తశుల్కము నిర్ణయించెను

ఈ సరకుల నామములబట్టి, యా కాలమునందారేవుపట్టణ మెంత ప్రసిద్ధి కెక్కియుండునో, దాని నంతటియుచ్ఛస్థితికి దెచ్చుటకు గణపతిదేవు డెంత ప్రయాసపడియుండెనో, యానగరవర్తకు లేయే దేశములతో వ్యాపారము చేయుచుండిరో వేఱుగ చెప్పనక్కఱలేకయే బోధపడక మానదు. గణపతిదేవు డానగరమునకు సిద్ధయదేవ మహారాజాను పాలకునిగ నియమించెను. గణపతిదేవుని కృపావిశేషమువలన నారేవుపట్టణము పునరుద్ధారణము కావింపబడి యాతని కుమార్తె రుద్రమదేవి కాలమున వెనీసు వర్తకుడగు మార్కోపోలో యనువానిచే సందర్శింపబడి, మిక్కిలి శ్లాఘింపబడుట తటస్థించియుండెను.

మోటుపల్లిగాక, నాంధ్రదేశమునం దితర రేవుపట్టణము లనేకము లింకను వర్ధిల్లుచుండినటుల శాసనములందు గానవచ్చుచున్నది ప్రభువువలెనె, గణపతిదేవుని సేనాని యొకడు జాయప యనువాడు కూడ క్రీ శ 1231వ సంవత్సరమున శాసనమొకటి ప్రకటించెను. జాయపనాయకుడు తన ప్రభువుపైగల భక్తిచొప్పున అతని పేరట నంగెగడ్డ యందు గణపతీశ్వరుని ప్రతిష్ఠించి యాస్వామికి నిత్యధూపదీపనైవేద్యాలంకారముల కొఱకు నారేవునకు వచ్చు వర్తకపుటోడలపై శుల్కమువిధించి యందువమూలమున వచ్చు నాయమాదేవున కర్పించెను. జాయపదేవు దీవిషయమున బ్రకటించిన శాసనమునం దిట్లున్నది

121 ‘‘ . దివి గణ
122 పతీశ్వర శ్రీమహాదేవరకు పదినెనిమిదివిష
123 యముల ఉభయనానాదేసియునంగేగడ్డనిచ్చి
124 న ఆయము కలమునం బేద్ద చిన్నము

ఇందు కొన్ని ప్రాచీన తెలుగుపదములు గలవు. నానాదేసి యన వర్తకులును, కలము అనగా ఓడయనియు అర్థము పెద్ద చిన్న మనగా నాకాలమున వ్యవహారములో నుండిన రూక, లేక పణము అను నాణెము ఆయ మనగా రాజానకుగాని ప్రభుత్వమునకుగాని చెల్లుబడి గావలసిన సుంకము. గణపతిదేవ మహారాజుకంటె పూర్వము కొంతకాలము క్రిందట జాయపనాయకుడీ శాసనమును బ్రకటించియుండుటవలన నంగె గడ్డ, యొక ప్రసిద్ధ రేవునగరమని యూహింపదగును. ఏలన ఆ రేవునకు విశేషముగ నోడలు రాకుండిన జాయప వృత్తులు గల్పించియుండిన లాభమును లేదు. జాయపదేవుని శాసనమున, కృష్ణానదీ ముఖద్వారముననున్న దివి తాలూకాలో (నానెగెడ్డ) నంగెగడ్డ యను రేవుపట్టణము కలదనియు, నారేవునకు వచ్చు నానాదేశవుటోడలు దివిలో జాయపదేవుడు ప్రతిష్ఠించిన గణపతీశ్వరమహాదేవరకు ఓడయొకటికి నొక పెద్దచిన్నము (ఒక పణము) శుల్కముగ నర్పింపవలసియుండెననియు దెల్పబడియున్నది. ఈ మర్యాదకు కృష్ణానదికిరుప్రక్కల పదునెనిమిది నాడుల వర్తకులు నొడంబడి సుంకము నిచ్చుచుండిరి. ఇపుడీ శాసనము దివి తాలూకాలోని గణపేశ్వరమునందలి దుర్గాంబదేవాలయమున కెదురుగానున్న స్తంభమున పూర్వ పశ్చిమ దక్షిణ దిశలందు లిఖింపబడి గాననగుచున్నదో

గణపతిదేవుని యభయశాసనమును బట్టియు, నాతని సేనాని జాయప నాయకుని శాసనమునుబట్టియు, నాకాలము నందు సముద్రముమీద విదేశవాణిజ్యము చక్కగ సాగుట కెట్టియేర్పాట్లు గావింపబడియెనో, ఆయా రేవుపట్టణములందు అధికారులు క్లుప్తశుల్కాదులను గైకొనుచు, సరకుల దిగుమతియెగుమతులకై యెట్టి సదుపాయములు చేయుచుండిరో వర్తకులు నిర్భయముగ వ్యాపారము చేసికొనుట కెట్టి క్రమమైన పద్ధతులుండెనో మన మూహించుకొనవచ్చును.

ఈసందర్భమున మోటుపల్లిని గూర్చి పాశ్చాత్యులు వ్రాసిన దానిని యొకింత చెప్పవలసియున్నది. వారి వ్రాతలబట్టి యామహానగర మాకాలమున ఆంధ్రదేశమున కెల్ల నాయకమణియైన వర్తకస్థానముగ నుండెనని నిశ్చయింపవచ్చును ఆమహానగరమునుండి యాకాలమున యెగుమతియగు సరకులగూర్చియు, నా నగర ప్రాంతమునందు లభించు చిత్రములగు వస్తువులనుగురించియు మార్కోపోలో విశేషముగ బ్రశంసిచియున్నాడు[7].

మోటుపల్లి ప్రాంతమంతయు ప్రాచీన కాలము నుండియు మిక్కిలి సున్నితము లయిన రవసెల్లాలకు బ్రసిద్ధిగాంచినదని యీ దేశమును జూడవచ్చిన విదేశీయులందఱు నేకగ్రీవముగ బ్రశంసించియున్నారు. పదునొకండవశతాబ్ద ప్రారంభమున సూలియామ్ అను అరబ్బీవర్తకుడీ దేశమును బేర్కొనుచు నిచ్చట నౌకయుంగరవములో దూరిపోగల సొగసైన రవసెల్లాలు లభించునని చెప్పియున్నాడు[8]. ఈ దేశమును పండ్రెండవశతాబ్దమున జూడవచ్చిన ఆల్ ఇద్రిసి యనునాతడు 'డుమి' యని బిలచుచు అది చోళమండలతీరమున యున్న దనియు, అది సన్నని నూలుబట్టలకు విఖ్యాతి కెక్కియున్న దనియు బొగడియుండెను[9]. పదమూడవశతాబ్దమున డామస్కసు పురవాస్తవ్యుడైన అబుల్‌ఫేదా యనువర్తకు (క్రీ.శ 1273-1331) డీమోటుపల్లి ప్రాంతము సున్నితములైన రవసెల్లాలకును వల్లులకును ప్రసిద్ధికెక్కియుండెనని చెప్పియున్నాడు[10] క్రీ శ 1296వ సంవత్సరమున నాంధ్రదేశమును జూడ వచ్చిన మార్కోపోలో యనునాతడు మాబారుదేశమున కుత్తరముగా 'మోసల' మను దేశ మున్నదనియు, నందు 'ముటఫిలి' యనురేవుపట్టణము గలదనియు, నచ్చట సాలిపట్టును బోలు మిక్కిలి సన్నని బట్టలు తయారుచేయబడుచున్న వనియు జెప్పియన్నాడు [11] ముటఫిలి యీ కాలమున మోటుపల్లికి సరిపోవు చుండుటచే నాతడు పేర్కొనిన రేవునగరము మోటుపల్లియే యని నిస్సంశయముగ నుడువవచ్చును. అదియునుగాక నీతడు రుద్రాంబిక పరిపాలించు కాలమున నీదేశమునకు వచ్చియుండినవాడు గావున నంతకుపూర్వము గణపతిదేవ చక్రవర్తిచే నుద్ధరింపబడి సకలద్వీపద్వీపాంతర దేశముల నుండియు నోడలు వచ్చుచు బోవుచుండుటచే ప్రఖ్యాతిగన్న మోటుపల్లియే యాతడు బేర్కొనిన మోసల లేక ముటఫిలి గావలయును.

మార్కోపోలో మోసలమండలమున వెండి, బంగారపు సరిగెబుట్టాపని చేయబడిన సొగసైన నూలుబట్టలు కూడ నేయబడుచుండెననియు నచ్చటివర్తకులు సుగంధద్రవ్యములను ముత్యములను జలతారునేసిన పట్టునూలుబట్టలను ఎగుమతి చేయుదురని చెప్పియున్నాడు. మరియు నాప్రాంతము వజ్రములకుకూడ బ్రసిద్ధిచెందియున్నట్లు చెప్పియున్నాడు. మార్కోపోలో మోటుపల్లినగరమున నోడదిగి, కాకతీయురాజధానిమీదుగ దేశములోనికి బోయెను ఆకాలమున త్రైలింగసామ్రాజ్యమును బరిపాలించు చుండిన గణపతిదేవుని కూతురగు రుద్రాంబిక యొక్క ప్రజ్ఞావివేకములను న్యాయానురాగమును, ధర్మాభిరతిని, బ్రజాపరిపాలనాదక్షతను అతడు వేయివిధముల బొగడియున్నాడు మోటుపల్లి రేవుపట్టణమున కాకాలమున చీనా, జపాను, బర్మాదేశములనుండియు సుమత్రా, జావా, బోర్నియో ద్వీపముల

నుండియు, వంగదేశము నుండియు నోడలు సరకులు గొనివచ్చి మఱల సరకులను గొనిపోవుచుండెను[12] మాబారు, మోసలతీరములనుండి (కృష్ణా, గోదావరి మండలములు) దక్షిణముగానున్న జాంజిబారు ద్వీపమునకు నోడలు రాకపోకలు సలుపుచుండెను. ఆద్వీపమునుండి మన దేశతీరమునకు ప్రయాణము మూడు మాసములు బట్టుచుండ మన దేశమునుండి యాద్వీపమునకు నోడలు ఇరువది దినములలోనే పోవుచుండెనని నాశ్చర్యపడుచు మార్కోపోలో వ్రాసియున్నాడు.

ఈతడాకాలమున హిందూమహాసముద్రమునంతయు విహారము చేయుచుండిన నౌకలను గూర్చియు వాని నిర్మాణ విధానమును గూర్చియు, పరిమాణమును గూర్చియు, గొన్ని యంశములు దెలిపియున్నాడు[13]. ఆ కాలమున సముద్రపుటోడలు దేవదారుకర్రతో గట్టబడుచుండెను అడుగుభాగమంతయు రెండేసి చెక్కలచొప్పున దళసరిగ నినుపమేకులతో నతికింపబడుచుండెను. చెక్కలనడుమగల సందులలో జనపనారదూర్చి సున్నపురాయి, ఒక విధమగు చెట్టునుండి తీయుబడు నూనెయు కలిపి చేయబడిన కీలును పూయుచు నీరుజొఱకుండ జేయుచుండిరి

అప్పటి యోడలు మిక్కిలి పెద్దవిగనుండి యించుమించుగ నైదారువేల మలగల మిరియమును గొంపోవగలిగి యుండెను మలగ యనగా నెద్దుపైనది మోయగలిగినంత గంతతోడి సరకుగోనెయని యర్థము. పూర్వకాలమున వర్తకులు సరకులను ఎద్దులపై వేసికొని నాటుప్రయాణము చేయుచుండిరి. కావున నిప్పటి కాలపు బస్తాల స్వరూపమువలె మలగలు ఆకాలమున యొుక పరిమాణముగనుండెను దీనిని బట్టి యాయోడలు కడువిశాలముగను బెద్దవిగను నుండెనని యూహింపవచ్చును ఆయోడలు నడుపుటకు నూటయేబదిమంది మొదలుకొని మూడువందలమంది నావికుల వఱకును గావలసి వచ్చుచుండిరి ప్రతి నౌకకును నాలుగు తెఱచాపకొయ్యలును పెక్కుచాపగుడ్డలు నుండెను తెఱచాపలున్నను ఆ నౌకలు త్రెడ్లువేసి కొనుచుగూడ పయనము సేయుచుండెను. నలుగురు నావికులు ఒక త్రెడ్డుచొప్పున వేయుచుండిరి ఒక పెద్దయోడతో వెంటనెప్పుడు రెండుమూడు చిన్నయోడలు గూడ వచ్చుచుండెను. ఆ చిన్నయోడకుగూడ నొకప్పుడు ఎనుబదిమంది నావికు లుండిరి. పెద్దయోడ గాలిలేక కదల జాలనపుడుగాని యెదురుగాలి వీచుచున్నప్పుడు గాని, ఆ చిన్న యోడలు త్రెడ్లువేసికొనుచు పెద్దయోడ నీడ్చుకొనుచు బోవుచుండెను పెద్దయోడతో నీ చిన్నయోడలుగాక పదిపండ్రెండు నావలుగూడ వెంటవచ్చుచుండెను ఆచిన్ననావల నీకాలపు స్టీమరులందువలె యోడ కిరుపార్శ్వములందు వ్రేలాడగట్టియుంచి యవసరము

వచ్చినప్పుడు నీటిలోనికి దింపుకొనుచుండిరి. ఇట్టినావలు, చిన్న యోడలకుగూడ వ్రేలాడగట్టబడుచుండెను. వీనిని లంగరులు తీసుకొనివచ్చుటకును, చేపలు బట్టుటకును, తదితరపనులకును వినియోగించుచుండిరి పెద్ద యోడ కుపరిభాగము లేక తట్ట (deck) ఒక్కటియే యుండెను. ఆ తట్టకు క్రిందియంతస్తునం దిఱువది గదుల వఱకుండెను. ఈ గదు లాయోడ పరిమాణమును బట్టి చిన్నవిగను పెద్దవిగ నుండెను ఒక్కొక్క వర్తకుడొక గదిని పుచ్చుకొని యందు తన సరకును గొంపోవుచుండెను. ఈ గదులక్రింద, చుక్కానిమొదలుకొని ఓడముఖము వఱకు గల, యడుగుభాగమంతయు గూడ గట్టిగా నీరు చొరకుండ గదులక్రిందనే గట్టబడుచుండెను ఒకవేళ తిమింగిలముల దెబ్బలవలనగాని సముద్రములోని కొండలకు దాకొనుటవలన గలిగిన దెబ్బల వలనగాని యోడకపాయము తటస్థింపకుండ నీ గదులు నిర్మింపబడియెను. ఈ గదులుండుట వలన ఏభాగమునకు దెబ్బతగిలిన ఆభాగము మాత్రమే చెడిపోవుచుండెనుగాని యోడ కెట్టిప్రమాదమును గలుగకుండెను. ఇట్టి దెబ్బలుతినిన భాగములను మరల చెక్కల నతిగించి బాగుచేయుచుండిరి. ఇట్లు ఓడయడుగుభాగ మొకప్పుడు అయిదారు చెక్కల దళసరివచ్చువఱకు మరమ్మతు చేయబడుచుండెనట[14]

కాకతీయాంధ్ర చక్రవర్తులలో గడపటివాడగు రెండవ ప్రతాపరుద్రదేవ చక్రవర్తి కాలమునగూడ సముద్ర వాణిజ్యవ్యాపారము నిర్విఘ్నముగ సాగుచుండెను. కవిసార్వభౌముడగు శ్రీనాధుడు తన పితామహుడైన కమలనాభామాత్యుడు రెండవ ప్రతాపరుద్రదేవుని యాస్థాన కవీశ్వరులలో నొకడైయుండుచు, సముద్రతీరమందున్న కాల్పట్టణమున కధీశ్వరుడై యుండినట్లు భీమేశ్వరపురాణమునందు, తన వంశాభివర్ణనము చేసికొనునప్పుడు ప్రశంసించియున్నాడు[15]. కాల్పట్టణ మెచ్చటనున్నదో, యా కాల్పట్టణ మాంధ్రదేశమునందుగాని యితర దేశములందుగాని యేనగరమునకు వర్తించునో, నిర్ణయింప సాధ్యముగాకున్నది. కీర్తి శేషులయిన రావుబహదూరు వీరేశలింగం పంతులుగారు కాల్పట్టణ నిర్ణయమును గురించి యెంతో ప్రయాసపడి కాల్పట్టణమును క్రాల్పట్టణమును జేసి, చివరకొక అవిశ్వసనీయ మగు వాదమును ప్రతిపాదించియుండిరి[16]. వారి వాదమును బట్టి కాల్పట్టణము నెల్లూరిమండలములోని క్రొత్తపట్టణము గావలయును కాల్పట్టణము, క్రొత్తపట్టణమనుటకు వారి విపరీతసిద్ధాంతముతప్ప వేఱు ప్రమాణము గానరాదు. కృష్ణామండలమందు సముద్రమునంటి ప్రసిద్ధిగలిగిన కాళీపట్టణ మొకటిగలదు. పూర్వమీగ్రామము గొప్ప రేవుపట్టణమై యుండవచ్చును. శ్రీనాథుడు తన తాతగారి యుద్యోగమును గూర్చి గొప్పగా జెప్పుకొనిన

కాల్పట్టణ మిదియే యైయుండిన కాకతీయాంధ్ర చక్రవర్తులకాలమున నీ కాళీపట్టణమును ఒక గొప్ప రేవుపట్టణమై యుండవలయును కాని, కొందఱు పండితు లూహించినటుల కాల్పట్టణము కర్ణాటదేశములోనిది మాత్రము గాజాలదు. మరియు, వీరేశలింగం పంతులుగారొక్క తృటిలో త్రోసిపుచ్చినరీతి, కమలనాభామాత్యుడు వట్టి కరణమును గాజాలడు కాల్పట్టణము వారిధితటి యందున్నదని చెప్పబడుట చేతను, ఆనగరమున కాతడధీశ్వరుడని వర్ణింపబడుటచేతను, ఆతడా రేవునకు అధికారియై యుండుచు, నానాదేశముల నుండి సరకులను తెచ్చుచు గొంపోవుచుండిన, యోడలపై సుంకముల విధించు నుద్యోగియై నగరాధిపతియై యుండవలయును

కాకతీయ సామ్రాజ్యారంభ కాలమునుండియు నెడతెగక వర్థిల్లుచుండిన నీ విదేశవాణిజ్య సముద్రయానములు, కాకతీయసామ్రాజ్య మంతరించిన వెనుక గూడ వర్థిల్లుచుండినట్లు ప్రమాణములు గలవు రెండవ ప్రతాపరుద్రుని కాలమున జనులు తఱచుగా విదేశములకు బోవుచువచ్చుచుండిరనియు, సముద్ర యానమును జనులుత్సాహముతో గావించుచుండిరనియు దెలియుచున్నది. రెండవ ప్రతాపరుద్రుని కాలమునాటి యోరుగల్లునగరమును గూర్చి దెలిపెడు వల్లభరాయామాత్య ప్రణీతమగు క్రీడాభిరామమను వీధినాటకమున, సముద్రముమీద నౌకాయానము చేసివచ్చుట సూచింపబడినది. అందు కథానాయకుడగు మంచన గోవిందశర్మ యోరుగల్లు నగరమునదిరుగుచు ప్రతాపరుద్రుని యుంపుడుకత్తెయగు మాచల్దేవి సౌధమునుగాంచి యది యెవ్వరిదని యచ్చటనున్న వారిని బ్రశ్నింప, వారాతని గనుంగొని యింతమాత్రము గూడ దెలియనివాడవా యనునట్లు 'సముద్రాంతంబున నుండి వచ్చితివె భూదేవా' యనుచు పరిహాసపూర్వకముగా బల్కిరి[17] కవిహృదయమును బట్టిజూడ నీవిషయము, ఆ కాలమున జనులకు తఱచుగా విదేశములకు బోవుచు వచ్చుచుండుట అలవాటుగ నుండెనని తెలుపుచున్నది.

జ్ఞాపికలు :

1 ఆంధ్రుల చరిత్రము, మధ్యయుగము, పుట 263-265
2 Epigraphia Indica, Vol XII, page 188 ff
3 ఆ శాసనములోని ప్రస్తుతము మనకు సంబంధిచినంత భాగమును మాత్రమే నిచట పొందుపఱిచితిమి మొదటి నూటముప్పదినాలుగు పంక్తులలో శ్రీ గణపతిదేవుని యొక్క వంశవర్ణనము గలదు, కావున వాని నిటవదలితిని
4 Thurston, Coinage of the East India Company

5 ఆంధ్రుల చరిత్రము, మధ్యయుగము, పుట 295
6 Epigraphia India, Vol III, page 82
7 Yule, Travels of Marco Polo, Vol II, page 346
8 Sir H Elliot, History of India, Vol II
9 Ibid
10 Ibid
11 Yule, Marco Polo, Vol II, page 346 ff , also Quarterly Journal of the Mythic Society, Vol II page 117 ff
12 ఆంధ్రుల చరిత్రము, పూర్వయుగము, పుట 293–295.
13 Mukherjee, Indian Shipping, pages 192-193
14 Mukherjee, Indian Shipping pages 192-193
15 మ కనకక్ష్మాధరధీరు వారిధితటీ కాల్పట్టణా ధీశ్వరున్
ఘనునిన్ పద్మపురాణ సంగ్రహ కళాకావ్య ప్రబంధాధిపున్
వినమత్కాకతిసార్వభౌము, గవితావిద్యాధరుంగొల్తు మా
యనుగుందాతబ్రదాత, శ్రీకమల నాభామాత్య చూడామణిన్
16. ఆంధ్రకవుల చరిత్రము, రెండవ ముద్రణము, పుట. 416
17 క్రీడాభిరామము, 180వ పద్యము

# 9. రెడ్డి, విజయనగర సామ్రాజ్య కాలములు
## క్రీ.శ. 1300 మొదలుకొని 1550 వఱకును

కాకతీయాంధ్రసామ్రాజ్యము, మహమ్మదీయ దండయాత్రల పరంపరలవలన భగ్నము గావింపబడిన తరువాత త్రిలింగదేశములోని పశ్చిమభాగము తురుష్కులకును, దక్షిణభాగము వెలమనాయకులకును తూర్పుదేశము రెడ్లకును వశమై, మూడు చిన్నరాజ్యములక్రింద చీలిపోయెను. రెడ్డిరాజులు పూర్వాంధ్రదేశమున స్వతంత్రరాజ్యము నెలకొల్పి, దక్షిణత్రిలింగదేశమును వెలమనాయకుల కడనుండి లాగికొని కాకతీయ సామ్రాజ్యము వంటి సామ్రాజ్యము నొకదానిని నిర్మింప జాలప్రయత్న మొనరించిరి రెడ్డి, వెలమవంశముల పోరాటములు, కాకతీయ సామ్రాజ్యము భగ్నమగుటకు దోడ్పడినట్లు, తుద కుభయపక్షములవారికి నష్టదాయకము లయ్యెను కొలదికాలములో వారు తగవులాడికొనిన దేశమంతయు, నుభయులకు కూడ దక్కకుండ, బహమనీసుల్తానుల పాలనము క్రిందకు బోవుట తటస్థించెను

పూర్వాంధ్రదేశమున స్వతంత్రరాజ్యము నిర్మించి పాలించిన రెడ్ల పూర్వులు, తొలుత కాకతీయులకు సామంతులుగ నుండుచు నెల్లూరిమండలము మొదలుకొని నిప్పటి విశాఖపట్టణములోని సింహాచల ప్రాంతమువఱకు గల దేశమును బాలించియుండిరి. రెడ్డిప్రభువులు కడు సమర్థులు, బలవంతులు వారు సామ్రాజ్యము నిర్మింపలేకపోయి విఫల మనోరథులయిరన్న మాటయేగాని దేశము నత్యంతవైభవముతో బాలించి యాంధ్రదేశాభ్యుదయమునకును, విదేశ వాణిజ్యాభివృద్ధికిని, భాషాభివృద్ధికిని విశేషముగ దోడ్పడి, మహోపకారము చేసియుండిరి

కాకతీయ చక్రవర్తుల కాలమున నభివృద్ధిలోనికి దేబడి యత్యంత వైభముతో సాగుచుండిన విదేశవాణిజ్యము రెడ్లకాలమున కూడ నెప్పటియట్ల సాగుచుండెను రెడ్లకు తొలుత అద్దంకిపురము రాజధానిగ నుండెను. ఇయ్యది, వంగవోలునకు కొంచము దూరముననున్నది రెడ్లు స్వతంత్రులయిన తరువాత రాచకొండ వెలమనాయకులతో బోరాటములు మిక్కుటమగుటచే రాజ్య

రక్షణమున కనుకూలమయిన కొండవీడున దుర్గమును ప్రాకారమును నిర్మించి రాజధాని నక్కడకు మార్చిరి కొండవీడు రాజధానిగా నుండుటచే, నక్కడకు సమీపముగానున్న మోటుపల్లి వర్తకము వారికి మురిపెము గొల్పియుండెను. ఆ కారణమున వారు కాకతీయచక్రవర్తుల వలె, తమశక్తి సర్వస్వముల నా రేవుపట్టణమును మంచిదశలో నుంచుటకై వినియోగించిరి

కొండవీటిని రాజధానిగా జేసికొని పరిపాలించిన రెడ్లలో దేసటి వేమారెడ్డి మొదటివాడు ఈతడాంధ్రదేశమును క్రీ.శ 1345 మొదలుకొని 1350 వఱకును పాలించియుండెను మోటుపల్లి రేవాతని కాలమున రెడ్డిరాజ్యమునకు ప్రధానరేవునగరమును, వర్తకస్థానము నగుట సంభవించెను కాకతీయాంధ్ర సామ్రాజ్యము మంతరించిన తరువాత, సామంత రాజవంశముల పోరాటముల వలనను, తురుష్కుల దండయాత్రలవలనను, దేశమందు కేంద్రప్రభుత్వము నశించెను. అంతట నానాప్రాంతములందును అల్లకల్లోలము లుదయించెను వర్తకస్థానమును, ధనలక్ష్మికి నివాసమునగు మోటుపల్లి నగరము నిరంకుశులగు స్థలాధికారుల చేతిలో జిక్కెను విశాలమగు దూరదృష్టితో విదేశవర్తకమును పెంపొందించుచు వర్తకుల కభయమిచ్చు చక్రవర్తులుగాని, రాజులుగాని లేమిచే, స్థలాధిపతులు తమ యిచ్చవచ్చిన తెఱగున మెలగనారంభించిరి. అంత వర్తకులకు వాణిజ్యమునకు ముప్పువాటిల్లనై యుండెను. అట్టి సమయమున, యదృష్టవశమున మోటుపల్లి నగరము రెడ్డిరాజుల దృష్టినాకర్షించెను. పోలయ వేమారెడ్డి తన సోదరుడగు మల్లారెడ్డిని, మోటుపల్లి నంతట జయించి వర్తక మభివృద్ధిపఱచుటకు బుత్తెంచెను ఇతడు కాకతీయ సైన్యాధిపు లగు క్షత్రియులను జయించి మోటుపల్లిని స్వాధీనపఱచికొనియెను. ఈ విషయము, ఎఱ్ఱాప్రగడ విరచితమగు హరివంశమున నిట్లు వర్ణింపబడియున్నది

శా. *''బాహాదర్పమునం బ్రతీపధరణీపాలావలిందోలి, యు*
*త్సాహోదగ్రుఁడు మోటుపల్లిఁగొని సప్తద్వీపసద్వస్తు సం*
*దోహంబున్ దనకిచ్చు నెచ్చెలి సముద్రుంబ్రీతిఁగావించుచు*
*మాహాత్మ్యంబు వహించె మల్లరథినీనాథుండు గాఢోద్ధతిన్.*

క. ''సకలద్వీపాంతర ర
త్నకలాప నిరంతార్చనాకలనారం
భక కురుమలూరి పురనా
యక మల్లచమూవరేన్యా హరినివేద్యా!

ఎఱ్ఱాప్రగడ తన హరివంశమును, దేసటి పోలయవేమారెడ్డికి అంకితమొనర్చెను

ఈపద్యములందు బేర్కొనబడిన మల్లారెడ్డి, వేమారెడ్డికి దమ్ముడై విధేయుడై, యాతనికి సేనానిగ నుండి సౌభ్రాతృత్వముతో రాజ్యమును విస్తరింపజేయుటకు దోడ్పడి వినుకెక్కియుండెను

వేమా రెడ్డికి దరువాత నాతని జ్యేష్ఠపుత్రుడగు అనపోతారెడ్డి రాజ్యభారము వహించి క్రీ శ 1362 వఱకును బరిపాలించి, యకాలమరణము నొందెను. ఈతడు తన రాజ్యకాలమున వర్తకాభివృద్ధికి విశేషప్రయత్నము గావించెను. కాకతి గణపతిదేవచక్రవర్తికివలె నీతనికి బూర్ణాయువు భగవంతుడొసంగియుండిన రెడ్డిరాజులు కాకతీయులవలె విశాలసామ్రాజ్యము నిర్మింపగలిగియుందురు. ఈ మహారాజు తాను పరిపాలించియుండిన స్వల్పకాలములో విదేశవాణిజ్యమునకు, సాహసిక జీవనమునకును విశేష ప్రోత్సాహ మిచ్చియుండినట్లు అతని మోటుపల్లి శాసనము వేనోళ్ల సాక్ష్యమిచ్చుచున్నది. 'కాకతీయసామ్రాజ్య మంతరించిన వెనుక మోటుపల్లి యందుండెడి వర్తకులు పరస్థలములకు బోవుటయు, నందువలన వ్యాపారము తగ్గుటయు దటస్థించెను.' అనపోతారెడ్డి యారేవు పట్టణమును వృద్ధికి దీసికొని రావలయునని శ్రద్ధతో సంకల్పించెను. అంతట నాతడు తనకు ప్రతినిధిగ మోటుపల్లిని బాలించుచుండిన సోమయామాత్యునిచేత, వర్తకమెట్లయినను మరల వృద్ధిలోనికి వచ్చుటకు మార్గముల నన్వేషించి, యభయశాసనమొకటి ప్రకటింప నాజ్ఞాపించెను. సోమయామాత్యు డట్లే యొక శాసనమును శాలివాహనశకము 1280అగు విళంబి సంవత్సర శ్రావణ శుద్ధ అష్టమి మంగళవారము (క్రీ శ.1358) నాడు బ్రకటించెను. ఆ శాసనమిపుడు మోటుపల్లి గ్రామమున వీరభద్రస్వామి యాలయమున, నొక మంటపస్తంభముపై లిఖింపబడి గాననగుచున్నది[1]. ఈ శాసనము సంస్కృతాంధ్ర భాషలయందేగాక, అరవమందుగూడ బ్రకటింపబడియున్నది. ఈ విషయము మోటుపల్లి రేవునందు ద్రావిడవర్తకులు కూడ నుండినట్లు దెలుపుచున్నది ఆ శాసనస్తంభముమీద సంస్కృతాంధ్రములందు వ్రాయబడిన శాసనమిట్లున్నది.

*"స్వస్తిశ్రీ శకవరుషంబులు ౧౨౮౦ అగునేంటివిళంబిసంవత్సర శ్రావణశుద్ధ ౮ మంగళ్వారం స్వస్తిశ్రీ మతు అనపోతయరెడ్డింగారు మోటుపల్లికి కాపువచ్చిన వ్యవహారులకున్ను వ్యవహారంవచ్చే కరపట్టాల ద్వీపాంతరాల వ్యవహారులకున్ను ఇచ్చిన ధర్మశాసనం॥ ఈమోటుపల్లికి ఎవరు కాపువచ్చినాను వారినివమన్నించి పెట్టుకొని వుండువారము వారికి భూమితోటి కాణాచి యిచ్చేవారము వారు ఎప్పుడు మరివొక తావుకు పోయేమన్నాను కాపని పట్టక అనిపివుచ్చువారము ఏ వూరిసరకులు దెచ్చినాను తమ విచ్చలవిడి నమ్మవలసినట్టు

సరకు గొనువారంగాని పోగావునకు వలసిన సరకు ఆడపెట్టము చీరాను గండము పవడము పరదేశవ్యవహారాలకున్ను అపుత్రికమున్ను సుంకాదాయమున్ను మానితిమి బంగారు సుంకము మానితిమి గంధవుయెుక్క (వచ్చు) బడిసుంకము పూర్వ మర్యాదలోను మూటను ఒకటి మానితిమి తీరిన సరకులకున్ను మెట్టసుంకాలు పూర్వ మర్యాదక్రమాననె కొనువారము ఈక్రమానకు సర్వమయినవారున్ను విశ్వసించివచ్చే వెరగువారికెల్లాను అభయహస్తముగనిస్తిమి.

''జయతి నయవిశాలః ప్రత్యహందానశీలః
కృతబుధపరిపాలః సంగడిరక్షపాలః
అహితమతికృశానుర్వేమభూపాల సూనుః
స్తుతకవితమహీశా అన్నపోతక్షితీశః''

''శాకాబ్దేగగనాష్టసూర్య్యగణితే తీరేమహాంభోనిధేః
ప్రఖ్యాత ముకుళాహ్వయే పురవరే శ్రీసోమమంత్రీశ్వరః
మర్యాదానకరోజగజ్జనసుతాంసాంయాత్రికాణామిమాం
కీర్తిర్వేమయ అనవోతనృపతేః ఆచంద్రమాతారకం॥

''అన్నవోత మహీపాలా శాసనార్థతభూషణం
స్థాపితః శాసనస్తంభః సోమయామాత్యధీమతా॥''

★ ఈ శాసనమింకను ప్రభుత్వమువారిచే బ్రకటింపబడలేదు పలువురు పలువిధముల శాసనమూలమును జదువుచున్నారు కావున మాకు తోచినరీతి జదివి యిచ్చుట ప్రకటించితిమి

ఈ శాసనమించుమించుగా నూఱు సంవత్సరముల క్రిందట గణపతి దేవ చక్రవర్తిచే నీయబడిన అభయశాసనమును దలంపునకు దెచ్చుచున్నది. మోటుపల్లిలో గాపురముండు వ్యవహారులకున్ను (వర్తకులు) యితర పట్టణముల నుండియు, ద్వీపదేశాంతరములనుండియు వ్యవహారము కొఱకు (వర్తకము) వచ్చెడి వ్యాపారులకున్ను అనపోతారెడ్డి క్రొత్తగా నీ ధర్మశాసన మిచ్చియుండెను. క్రొత్తగా నిట్లు శాసనము బ్రకటించుటకు బ్రోత్సహించిన పరిస్థితు లెవ్వియో ఊహించుకొనుటకు తగిన ప్రమాణ మెచ్చటను స్పష్టముగ జెప్పబడలేదు. అప్పటికి వర్తకము క్షీణదశలో నుండవలయును, లేదా యభివృద్ధిలోనుండిన దానిని ప్రోత్సహింప నావశ్యకతయైన గలిగి యుండవలెను మోటుపల్లి జయింపబడి యప్పటికి పది సంవత్సరవములై యుండెను. ఆ పట్టణ మభివృద్ధిపఱచి వర్తకమును పెంపొందింప సంకల్పించుటకు ముందే దేసటి

వేమారెడ్డి మరణించెను. తండ్రి సంకల్పించినదానిని అనపోతారెడ్డి యాచరించి యుండును తండ్రి సంకల్పించియుండిన దాని నంతయు బూర్ణముగ నెఱవేర్చుటకు నాతనికిగూడ సావకాశము లేకపోయెను అనపోతారెడ్డి మంచి రాజనీతివేత్తయగుటచే వర్తకవరాతనికి బాగుగా తెలిసియుండెను. దేశాభ్యుదయమున కెట్టి వర్తక పరిస్థితు లావశ్యకములో యెఱింగిన ట్లాతనికి గణపతి దేవచక్రవర్తియే సాటి. ఈ కారణముల వలన అనపోతారెడ్డి ధర్మశాసనము చాల విశాలదృష్టితో నొసంగబడిన ట్లూహింపవలయును.

అతడు తన శాసనమందు వ్యవహారు లేదేశమునుండి వచ్చినను, మన్నించి, నిర్భయముగా నిరాటంకముగా వ్యాపారము చేసికొననిచ్చువాడనని యభయమిచ్చియుండెను. వర్తకులు దాము కాపురముండుటకును, సరకులను నిలువజేసి యుంచుటకును వ్యాపారవము చేసికొనుటకును వలయు గృహనిర్మాణమునకై భూమిని, నివేశనములను ఇచ్చువాడనని దెల్పెను వారికి భూములేగాక వాటియందు చిరకాలానుభవమువలన గలుగు స్వామ్యములతో (కాణాచి) గూడ నిచ్చువాడ నని యాశపెట్టెను వ్యవహారు లేదేశమునుండి యేసరకుల దెచ్చినను వానిని వలదనిగాని బాధలుకలిగించిగాని నిర్బంధపెట్టక వారిసరకులను స్వేచ్ఛగ నమ్ముకొననిచ్చువాడ నని ప్రకటించెను. సుంకములకై, యెగుమతి కావలసిన సరకు నడ్డుపెట్టనని వాగ్దానమిచ్చెను. వ్యాపారులు కారణాంతరములచే మరియొక స్థలమునకు బోవవలసినవుడు వారినడ్డుపెట్టక వారి యిష్టమువచ్చినరీతి వచ్చుటకును, బోవుటకును స్వతంత్ర్యమిచ్చెను. చీరాను (ముత్యముల సరములు) గండము (ఏనుగు దంతములు) పవడమును (పగడము) తెచ్చు పరదేశవర్తకులకు నా సరకులపై 'అపుత్రికమునను, సుంకాదాయమును' మానివేసితి ననెను బంగారముపై సుంకము తీసి వేసెను. శ్రీగంధముపై శుల్కము పూర్వముకంటె తగ్గించెను. దిగుమతి యగుచుండిన సరకులపై పూర్వపు మర్యాదను మార్చి రావలసిన సుంకములోనుంచి మూడవ పాలు మానివేసెను తక్కిన సరకులకు సుంకము లెప్పటి యట్ల పూర్వపుమర్యాద ననుసరించి కొనువాడననెను. తా నిచ్చిన అభయశాసనమును బురస్కరించు కొని తనయందు విశ్వాసముగల్గి యా రేవునకు రాదలచిన విదేశవర్తకుల కెల్లరకును అనపోతారెడ్డి మనఃపూర్వకముగ స్వాగత మొసంగెను.

అనపోతారెడ్డి యొక్క శాసనమంతయు జదివిన వారికి నతడెట్లయిన యా రేవుపట్టణము నభివృద్ధిలోనికి దీసికొనివచ్చి దేశ దేశాంతర, ద్వీప ద్వీపాంతర పట్టణముల తోడను సముద్రవాణిజ్యము పెంపొందింపవలయునని

మనస్ఫూర్తిగ సంకల్పించుకొని జేసిన బ్రయత్నమని స్పష్టముగ బోధపడును. అతని శాసనమునందలి పరమార్థము, తనరాజ్య మితరదేశములతో స్వచ్ఛందవాణిజ్య పద్ధతిని వ్యాపారము చేసికొని యైశ్వర్యముతో తులతూగుచుండునటుల చేయుటయే యని గ్రహింపవలయును గణపతిదేవ చక్రవర్తి వర్తకమును రక్షణపద్ధతి నవలంబించి దిగుమతి సరకులపై నెక్కువ సుంకములను విధించెను ఎగుమతి సరకులపై సుంకముల నిర్ణయింపలేదు. అనపోతారెడ్డి యట్లుగాక దిగుమతిసరకులపై 'అపుత్రికమును, సుంకాదాయమును' మానితినని అభయమిచ్చెను. విదేశవర్తకులు తమ యిచ్ఛవచ్చిన తెఱగున పోవుచు వచ్చుచుండుటకు సదుపాయము లనేకములు గల్పించెను.

ఈ శాసనమందు వివరింపబడిన సుంకముల నామములు చరిత్ర కారునకు మిక్కిలి యుపయోగకరములైనవి. వాని వివరమును, అర్థమును, స్వభావమును నిర్ణయించుటకు దగిన ప్రమాణము లింకను లభింపలేదు. మహమ్మదీయ ప్రభుత్వమునకు బూర్వము దేశమున చెల్లుబడి యగుచుండిన సుంకములు మొదలగు విషయము లింకను బరిశోధింపబడవలయును. అయినను 'అపుత్రికము' గణపతిదేవుని క్లుప్తశుల్కము వంటిదనియు 'మెట్టసుంకాలు' నాటునుండి యెగుమతి కాబడు సరకులపై సుంకములనియు 'సుంకాదాయములు' దిగుమతి సరకులపై పన్నులనియు నూహింపవచ్చును.

అనపోతారెడ్డికి దరువాత గూడ నాంధ్రదేశమున నౌకావ్యాపార మభివృద్ధిలో నుండినటు లనేక దృష్టాంతరములు గానవచ్చుచున్నవి. అనపోతా రెడ్డికి దరువాత రాజ్యపాలనము చేసినవాడు అతని సోదరుడగు అనవేమ భూపాలుడు. అనపోతారెడ్డి కుమారుడు కుమారగిరి రెడ్డి బాలుడగుట చేత శౌర్యవంతుడును సమర్థుడు నగు అనవేముడు ప్రజాపాలనము గావించుట తటస్థించెను అనవేముడు క్రీ.శ.1362 మొదలుకొని 1380 వఱకును పరిపాలించి, మరణించెను అతని వెనుక కుమారగిరి భూపాలుడు రాజ్యభారము వహించెను కొండవీటిరాజ్యమున కీతనితో దుర్దినములు ప్రారంభమయ్యెనని చెప్పవచ్చును. ఈతడు రాజకీయవిషయములందు ప్రమత్తతతో నుండుటచే కర్ణాట ప్రభువగు రెండవ హరిహరరాయలు తన రాజ్యము నుత్తరముగా విస్తరింపజేయగల్గెను. అనవేముడు మరణించిన తరువాత, కుమారగిరి రాజ్యమునకు వచ్చునంతలోపల మూడు సంవత్సరముల కాలమువఱకు రాజ్యరక్షణముచేయగల దక్షుడెవ్వడును లేమిచే, రెండవ హరిహరరాయలకు

మంచితరుణము దొరకెను. ఆకాలమున మోటుపల్లి నగరము విజయనగర చక్రవర్తుల యధీనమయ్యెను వేమారెడ్డి కాలమున జయింపబడి అనపోతారెడ్డి అనవేమారెడ్ల చే నభివృద్ధికి దేబడిన మోటుపల్లి వర్తకపు టైశ్వర్యము వారికి మోహము గొలుపజాలెను మోటుపల్లిని స్వాధీనపఱచుకొనిన తరువాత రెండవ హరిహర రాయలు, తన కుమారుడగు దేవరాయ వొడయలును దనకు బ్రతినిధిగ నా నగరమును పాలింప నియమించెను. పూర్వపురాజులవలె దేవరాయ వొడయలును మోటువల్లి వర్తకులచేతిలోనుండిన విదేశ సముద్రవాణిజ్యమును మంచిస్థితిలో నుంచుటకు జాలప్రయత్నములు చేసియుండినటుల తెలియవచ్చుచున్నది. ఆతడు మోటుపల్లిని పరిపాలించుచుండిన కాలమున క్రీ.శ.1390వ సంవత్సరమున మోటుపల్లి యందుండెడి వర్తకుల కొక ధర్మశాసనమును బ్రకటించి యుండెను[2]. ఆ శాసనమందిట్లున్నది.

''స్వస్తిశ్రీ శకవరుషంబులు ౧౩౧౨అగునేటి దుర్ముఖి సంవత్సర మాఘశుద్ధ ౧ శుక్రవారము స్వస్తి శ్రీమన్మహారాజాధిరాజ రాజపరమేశ్వర చతుస్సముద్రాధీశ్వర హరిహరరాయకుమార దేవరాయ ఒడయలు మోటుపల్లికియిచ్చిన ధర్మశాసనము. వోడ దిగిన సరకులకు సుంకాలు· మోటుపల్లి పట్టణమర్యాదలు ఎప్పటికి ఎన్ని సరకులుదిగిన అయిదు లెఖ్ఖ ఆయం పసిడికవ్వటి. దిగుమతిసరకులకు గరిశవకటింటికి యెనిమిది సుంకములు రాజకరుకను అరువల్లాలు. యేంబది పగడాలకట్టకు అయిదురూకలున్ను అడ్డిగ పడమట . .ల్ఖ్ఖ తాపులు నేయించేవారికి తోపు మీద వెలచేసి యెనిమిదిచేసి తరుగు నూటికి రూకను పెట్టి ఆయాలకు జారిపదింటికి ఒక్కటి ముద్రసరకునకు రెండుకాసులు, పొన్నూరి వెల్లపచ్చడాలకున్ను ఈమర్యాదను. సన్నచీరెకు సారూపానకు నాలుగుకాసులు కయికాలచీరె సారూపానకు కాసు. రొఖ్కము రాచవారుకొని అందు మూఁడవపాలు దేవరాజవొడయలు బడయుదురు!''

అనపోతారెడ్డి శాసనములోని భాషవలె నీ శాసనములోని భాషయు జాలవఱకు నా కాలపు వర్తకులు వ్యవహరించెడు పదములతో నిండి చదువువారికి చక్కగా నర్థము గాకున్నది. ఐన నిందొక విశేషము గన్పట్టుచున్నది. పూర్వపు రెడ్డిరాజులు హీనస్థితియందుండిన వర్తకము నెట్లయిన అభివృద్ధిపఱచుటకు బ్రయత్నించియుండిరి. అందువలన దిగుమతిసరకులపై సుంకములను పూర్వపుమర్యాదలకంటె తగ్గించి యెట్లయిన వర్తకులను రావించుటకై పాటుపడి యుండిరి కావున గణపతిదేవునివలె అనపోతారెడ్డి శాసనమునందు యెగుమతి

సరకులపై శుల్కపరిమాణమును విధించి యుండలేదు ఇక దేవరాయ వొడయలు కాలమునాటికి విదేశవాణిజ్యము మంచి స్థితి యందుండుటచేత గాబోలు ఆతడు దిగుమతి సరకులపై మోటుపల్లి మర్యాదలు యెప్పటియట్లయని ప్రకటించి పిదప యెగుమతి సరకులపై శుల్కమును నిర్ణయించెను దేవరాయలు, క్రొత్తగా మోటుపల్లిని స్వాధీనపఱచుకొనిన వాడగుట వలన ముందుగా తన శాసనమందు వర్తకులకు దమవ్యవహారములను గురించి యభయ మొసంగెను. అనపోతారెడ్డి నిర్ణయించిన దిగుమతి సరకులమీద సుంకములు దేవరాయలు ఏమికారణముననో కొంచెము మార్చియుండెను అట్టిసరకులలో బంగారమొకటి. దిగుమతియైన బంగారముపైన అనపోతారెడ్డి సుంకము మాని యుండ దేవరాయలు ఐదవపాలు ఆయము విధించెను దిగుమతియగుచుండిన యితరసకులకు 'గరిశ' పరిమాణమునుబట్టి రేవులో నిల్వజేసికొనినందులకు 8 వరహాల నీయవలసిన దనియు నందాఱువరహాలు తనకు చెందవలయునని శాసించెను ఏబది పగడాల కట్టకు అయిదున్నర రూకలు సుంకము నిర్ణయించెను ఇవిగాక యెగుమతి సరకులపై సుంకములుకొన్నింటిని నూతనముగా బేర్కొనెను దేశాంతరముల కెగుమతి చేయుటకై నేయింపబడిన రత్నకంబళములపై మొత్తముమీద వెలచేసి, దానిని ఎనిమిది భాగములు గావించి యంత నూటికొక రూక తరుగుపెట్టి, మిగిలిన వెలమీద పదివరహాల కొకరూక చొప్పున సుంకమీయవలసినదని విధించెను. ముద్రసరకునకు స్వరూపమునకు రెండుకాసులు విధించెను. ముద్రసరకనగా నెట్టిదియో గ్రహింప వీలుగాకున్నది, గాని అద్దకపుగుడ్డలైన గావచ్చును పొన్నూరి వెల్లపచ్చడాలకు (బంగారు సరిగవేసిన తెల్లబట్టలు) ముద్రసరకు మర్యాదను స్వరూపమునకు రెండుకాసులు నిర్ణయించెను. ఇట్లే సన్నచీరెలకు స్వరూపమున కొక్కంటికి నాలుగు కాసులును, కయికాల చీరెలకు (పట్టునూలు చీరెలు) స్వరూపమున కొక్కంటికి ఒక కాసును విధించెను ఈ సుంకములు రాచవారు రొక్కముతీసి యందు రెండుభాగములు తాముగ్రహించుచు మిగిలిన మూడవపాలు రాజునకు జెల్లింపవలయునని దేవరాయ వొడయలు శాసించెను.

మోటుపల్లి నగరము కర్ణాటాధీశుల వశమయిన వెంటనే స్థలాధి కారులందు గూడ మార్పులు గలిగెనని యూహించుట కీశాసనము వలన అవకాశము గలుగుచున్నది ఇదివఱకు రెడ్డిరాజుల కాలమున నా పట్టణము నేలుటకు నియోగి బ్రాహ్మణులు మంత్రులుగ నియమింపబడుచుండ, నిపుడేలకో కాకతీయుల కాలమందువలె రాచవారు (క్షత్రియులు) నియమింపబడ నారంభించిరి.

ఈ శాసనమున మఱియొక నూతన విషయముగూడ పొడకట్టుచున్నది. కాసులను నాణెములిందు బేర్కొనబడి యున్నవి ఇవి రూకలకంటె చిన్న నాణెములని యూహింపవలయును. రూకలవలె కాసులుగూడ రాగినాణెములు గావలయును విజయనగర సామ్రాజ్యకాలమున వ్యవహారములో నుండిన నాణెములు వరహాలనియు, రూకలనియు, కాసులనియు బరగుచుండెను. వరహాలను దీనారము లని జనులు బిలచుచుండిరి. అవి బంగారు నాణెములు ఒక వరహాకు రాజమర్యాదను నలుబది రెండు రూకలు వచ్చుచుండెను కాని మారకపు రుసుము అన్ని ప్రాంతములం దొక్క రీతిగ నుండని కారణమున కొన్ని తావులందు వరహాకు 40,41 రూకలు మాత్రము యిచ్చుచుండిరి ఒక రూకకు ఎనుబది కాసులచొప్పున నిచ్చుచుండిరి

రెండవ హరిహరరాయల మరణానంతరము తిరిగి మోటుపల్లి ప్రాంతము కొండవీటి రెడ్డిరాజుల యధీనమయినట్లు శాసనములవలన దెలియవచ్చెడిని ఇట్లు కొంతకాల మొకరి పాలనముక్రిందనుండి మరియొకరి పరిపాలనముక్రిందకు మారుచుండినను, మోటుపల్లి వర్తక మెప్పటియట్ల నిరాఘాటముగ సాగుచునే యుండినట్లు దృష్టాంతరములు గలవు ఆకాలమున నాంధ్రదేశమున విదేశములతోడి వ్యాపారము సముద్రముమీద జరుగుచుండినటుల శ్రీనాధ కవిసార్వభౌమ కృతమగు హరవిలాసము వలన దెలియవచ్చుచున్నది శ్రీనాధుడు చాలకాలము రెడ్ల యాస్థానకవిగ నుండుచు పెదకోమటివేమ భూపాలుని కొల్వున విద్యాధికారిగ నుండెను శ్రీనాధుడు తన హరవిలాసమును కుమారగిరి రెడ్డికి సచివుడును, మిత్రుడును, సుగంధభాండాగారాధ్యక్షుడునగు అవచి తిప్పయ (త్రిపురారి) సెట్టికి గృతియిచ్చెను. అవచి తిప్పయ సెట్టి తండ్రితాతలు వాణిజ్యమునందు ప్రఖ్యాతి గాంచినట్టి సుప్రసిద్ధ వర్తకులు, జగజెట్టులని ప్రఖ్యాతిగాంచిన వారు తిప్పయ సెట్టి హరివంశ కృతిపతి యగు వేమారెడ్డికి సమకాలీనుడగు అవచి దేవయ సెట్టికి గుమారుడు. కుబేర సమానుడగు నా దేవయ సెట్టి వేమారెడ్డికి నెంతయు బ్రాపుగనుండెనట

అవచి తిప్పయ సెట్టి వంశాభివర్ణనము చేయు సందర్భమున శ్రీనాధుడు తనకాలమున అత్యంత వైభవములో నుండిన అవచివంశమువారి విదేశవ్యాపారమును మనోహరముగ వర్ణించి చరిత్రకారున కత్యంతోప కారియయ్యెను మహాకవియగు నాతని హరవిలాసకృతి లేకుండిన జగజెట్టులని ప్రఖ్యాతిగాంచిన యా అవచివంశచారిత్రము కూడ నితర ప్రసిద్ధ వైశ్యకుటుంబముల చరిత్రములతో బాటు మనకు దెలియ కుండెడిదిగదా!

కుమారగిరి రెడ్డి వసంతోత్సవప్రియుడై యుండి రెడ్డి రాజులందఱికన్న నెక్కుడు శ్రద్ధతో వసంతోత్సవముల జరపు చుండెను కుమారగిరి రెడ్డి జరపెడి వసంతోత్సవములందీ తిప్పయ సెట్టి యెక్కువగా దోడ్పడుచు బ్రఖ్యాతిగాంచెను ఈతడు ప్రతిసంవత్సరమును వసంతోత్సవమునకు వలసిన కస్తూరీ, కుంకుమ, ఘనసార, సంకుమద, హిమాంబు, కాలాగురు, గంధసార ప్రభృతి సుగంధ ద్రవ్యములను నానాదేశముల నుండి తెప్పించుచు నొడగూర్చు చుండెను ఇంతియగాక తరుణా, చీని, సింహళ, తవాయి, హురుమంజి, జలనోగి మొదలగు నానాద్వీప నగరాకరంబులగు ధన కనకవస్తువాహన మాణిక్యగాణిక్యంబుల తెప్పించి యిచ్చుచుండెను అవచి తిప్పయ సెట్టికి చామి సెట్టి, తిరుమల సెట్టి యను నిరువురు సోదరులుండిరట వీరిరువును దమ సొంత యోడలలో సముద్రప్రయాణము చేయుచు, నానాదేశద్వీపాంతరముకు బోయి కర్పూర పాదపములు, బంగారు మొలకలు, సంకుమద ద్రవములు, అణిముత్యములు, కస్తూరికాటంకములు, చీనా చీనాంబర శ్రేణి, గంధసింధురములు, తేజిరుహరులు మొదలుగాగలవాని నాంధ్ర దేశమునకు గొనివచ్చు చుండిరట. శ్రీనాథు డీవిషయముల నీ క్రిందిపద్యములం దతిమనోహరముగ వర్ణించియున్నాడు

*''సీ. పంజాబుకర్పూర పాదపంబులుతెచ్చి*
*జలనోగిబంగారు మొలకఁదెచ్చి*
*సింహళంబున గంధసింధురంబులు తెచ్చి*
*హురుమంజి బలుతేజి హరులుతెచ్చి*
*గోవసంశుద్ధ సంకుమద ద్రవము తెచ్చి*
*యాపగనాణిముత్యాలు తెచ్చి*
*చోటంగి కస్తూరికాటంకములు తెచ్చి*
*చీనిచీనాంబర శ్రేణిఁదెచ్చి*

*గీ. జగదగోపాలరాయ వేశ్యాభుజంగ*
*వల్లవాదిత్య భూదానపరశురామ*
*కొమరగిరిరాయదేవేంద్రు కూర్మిహితుఁడు*
*జాణజగజెట్టి దేవయచామి సెట్టి''*

*''మ తరుణా చీని తవాయి గోవ రమణాస్థానంబులం జందనా*
*గరు కర్పూరహిమాంబుకుంకుమరజఃకస్తూరికాద్రవ్యముల్*
*శరధిం గప్పలి జోగులన్ విరివిగా సామ్రాజ్ఞ దెప్పించు నే*
*ర్పరియౌ వైశ్యకులోత్తముండవచితిప్పండల్పుఁడేయిమ్మహిన్.*

*''గీ పండువా, ఢిల్లి, రాఢాదిపట్టణముల*
*నధిపతులు మౌళిఁదాల్చు రత్నాంకురంబు*
*లవచిత్రిపురాంతకా నీతయానపాత్ర*
*సింహళద్వీపమండలక్షేత్రజనులు ''*

పై మొదటిపద్యములో దెల్పబడిన జలనోగి బహుశః పెగూ దేశమై యుండవచ్చును పెగూ దేశమునకు జిరకాలము నుండియు సువర్ణభూమియని బేరుగలదు అంతియగాక, పెగూ దేశమున కుత్తరప్రాంతమునుండి బంగారు ఇసుక హిందూదేశమున కెగుమతి యగుచుండుట చరిత్ర ప్రసిద్ధము 'హురుమంజి' పారశీక సింధుశాఖపై నున్న ప్రసిద్ధికెక్కిన హోర్మజ్‌నగరము. ఇచ్చటినుండియే హిందూదేశమునకు బ్రాచీనకాలమునుండియు మేలైన యుత్తమాశ్వములు గొని రాబడుచుండెను. గోవ హిందూదేశమునకు బశ్చిమతీరమున నున్నది అపగనాణిముత్యములనుటచే, బురాణ ప్రసిద్ధమగు శుక్తిమతీనదిలో దొరకు మంచిముత్యము లనవలయును, గాని యా శుక్తిమతి యను నది ఎచ్చటనున్నదో నిర్ణయింపజాలము, కాని పాంబన్ జలసంధి చిరకాలమునుండి ఆణిముత్యాలకు బ్రసిద్ధికెక్కియున్నది తరుణానగరము పారశీకదేశపు రాజధానియగు టెహరాన్ గావచ్చును, గాని యిదమిద్ధమని నిర్ణయింప వీలుగాదు. చోటంగి వంగదేశములోని చిటగాంగు గాని, బర్మా దేశములోనిదిగాని గావచ్చును. చీనా దేశము దొలుతనుండి కర్పూరమునకు బ్రసిద్ధిజెందియుండుట వలన యెల్లరకు దెలిసియే యున్నది తవాయి పట్టణము బర్మాదేశములో తవాయి నదిపై నున్నది. ఇచ్చటనుండి హివూంబు కుంకుమరజములు గొనిరాబడుచుండెను పండువా నగరము గంగానదీ ముఖద్వారమున నుండి, బౌద్ధయుగమున గొప్ప వర్తకస్థానమని ప్రఖ్యాతిగాంచెను ఇక రాఢా యను పేరేనగరమునకు వర్తించునో నిర్ణయింప సాధ్యముగాకున్నది. శ్రీనాథుడీ పద్యములందు తన కాలమున వర్తకు లుపయోగించెడి వివిధములగు నోడల నామములు దెలిపియున్నాడు. 'కప్పలి' సామాన్లు గొంపోయెడి యోడ యనియు 'జోగు' జనులు ప్రయాణము చేయుట కుపయోగించెడి యోడ యనియు నిచ్చట దెలియవచ్చుచున్నది.

శ్రీనాథుడిట్లే తనగ్రంథములం దాకాలమున నిస్సంశయముగా నభివృద్ధిలోనుండిన సముద్రవాణిజ్యవైభవమును నౌకాయానమును వర్ణించుచు సూచించియున్నాడు. ప్రత్యక్షముగ దాను చూచియుండిన దేశపరిస్థితులను తన కృతులందు సమయోచితముగా జొప్పించి చరిత్రకారునికి దోడ్పడుటలో

శ్రీనాథు డగ్రణ్యుడు. ఈతడు తన శివరాత్రిమహాత్త్వము నందొకచోట[3] వర్తకుని కవికిని, సముద్రమును కవిత్వమునకును, నౌక కవిజిహ్వకును, రత్నములను మృదుభాషలకును బోల్చి మనోహరముగా పద్యము రచియించియున్నాడు ఇట్లే కాశీఖండమునం దొకచోట[4] సముద్రపు మొగయందు అలలందు చిక్కువడి వెనుకకును ముందుకును నడవజాలక చిక్కువడుచుండు ఓడకు సూర్యుని బోల్చి యున్నాడు పదునాలుగు పదునైదవ శతాబ్దపు పరిస్థితులిట్లు శ్రీనాథుని కవితావాహినియందు చరిత్రకారునికి లభించుటెంతయు నదృష్టము

రెడ్డి, విజయనగర సామ్రాజ్యకాలమున, మోటుపల్లి ప్రసిద్ధమగురేవుగా నుండిన కారణమున సుప్రసిద్ధవర్తకు లిక్కడకు నానాదేశములనుండి సరకుల దెప్పించుచు బహమనీరాజ్యము లోనికిని, కర్ణాట దేశములోనికి నెగుమతిచేయు చుండిరి ఇట్టి మోటుపల్లి వర్తకపు టైశ్వర్యము పదునైదవ శతాబ్దముతో నశించిపోయెను రెడ్డిరాజ్యము బలహీనమయి తుదకు నాశమొందుటయు, మోటుపల్లి రేవు పాడయిపోవుటయు, నించుమించుగ నేకకాలమున దైవికముగ సంభవించెను.

కుమారగిరి రెడ్డి మరణానంతర మాతని సోదరిభర్తయగు కాటయ వేముడు తన బావవలన బడసిన రాజమహేంద్రవర రాజ్యమును స్వతంత్రముగ బరిపాలింప నారంభించెను కుమారగిరి, రెడ్డిరాజ్యక్షేమ మెఱుంగజాలక, తన రాజ్యములోనుండి కొంతభాగము విడదీసి బావమఱదికి నొసంగియుడుటచే రెడ్డిరాజ్యము క్షీణించిపోవుట తటస్థించెను. కుమారగిరి మరణానంతరము కొండవీటి వారికిని, కాటయవేమునికిని బరస్పరవైరములు వృద్ధియయ్యెను. కొండవీటిరాజ్యము కోమటివేమా రెడ్డికి (1400-1420) దరువాత చెల్లాచెదరై కర్ణాటుల వశమయ్యెను కాటయవేముని రాజ్యముగూడ అల్లాడ వేమా రెడ్డి, వీరారెడ్ల పరిపాలనమున నొక యర్ధశతాబ్దము వఱకు నిలచియుండి క్రీ శ.1450వ సంవత్సర ప్రాంతమున నొక ప్రక్క ఒడ్డిగజపతుల దండయాత్రలకును, మఱియొకప్రక్క తురుష్కులతోడి పోరాటములకును జిక్కి త్వరలో గజపతులకు లొంగిపోయి నామమాత్రావశిష్ట మయ్యెను.

అంత నెల్లూరి కడనుండి, విశాఖపట్టణము వఱకు గల యాంధ్రదేశము జీవకళదక్కి కొంత రెడ్డినాయకుల పాలనమునను మరికొంత యొడ్డిరాజుల ప్రభుత్వముక్రిందను, మిగిలినది కర్ణాట రాజుల క్రిందనుండుటయు తటస్థించి ఎల్లవేళల నశాంతితోడను రాజకీయవిప్లవములతోడను దారుణవధలతోడను నిండిపోయెను పదునైదవ శతాబ్దమునందు బహమనీ సుల్తానులును, వారి వెనుక

గోల్కొండ నవాబులు నీప్రాంతమునంతయు తమ పాలనమున నొకకడకు దీసికొని వచ్చిరి ఈ నడుమ కాలమున విదేశవాణిజ్యమును బోషించి ప్రోత్సహింప సమర్థులగు హిందూరాజులు లేకుండులచే అది క్షీణించెను అదియునుగాక మోటుపల్లి రేవు దగ్గర యుప్పుటేఱు కాలవశమున మెఱక పట్టిపోవుచుండుటచే నారేవు పట్టణమునకు వర్తకపుటోడలు రాకపోకలు సలుపుటయు మానుచుండెను ఈ రెండుకారణములవలనను మోటుపల్లి పదునైదవ శతాబ్దారంభమునుండియు వర్తకస్థానముగ నుండదయ్యెను

బహమనీ సుల్తానులును, గోల్కొండ నవాబులును పూర్వాంధ్రదేశము సముద్రయానమునకును విదేశవాణిజ్యమునకును ప్రాచీనకాలమునుండియు ప్రసిద్ధివడసియుండు టెఱింగి విదేశములతోడి వ్యాపారమును వృద్ధిపఱచి యుండిరి ఈ మహమ్మదీయ ప్రభుత్వకాలముననే కృష్ణానదీ యుత్తర ముఖద్వారమున కించుకనుత్తరముగా నొక రేవుపట్టణములేచి యచిరకాలములో మహానగరమయ్యెను ఆ మహానగరమే మచిలీపట్టణ మనియు బందరనియు వ్యవహరింపబడుచు గోల్కొండనవాబుల పోషణము క్రింద మహావర్తకస్థానమై యలరారి నాలుగు శతాబ్దముల కాల మత్యంత వైభవమును దిలకించి ఖండఖండాంతరములందు ప్రఖ్యాతిగాంచియుండెను.

జ్ఞాపికలు :

1 Epigraphical Reports, 1910, page 118, See also Local Records Vol 42 pages 423-425

2 Epigraph No III-A of 1909, See also Local Records, Vol 42, pages 422-3

3 చ. కవికవితాబ్ధిలోన ముఖగహ్వర మోడయు జిహ్వ త్రెడ్డు హ్వ
త్ప్రవనుఁడు పీలికాఁడు మృదుభాషలు రత్నము .
మాత్మవర్తకుని కైవడి నీకు విశేషసత్కృతుల్
గవయగ నిచ్చె నీవలన గావ్యసుఖస్థితి యిచ్చు గావుతన్
ప్రథమాశ్వాసము, 6వ పద్యము

4 వ మార్తాండుండు కొండప్రక్కంజిక్కి కడలిమొగ యక్కలిందగులువడిన జోగునుంబోలె నెదురునడవ మరలంబఱవలేక చీకాకుపడియున్న వాఁడు
కాశీఖండము, 2వ ఆశ్వాసము

# 10. అంత్యదశ

## క్రీ.శ. 1450 మొదలుకొని 1800 వఱకును

ఇంచుమించుగ పదునైదవ శతాబ్దముతో నాంధ్రదేశమున నూతన శక మారంభమయ్యెనని నుడువ వచ్చును రాచకొండ వెలమనాయకులును, కొండవీటి, రాజమహేంద్రవఱపు రెడ్డిరాజులును గ్రమక్రమముగా దమతమ రాజ్యములను గోల్పోయి, దేశరంగమునుండి నిష్క్రమించుటచే దేశమున స్వదేశరాజుల పరిపాలన మడుగంటి పోయెను విజాతీయులు, విమతస్థులు నగు తురుష్కులు, దేశద్రోహులగు గజపతులట్టి రాజుల సహాయమున దేశమున చంద్రధ్వజమును సుస్థిరముగ బాదుకొల్పగలిగిరి. ఎచ్చటనో దక్షిణమున విజయనగరాంధ్ర సామ్రాజ్యము మహోచ్చదశ యందుండెనను మాటయెగాని స్వదేశమున నాంధ్రుల ప్రతిభ మూలబడి పోయెను. స్వాతంత్ర్యము కొఱకును, స్వలాభముకొఱకు చిన్నదొర లవివేకులయి, సర్వదా యొకరితో నొకరు కలహముల బెంచుకొని దేశమునందు శాంతిలేకుండజేసి తుదకు ప్రజలకు పారతంత్ర్య మాపాదించియుండిరి ఆంధ్రసంతతి నొకప్పుడు, గొప్పవారినిగా జేయజాలిన గుణములన్నియు గ్రమక్రమముగా వారియందస్తమించియుండెను

ఇంక నిట్టి విపరీతపరిస్థితు లనేకములకు పదునైదవ శతాబ్దము సాక్ష్యమిచ్చెను. రెడ్డిరాజ్య మస్తమించిన వెనుక దేశమున బలిష్ఠమైన రాజ్యముగాని, దక్షతగలిగిన రాజవంశముగాని లేకుండుటచేసి, దేశమశాంతికి బాలయ్యెను. ప్రజలు నిస్సహాయులై యిడుమల బడ నారంభించిరి. సరియైన దొరతనము లేనప్పుడు లక్ష్మినివాసస్థానములగు వర్తకస్థానములును, రేవులును దుర్మార్గులగు నోడదొంగల కాటపట్టులయ్యెను పదునైదవ శతాబ్దముల కాలమును వర్తకలక్ష్మికాశ్రయమై పాశ్చాత్య చరిత్రకారులచే సయితము బ్రశంసింపబడిన మోటుపల్లి రేవు సముద్రుని యనుగ్రహమునకు దూరమయ్యెను. ఒక్క మోటుపల్లి యననేల, ప్రాచీన నౌకాశ్రయములన్నియు నీ కాలమున నిష్ప్రయోజనములయ్యెను లోతుగను, విశాలముగ నుండిన మోటుపల్లి యుప్పుటేఱు క్రమక్రమముగా నిసుకపడిపోయెను ఆ కారణమున నా రేవునకు మునుపటివలె నోడల రాకపోకలకు వీలు లేకుండెను.

ఇట్టి నూతన పరిస్థితులందు మనము ప్రాచీనాంధ్రసముద్రవ్యాపార చరిత్రమునందు కడపటిరంగమున బ్రవేశించుచున్నాము ఈ కాలమున ప్రాచీనప్రశస్తిగలిగిన ఒక కళింగపట్టణము తప్ప మిగిలిన రేవునగరములన్నియు వెనుకబడిపోయి గణనకు రాకుండెను పూర్వపు నగరములకు బదులుగా క్రొత్త రేవు లనేకములు ఈ కాలమున బయల్పడెను వానిలో కృష్ణామండలములోని మచిలీపట్టనము, నరసాపురములును, గోదావరిజిల్లాలోని ఓడలరేవు (బెండమూరులంక), కోరంగి, తాళ్లరేవులును, విశాఖపట్టణ జిల్లాలోని కళింగపట్టణము, విశాఖపట్టణములును ఎక్కువగా బ్రఖ్యాతిగాంచ గల్గెను ఈ నగరములన్నిటిలో మచిలీపట్టణమునకు, కోరంగి, తాళ్లరేవులకును వచ్చిన ప్రసిద్ధి యితర నగరములకు రాలేదు

తూర్పుతీరమున మోటుపల్లి రేవొక్కటి గొప్పవర్తక స్థానముగా నుండుటయు, అది వరుసగా స్వదేశపురాజుల స్వాధీనములో నుండుటయు, నా లాభమంతయు వారే బడయుటయు, బహమనీ సుల్తానులకు కొంచెము గష్టముగనుండెను వలసవచ్చిన మహమ్మదీయవర్తకులు మోటుపల్లి వర్తకుల పోటీకి నిలువజాలక, క్రమముగా సాహసించి, రెడ్డి, కర్ణాటరాజుల యనుగ్రహము చేతనేమి, బహమనీ సుల్తానుల ప్రోత్సాహము చేతనేమి కృష్ణానదియుత్తర ముఖద్వారమునకు గొంచెముత్తరముగా నొక యుప్పుయేటి యొడ్డున నొకవలస స్థాపింపగలిగిరి మొట్టమొదట నీవలస నెలకొల్పినది మహమ్మదీయులగు నరబ్బులు, పారశీకులును ఈ వలసస్థాపన మించుమించుగా పదునాలుగవ శతాబ్దాదిని జరిగియుండవచ్చును[1] ఆ వలసను తురకలు మచిలీబందరనియు, బందరని, మచిలీపట్టణమనియు బిలచుచుండిరి ఇంగ్లీషు, పరాసు వర్తకు లిచ్చట వర్తకశాలల నెలకొల్పినతరువాత నానగరమును మసూలిపటా మనియు, బందరనియు వ్యవహరింప నారంభించిరి మచిలీబందరు నిర్మింపబడినదాదిగా, బహమనీ సుల్తాను లా నగరమును తమ రాజ్యమునకు ప్రధానరేవును గావించిరి

మోటుపల్లిరేవు పడిపోయినతరువాత తూర్పుతీరమున మచిలీపట్టణము తురకల చేతిలో నుండుటచేత విజయనగర సామ్రాజ్యము, తన వర్తకము నంతయు పశ్చిమతీరమున కళ్ళికోట రేవునకు ద్రిప్పివేసియుండెను ఇందుల కుభయరాజ్యములవారికి గల సహజవైరము చాలవఱకు గారణము గావచ్చును. మోటుపల్లిరేవు పడిపోయిన తరువాత, ననగా పదునైదవ శతాబ్దపు ఉత్తరార్ధ కాలము నుండియు తూర్పున చీనాదేశము మొదలుకొని పశ్చిమమున పారశీక సింధుశాఖ వరకుగల దేశములతోడి సముద్రవాణిజ్య లాభమంతయు,

నించుమించుగ మచిలీపట్టణమందలి యరబ్బుల చేతులలోనికిని, పశ్చిమతీరమున కళ్ళికోట, సూరతు, గోవానగరవాసుల చేతులలోనికిని బ్రవహించెను మొదటి రోజులలో విజయనగరాధీశులు కళ్ళికోట రేవుమీదను, తరువాత కాలమున గోవాపట్టణపు బుడతకీచు వర్తకులమీదను ఆధారపడియుండిరి. విజయనగర రాజ్యమునకు కళ్ళికోట ప్రధాన రేవునగరముగ నుండుట తటస్థించినందున విజయనగర సామ్రాజ్య మభివృద్ధి నొందుకొలది కళ్ళికోట రేవుపట్టణముగూడ నభివృద్ధిలోనికి వచ్చియుండెను సామ్రాజ్యమునందలి వర్తకమంతయు, ప్రత్యేకముగ నీరేవుపట్టణపు వర్తకుల చేతులలో నుండుటవలన నా నగరపుటైశ్వర్యము పాశ్చాత్యులకు వెఱపును ఆశ్చర్యమును గల్గించి యుండెను ఆ నగర వర్తకవైభవమును గూర్చి క్రీ శ 1442వ సంవత్సరమున విజయనగర చక్రవర్తులకడకు పారశీకదేశము నుండి రాయబారిగా వచ్చిన అబ్దుల్ రజాక్ అనునాతడు కళ్ళికోటను మిక్కిలి ప్రశంసించియుండెను[2]. ఆతడు కళ్ళికోట ప్రపంచములోగల గొప్ప వర్తకస్థానములలో నొకటని వ్రాసెను 'ఇచ్చట విదేశర్తకులకు, దేశీయవర్తకులకు నోడదొంగలవలనగాని, దుర్మార్గులగు మండలేశ్వరులవలన గాని భయ మావంతయులేదు ఈ ప్రాంతమును బాలించు విజయనగర చక్రవర్తులు బహు సమర్థులగుటచేత నెట్టిధనవంతులైనను, యేదేశమునుండి యేతెంచుచుండినను నిస్సంశయముగను, నిర్భయముగను, యీ రేవునకు వచ్చి, తమసరకులను విచ్చలవిడి నమ్ముకొనుటకై దేశములోనికి గొంపోవుచుందురు రేవుపాలకు లిచ్చట నోడదిగిన సరకులకును, ఎగుమతి కావలసిన సరకులను, విలువపైన నూటికి నలుబదవపాలు సుంకవము తీయుచుందురు ఇచ్చటి వర్తకపద్ధతియంతయు కడు ప్రశంసనీయముగ నున్నది' యని అబ్దుల్ రజాకు విశేషముగ బ్రస్తుతించెను ఇట్టి వర్తకవైభవము విజయనగరసింహాసనమున సాళువవంశ మధిష్ఠించిన వెనుక విదేశీయులను వరించెను అప్పటికి బుడతకీచులు దేశమున గాలుపెట్టిరి. వారి గోవా నగరము దేశీయవర్తకుల కాలమందుకంటె యపుడు గొప్ప వర్తకస్థానమయ్యెను. బహమనీ, గోల్కొండ రాజ్యములతో బోరాటములందు కర్ణాటచక్రవర్తులు తమ యాశ్వికసైన్యము నభివృద్ధిచేయ దలచిరి వారికి గావలసిన యుత్తమాశ్వములు బుడతకీచులు, అరబీ, పారశీకదేశముల నుండి దెచ్చుచు, విజయనగరమున అమ్ముచుండిరి స్వలాభము కొఱకు బుడతకీచుల సహాయ మపేక్షించినవా రగుటవలన విజయనగర చక్రవర్తులు వారిని పోషించి వారికి సహాయము చేయనారంభించిరి ఆకారణమున కళ్ళికోట రేవుపై వారిదృష్టి సన్నగిల్లెను. అంతట గ్రమక్రమముగా నీరేవు వర్తకము పడిపోయెను పాలకుల

ప్రోత్సాహముగాని, సంరక్షణము గాని లేనికారణమున కళ్ళికోట రేవునకు విదేశవర్తకులు రాకుండిరి అదియునుగాక, తూర్పుతీరమున నించుమించుగ నా కాలమున మచిలీబందరు గూడ నభివృద్ధిలోనికి వచ్చి, వర్తకుల నాకర్షించుచుండెను తూర్పుతీరమున మోటుపల్లి స్థానము మచిలీబంద రాక్రమింపగలుగుటచే చీనాదేశము మొదలుకొని గల తూర్పుదేశముల వర్తకులందఱు మచిలీపట్టణ రేవునకే జేరుచు, వర్తకము చేసికొనుచుండిరి.

బహమనీసుల్తానుల ప్రాపకమువలన లేచి యభివృద్ధిగాంచిన మచిలీబందరు పదునాఱవ శతాబ్దారంభమునాటి కత్యంత వైభవమును దిలకించుచుండెను. బహమనీ రాజ్యము భగ్నమయినవెనుక వేంగీ కళింగ దేశములు (ఉత్తర సర్కారులు) గోల్కొండ కుతుబుశాహీ పరిపాలనము క్రిందకువచ్చెను. బహమనీరాజ్య స్థాపనారంభకాలము నుండియు మహమ్మదీయులకు, మహమ్మదీయ పుణ్యక్షేత్రము లగు మక్కా, మదీనా నగరములకు పయనము సలుపుటకు నోడల రేవొకటి అత్యంతావశ్యకముగ నుండెను. మక్కా, మదీనా నగరము లరేబియా దేశపు దక్షిణభాగమున గలవు. అక్కడకు బోవుటకై యోడయెక్కి అరేబియాసముద్రము దాటవలయును బహమనీ రాజ్యమునకుగాని, గోల్కొండ రాజ్యమునకుగాని పశ్చిమతీరమున యాత్రికు లోడయెక్కుటకు సొంతరేవు లేకుండెను అట్టితటి సుల్తానులు తూర్పుతీరము వారిరాజ్యమగుటచే నచ్చట సులభముగ రేవొకటి నెలకొల్పగలిగిరి. మోటుపల్లిని తురకలు కొంతకాలము రేవుగ నుపయోగించి యుండినను, ఆ నగరము హిందూరాజుల స్వాధీనమై యుండుటయు నప్పటికి ముసల్మానుల ప్రభుత్వము కొండవీటిరాజ్యము దాటి వ్యాపింపకుండుటయు, మచిలీపట్టణము లేచుటకు ముఖ్యకారణములయ్యెను. ఈ నగర ముదయించుటకు గారణము నిశ్చయముగా పరమత పరదేశములవట్ల ద్వేషములు లేని యుదారులగు రెడ్డి, కర్ణాట రాజుల సహనబుద్ధియని చెప్పవలయును. తొలుత నరబ్బుల వలసగా నుండిన మచిలీబందరు, కుబుతుశాహీల యాదరణవలన గొప్ప రేవుపట్టణ మగుట తటస్థించెను ముసల్మానులు, వేంగీ కళింగ దేశములను జయించిన తరువాత, యా ప్రాంతము నంతను, పరిపాలనా సౌకర్యమునకై నాలుగు సర్కారులుగ విభజించి, యంతట నా యుత్తరసర్కారుల నాల్గింటికిని సుబేదారునొకని నియమించి, యాతనికి మచిలీబందరు రాజధాని గావించిరి ఈ కారణము లన్నింటి వలనను, మొదట చిన్న కుగ్రామముగా నుండిన యారేవు సుబేదారుల ప్రాపకపోషణములచే నచిరకాలములో, మహానగరమగుట సంభవించెను. మచిలీ బందరు మూడు శతాబ్దముల కాలము దక్షిణ

హిందూదేశములో కెల్ల ప్రధాననగరమై, ఢిల్లికి తరువాత, మహదైశ్వర్యమును అఖండవైభవమును ననుభవించి యుండెనని చరిత్రకారులు వ్రాసియున్నారు. గోల్కొండ సుల్తాను లగు కుతుబ్‌శాహీలు తమ రాజ్యములోనుండి తీర్థయాత్రసేవింప కుతూహలము గల మహమ్మదీయుల నెల్లవేళల మక్కా, మదీనానగరములకు గొంపోవుటకై, యొక గొప్ప నౌకాదళమును మచిలీబందరు రేవున సిద్ధపఱచి యుంచిరి[3]. ఇదిగాక, నానాదేశ, ద్వీపాంతర నగరములతో వర్తకముచేయు వర్తకుల యుపయోగార్థమై, సామాన్లు గొంపోయెడి యోడ లనేకములను గూడ సిద్ధపఱచియుంచిరి[4].

మచిలీపట్టణపుటైశ్వర్యమును, వర్తకవైభవమును, మనకు ఇతర చరిత్రాంశములతో బాటు, పాశ్చాత్యచరిత్రకారుల వ్రాతలబట్టియే, దెసిలికొనవలసిన గతి పట్టినది దేశీయులలో హిందువుల కాకాలమున చరిత్ర రచనా ప్రయోజనము దెలియదు దాని ప్రయోజన మెఱింగిన మహమ్మదీయ చరిత్రకారు లసూయాపరులై హిందువుల చేతల వర్ణింపరైరి. అందువలన యథార్థస్థితి యించుమించుగా, దేశీయుల నాగరికతాతత్వ మెఱుంగని పాశ్చాత్య చరిత్రకారుల నోట వినవలసివచ్చినది. అట్లయ్యును ఈ నగరవైభవము, మన కిప్పటికి గనులకుగట్టినట్లున్నది మచిలీపట్టణము క్రీ శ 1425 సంవత్సర ప్రాంతమున, దిరిగి కర్ణాధీశుల కడనుండి, బహమనీ సుల్తానులచే గైకొన బడియెను తురుష్కుల నగరమగుట వలన సుల్తాను లా నగరముపై ప్రేమాతిశయము వెల్లడించి, వెంటనే యా సంవత్సర మచ్చట నొక మసీదు నిర్మించి యుండిరి. అచ్చటి పరిపాలనము, వర్తకుల కభయ మొసంగజాలుట వలన దేశీయవర్తకులు గ్రమక్రమముగా నచ్చటకు జేరుచుండిరి. గోల్కొండ నవాబులలో క్రీ.శ. 1580 మొదలుకొని 1621 వఱకు బరిపాలించిన మహమ్మదు కుతుబుశాహి కాలమునుండియు విదేశవర్తకులీ రేవునకు వచ్చుటకు బ్రారంభించి యుండిరి అట్టి పాశ్చాత్యులలో తొలుత నీ ప్రభువు వలన సన్మానము వడసి, వర్తకము చేసికొనుటకై ఫర్మానాయును, వర్తకశాల నిర్మించుకొనుటకు నివేశనస్థలమును బడసినవారు బుడతకీచులు వీరి తరువాత, అంగిరీజులు వలందులు, పరాసులు నొకరితరువాత నొకరు గ్రమముగా ఫర్మానాలు నివేశనములు బడసి వర్తకముచేసికొనుట కారంభించిరి ఇప్పటికి బందరున దొలుత వీరందఱు కాపురముండిన పాలెములు వారివారి నామముల బరగుచున్నది.

మచిలీపట్టణము గూర్చి వ్రాసిన పాశ్చాత్యులలో మొట్టమొదట బరిశీలింపదగినది ఫ్రాన్సుదేశయాత్రికుడగు జాను బాప్టిస్టా టావెర్నియరు

చేవ్రాయబడిన చారిత్రము ఈతడు వర్తకుడు అర్మజానగరమున చాలకాలము నివసించి, తరువాత తనకడనుండిన ముత్యములను, వజ్రములను, మంచిరాళ్ళను అమ్ముటకై హిందూదేశమునకు వచ్చెను. ఈతడు మచిలీపట్టణమునకు క్రీ శ 1654వ సంవత్సరప్రాంతమున వచ్చి జూచియుండెను అప్పటికింకను ఫ్రాన్సువర్తకులు మచిలీబందరున వర్తకస్థానము నెలకొల్పియుండనట్లు గాన్పించెడిని. మచిలీపట్టణమును గూర్చి యితడు 'ఇది గొప్ప పట్టణము ఇచ్చటి యిండ్లు కఱ్ఱతో గట్టబడును ఇంటింటికి నడుమ విశాలమయిన స్థల ముండును సముద్రపుదరినుండుటచే నీ నగరము వర్తకపుటోడల రాకపోకలకు విశేషప్రసిద్ధి గాంచినది బంగాళాఖాతమున నింతటి ప్రఖ్యాతిగన్న రేవు మరియింకొకటిలేదు. ఈ రేవునుండి యోడలు బయలుదేరి, పెగూ, సయాం, అరాకాను, బంగాళము, కొచ్చి, చీనా, మక్కా, హోర్మజు (హురుమంజి) దేశనగరములకును పట్టణములకును, మడగాస్కరు, సుమత్రా, మానిల్లా దీవులకును వ్యాపారము కొఱకై యరుగుచుండును ' అని వ్రాసియున్నాడు[5].

ఇంగ్లీషువర్తకులలో, బందరురేవును బౌరి యను నాతడు విశేషముగ బ్రశంసించియుండెను[6] తామసు బౌరీ, హిందూదేశమును క్రీ.శ.1669 మొదలుకొని 1679 వఱకును సంచారము చేసియుండి మచిలీపట్టణమునుగూడ సందర్శించియుండెను ఈతడు మచిలీబందరును గూర్చి వ్రాసిన విషయము లెంతయు నుత్సాహజనకములై యున్నవి 'చోళ మండలతీరమున, మచిలీపట్టణ మీకాలమున గొప్పవర్తక స్థానమును, నౌకాశ్రయమునై యున్నది ఇక్కడి వర్తకులు విశేషముగ దమ సరకులను స్వంతయోడలలోను, మాయోడలలోను యెగుమతి చేయుచుందురు' అని బౌరీ వ్రాసి యున్నాడు క్రిస్టొపరు హవుటను అనునాతడుగూడ 'నేను 1657వ సంవత్సరమున ఈ నగరమున కేతెంచినపుడు మంచి దశలోనుండెను ఈ నగరపు వర్తకులు ఇరువది యోడల నిండ సరకు వేసికొని యెల్లపుడు అరాకాను, టెనేసరి, పెగూ, క్వీడా, మలాకాలకును, పశ్చిమమున మక్కా, (మోకా) పారశీక దేశములకు బోవుచు వర్తకము చేయుచుందురు '

'గోల్కొండ నవాబులకు అరాకాను, టెనేసరి, సింహళ ద్వీపములతో వ్యాపారము చేయుటకును, తమకును, తమసామంతకోటికిని వేటేట సింహళద్వీపమునుండియు, నితరద్వీపములనుండియు, ఏనుగులను దెచ్చుటకును ప్రత్యేకముగ కొంతనౌకాదళము గలదు ఆ యోడలందొక్కొక్క

దానిలో పదునాలుగు మొదలుకొని ఇరువదియైదు దేనుగుల వఱకును గొని రాబడుచుండును ' అని బౌరీ వ్రాసియున్నాడు 'గోల్కొండ నవాబుల వర్తకపుటోడ యొకటి ఎఱ్ఱసముద్రముమీదనున్న మోకానగరమును గూర్చి బోవుచుండగా నేను చూచితిని. నవాబుల యోడ లొక్కొకటి వేయి టన్నులు బరువుండునని తోచును ' అని బౌరీదొర యింకొకచోట వ్రాసియున్నాడు. మచిలీపట్టణ మాప్రాంతమున చుట్టుప్రక్కల నూఱుమైళ్ళ వఱకును ప్రధానవర్తకస్థానముగ నుండెను మరియు, హిందూదేశములోకెల్ల భాగ్యవంతములును, జన సమర్థములునగు మహానగరములలో మచిలీపట్టణ మొకటియై యుండెనని అరమ్సు చరిత్రకారుడు వ్రాసియున్నాడు. క్రీ.శ.1674వ సంవత్సరమం దీనగరమునకు వచ్చియుండిన డాక్టరు ఫ్రయరు ఈ నగరమును జాలవఱకు వర్ణించియున్నాడు ఇచ్చట మసూలా యనుపడవలు సముద్రముమీద సరకులు గొనిపోవుచుండుననియు నవి తేలికగ నుండి చాలబరువును దీసికొనిపోగలిగి యుండుననియు నానౌకకు ఒంటి తెరచాప యుండినను కళాసులు తెడ్లువేసి పడవను నడుపుచుండిరనియు డాక్టరు ఫ్రయరుగారు చెప్పుచున్నారు[7] 'మసూలా' నౌకయందు పదిమంది తెడ్లువేయుదురు వారిలో నిద్దఱు చుక్కాని పట్టుదురు. ఈపడవకు ప్రత్యేకముగ చుక్కాని లేదు. తెడ్లనే చుక్కానిగ నుపయోగింతురు. వీనిని మామూలు నౌకలను గట్టినట్లు నిలువుగను, అడ్డుగను దూలములువేసి కట్టరు. పలకలను వంచి యొకదానికొకటి త్రాటితో కట్టి సందులు లేకుండ నౌకవిధమగు కీలుతో కప్పివేయుదురు. ఈ పడవ లందువలన మిక్కిలి తేలికగ నుండి, లోతుతక్కువ యున్న ప్రవాహములందును నదీముఖద్వారమునందును సులభముగ కదలగలవు ఇవిగాక యోడలలో నుండి సరకులను ఒడ్డునకు దీసికొనివచ్చుటకు కెటమరాౘ, [Catamaran - (Tamıl) Kattamaran] అనునవి యుపయోగింపబడు చుండెను. కెటమరా ననగా నాలుగైదు దూలములు త్రాటితో గట్టిగజేర్చి కట్టెడు తెప్ప వీనిపై సులభముగ నాలుగైదు టన్నుల సామాను తీసికొని వచ్చుచుండెడివారు మసూలా నౌకలను బౌరీ గూడ వర్ణించియున్నాడు.

మచిలీపట్టణము చీటిగుడ్డలకు, అద్దకపుగుడ్డలకు, సున్నితములై రవసెల్లాలకు ప్రసిద్ధికెక్కియుండి విశేషముగ చీనా మొదలుకొని యింగ్లాడువఱకుగల దేశముల కెగుమతిచేయు చుండెను ఇచ్చటి యద్దకపుగుడ్డలు కలంకారిగుడ్డలును రంగుతగ్గిపోక, యుతికిన కొలది మఱింత యందముగనుండుటచే వీనికి బర్మాయందును, ప్రాగ్ద్వీపములందును, పారశీక

సింధుశాఖ ప్రాంతములందును, విశేషమమ్మక ముండెను. ఇవిగాక తివాసులు, పట్టువస్త్రములు, వజ్రములు, తేయాకు, దంతముతో బనిచేసినటువంటి నగిషీ సామానులు, నల్లచేవతో తయారు చేయబడిన కుర్చీలు, బల్లలు, బీరువాలు మొదలగు సామానులు విశేషముగ నెగుమతి యగుచుండెనని బౌరీ వ్రాసియుండెను[5] ఈ పట్టణమునందు దేశీయులు, పారశీకులు, సిరియనులు, ఆర్మీనియనులు, మహమ్మదీయులు గాక బుడతకీచులు, వలందులు, అంగిరీజులు, పరాసులుగూడ నివసించుచు వర్తకము చేసికొనుచుండిరని డాక్టరు ప్రయరు వ్రాసియున్నాడు. వీరిలో ఆర్మీనియనులు వర్తకమును నాటున సాగించుకొనుచుండువారు దేశీయులు వర్తకముచేయుట యందు చాలగడుసువారనియు, గణితశాస్త్రమునందు చాల ప్రవీణులనియు, పిల్లలుసైతము చక్కగ అర్థకపుబని చేయగలరనియు డాక్టరు ప్రయరుదొరగారు శ్లాఘించియున్నారు

మచిలీపట్టణము తరువాత చాలప్రఖ్యాతిగాంచినది ఇచ్చట కుత్తరముగ నలువది మైళ్లదూరముననున్న నరసాపురము ఇచ్చట పెద్దయోడలు కట్టుటకు వలయు టేకుకఱ్ఱ, తుమ్మకఱ్ఱ మొదలుగాగల కలప విశేషముగ లభించుటచే మంచి నౌకానిర్మాణస్థానమని ప్రఖ్యాతి గాంచెను. ఏటేట గోదావరి వఱదలందు గొట్టుకొనివచ్చు కలపనంతయు నటు తాళ్లరేవు నందును, ఇటు నరసాపురము నందును జనులు పట్టుకొని నిలవ చేయుచుండుటవలన ఎంత పరిమాణముగల యెన్ని యోడలనైనను కట్టుటకు గావలసినంత కలప యిచ్చట లభించుచుండెను మారిస్ దొరగారు తమ 'గోదావరిజిల్లా' యను పుస్తకమునందు 'ఈ నరసాపురము కడచిన రెండు శతాబ్దములకు బూర్వమునుండియు ఓడలు కట్టుటకును, మరమ్మతు చేయుటకును ప్రసిద్ధి చెందియున్నద' ని వ్రాసియుండిరి. గోదావరి ముఖద్వారమునకు గొంచెమెగువగానుండుట చేత నిచ్చట నది చాలలోతుగ నుండి పెద్దపెద్ద యోడలు లంగరు వేసికొనుటకు కట్టుట కనుకూలముగ నుండెను పట్టణమున కెదురుగనున్న గోదావరిగుండమునందు ఆ కాలపుబ్రిటీషు నౌకాదళమంతయు సుఖముగ లంగరు వేసికొనియుండుటకు దగినంతవిశాలముగ నుండెనని మారిస్‌గారు వ్రాయుచున్నారు[6]. ఈ పట్టణ వర్తక మంతయు రంగం, మోల్‌మేన్‌లతో జరుపబడుచుండెను. ఇచ్చటి నౌకాశ్రయమున క్రీ శ 1670వ సంవత్సరమునందు బాలసూరులోని యంగిరీజువర్తకులు మద్రాసు 'పిన్నెస్' మానివేసి ఒక పెద్దయోడను గట్టించుకొనిరి వారు దానికి గారణముగ నరసాపురమునందు ఓడలుకట్టుట

కనుకూలమైన కలపవంటి కలపయు, నచ్చటి పనివాండ్రనుబోలిన మంచిపనివాండ్రును మఱియెచ్చటను లేకపోవుటయే యని వ్రాసియుండిరి[10].

నరసాపురములో నిప్పటికిని మాలెంవీధి యని యొకపేట గలదు. ఆ పేరే యొకప్పు డీనగర సముద్రవ్యాపారవైభవమును జాటుచున్నది. 'మాలెం' అనుపదమునకు సముద్రములోని మెరకపల్లములను, ఆకాశముమీది నక్షత్రముల స్థలములను దెలిసికొని యోడను గమ్యస్థానమునకు సురక్షితముగ నడపగలవాడు అని అర్థము.

నరసాపురమునకు జేరువుగా మాధవాయిపాలెమను నొక గ్రామము గలదు. ఇది నరసాపుర ముచ్ఛ్రదశయందుండిన కాలమున నౌకాశ్రయమునకు సమీపముగా నుండిన వీధి కొంతకాలము క్రిందట నిచట ఇంగ్లీషువారి వర్తకశాల యుండెను ఇక్కడ పనివాండ్రు ఇనుముతో నోడలకు గావలసిన యేసామానునైనను మిక్కిలి సునాయాసముగను, చక్కగను తయారుచేయుచుండిరి ఇక్కడ ఓడలుకట్టుటయందు మిక్కిలి నేర్పరులైన మంచిపనివాండ్రుండిరి. యూరోపియను వర్తకులందఱు నరసాపురము, మాధవాయిపాలెములందు తమయోడలను మరమ్మతు చేయించుకొనుచు, గ్రొత్త యోడలను గట్టించుకొనుచుండువారు. మధ్య మాగాణములలోని వర్తకులుకూడ ఇక్కడనే తమ నౌకలను గట్టించుకొనుచుండువారు బౌరీదొర యిచ్చట నోడలు బాగుగ గట్టబడుననియు, ప్రపంచములో దాను చూచినస్థలము లన్నిటికంటె నిచ్చటి నౌకానిర్మాతలు మిక్కిలినేర్పుతో నోడలను నీటద్రోయుదురనియు, వీరు తెరచాపలు, ఓడకొయ్యలు, మోకులు, లంగరులు మొదలుగాగలవి మేలైనరకము తయారుచేయగలరని వ్రాసియున్నాడు

ఇట్లే గోదావరినది కుత్తరముఖద్వారముననున్న కోరంగి, తాళ్ళ రేవులుకూడ నొకప్పుడు ప్రసిద్ధనౌకాశ్రయములై యుండెను వీటి ప్రాముఖ్యతయు పందొమ్మిదవ శతాబ్దముతో నంతరించిపోయెను కలకత్తాకును, దక్షిణమున 'ట్రింకోమలి'కి నడుమ పెద్దయోడలనుపట్టగల నౌకాశ్రయము గానుండిన కోరంగి యీకాలమున గోదావరి తిప్పలు వేయుటచే వర్తకపుటోడలు వచ్చుటకు వీలులేకున్నది ఈ పట్టణము ఇటీవలి కాలమువఱకు రంగము, మోల్మేను పట్టణములతో వర్తకము చేయుచుండెడిది ఇప్పుడీ వర్తకము నశించిపోయినది. తాళ్ళరేవు, కోరంగులు చాలవఱకు ఉప్పెనలచే ధ్వంసము గావింపబడినవి. ప్లైనీయును, టోలెమీయును, పెరిప్లస్ గ్రంథకారుడును బేర్కొనియుండిన గోదావరీముఖద్వారమునందు రేవుపట్టణము ఈ

కోరంగియేయని కొందఱు చరిత్రకారు లూహించి యుండినట్లు ఇదివఱకే చెప్పియుంటిమి. ప్రాచీన కాలమునుండియు ప్రాతకోరంగులు సముద్రము పాలగుచుండ క్రొత్తవి యెప్పటికప్పుడు లేచుచుండెను. క్రీ.శ. మొదటి శతాబ్దమున నిచ్చట నొక గొప్ప రేవుపట్టణముండిన ట్లూహింపవచ్చును. కోరంగి సమీపముననున్న తాళ్ళ రేవు దగ్గఱ క్రీ శ 1802వ సంవత్సరములో విశేషధనము ఖర్చుచేసి ఎబెనీజా రోబెక్ అను ఆంగ్లేయుడు ఓడలు మరమ్మతుచేయుటకు 'బొది' ని నిర్మింపించెను అందు పదునాలుగడుగులకంటె నెక్కువ లోతవసరము లేని యోడలు మరమ్మతుచేయుటకు వీలుగ నుండెను. నూటయేబదియైదడుగుల పొడవును, క్రింద నేబదియొక్క యడుగు వెడల్పును, పైన డెబ్బదియాఱడుగుల వెడల్పును గల ' ఆల్బట్రస్' అను బ్రిటీషు యుద్ధనౌక యిచ్చట మరమ్మతుచేయబడెనట ఈ బొదిని ఓడ ప్రవేశించినతరువాత మరమ్మతుచేయుట కందులోని నీరంతయు నాలుగు గంటల కాలములో తోడివేయుటకుదగిన యంత్రములుండెను. ఇప్పుడా బొదియంతయు తాడిప్రమాణమున మేటవేసికొనిపోయెను తాళ్ళరేవు, కోరంగులు మంచి దశలోనుండిన రోజులలో నక్కడ నెప్పుడును ఐదువందల యోడలకు తక్కువగాకుండ నుండెడివట. ఇక నోడలు మరమ్మతుచేయుట కెన్నియో బొదులుండెనట ఈ తాళ్ళరేవు, కోరంగిరేవులు మేటవేసికొనిపోయినతరువాత గోదావరీముఖద్వారమున నున్న బెండమూర్లంకయు, నోడలరేవును కొంతకాలము వర్తకస్థానములుగ నుండెను. కాకినాడ రేవుపట్టణముగ దలచూపినతరువాత నీ రెండును గూడ నిరుపయోగము లైనవి. ఇంతకంటె ఈ రేవుల ప్రాచీన వైభవచారిత్రమును వెల్లడించు నాధారములు కానరావు

ఈ కోరంగి సమీపమున యానాము, నీలపల్లి, ఇంజరములు కూడ పదునాఱు, పదునేడవ శతాబ్దములందు ఐరోపియను వర్తకులకు నాటపట్టులుగనుండి కొంతవర్తకవ్యాపారవైభవమును దిలకించియుండెను ఇప్పుడవికూడ రేవుపట్టణములుగ నిరుపయోగము లగుటచే వాణిజ్యలక్ష్మి యచ్చటి నుండి యంతర్ధాన మొందెను.

యూరోపియను వర్తకు లీదేశమునకు వచ్చినకాలముననే విశాఖపట్టణము కూడ స్వాభావికమైన నౌకాశ్రయమగుటచే వర్తకస్థానముగ రాణకెక్కెను ఈ పట్టణము చాల ప్రాచీనమై మొదటికులోత్తుంగునిచే నిర్మింపబడినట్లు చరిత్ర వలన దెలియవచ్చుచున్నది ఇది యాకాలమున కులోత్తుంగచోడపట్టణమని కూడ బిలువ బడుచుండెను. చాళుక్య చోళుల కాలమున, అనగా పండ్రెండవ

శతాబ్దమున నీనగరము పశ్చిమతీరమునందలి 'కొల్లం' (Quilon), 'కాయిల్' (Kayal) పట్టణములతో వర్తకము చేయుచుండినట్లు ఇచట లభించిన కొన్ని శాసనములవలన దెలియుచున్నది ఇచ్చటి ప్రాచీననగరముకూడ సముద్రముచే ముంచివేయబడియెననియు, నా నగరములోని దేవాలయ శిఖరములు మున్నగునవి యిప్పటికి నోడలకు దగులుచుండుననియు స్థలజ్ఞులు చెప్పుదురు.

ఇంక నీకాలపు రేవులలో బేర్కొనదగినది కళింగపట్టణము. ఇయ్యది వంశధార నదీముఖద్వారమున నుండి కళింగదేశమున కొకప్పుడు రాజధానియై, యత్యంత వైభవమును గాంచియుండెను ఈ నగరమేకాలమున నేవంశీయులకు రాజధానిగనుండెనో చరిత్రకారు లింకను నిశ్చయింపలేకున్నారు ఒకప్పు డీమహానగరము విదేశములతో వర్తక వ్యాపారము విశేషముగ జేసియుండినట్లు ఊహించుటకు మాత్రమాధారములు కన్పట్టుచున్నవి ఈ పట్టణప్రాంత మంతయు బౌద్ధుల ప్రాచీనౌన్నత్యమును దెలుపు శిధిలము లైన కట్టడములతో నిండియున్నది బౌద్ధమత మభివృద్ధిలో నుండిన కాలమున నీరేవునుండియే బౌద్ధసన్యాసుల విదేశములకు మతవ్యాపనార్థ మరుగుచుండిరి, సాహసికులగు వర్తకులు వాణిజ్యార్థమై ద్వీపదేశాంతరములకు వలసబోయి యధినివేశముల నెలకొల్పుచుండిరి. ఈ దేశమునకు యూరోపియను వర్తకు లేతెంచిన కాలమునగూడ నీనగరము ప్రఖ్యాతిగాంచిన రేవుగనుండినటుల కవి-చరిత్రకారులగు స్థలజ్ఞులు వర్ణించి యుండిరి ఇక్కడ వలందులు, యింగిరీజులు, బుడతకీచులు, పరాసులు వర్తకశాలల నిర్మించుకొని వ్యాపారము చేసికొనుచుండినట్లు కవులు వర్ణించి చెప్పిన పద్యము లనేకములు గానగుచున్నవి[11]. ఈ పట్టణముయొక్క ప్రాచీనవైభవము, చరిత్రాధారములు లేక దెలియరాకున్నది ఈ నగర మొకప్పుడు శృంగళమనుద్వీపము పై నుండినట్లును అదియంతయు సముద్రముచేత ముంచివేయబడినట్లును స్థలజ్ఞులు చెప్పుదురు. శృంగళద్వీప మొకప్పుడు ఇరువది మైళ్ళ వైశాల్యముగలిగి మహాపట్టణమై శోభించుచుండెనట ఇపుడా శృంగళద్వీప మెచటను గానబడదు అయ్యది భూమితో గలసిపోయెనో, లేక సముద్రపుటుప్పెన వాతబడి మునిగిపోయెనో చెప్పగల వారెవరునులేరు ఈ మహానగరవైభవము, చరిత్రయందు విశేషముగ గానరాకుండు టెంతయు మన దౌర్భాగ్యము

ఇట్లే చరిత్రకారునికి లభింపని చరిత్రమెంతో కాలవశమున నశించిపోయినది అటుల నశించినదానిలో మిగిలినది చాలవఱకు ప్రాచీనవర్తక వైభవమునకు సాక్ష్యమిచ్చియుండిన నగరముల నామములు చరిత్రస్పష్టముగ దెలియని మన కాలమున యా నగరనామముల స్మరించి ప్రాచీనపుటౌన్నత్యము నైశ్వర్యము నూహించుకొని సంతసమంద వలసిన వారమగుచున్నాము

ఒకింతేనియు చరిత్రము తెలియని రేవునగరము లీకాలమున పాడుపడిపోయి అక్కడక్కడ గానవగు చున్నవి ఇంచుమించుగా సముద్రపుదరిని యేడెనిమిదిమైళ్ల దూరముగానున్న, పట్టణములు, గ్రామములు, పల్లెలయొక్క చారిత్రమన్వేషింపనారంభించిన విశేషాంశములు గొన్నియయిన మనకు తెలియరాకుండవు

అట్టివానిలో నెల్లూరిమండలములోని ఇసుకపల్లియు కృష్ణాజిల్లాలో శంబలదీవియు, కాల్పట్టణమును, పేరుపాలెమును, విశాఖపట్టణములోని పూడిమెడక, దివిలి, వాతాడయు నొకప్పుడు ప్రఖ్యాతిగాంచి, చరిత్రకారుని పరిశోధనకు బురికొల్పుచున్నవి.

జ్ఞాపికలు :


1 Orme, History of Indostan, Vol I, page 162
2 India in the Fifteenth Century, i page 19 (Haklyut Society Publication)
3 Bowery, A Geographical Accouont of the countries Round the Bay of Bengal, page 72 ff
4 ibid
5 Tavernier, Voyages Part II, Book I, page 70 (London 1678)
6 A Geographical Account of the Countries Round the Bay of Bengal, 1669-1675 Thomas Bowery (Haklyut Society Publication)
7 Thirty years in India by Major H Bevan, Vol 1, page 14, also Early records of British India
8 Wheeler Talbois, History of India, pages 481-8
9 Marris, Godavari district Gazetteer, pages 39-40
10 Bowery Thomas, A Geographical Account of the countries Round the Bay of Bengal, page 72 ff
11 Local Records, Vol 9, page 363

# ఉపసంహారము

ప్రాచీనాంధ్రుల సాహసిక నౌకాజీవన చారిత్రము ఇంతటితో ముగిసినది పూర్వప్రకరణములందు వర్ణింపబడి, యస్పష్టముగనైనను, ప్రాచీనాంధ్రుల యౌన్నత్యమును స్మరణకుదెచ్చుచున్న పావన చారిత్ర వైభవమట్టిది. ఆ వర్తకపుటైశ్వర్యము, ఆ కాలపుటాంధ్రుల యధినివేశస్థాపనా చారిత్రము గన్నులార గాంచిన కాలము చిరస్మరణీయము ఆ వైభవమును దిలకించి యా ఐశ్వర్యము ననుభవించిన యాంధ్రులది అదృష్టము ఆ కాలము గతించెను ఆ కాలమున మనపూర్వులను సాహసకృత్యములకు బురికొల్పిన మత, సాంఘిక, రాజకీయార్థిక పరిస్థితులీకాలమున గానరావు పోనిండు, పూర్తిగ వారి కాలమునుగూర్చి దెలిసికొనుటకైనను దగిన పరికరములు గానబడవు. మనకాలము అంధకారబంధురము, మనపూర్వులదో సాహసిక దీప్తులచే వెలిగినది. అటులా దేదీవ్యమానమగు శోభతో పదునెనిమిది శతాబ్దముల కాలము ప్రకాశించిన యాంధ్రుల సాహసిక జీవనజ్యోతి చల్లారినది. ఇంక చారిత్ర మొకటి రెండు విషయములు చెప్పి ముగించెదము.

ఇంతవఱకును వర్తకులను గురించిగాని, నావికులను గురించిగాని, విశేషములేవియు వర్ణింపబడలేదు పూర్వకాలపు వర్తక పరిస్థితులు, వర్తకమర్యాదలు విశేషముగ దెలిసికొనుట కాధారములు లేవు. అయినను కొంతవఱ కూహించుట కవకాశముగలదు. దేశమునుండి యెగుమతిగావలసిన సరకులు విశేషముగ లభించు ప్రాంతమునకు వర్తకసంఘములు (బిడారులు) బోవుచు నక్కడినుండి సరకులనుతీసికొని యెద్దులపై వేసికొని రేవులకు వచ్చుచుండిరి బండ్లమీద సరకులువేసికొని గొంపోవుటకు దేశమునందు విశాలమగు రాజబాటలు చదునుగా వేయబడి లేకపోవుట వలన వర్తకులు సరకును గంపలలో వేసి పశువులపైవేసి తీసుకొనిపోవుచుండిరి మార్గమధ్యము నందు దోపిడిగాండ్ర భయ మెక్కువగ నుండుటవలన బిడారులు సమూహములుగా బోవుచువచ్చుచుండిరి రేవులకు జేరిన సరకును, ఆ వర్తకులు ఓడయజమానులగు వర్తకులకువప్పగించి యెచ్చటెచ్చటాసరకులు కావలసి యుండునో అక్కడకు గొంపోయి యమ్మవలసినట్టు నిర్ణయించుకొనుచుండిరి. ఓడ యజమాను లేవర్తకులై యుండిన పక్షమున తమసొంతయోడలలో

సరకులను గొంపోయి ఆయాదేశములకరుగుచు, నచ్చటచ్చట తమసరకును విక్రయించి యక్కడ చవుకగానున్న సరకును, యెగుమతిచేసికొని పయనమయిపోవుచు నొకప్పుడు రెండు మూడు మాసములు మొదలుకొని సంవత్సరమువఱకును మొదట బయలుదేరిన రేవునకు జేరకుండిరి స్వదేశమునుండి యెగుమతి కాబడిన సరకులపై వర్తకులకు, ఓడ నౌకరులు మిగుల్చుకొనినంత మిగుల్చుకొని యజమానుని సొమ్మపహరించినప్పటికిని, పదిరెట్లు లాభము వచ్చుచుండెడిది ఒక వరహా విలువగల సరకునకు ఖర్చులు, తరుగులు, నష్టములుపోను పదివరహాలు లాభము వచ్చుచుండినందున వర్తకులు, ఓడనౌకరు లపహరించిన సొత్తుకై వగవకుండిరి. ఇతరుల యోడలలో సరకులు నెగుమతిచేయుటకై వారలు ఓడ యజమానుల కివ్వవలసిన కేవునకు నిందాయమని పేరుగలదు ఈ నిందాయమునకు నియమములేదు ఓడయజమాని యడిగినంతయు, ఓడ మాలిము, నఖూదా లపహరించినంతయుకూడ నిందాయముక్రింద పరిగణింపబడుచుండెను.

సరకు నిప్పటివలె యాకాలమున, గోనెసంచులలో నెగుమతిచేయుట యలవాటు గాకుండెను వెదురుబద్దలతో పొడుగుగా గుండ్రముగా అల్లబడిన చాపబుట్టలలో సరకును బోయుచుండిరి ఒక్కొక్క బుట్ట పదికుంచముల వఱకు సరకును పట్టగలిగియుండెను బుట్టలు లేనిసమయమున ధాన్యాదులను కొట్లలోబోసినరీతి ఓడలలో నడుగుభాగమున చెక్కలను పఱచి, వానిపై చక్కగానల్లబడిన వెదురుచాపలను ఒకదళసరిని పఱచుచు నందుమీద సరకులకు కుప్పగా బోయుచుండువారు

ఒక యోడకు కళాసులు వందలకొలది యుండిరి. ఓడ కంతకు నఖూదా ముఖ్యుడు నఖూదా పారశీక భాషాపదము నావిక శబ్దమునకు సమీపమైనది ఓడ నెట్లునడిపింపవలెనో, ఏయేరేవుల జేరవలయునో, ఏసరకులతో వ్యాపారముచేయవలయునో నిర్ణయించుభారమంతయు నఖూదాపై గలదు ఈతని క్రిందయుద్యోగి మాలిము ఈతడు సముద్రమునందలి లోతు పల్లములను, ఆకాశమందు నక్షత్రచలనములను గుర్తెఱిగి ఓడను సరిగా గమ్యస్థానము జేర్పవలసినవాడు ఈతని క్రిందివాడు తండేలు తండేలు కళాసులపై యధికారి. ఓడలో సరకులు వేయించుటయు, రేవులందు సరకులు దింపించుటయు, నెగుమతి చేయించుటయు సరంగు చేయించవలసినపని ఓడలోనికి ప్రయాణకాలమందు గావలసిన సామగ్రిని జాగ్రత పెట్టువాడు భండారి. లెక్కలు వ్రాయువాడు కరణము వీరుగాక ఓడ చుక్కానిగాయుట కొకడును, ఓడలో నడుగుభాగమున నూరుచుండు నీటిని తోడుటకు గుమ్మీలు

నుందురు. ఓడ కొయ్యలపై నెక్కి, తుపానువచ్చుటగాని, భూమిని గనిపెట్టు చుండుటకుగాని పుంజారి యనునింకొకడు గలడు. ప్రయాణము చేయుచున్న పుడు ఓడయంతయు నఖూదా, మాలిముల యధికారము క్రింద నుండును.

ఓడలు, ప్రయాణముచేయునపుడు వాయుచలనము భయంకరముగా నుండినను, తుపాను రానుండినను ఇనుప లంగరు వేయుచుండును లంగరులు లేని కాలమున కొబ్బరి పీచుతో పేనబడిన బరువైన పెద్ద మ్రోకులు నీటిలోనికి దింపబడుచుండెను ఇవియును, యినుపలంగరులంత పని చేయునట! సాధారణముగా నౌకలు తుపాను సమయములందు ఒడ్డుదరినిబోవక నడి సముద్రముమీద బడి పోవుచుండెను. అపుడు ఓడనడక యించుమించుగా గంటకు నిరువదిముప్పది మైళ్ళువర కుండును. ఓడ యెపుడైనను త్రోవతప్పి యగాధసముద్రమున నడచు చున్నపుడు అది యేప్రాంతముననున్నదో యేరేవునకు సమీపముగానున్నదో, అచ్చటి యక్షమెంతో (latitude) మాలిములు సులభముగా కనుగొనుటకు నొకవిధమగు పరికరము నుపయోగించు చుండువారు. మూడంగుళముల పొడవును, ఒకటిన్నర యంగుళముల వెడల్పును గల యొకపలుచని కఱ్ఱ బిళ్ళను దెచ్చి, దానిమధ్య పదునెనిమిదంగుళముల పొడవు గల దారమును గట్టుదురు. నావికుడు ఓడకొయ్యపైనెక్కి యాబిళ్ళను దనయెడమచేతితో కంటివద్ద పట్టుకొని దారమును గుడిచేతితో బుచ్చుకొని కంటిముందరిబిళ్ళను వెనుకకు ముందునకు గదలించుచు యుత్తర ధ్రువమునకును క్షితిజము (horizon) నకునూ గల మధ్యభాగమును బిళ్ళ కప్పివేసి నంతదూరమున దారమున నొక ముడివేయును ఈ ముడి యే రేవున సరిగా కొలిచి వేయబడునో యా రేవుయొక్క యక్షమును నావికునకు సులభముగ దెలియును. ఇట్లు ఆ యోడ యేయే రేవులకు దిరుగుచుండునో ఆయారేవులయొక్క యక్షమును, ఓడమార్గముల యొక్క యక్షములును ముందుగ నావికుడు కొలిచి దారముపై ముళ్లవేసి యుంచుకొనును. ముళ్లవేసిన యాదారమునుబట్టి నావికులు తామెటిగిన రేవుపట్టణముల యక్షములను ఎప్పుడైనను ఎచ్చటనుండినను కనిపెట్టుచుందురు.

ఓడ యెంతవడిగ బోవునుండునో తెలిసికొనుటకు నావికులకు ఒక ఉపాయము గలదు. అలవాటుగ దన నడకవేగమును దెలిసిన నావికు డోడప్రక్కను నిలబడి యొకకొయ్యముక్కను నీటిలో బారవేసి చుక్కాని వైపు నడువనారంభించును. అంతట నీటిపై దేలియాడుచు వెనుకకుబోవుచున్న యాకొయ్యయొక్క వడినిబట్టి తననడకతో సరిచూచి యోడ ఘడియ కిన్నిమైళ్ళచొప్పున బోవుచున్నదని చెప్పును. సముద్రముమీద నీటిప్రవాహ

మెట్లున్నదో నావికునకు దెలియనప్పుడాతడు సముద్రములో బూడిద నుండజేసి పారవేయును. అది నీటిలో మునిగి మెల్లమెల్లగ కరుగుచు తోకచుక్కయొక్క తోకవలె ప్రవాహమునందు గనిపించును. దీనినిబట్టి నావికుడు ప్రవాహ మెటు వైపున్నదో గ్రహింపగలడు.

ఓడలను మరమ్మతుచేయుటకై యోడలబొదిలోనికి దీసికొని వచ్చుటయు, బాగుచేసినతరువాత మఱల నీటిలోనికి బడద్రోయుటయు దెలిసికొనుటకు మనోహరముగ నుండును ఉప్పుటేరులకును, నదీ ప్రవాహములకును సమీపముననున్న యోడలబొదిలోనికి ఓడను దీసికొనివచ్చి యా బొదియొక్క ముఖద్వారమును గప్పివేయుదురు. తరువాత ఓడలబొదిచుట్టును ఎత్తుగ గట్టుమీద వేయబడియున్న యిసుకను బొదిలోనికి ద్రోసివైచి, క్రమక్రమముగ నందలి నీటి మట్టము నెత్తుచేయుదురు. అంతట నీరు పైకిలేచి యావలికిబోవును. అప్పుడోడ తిరుగబడకుండ ముందును, వెనుకను దూలములతో జేసిన కత్తెరకాళ్ళను బోటుపెట్టి యడుగు భాగమునంతయు బాగుచేయుటకు వీలుగనుంచెదరు ఓడ మరమ్మతు పూర్తియైన తరువాత మఱల దానిని నీటిలోనికి ద్రోయుటకు ఓడ మోకులను దెచ్చి చుట్టలుగజుట్టి యాచుట్టలను నొకదానిపై నింకొకటి ఓడ కుడిచెక్క క్రిందను యెడమచెక్కక్రిందను నిలువబెట్టుదురు. ఆచుట్టలకు, మన్నుపూసి యడుగుచుట్టకును, పై చుట్టకును నడుమ నిసుకగాని, మన్నుగాని పోయుదురు. అంతట నోడబొదిలోని మన్నంతయు ద్రవ్వివేసి నీరు పెట్టుటకు ముందు ఓడక్రింద బోటుపెట్టిన త్రాటిచుట్టలను నాలుగువైపులనుండి యొక్కమాఱుగ దీసివేయనారంభింతురు. అట్లు చేయుటవలన నీరు వచ్చినతోడనే యోడ యెప్పటియట్ల తేలియాడి యావలకుబోవుటకు సిద్ధముగానుండును

ఇప్పటివలె రేవుల స్థానమును నిర్ణయించుటకు దీపస్థంభములు పూర్వముండినట్లు గానరాదు, కాని పల్లవరాజధానియగు మామళ్ళపురమున నెనిమిదవ శతాబ్దమునాటి దీపపుస్థంభమొకటి గలదు ఈ దీపస్తంభమున వెలుతురు చుట్టుప్రక్కల నాలుగైదు యోజనములవఱకును గాననగుచుండెనట! మొత్తముమీద నాకాలమున నావికులు, ఆకసమువంక చూచి, నక్షత్రములబట్టియే, తమనౌకలను నడుపుకొనుచు రేవుల స్థలముల నిర్ణయించుకొనుచుండిరి.

సమాప్తము.

ఓం శాంతిః శాంతిః శాంతిః

అనుబంధం – 1

# ప్రాచీనాంధ్ర నౌకాజీవనము

## పల్లవయుగము క్రీ.శ. 200–700ల వఱకు అధినివేశన రాజ్యస్థాపనకాలము

ప్రాచీనాంధ్రులు ఎంత యుత్సాహముతోను ఎంత పట్టుదలతోను తమ వర్తకము రోమక సామ్రాజ్యము మొదలగు పశ్చిమ దేశములతోఁ జరుపుచు భరతఖండమునకు మహైశ్వర్యమును చేకూర్చి యుండిరో యంతకంటె వేయిమడుంగులధికోత్సాహముతోఁ గార్యదీక్షతో వాణిజ్యార్థమై యేగుచు నౌకప్పుడు ప్రాగ్ద్వీప సమూహమునందును, బర్మా (పెగు), సయాము, కాంబోడియా (చంపకదేశము) లోనగు దేశములందును, అధినివేశరాజ్యములను నెలకొల్పి జగద్విఖ్యాతిని బడసి యుండినట్లు సమకాలీన చారిత్రములను బట్టి తెలియుచున్నది. ఈ యధినివేశరాజ్య సంస్థాపన ప్రయత్నము ఒక్క వాణిజ్యాభివృద్ధికేగాక హిందూదేశములోని బౌద్ధ బ్రాహ్మణ మతముల నాగరికతను చిత్రకళలను విజ్ఞానమును విస్తరింపఁజేయుటకుఁ గూడ జరిగినట్లు చరిత్రకారుల యభిప్రాయమై యున్నది.[1] ఈ వలసరాజ్య స్థాపనమునందు ఆంధ్రులును కాళింగులును జూపిన యత్సాహమును, కార్యనిర్వహణదీక్షను బొగుడుచు, ఫర్గ్యుసను పండితుఁడు ధరణికోట అమరావతీస్తూపములం దిప్పటికిని జీర్ణావస్థయందు నిలిచియున్న కట్టడభాగములను, అందలి చిత్తరువులను, పూర్వ మొకప్పుడు కృష్ణా గోదావరీముఖద్వారములందుండిన రేవుపట్టణములనుండి హిందూ దేశములోని నానాప్రాంతములనుండి వచ్చుచుండిన బౌద్ధభిక్షువులు సువర్ణభూమి యనఁబరఁగు పెగు (దక్షిణ బర్మా) దేశమునకును, కాంబోడియా సయామదేశములకును, జావా బార్నియో సుమత్రా, మున్నగు ప్రాగ్ద్వీపములకును, మతవ్యాపనార్థము వలసపోయినటులు సాక్ష్యమిచ్చుచున్నవని వచియించియున్నాఁడు.[2] ఆంధ్రు లందాకాలమున జాతీయజీవనోత్సాహము వెల్లివిరియుచుండుటయే యీ సాహసిక జీవనమునకు ప్రబలకారణ మగుచుండెను. కాని యప్పుడప్పుడు దేశమును

కలగుండుపఱుచుచుండిన మతసాంఘిక రాజకీయ పరిస్థితులు కూడ దానిని పురికొల్పుటకు సాధనభూతము లయ్యెను

మూడవ శతాబ్దాంతమునకుఁ బూర్వమే ప్రాక్పశ్చిమసముద్రముల

వఱకు వ్యాపించి యుండిన యాంధ్ర మహాసామ్రాజ్యము క్షీణింప నారంభించెను. ఆ సామ్రాజ్యమును పరిపాలించిన శాతవాహనవంశజు లలోఁ గడపటివాడగు మూడవ పులిమావి చక్రవర్తి మరణానంతరము సామ్రాజ్యమున నల్లకల్లోలములు సంభవించుటచే నయ్యది యచిరకాలముననే భగ్నమై యదృశ్యమై పోయెను. అంతట నేప్రాంతమును బాలించుచుండిన జాతులవార లాప్రాంతమున స్వాతంత్ర్యమును బ్రకటించి రాజ్యములను నిర్మించి యుండిరి. అట్టి సమయమునఁ బూర్వాంధ్ర దేశమున దక్షిణమునఁ గాంచీపురము మొదలుకొని యుత్తరమున కళింగ, వేంగీదేశముల పర్యంతము గల దేశమును పల్లవులను నొక తెగవారు స్వాధీనపఱచుకొని స్వతంత్ర రాజ్యపరిపాలనమును చేయఁ బ్రారంభించిరి. శాతవాహనచక్రవర్తులు బౌద్ధ మతావలంబకులుగను, బౌద్ధమత పోషకులుగను నుండ, వారి కాలమున సామంతరాజులుగ నుండిన యీ పల్లవరాజులు బ్రాహ్మణమతాభిమానులై బ్రాహ్మణమతము నుద్ధరింప నిరంతరమును బ్రయత్నించు చుండిరి. ఆ కారణమున నాంధ్ర సామ్రాజ్య మంతరించి, పల్లవులు విజృంభించిన కాలమునుండియే, బ్రాహ్మణ బౌద్ధ మతములకు నొక విధముగ సంఘర్షణ మారంభమయ్యెను. రాజాదరణ గలిగిన బ్రాహ్మణమత మప్పటినుండియు దినదినాభివృద్ధిఁ గాంచుచుఁ బ్రజాహృదయము నాకర్షించుచుండ బౌద్ధమతమునకు దేశమున నిలువ నీడయునుఁ బోషణయును లేకుండఁ బోవుచుండెను.

ఈ మతపరిస్థితులే గాక రాజకీయపరిస్థితులు కూడ నాంధ్రుల సాహసిక జీవనమునకుఁ బురికొల్పి యుండినట్లు కాన్పించుచున్నది. నానాఁటికి మహైశ్వర్యము నొందుచుండిన యాంధ్రసామ్రాజ్యము యొక్క జనసంఖ్యయును నభివృద్ధి నొందుచుండెను. జనసంఖ్య యభివృద్ధి నొందుకొలఁదిఁ బ్రజలయందు వాణిజ్యాభిరుచియును విదేశగమనాభిలాష యును గలిగి యుండెను. అట్లు వాణిజ్యాభివృద్ధికై జనులందు గలిగిన విదేశగమనాభిలాషయును వలసలను (Settlements) నెలకొల్పుటకుఁ బ్రోత్సహించియుండెను. ఆంధ్రులయందాకాలమున నావిర్భవించిన

కోర్కులన్నియుఁ గార్యరూపమునఁ బుష్పించి ఫలించు చుండ, మతబోధకులును భిక్షుకులును మత సంరక్షణార్థమును, మత వ్యాపనార్థమును గూడ తమంతట తామే వర్తకులతో పాటు విదేశముల కరుగుచు నచ్చటి జనులను నాగరికులను జేయుచుండిరి. ఆ కాలపు టాంధ్రులిట్టి సాహసిక జీవనమునందును వాణిజ్యమునందును విశేషముగ నభిలాషఁ గలిగియుండినను ఈ కాలపుఁ బాశ్చాత్త్యులవలె ననాగరికులైన విదేశస్థులతో వర్తకముచేయుచుఁ గ్రమక్రమముగ వారి రాజ్యము నపహరించి స్వాతంత్ర్యమును మంటఁగలిపి యనేకవిధములఁ బీడించి మాతృదేశమున కన్యాయార్జితమైన యైశ్వర్యమును ఆపయశస్సును ఏమాత్రము చేకూర్పలేదు.

బౌద్ధగాథలను విమర్శించుచోఁ గ్రీస్తునకుఁ బూర్వ మేడవ శతాబ్దినుండియే, హిందూనావికులు దక్షిణమహాసముద్రముల నన్నిటిని జుట్టివచ్చుచుండి రనియును, హిందూదేశపువర్తకులు దక్షిణమున సింహళద్వీపముతోను తూర్పున బర్మా, సయామూ కాంబోడియా దేశములతోను వాణిజ్యసంబంధముఁ గలిగియుండిరనియు మాత్రము దేటపడును. బౌద్ధగ్రంథము లిట్లు సందిగ్ధములైన సూచనలకు మాత్రమే తావొసంగుచుండ, బర్మాసయామూదేశములందును, జావా సుమత్ర బోర్నియో మున్నగు ద్వీపములందును నేఁటివఱకు గాలానుగతముగ వచ్చుచుండిన గాథలు బౌద్ధసారస్వతములోని విషయములను ధ్రువపఱుచుచున్నవి. ఇట్లు ప్రాచీనకాలముననే యాంధ్రులయందుఁ బొడసూపిన సాహసిక జీవనోద్యమము యొక్క విపులచారిత్ర రచనమునకును తత్కాల నిర్ణయమునకును మనకు వీలుగాక యున్నది. ప్రాచీనాంధ్రభాషతోపాటు అందలి ప్రాచీనసారస్వతము గూడ గాలక్రమమున నాశమొందుట కతనఁ జాలవఱకు మనపూర్వుల చారిత్రము కూడ లుప్తమైపోయినది. కాని బర్మాదేశచరిత్రలందును, అచ్చటచ్చట మనదేశము నందు నేఁటివఱకుఁ జెప్పుకొనఁబడుచున్న స్థల పురాణము లందును ప్రాచీనాంధ్ర సాహసిక జీవనము లీలగఁగాన్పించుచునే యున్నది. పెగు దేశములోని గాథలు ఆంధ్రులు మొదటిమాఱు బుద్ధునికిఁ బూర్వమే దక్షిణబర్మాదేశ మన బరఁగు సువర్ణభూమికి వలస పోయి రాజ్యములు స్థాపించినట్లు సాక్ష్య మొసంగుచున్నవి. బర్మాదేశచరిత్రము వ్రాయు సందర్భమున ఫెయిరుగారు "మిక్కిలి ప్రాచీనకాలముననే గోదావరీ, కృష్ణానదీ ముఖద్వార ప్రాంతదేశముల నుండి హిందూదేశీయులు

బంగాళాఖాతమును దాఁటివచ్చి, ఐరావతీ డెల్టాభూములయందును తత్పరిసరభూములయందును వలస లేర్పఱచుకొనినట్లు ఇచటి స్థలపురాణములవలనఁ దెలియుచున్నది. వారాక్రమించుకొనిన ప్రదేశము బౌద్ధగాధలందు సువర్ణభూమి యనఁ బరఁగుచుండెను. ఈ సువర్ణభూమికి రాజధానియై ప్రఖ్యాతిఁగాంచిన 'తటోను' రేవునగరమునకు గూడ 'మన్' భాషయం దిట్టి యర్థమే కలదు. ఈ ప్రాంతమునకీ సువర్ణభూమి యని పేరచట సువర్ణము లభించుటచేఁ గలిగెనని తలఁపఁగూడదు. ప్రాచీనకాలము నుండియు నైరావదిమీఁదుగా చీనాదేశములోని వాయవ్యభాగమునుండి సువర్ణ మీ ప్రాంతమునకుఁ గొనిరాఁబడుచు నిచ్చటి 'తటోను' రేవుపట్టణము నుండి హిందూదేశమున కెగుమతియగుచుండె ననుకారణమున హిందూదేశీయు లీదేశమును 'సువర్ణభూమి' యని పిలిచియుండిరి.'' అని వ్రాసియున్నాఁడు.[3] కృష్ణాగోదావరీ మధ్యప్రదేశవాసు లీప్రాంతమునకు దొలుత వాణిజ్యార్థమై వచ్చుచుఁ బోవుచుండినట్లు కాన్పించుచున్నది. ఆకాలమున దక్షిణబర్మాదేశమునకును, దక్షిణ హిందూస్థానమునకు వర్తకవ్యాపారము జరుగుచుండినందున వర్తకులు తఱచుగ వచ్చుచుఁబోవుచుండిరి. సువర్ణభూమితో వర్తకము విశేషలాభకరముగ నుండుట చేతఁ గాఁబోలు అవకాశము గలిగినప్పుడు కొంద ఱిచ్చటనే వలసగా నేర్పడి స్వదేశములతో వాణిజ్యము సాగించుకొనుచుండిరి. అంతట వాణిజ్య మభివృద్ధినొందు కొలఁది ఆంధ్రులు విరివిగ బర్మాదేశమునకు వలసవచ్చుచు నైరావదీముఖద్వారప్రాంతము నంతను వర్తక స్థానములతో నింపిరి. వలసవచ్చిన యాంధ్రులు మంచివర్తకు లగుటచేతను నాగరకు లగుటచేతను ద్వరలోదమవర్తకము నభివృద్ధి చేసికొనుటయే గాక తమ వర్తక స్థానములను దేశములోనికి సైతము వ్యాపింపఁజేసి యుండిరి. అట్లు కొంతకాలము జరుగునప్పటికి మనవారలు స్వతంత్రరాజ్యమును నెలకొల్పఁగలిగి క్రమముగ సువర్ణభూమి నంతనుఁ దమ పరిపాలనము క్రిందికిఁ దేఁజాలియుండిరి. ఆంధ్రులు తొలుత నాక్రమించుకొనిన ప్రాంతము బర్మాలో నేటివఱకు ''మన్'' రాష్ట్రమనఁ బరఁగుచున్నది. నాగరికులైన తెలుఁగువారల మూలమున నా ప్రాంతపు జనుల కందఱికి గూడ 'త్రైలెంగు' లను పేరు కలిగినట్లు లెఫ్టి నెంటు జనరలు ఫైడ్ఫ్రిగారు వ్రాసియున్నారు.[4] ఈ విషయమునే మఱియొక చరిత్రకారుఁడగు యస్. డబ్ల్యు. కాక్సు[5] గారు కూడ తమ బర్మా దేశపు చరిత్రయందు ధ్రువపఱిచినారు.

క్రమక్రమముగఁ దెలుఁగువారల వలస అభివృద్ధిఁ గాంచుచుండ వలసవచ్చిన తెలుఁగువార లచటిదేశీయులతో స్నేహభావమున మెలంగుచు, వారిని నాగరికులను జేయుచు, వారితో అన్ని విధములగు సంబంధ బాంధవ్యములను గల్పించుకొనుచుండిరని తెలియుచున్నది. ఆకాలమున బర్మాదేశమునకుఁ బోయిన తెలుగువారలు తమతోఁ గూడఁదమ స్త్రీలను దీసికొనివెళ్లియుండి రనుట కాధారములు కాన్పించుట లేదని ఫెయిర్‌గారు నుడివి యున్నారు.[6] ఇట్లు వలసపోయిన తెలుఁగువంశజులు బర్మాదేశమునందుఁ గొంతకాలముండిన తరువాత నచ్చటివారితో నందు ముఖ్యముగ 'మన్' జాతి స్త్రీలతో వివాహములు చేసికొనుచుండిరి. ఈ తెలుఁగువారికిని 'మన్' జాతి స్త్రీలకును జనించిన సంతతివారలే 'తలైంగ్' 'తైలింగ్' లని తరువాతి కాలమున వ్యవహరింపఁబడుచు వచ్చిరి. కావుననే చరిత్రకారులగు ఫెయిరుగారు అధునిక కాలమున బర్మాదేశమున 'తలైంగు' 'తైలింగు' లని పిలువబడుచున్న జాతివార లొకప్పుడు దక్షిణాపథమునందలి త్రిలింగ (Telingaan) దేశములోని తూర్పుతీరమునుండి వలసపోయిన తెలుగువారల సంతతివారలనియు 'తలైంగు' 'తెలెంగ్' శబ్దములు తెలుంగుశబ్దభవములే యనియు నూహించుచున్నారు.[7] మన పూర్వులింతటి మహత్కార్యములను నిర్వహించి మాతృదేశమునకు ప్రఖ్యాతిని దెచ్చియుండిరని మన మిపుడు సంతోషభరితుల మగుచున్నను కాలవైపరీత్యమువలన వారు తమ ప్రత్యేకవ్యక్తిత్వమును నిలుపుకొన జాలక యచ్చటిదేశీయులతోఁ గలసిపోయి మాతృదేశము తోడి సంబంధమును సంపూర్ణముగ విడఁగొట్టుకొనిరని తెలుపునప్పుడు విషాదపూరితులము గాకమానము.

ఈ 'తైలింగ్' తలైంగ్ శబ్దములు తెలుఁగు శబ్దభవములే యని నిరూపించుటకు నొకటి రెండు కారణములు గన్పించుచున్నవి. అందొకటి యాంధ్రపదమునకుఁ బర్యాయపదముగ నున్న తెలుఁగు లేక తెలుంగు క్రీస్తుశకారంభకాలమునకుఁ బూర్వమునుండియు వాడుకలో నుండినట్లు కన్పట్టుచున్నది. పైశాచీభాష యందీ తెలుఁగు పదము 'తెలింగో' గాఁ గానవచ్చు చున్నది. ప్రాచీనమైన పైశాచీ భాషయందు గానవచ్చుటచే తెలుఁగు భాషయు నంతటి పురాతనమైనదనియే యూహింపవచ్చును. ఈ తెలుంగుభాష మొదటనుండియుఁ ద్రిలింగదేశమునందు నివసించు ఆంధ్రులకు మాతృభాషగా నుండిన కతన జనులు త్రిలింగదేశమును బట్టి

భాషకును జనులకును గూడ త్రిలింగ శబ్దభవమగు తెలుఁగు పదము వాడఁబడుచు వచ్చెను. అట్లగుట వలనఁ గొంతకాలమున కాంధ్ర తెలుఁగుశబ్దము లొకదాని కొకటి పర్యాయపదములుగ వ్యవహరింపఁబడ జొచ్చెను.

'తలైంగ్' 'తెలైంగు' పదములకుఁ దెలుఁగు పదమునకుఁగల పోలికఁబట్టి మాత్రమే గాక తెలుగువారలే తొలుత విదేశగమనమునందును సముద్రయానమునందును వలసరాజ్య సంస్థాపనమునందును హిందూదేశీయుల కెల్లరకును మార్గదర్శకులయి బర్మాదేశమునకు, జావా సుమత్రాదీవులకును తొలుతనే తమ నాగరికతను గొంపోయి వ్యాపింపఁజేసినవారని నిర్ణయించుటకు మఱియొక ప్రమాణము గలదు. అయ్యది ప్రాచీనాంధ్రభాషాలిపికిని ప్రాచీన మన్ భాషాలిపికిని గల సాదృశ్యమని చెప్పదగును. బర్మాదేశములో శాసనపరిశోధనశాఖవారిచే వెలికిఁదీయఁబడిన 'మన్' భాషాలిపి స్వరూపము త్రిలింగదేశములోని (Telingana) ప్రాచీనలిపి బోలియున్నదని అక్షరతత్త్వజ్ఞుల యభిప్రాయమై యున్నది. ఈ విషయము ఈ వఱకే మన్‌జాతివారు తెలుఁగువారల సంతతివారలని దెలిపియుండిన సుప్రసిద్ధచరిత్రకారుల యభిప్రాయమునకు బలమొసంగుచున్నది. మన్‌భాషా శాసనలిపిని పరిశోధించిన అక్షరతత్త్వజ్ఞులు ఈ లిపి ప్రాచీన కాలమునం దిచ్చటికి తెలుఁగు వారలచే గొనిరాఁబడి క్రమక్రమముగా నభివృద్ధి చేయఁబడినదని యూహించుచున్నారు. ఆ కాలమున హిందూదేశమునకును తూర్పుతీరమునందలి దేశములకును రాకపోకలు వర్తకసంబంధములు నెక్కువగ నుండిన కతన మనదేశమునందు వ్యవహారమునందుండిన ప్రతివిషయమును ప్రాగ్ద్వీపములకు దేశములకు గూడ వ్యాపించి యచ్చటి పరిస్థితుల ననుసరించి వృద్ధిపొందుచుండెను. క్రీస్తుశకారంభకాలమున వర్ధిల్లుచుండినది ఆంధ్ర సామ్రాజ్యమే! కావున ఆంధ్రలిపినే ఆంధ్రనావికులును వర్తకులును వలసస్థాపకులును మున్నగు సాహసికజీవులు గొంపోయి యుందురు.

ఇంతవఱకు బర్మా దేశమునకును ఆంధ్రదేశమునకును గల సంబంధమును సూచించియుంటిమి. ఇఁకముందాసంబంధమేవిధముగఁ బరిణమించెనో తెలిసికొందము. ఆఱవశతాబ్దిని సువర్ణభూమికి రాజధాని యగు తటోను నగరమునందలి రాజకీయపరిస్థితులు ఆంధ్ర

సువర్ణభూములకుఁగల యన్యోన్య సంబంధమును సూచింపఁజాలియున్నవి. ఆ కాలమునందచట రాజ్యము చేయుచుండిన రాజుయొక్క కుమారులిరువురు విమల తమల యనువారలు తమతల్లి పైఁగల దురభిమానము వలన పైతృక రాజ్యమును గోల్పోయి కొంత సైన్యమును గూర్చుకొని తటోను నగరమున కుత్తరముగాఁ జని యాప్రాంతమును జయించి యచ్చట నొకరాజ్యమును స్థాపించి పరిపాలించియుండిరని చరిత్రవలనఁ దెలియుచున్నది. ఈ విషయమందలి యథార్థ మెటులున్నను, 'తమల' 'విమల' యను నామములనుబట్టి చూడఁగా వీరుగాని వీరిపూర్వులుగాని యాంధ్రులయినట్లును మఱియు పల్లవులయిన శాలంకాయనులకో బృహత్పాలాయనులకో లేక విష్ణుకుండినులకో లేక నంతకంటె పూర్వచాళుక్య వంశమునకో చెందిన యొక శాఖవారనియుఁ దోఁపక మానదు. ఇట్టి యభిప్రాయమునే సర్ ఆర్థరు ఫెయిరుగారు వెలిబుచ్చిరి. [8]

ఆంధ్రదేశమునందు బౌద్ధమతము నిర్మూలముచేయఁబడిన తరువాత నాంధ్రుల ప్రాచీనచారిత్ర మెట్లు విస్మరింపఁబడియెనో యట్లే బర్మాదేశమునందు తలైంగురాజ్య మస్తమించినతరువాత వారి చారిత్రము కూడ శత్రురాజులచే బుద్ధిపూర్వకముగ నాశనము గావింపఁబడియెను. అంతట కాలానుగతములైన స్థలపురాణములుతప్ప ఇతర చరిత్రాధారములన్నియు నదృశ్యమై పోయెను. అయిన నీ స్థలపురాణములును గాథలును మిక్కిలి ప్రాచీనములుగఁ దోఁచుచుండుటచే విశ్వసనీయములుగ నున్నవి. మొట్టమొదట బర్మాదేశములోని పెగూ ప్రాంతమునకు వలసపోయినవారు తెలుఁగువారని నిర్ధారణచేయుట కిచట నేఁటివఱకు చెప్పుకొనఁబడుచున్న స్థలపురాణములే సత్యాధారములుగ నున్నవి. ఈ కారణమున ఫెయిరుగారు తమబర్మాదేశ చరిత్రమునందు "బర్మాదేశమునకు తొలుతనే వలసవచ్చియుండిన వారు తప్పక ప్రాచీనవంగు తెలుఁగుదేశమునుండి వచ్చినవారని యూహించుట కిచటి గాథలు ప్రబలకారణ మగుచున్న" వని వ్రాసియుండిరి [9]

ఈ పూర్వోక్తసందర్భముల నన్నింటిని బాగుగ నెఱింగియుండిన సుప్రసిద్ధ చరిత్రకారుఁడగు ఎల్ఫిన్‌స్టన్ 'తూర్పుతీరవాసులు పశ్చిమ తీరపుసోదరులకంటె ముందు సముద్రవ్యాపారమునందు ప్రసిద్ధి గాంచి

యుండి' రని చెప్పుచున్నాఁడు. దక్షిణమున గోదావరి మొదలుకొని యుత్తరమున గంగానది వఱకును వ్యాపించియుండిన కళింగదేశము ప్రాచీన కాలమునుండియు భరతఖండమున ప్రసిద్ధివడసిన రాజ్యములలో నొకటియై యుండుటయేగాక క్రీస్తునకుఁ బూర్వము మూఁడవశతాబ్దినుండియును సముద్రవాణిజ్యము నడపుచుండినట్లు గానవచ్చుచున్నది.[10] ఆంధ్ర సామ్రాజ్యము శాతవాహనుల పరిపాలనమున నానాముఖముల విజృంభించినపుడు కళింగరాజ్యము దానిలో సమ్మేళనమై పోయెను. అటులు సమ్మేళనమై పోవుటయేఁ గాక కళింగదేశము క్రమక్రమముగా నాంధ్రదేశములోని వేంగి మొదలగు ప్రాంతములట్లు ఆంధ్రదేశములోని యొకప్రాంతమునకు ప్రత్యేక నామ మగుట తటస్థించెను.[11] అంతకుఁ బూర్వము కళింగరాజ్యమును బరిపాలించిన బౌద్ధరాజులు పరమతద్వేషులుగాక సహనముగల్గి విదేశగమనమును సముద్రయాన వాణిజ్యములను విశేషముగ నభివృద్ధిపఱచియుండిరి.

నౌకాయానము సముద్రవాణిజ్యము కళింగరాజకుమారులు తప్పక యభ్యసింపవలసిన విద్యలుగ నుండెనని శాసనముల వలనఁ దెలియుచున్నది.[12] కళింగాంధ్రులు తొలుత సింహళద్వీపముతో వ్యాపారముచేయ నారంభించి రానురాను బంగాళాఖాతమునుగూడ దాఁటి హిందూమహాసముద్రమును సైతము ప్రవేశింప నారంభించియుండిరి. బర్మావారికి మతగ్రంథమైన 'బుద్ధగట' మందు కళింగ దేశమునుండి బౌద్ధవర్తకులు బర్మాదేశమునకుఁ బోయి వర్తక మారంభించి లాభము పొందుచుండ బౌద్ధసన్న్యాసులు మతవ్యాప్తి గావించిరనియుఁ దుదకు కొంద ఱచ్చటనే యుండి దేశమునుగూడ జయించి రాజ్యస్థాపనముఁ గావించి రనియు వ్రాయఁబడియున్నది[13] కళింగదేశమునకును బర్మాదేశమునకును విశేషముగ పరస్పర సంబంధముండినట్లు పెగూ దేశమునందు దొరకిన నాణెముల మీఁదఁగల హిందూదేశ చిహ్నములవలన ధ్రువపడుచున్నదని ఫెయిరుగారు నుడువుచున్నారు.[14] ఈ సంబంధము ఇంచుమించుగ పండ్రెండవ శతాబ్దమువఱకు వర్థిల్లి యుండినట్లును అది తలైంగురాజ్య మంతరించిన కొలఁది కాలమునకే విడిపోయియుండె ననియుఁగూడ తెలియుచున్నది.

ప్రాచీనాంధ్రులు బర్మాదేశమునందు వలస లేర్పఱచుకొనిన తరువాతఁ గ్రమముగ మలాకాద్వీపకల్పములోనికిఁ గూడ ప్రాకియుండిరి.

తూర్పుతీరపు దేశములకును మలాకాద్వీపకల్పమునకును రాకపోకలును వాణిజ్య సంబంధవము నుండినట్లును మలయు భాషలోని సంస్కృతభాషోద్భవములగు కొన్నిపదములవలన మూర్సెడనుగారు నిశ్చయించుచున్నారు [15] మఱియు నచ్చటిజనులు జావాద్వీపమునందువలెనే తూర్పుతీరమునుండి వచ్చినవారి నీకాలమున క్లింగులని పిలుచుచున్నారని కూడ చెప్పియున్నాఁడు. ఒకప్పుడాక్లింగుపదము కళింగదేశములోనుండి వచ్చినవారి కుపయోగింప బడి యుండినను నేటి కాలమున తక్కువజాతి హిందువులకు చెన్న రాజధానినుండి వచ్చి కూలినాలి చేసికొను జనులకును వ్యవహరింపఁబడుచున్నది. తూర్పుతీరవాసులకును, మలాకాద్వీపకల్ప వాసులకును విశేష సంబంధముండెననుట కేవిధమయిన సందేహము లేదనియు నట్టిసంబంధము బౌద్ధమతమభివృద్ధిలో నుండిన కాలమున - ననఁగా క్రీస్తుశక మైదారు శతాబ్దములవఱకు - మిక్కిలి బలీయముగ నండెననియు సర్ వాల్టరు ఎలియటుగారు అభిప్రాయపడుచున్నారు.[16] పినాకినీముఖద్వారము మొదలుకొని కాంచీపురమువఱకుఁ గల ప్రాంతమునందు దొరకిన కరుంబాలను పల్లవులలోని నౌకతెగవారి నాణెములను బరీక్ష చేయు సందర్భమున నీ పల్లవరాజుల కాలమున విశేషముగఁ బశ్చిమదేశములతో సముద్రవాణిజ్యము లేకపోయినను దూర్పున బర్మా, కాంబోడియా దేశములతోడను మలాకాద్వీపకల్పముతోడను సుమత్రా జావా మొదలగు ద్వీపములతోను జనులు తమసొంతయోడలలో సముద్రము మీఁద వర్తకముచేయుచుండినట్లు తెలియుచున్నదని వ్రాసియుండిరి.[17] ఈ వర్తక మేమి కారణముననో బౌద్ధమతము సన్నగిల్లి బ్రాహ్మణ పౌరాణిక హిందూమతము లభివృద్ధి జెందుకాలమున తగ్గిపోయెను.

పల్లవరాజులకాలమున బౌద్ధమతమునకు దేశమునుండి యుద్వాసన మిప్పింపఁబడియె నని యీ వఱకే తెలిపియుంటిమి. అట్టియెడ వర్తకులు వాణిజ్యార్థమై సముద్రాంతరములకుఁబోవుచుండ - బౌద్ధభిక్షువులు మతసంరక్షణార్థమై యుత్తర దేశములందు మతవ్యాప్తి గావించుటకు విదేశములకుఁ బోవుచుండిరి. బౌద్ధ భిక్షువులట్లరుగుచుండ, బ్రాహ్మణులు కూడ కొన్నివేళలందు స్వమత వ్యాపనార్థము బౌద్ధమతమునెడఁ గలుగు ద్వేషము చొప్పున నరుగుచుండిరి క్రీస్తుశకము యైదవ శతాబ్దమున భరతఖండమును సందర్శింపవచ్చిన చీనాదేశయాత్రికుఁడగు పాహియాను

ఆకాలపు స్థితిగతులను గూర్చి వ్రాయుసందర్భమున - వర్తకపు టోడలు, తామ్రలిప్తినగరమునుండి బయలుదేఱి తూర్పుతీరము వెంబడి ప్రయాణము చేయుచు సింహళద్వీపపు రేవుపట్టణములను జూచుకొని జావాద్వీపమునకుఁ బోవుచుండెనని చెప్పియున్నాఁడు. ఈ యాత్రికుఁడు హిందూదేశమునందు క్రీ॥శ॥ 405 మొదలు 411 వఱకును సంచారము చేసిన పిదప తామ్రలిప్తినగరమున నోడ నెక్కి బహుదినములు పయనము సలిపి సింహళద్వీపమును జేరి యచ్చటఁ గొంతకాలము నివసించి పిమ్మట వర్తకులు సరకులను గొంపోవునోడ నెక్కి తొంబదిదినములకు నతిప్రయాసముమీఁద యవ ద్వీపముఁ జేరెను ఇతఁడిన్నిదినములు ప్రయాణము చేయుటకు కారణమునుగూడ దెలిపియున్నాఁడు. ఇతఁడెక్కిన యోడలో రెండువందల బాటసారు లుండిరి. ఆ నౌకకు చిన్న నావ యొకటి త్రాటితో వ్రేలాడఁగట్టఁబడి యుండెను. తుపాను మొదలగునవి సంభవించినపుడాచిన్న నావ ప్రయాణికులను సంరక్షించుటకై యుపయోగింపఁబడు చుండెనని యూహింపవచ్చును.[18] ఈతఁడు సముద్రముమీఁద ప్రయాణము చేయుచున్నప్పుడు ఓడలో నున్న బ్రాహ్మణులందఱు నొకప్పుడు తుపానుఁరాఁగా ''నీ శ్రామణుఁడు మనతోఁగూడ నోడపై నుండుటచేత మన మదృష్టవిహీనులమై యీ విపత్తు పాలఁబడితిమి. ఒక్కనికొఱకు మన మందఱము చావరాదు. ఏ ద్వీపము కానఁబడినను ఈ భిక్షువుని భూమిమీఁద విడిచిపెట్టి మనము పోదము'' అని తమలోఁదాము వితర్కించుకొని నిశ్చయించిరఁట. ఈ విషయమువలన నా కాలమున బౌద్ధమత మెంత యనాదరణీయ మగుచుండెనో విదితము. ఈ యాత్రికుఁడు జావాద్వీపమునందు బౌద్ధులే గాక బ్రాహ్మణులును పాషండులును గూడ వర్ధిల్లుచుండిరని నుడివి యున్నాడు.[19] ఆంధ్రచరిత్రకారు లీ విషయమునుగూర్చి వ్రాయుచు, నాంధ్రరాజుల కాలమున నారంభింపఁబడిన సముద్రవర్తకము ఫాహియాను కాలమువఱకును నిర్విఘ్నముగ కొనసాగుచుండెనని చెప్పుటకు వీలగుచున్నదని వ్రాసియుండిరి.[20] నాల్గవ శతాబ్దమందు వేంగీరాజు లయిన పల్లవులు జావాసుమాత్రాద్వీపములను జయించినట్లు గానఁబడుచున్నది. ఈ విషయము ఆ దీవులలోఁ గానవచ్చిన కొన్ని శాసనముల వలన నిశ్చయింపఁబడుచున్నది. కళింగదేశములోని నాగరికత జావాసుమాత్రా దీవులకు వ్యాపించెనని గాథలలోఁ జెప్పుకొనుట మాత్రముండెను. కాని చాలకాలమువఱకు ప్రత్యక్షనిదర్శన మేమియుఁ

గానరాకుండెను. ఇటీవల కోహెను స్టూవర్టు గారిచేఁ గనుగొనఁబడిన రెండు శాసనములవలనను కాయిజావాలిపుల యుత్పత్తితత్త్వము బోధపడినది. ఈ శాసనములు రెండును సంస్కృతభాషయందు రచియింపఁబడి యున్నవి. వీనిలోని లిపి ప్రాచీనవేంగీరాజుల ప్రాచీనశాసనములలోని లిపిని బోలియున్నది.[21] ఆ ద్వీపములో బెయిటనుబర్గునకు అనతిదూరమున నున్న జాంపియయా జాంబోయను ప్రదేశములలోని కొండలపైని సంస్కృత శ్లోకములతి మనోహరములుగాఁ జెక్కఁబడియున్నవి. మఱియు నీ కొండలపై హిందూరాజుల పాదములు చెక్కఁబడి యున్నవి. ఇవి యాద్వీపములను జయించిన జ్ఞాపకార్థము చెక్కఁబడినవని యూహింపఁబడుచున్నది. అచ్చటి శాసనములందు ఆ ద్వీపములను జయించి రాజ్యమును స్థాపించినవాఁడు పూర్ణవర్మయని తెలుపఁబడినది. ఇంకను పూర్ణవర్మశాసనములను బోలిన శాసనములు కొన్ని గలవు. కాని యవి శిథిలములయి విశేషభాగము స్పష్టముగఁ దెలియరాకుండ నున్నవి. శాసనపరిశోధకు లీపూర్ణవర్మ కళింగమును వేంగిని కాంచీపురమును బరిపాలించిన పల్లవులలోనివాఁడై యుండునని యభిప్రాయపడుచున్నారు. ఈతని శాసనములందలి లిపి ప్రాచీనవేంగీపల్లవశాసనముల లిపిని బోలి యుండుటచేత నైదవశతాబ్దమున కీవలివాఁడు కాఁడని చెప్పవలసి యుండును. ఆ కాలమునందలి పల్లవులందఱు నొక్కకూటములోని వారేగాని యన్యులుగారని డాక్టరు బర్నెలుగారు సయితము నుడువుచున్నారు.[22] కాంచీపురమును బాలించిన ప్రాచీనపల్లవుల దేశములో విశేషభాగ మాంధ్రదేశముగానే యుండుటచేతను పూర్ణవర్మయు నాంధ్రదేశములోనివాఁడే యనియు వానితో జావాద్వీపమునకుబోయిన బ్రాహ్మణు లాంధ్ర ద్రావిడ బ్రాహ్మణులై యుందురనియుఁ జెప్పవచ్చును. సుమాత్రా, జావాద్వీపములోని క్లింగులను కళింగదేశమునుండి వచ్చిన తెలుగువాండ్రని పెక్కండ్రు చరిత్రకారులు తలంచుచుండఁగా డాక్టరు బర్నెలుగా రుత్తరద్రవిడదేశ తీరమునుండి వచ్చిన ద్రమిళులని యభిప్రాయపడుచున్నారు.[23] కాని యీ యభిప్రాయము సరిగాదు. తరువాతి కాలమున జావాసుమాత్రాదీవులకుఁ బోయినవారు ద్రావిడులయినను ప్రాచీన క్లింగులు మాత్రము కళింగదేశము నుండి బోయినవారని యూహింపక తప్పదు. ప్రాచీనక్లింగులు తొలుత త్రోవచూపిన తరువాతనే దక్షిణ దేశీయు లాద్వీపములకు విశేషముగఁ బోవనారంభించిరి. ఏది యెట్లున్నను పల్లవరాజులకాలమున నాంధ్ర కళింగదేశములు, సుమత్రా

జావామున్నగు ద్వీపములతో వర్తక వ్యాపారము విశేషముగఁ జేయుచుండిరనియు నాంధ్రద్రావిడ బ్రాహ్మణులు సైత మేవిధమగు మత సాంఘికాచార నిరోధము లేవియు లేక సముద్రయానమును విదేశగమనమును జేయుచుండిరని నిశ్చయముగఁ జెప్పవచ్చును.[24]

ప్రాచీనకాలమునందే యావిర్భంచిన యీ సాహసికజీవనోద్యమము సాహసికులగు నావికులను వర్తకులను క్రమక్రమముగా బంగాళాఖాతమును దాఁటి విశాలసముద్రమును బ్రవేశించి యచ్చటి ప్రాగ్ద్వీపములందు వర్తకస్థానములను వలసలను స్థాపింపఁజేసెను. కళింగ దేశపు రేవులనుండియు కృష్ణా గోదావరీ ముఖద్వారములందుండిన రేవులనుండియు వర్తకులు వాణిజ్యార్థమై నూతనదేశముల నాశ్రయించుచు సముద్రయానముచేసి వచ్చుచుండిరి. అట్టియెడ మతాభినివేశము గల బౌద్ధులు మతవ్యాపనార్థమై వర్తకులతోఁగలసి ద్వీపద్వీపాంతరములకుఁ బోవుచు తమ నాగరికతను మతమును నాటుచు పల్లవింపఁజేయు చుండిరి. కావుననే ఎల్ఫిన్‌స్టన్ కళింగాంధ్రుల యధినివేశసంస్థాపనా చారిత్రమును వ్రాయుచు నసంఖ్యాకులగు నీదేశీయులు సాహసికులయి బయలుదేఱి బంగాళాఖాతమును దాఁటి హిందూమహాసముద్రమును జొచ్చి యచ్చటి సుమాత్రాజావాద్వీపములను జేరి వలసలేర్పఱచుకొని యచ్చటి అనాగరకు లగు ద్వీపవాసులను నాగరకులను జేసి యుద్ధరించి రనియును, తాము యవద్వీపప్రవేశ చిహ్నముగ క్రీస్తుశకము 75వ సంవత్సరమున నొక శకము ప్రారంభించి యుండిరనియు జావాద్వీప చారిత్రమువలన దెలియుచున్నదని వ్రాసియున్నాఁడు.[25] ఆ సంవత్సరముననే కృష్ణా, గోదావరీముఖ ద్వారములందుండిన రేవుపట్టణములలో నొకదానినుండి యాదిత్యుఁడను రాకొమరు డొకఁడు సైన్యసమేతుఁడై జవద్వీపముపై దాడి వెడలి జయించెనని యాదేశమున మఱియొక ప్రతీతిగలదఁట. మఱియు నాదేశమున నాంధ్రరాజుల గూర్చి దెలిపెడి మహాగ్రంథ మొకటి గూడ గలదు. జావాదేశపు భాషాజ్ఞానము సంపాదింపఁగలిగినచో నాంధ్రదేశచరిత్రాత్మకము లగు నూతనాంశము లెన్నియో వెలికి రాఁగలవు.

ఈ పై యంశములను బరికించినచో పూర్ణవర్మ పరిపాలించు కాలమునాఁటికి జావాద్వీపమునందు ఆంధ్రుల వలసరాజ్యము లున్నతస్థితి యందుండెనని యూహింపఁదగును. జావా సుమాత్రా బోర్నియో మొదలగు ప్రాగ్ద్వీపములం దాకారణమునఁ గళింగాంధ్రదేశమున నాకాలపు పట్టణ గ్రామ

నామములతో నెన్నియో నగరములు వెలసి వర్ధిల్లుచుండెను. ఈ దీవులందు గాక హిందూదేశీయుల వలసలు బర్మాదేశము మొదలుకొని మలాకాద్వీపకల్పము వఱకును అనేకములు వెలసియుండెను. అప్పటికే బౌద్ధమతము చీనాదేశమునకు వ్యాపించియుండుట వలన బౌద్ధభిక్షువులు చీనాదేశమునుండి హిందూదేశమునకు – హిందూదేశీయులు చీనాదేశమునకు – బోవుట తఱచుగ జరుగుచుండెను ఇట్లు రాకపోకలు సలుపు బౌద్ధసన్న్యాసులకును వర్తకవ్యాపారము చేసికొను వర్తకులకును నప్పటి దీవులందును మలకాసముద్ర ప్రాంతములందును వేచియుండిన రేవుపట్టణములు నడుమ విశ్రాంతి స్థలములుగ నుండెను. అంతియగాక యొకప్పుడు యాత్రికులకు నోడలు మార్చుకొనవలసిన స్థలములుగూడ నై యుండెను. హిందూదేశమునకు బోయి (విద్య) యభ్యసింపఁ దలంచుకొన్న చీనాదేశీయులగు బౌద్ధసన్యాసుల కీనగరములందు తొలుత హైందవనాగరికత జీవనము సాంప్రదాయములతో ప్రథమపరిచయము గలుగుచుండెను.[26] అట్లగుటచేత హిందూ సామ్రాజ్యము సముద్రాంతరములకు వ్యాపించి విదేశీయులకు సమ్మోహముగ నుండె ననుటలో వింత యేమి గలదు?

కావున సుమాత్రా, జావా మొదలగు ప్రాగ్ద్వీపములలోని నాగరకత నిక్కముగా కళింగ వేంగీదేశముల ప్రాంతములనుండి వ్యాపించెననుట నిర్వివాదాంశము. భండార్కరు పండితుఁడు గూడ నొకచోట కళింగాంధ్ర దేశములకును ప్రాగ్ద్వీపములకును గల సంబంధమును జరుగుచుండిన విశేషసముద్రవాణిజ్యమును గూర్చి యచ్చట చెప్పుకొనఁబడుచున్న గాథలును, జీర్ణావస్థయందు జీవించియున్న కట్టడభాగములును, గుహాలయములును, శిల్పకళాదులును గాక అచ్చట గానవచ్చిన శాసనములలోని లిపిగూడ స్పష్టముగ సూచించుచున్నదని చెప్పియుండిరి.[27] క్రీ.శ 1820వ ప్రాంతమున క్రాఫర్డు పండితుఁడు కూడ యవద్వీపచారిత్రమును వ్రాయుచు నొక సందర్భమున జావాద్వీపములోని హిందూనాగరికత కళింగదేశములోనుండి యొకప్పుడు వ్యాపించి యుండవలయు నని వ్రాయుచున్నాడు.[28] ఇంతియేగాక హిందూనాగరికత ప్రాగ్దేశములకును ద్వీపములకును వ్యాపించెననుటకు సయాము, కాంబోడియా దేశములందు సయితము నేఁటివఱకు శాలివాహన శకము వాడుచుండుటకన్న మఱియేమి కావలయును.

క్రీస్తుశకారంభకాలముననే ప్రారంభమై యభివృద్ధి గాంచిన యిట్టి యాంధ్రుల యధినివేశసంస్థాపన చరిత్రమును సముద్రవాణిజ్యచారిత్రమును భారతీయేతిహాసమున కంతకు జగజ్జేగీయమానమైన వైభవమును సమకూర్చిన మహాకార్యములలో నొకటియై విరాజిల్లుచున్నది. ఇట్టి ఘనకార్యములు తొలుత మనపూర్వులే నిర్వహించిరని తెలియవచ్చు టెంతయు నుత్సాహజనకము. ఆ మహాచరిత్ర మంతయుఁ విస్మరింపబడుట మన దౌర్భాగ్యము ఆంధ్రదేశమునందు బౌద్ధమతము ప్రజాహృదయ పీఠము నాక్రమించి యుండినంతకాలము నిట్టి సాహసికజీవన మభివృద్ధిలోనుండి బౌద్ధమతావలంబకులచేఁ బ్రోత్సాహింపఁబడి యుండెను. పల్లవసామ్రాజ్యము గూడ నంతరించి పూర్వచాళుక్యరాజ్య సంస్థాపనకాలమున ననఁగా క్రీస్తుశక మేడవశతాబ్దాదిని బౌద్ధమతమునకు సంపూర్ణముగ దేశమునుండి యుద్వాసన మిప్పింపబడి యుండుటచే, హింసింపబడిన బౌద్ధులకు ప్రాణత్యాగమో మతమును పరిత్యజించుటయో, లేక మతాభిమానముచే విదేశముల పాలగుటయో తటస్థించుచుండెను. ఈ కాలముననే, కడసారి యాంధ్రుల సాహసిక జీవనమునకు నూతనోజ్జీవము గల్గింపబడియుండెను.

జ్ఞాపికలు :

1 History of Burma by Sir A P Phayre p 24
2 Indian Architecture, page 103.
3 History of Burma by Sir A Phayre, page 24
4 Note on Mon by Lieut Gen A Fytche in 'Burma' Vol I, page 125
5 A short history of Burma, by S W Cocks M A Chap II
6 History of Pegu, by Sir A Phayre in A S J
7 Sir Arthur Phayre : History of the Burma Race A S J No 1, 1864, no II, 1868
8 Sir Arthur Phayre, History of Burma page 30
9 Ibid
10 Huntir's Orissa Vol I page 197

11 Sir Walter Elliot, 'Numismata Orientala, page 48 కళింగదేశములోని కాళింగులును, ఆంధ్రులును, ఒక్కతెగలోనివారేయని యాంధ్రచరిత్రకారుని యభిప్రాయము అదియుగాక కళింగము ఉత్తరకళింగము, మధ్యకళింగము, కళింగము, అని మూఁడు విధములుగ నుండెననియు నుత్తరకళింగము, ఈ కాలవు ఒరిస్సా యనియు, మధ్యకళింగము గంజాముమండలములోని ముఖలింగ ప్రాంతమనియు, కళింగము గోదావరివఱకు గల యాంధ్రదేశమునకు నామాంతరమనియు, కన్నింగుహాముగా రభిప్రాయపడుచున్నారు ఈ కళింగమునకే త్రికళింగమని నామాంతరముండెననియు, నదియేత్రిలింగమని సాధురూప మయ్యెననియుఁ జెప్పుదురు వీనినన్నిఁటిని పైని పేర్కొని యుండెను
12 Huntir's Orissa Vol 1 page 188
13 History of the Burma race by col A P Phayre A S J No I,1864, No II, 1868
14 History of Burma by Sir A P Phayre page 31
15 Mukherji's Indian shipping Etc page 146
16 Mukherji's Indian shipping page 146
17 ibid
18 Fah-ian Leggee, page 113
19 Fah-ian Leggee, page 111
20 ఆంధ్రులచరిత్రము, పూర్వయుగము పుట 250
21 Rawlinson's Intercouse with Indian and the Western World, page139.
22 Barnet's South Indian Paleography page 31
23 Barnet's South Indian Paleography page 31
24 ఆంధ్రులచరిత్రము, పూర్వయుగము పుట 251-252.
25 Mukherji's Indian shipping page 14
26 Mukherji's Indian shipping page
27 Mukherji's Indian shipping page 150 & Bombay Gazetter Part I, vol I, page 93
28 Mukherji's Indian shipping page 119

( ఆంధ్ర పత్రిక- సంవత్సరాది సంచిక, 1922 మే )

గమనిక · ఈ వ్యాసం దాదాపు యధాతధంగా గ్రంథంలో 6వ అధ్యాయంగా ఉన్నది

అనుబంధం – 2

# ప్రాచీనాంధ్రదేశపు వర్తకపరిస్థితులు

భరతఖండముయొక్క ప్రజాజీవనమందు వృత్తులనుబట్టియే వర్ణాశ్రమ ధర్మము లేర్పడినట్లు చరిత్రకారు లూహించుచున్నారు. ఈ వర్ణాశ్రమములు కాలక్రమముగా నేర్పడినవి కాని యొక్కసారిగా నొక్క కాలమున ఋషుల అను శాసనముల వలన నేర్పడలేదు. వర్ణాశ్రమ ధర్మములు హిందూసంఘము జీవకళతో నున్నంత కాలము ప్రజల వృత్తుల కనుగుణ్యముగ నుండెను. ఆకాలమున వృత్తిని మార్చుకొనిన బ్రాహ్మణుడు క్షత్రియుడగుయు; క్షత్రియుడు బ్రాహ్మణుడు లేక శూద్రుడగుటయు, వైశ్యుడు క్షత్రియుడు లేక బ్రాహ్మణుడు-శూద్రు డగుటయు, శూద్రుడు వైశ్యుడు లేక క్షత్రియుడు బ్రాహ్మణు డగుటయు సాధారణముగ సంభవింపుచుండెను.

వర్ణాశ్రమధర్మము లేర్పడు కాలమున బ్రాహ్మణ క్షత్రియ శూద్రులుగాక, స్వతంత్రవృత్తులుగలిగిన సామాన్య ప్రజాసంఘ మొకటియుండెను. వారు 'విశాః' అని పిలువబడుచుండినటుల వేదములయందుగలదు.

ఈ సామాన్యప్రజ దేశమునందు ఆర్థిక పరిశ్రామిక కృషిజీవనమును నిర్వహింపుచుండిరి. బ్రాహ్మణులు వైదికజీవనమును, క్షత్రియులు క్షాత్రమును, శూద్రులు దాస్యమును నెరవుచుండిన మిగిలిన ప్రజాహిత జీవనమును 'విశాః' నడిపించుచుండిరి. ఈ విశాః శబ్దభవమే వైశ్యుడు. వైశ్యుడు తనవృత్తినిబట్టి మూడవ వర్ణమువాడుగ బరగెను

ఒకకాలమున వైశ్యుడు ఆర్థిక జీవనముతోబాటు భూమిని సేద్యము సేయుచు పంటలు పండించుచుండెను. ఏలకోగాని, కొంతకాలమగునప్పటికి వ్యవసాయవృత్తిని శూద్రుడు స్వీకరింటయు వైశ్యుడు వదలుటయు సంభవించెను. ఇది యెపుడెట్లు సంభవించెనో తెలిసికొనుటకు సాధనములు లేవు. భరతఖండమందు ద్రావిడ దేశమునందు తప్ప వైశ్యు లన్నిచోట్లను గలరు. ఆర్య వైశ్యులెప్పుడు మన యాంధ్రదేశములోనికి వ్యాపించిరో తెలిసికొనలేము. కాని యిపుడు కొందరు వైశ్యులు ఆర్యవైశ్యులమని పిలచుకొనుచున్నారు.

మనదేశమందు ఆర్యసంతతి వైశ్యులుగాక అనార్యసంతతి వైశ్యులు గూడ నున్నారు చాల కాలమువఱకు నీ రెండు సంఘములవారు నొకేసంఘముగ నుండినను ఇపుడేలకో రెండు తెగలవారుగా నేర్పడియున్నారు ఇందులకు కారణము లిచ్చట నన్వేషింపవలసిన యావశ్యకత లేదు

ఆంధ్రవైశ్యులకు కోమటి పేరువచ్చుటకు కారణము తెలియదు. కాని యించుమించుగా పంద్రెండవ శతాబ్దారంభమునకు బూర్వము వర్తకము చేయు వైశ్యులకు కోమటి పదము పర్యాయపదముగా వాడబడుచుండుటను ప్రాచీన శాసనములందు గాంచుచున్నాము

వైశ్యులు (కోమట్లు) ఆర్థికజీవనమందు విశేష ప్రతిభావిశేషములను మొదటి నుండియు జూపుచువచ్చిరి సంస్కృత వాఙ్మయమునందు కోమట్లు వైశ్యులని బిలువబడుచుండినను ఆంధ్రదేశమునందు క్రీస్తుశకారంభమునకు నాలుగైదు శతాబ్దములు పూర్వమును, తరువాతను జనులు మాటాడు చుండిన ప్రాకృత భాషయందు శేర్ అని బిలువబడుచుండిరి. ఇపుడు మనము మాట్లాడుకొనుచున్న తెలుగుభాషలో నీ శేర్ పదము, సెట్టిగ మారి పోయినది. సెట్టి యనగా మనము వర్తకుడు, కోమటి అను అర్థమునం దుపయోగించు చున్నాము.

ఆంధ్రదేశమునందు లభించిన ప్రాకృత శాసనములందు శేర్ పదము కానుపించుచున్నది. శేర్‌లు వర్తకము చేయుచు, వాణిజ్యాభివృద్ధికై విదేశములకేగి దేశమున కైశ్వర్యమును సమకూర్చి యుండిరి మనదేశమునందు పుణ్యము కొరకు బౌద్ధాలయములందు అఖండదీపములు బెట్టింటకై ధనమును వినియోగింపు చుండిరి భిక్షువులకు వర్షఋతువునందు చాతుర్మాస్యలు చేయుటకై కొండలు దొలిపించియో, రాతితో గట్టించియో విహారములను, బుద్ధుని పూజాదులకు చైత్యములను నిర్మింపుచుండిరి

శేర్ (లేక సేర్) పదము వర్తకులకు పర్యాయపదముగా నుండిన బౌద్ధయుగమున, ఆంధ్రదేశము వర్తకమువలన విశేషైశ్వర్యము ననుభవించినటుల చరిత్రలు నుడువుచున్నవి ఆకాలమున ఆంధ్రచక్రవర్తులనియు, మగధ చక్రవర్తులనియు బ్రఖ్యాతిగాంచిన శాతవాహనులు లేక ఆంధ్రభృత్యులు పూర్వపశ్చిమ సముద్రములను దాకి వింధ్యాద్రి మొదలుకొని కాంచీపురమువరకు గల దక్షిణాపథము నేలుచుండిరి. శాతవాహనుల కాలమున ఆంధ్రుల విదేశ సముద్రవాణిజ్యము లుచ్ఛస్థితియందుండెను. పూర్వదిశను చీనా, జపాను దేశములతో మొదలుకొని పశ్చిమమున రోము, బాబిలోను, అస్సీరియా, ఐగుప్తదేశములవరకుగల సకల ద్వీపములు దేశములతోడ, ఆంధ్రసేర్‌లు

నౌకలమీద సరుకుల గొంపోవుచు, తీసికొనివచ్చు చుండిరి. ఆకాలపువర్తకము విశేషలాభకరముగా నుండెను చీనా చరిత్రకారులయొక్కయు, యాత్రికుల యొక్కయు వ్రాతలే దీనికి తార్కాణములు మలాకా ద్వీపకల్పము మొదలుకొని, బర్మాదేశమువరకుగల ఆంధ్రవర్తకసంఘముల వలస పట్టణములే సాక్ష్యములు

అవిషయ మటుండనిండు వర్తకమునందు విస్తారము లాభము వచ్చు చుండిన కారణమున పూర్వపువర్తకులు తమలాభము చెడిపోకుండుటకును, వర్తకమెల్లపుడు తరతరముల వరకు నిర్విఘ్నముగ సాగుచుండుటకును తమ చేతనయినంతవరకు కట్టుబాట్లను, నియమములను చేసికొని యుండిరి. అందుల కనుకూలముగ దేశమునేలుచుండిన రాజులు (ఈ కాలమునందువలె గాక) వర్తకులకు అభయమిచ్చి దేశహితమును గోరుచు, వర్తకాభివృద్ధి కనువగు మార్గముల నేర్పరచుచుండిరి వర్తకము విశేషముగ జరుగు పట్టణములందును, రేవు స్థలములందును సరిహద్దురాజ్యముల ప్రాంతము లందును సుంకాధికారుల నియమించుచు, నభయశాసనము లిచ్చియుండిరి.

పూర్వపు వర్తకులు తమ వర్తకమును తరతరములవరకు నిరాటంకముగ చేసికొనుటకై కొన్ని కట్టుబాట్లు చేసికొని యుండిరని చెప్పితిమి గదా! ఆకట్టుబాట్లను తెలిసికొన వలయుననిన పూర్వకాలపు వర్తకసంస్థలు, లేక వ్యవస్థలను పరిశీలించ వలయును బౌద్ధయుగమునకు బూర్వమునుండియు, వర్తకులు కార్మికులు మున్నగు వారు సంఘములక్రింద నేర్పడియుండి ఆసంఘములో నొకనిని తమకు నాయకునిగా జేసికొని యాతని యాజ్ఞానుసారము వ్యవహరించుకొను చుండిరి అట్టిసంఘములు, ఇంచు మించుగా ప్రతిపట్టణమునందుండెను. వానిని వ్యవహారభాషయందు సభలనియు, పూగశ్రేణులనియు పిలుచుచుండిరి. ప్రజాజీవనమునకు ముఖ్యము లయిన ప్రతివిషయమునకొక సభయుండెను. ధర్మసభలు, వర్తక సభలు, కార్మిక సభలు, మొదలగున వనేకము లుండెను సభలకు శ్రేణులను నామముగూడ బరగుచుండెను. పూగశ్రేణి పదము, వృత్తిని బట్టి యేర్పడుచువచ్చిన వర్తక సంఘములకు (Guilds) పయోగింపబడును. కొన్ని తావులందు వర్తకులు కొందఱు భాగస్వాములుగా నేర్పడి సమిష్టివ్యాపారము చేసికొనుచుండుటయు గాననగును అట్టి శ్రేణులను జనులు సంభూయ సముత్థానశ్రేణులని బిలుచుచుండిరి అట్టి వానిని యిప్పుడు మనము ఇంగ్లీషునందు (Merchant Corporation) అని బిలచెదము ఈ ద్వివిధ శ్రేణులందును వర్తకులకు ఆర్థిక జీవనమునకు పరస్పర సహకారత్వము (Cooperation) ప్రధానాంగముగ నుండుచు వచ్చెను ఇట్టి పూర్వపు వర్తకుల వర్తక సంప్రదాయము లనేకములు

నేటి వఱకును గానుపించుచున్నవి పూగ శ్రేణియందలి సభ్యులు శలాకల వలన నౌకనాయకుని యెన్నుకొనుచుండిరి అతడు పూగశ్రేణి కధ్యక్షుడై శ్రేష్ఠియని బిలువబడుచుండును. శ్రేష్ఠియన మామూలు అర్థమటుంచినను కొందఱి మతము ప్రకారము ప్రాకృతభాషాపదమగు సేఠ్ నకు సంస్కృతము శ్రేష్ఠి కావచ్చును మొట్టమొదట శ్రేష్ఠి పూగశ్రేణి కధ్యక్షునికే యుపయోగింపబడినను రానురాను శ్రేణిలోని ప్రతి సేఠ్‌నకును వినియోగింపబడ నారంభించెను. అందుచేతగాబోలు మనవైశ్యులు శ్రేష్ఠిపదము కులగౌరవ సూచకముగా నుపయోగించుకొనుచున్నారు ఈ శ్రేష్టి తిరిగి చెట్టిగ మారిపోవుచున్నది

వర్తకులకు వలెనే ఇతర సంఘములవారికి గూడ నిట్టి శ్రేణులుండినట్లు గానబడుచున్నది ఈ శ్రేణులు లేక సభలందు శ్రేష్ఠితో గలిపి ౫ గురు సభ్యులుండిరి వీరు ఆయా సంఘములచే నెన్నుకొన బడినవారు. వీరి యెన్నికల విధానము శలాకలవేసి (వోట్లు) చేయుచుండినటుల బౌద్ధగ్రంధములందు గానబడు చున్నది. ఈ పూగశ్రేణులే కాలక్రమమున పూర్వ వైభవమును గోలుపోయి కులపంచాయితీలుగ మారిపోయినవి భాగస్వాములుగ వర్తకము చేసుకొనుచు సంభూయ సముత్థాన శ్రేణులక్రింద నేర్పడిన వర్తకులు కర్మకారులు సరకుల నెగుమతి దిగుమతి చేయుచుండిన బిడారులు సార్థవాహులు మున్నగువార లనేకులు ఒక్కొక్క సమితి (కంపెనీ) శ్రేణిగా నేర్పడి తమ వ్యాపారమును జేసికొనుచుండిరి ఇట్టివానికి నైగమ సభలని గూడ మరియొక పేరు గానవచ్చు చున్నది

ఈ వ్యవస్థలన్నియు, నాంధ్రదేశమున బౌద్ధయుగమున (క్రీ పూ. ౪౦౦ మొదలు క్రీ.శ. ౪౦౦ వరకునూ) నూతనశక్తితో వర్ధిల్లి యుండెను. శ్రేణులీకాలమున గోరి లేక గోష్టియని బిలువ బడుచుండెను గోరి ప్రాకృత పదము దాని కర్థము చెప్పవలసిన ఈకాలమున మన ముపయోగించుచున్న ఉపసంఘము లేక యింగ్లీషున 'కమిటీ' యని చెప్పవలయును. శాతవాహ కాలమున ఆంధ్రవైశ్యులు, విశేషముగ వర్తకముచేయుచు లాభమును సంపాదించి యుండుటచేత నీ పూగశ్రేణులు, నైగమసభలు విశేషముగ ప్రబలి యుండెను. శాతవాహనుల కాలమున వర్తకులకు మాత్రమేగాక మతకార్యములను నిర్వరించువారికిని దేవ ధర్మ కార్యముల జరుపువారికిని యితర పౌరజనోపయోగకరము లయిన కార్యములు నడిపించువారికిని ధర్మపౌరసభలు, మిక్కుటముగ నుండెను దేశమందంతటను వ్యాప్తములయియుండెను ఇట్టివే నేతగాండ్రకు, గాంధికులకు (ఓషధులు తయారుచేయువారికి) ధాన్యక శ్రేణులకు (ధాన్యము వర్తకము చేయువారు) తిలఘాతకులకు, కుమ్మరివారికి,

కమ్మ (కర్మ) జాతులకును ప్రత్యేకసభలు లేక పూగశ్రేణులుండెను ఈ శ్రేణులు లేక గోటుల (గోరి శబ్దభవమే 'కూట'మని యూహింపవలసి యున్నది.) (బహువచనం గోరి) కు అన్నింటికి క్రమమైన నియమములుంటుడుటచే చాలకాలము మంచిస్థితియందుండెను. ఇప్పటికాలపు బ్యాంకుపద్ధతులమీద వర్తకులకు, యితర కార్మిక సంఘములకు అప్పుగా ధనము నిచ్చుటకును, దాచి వడ్డినిచ్చుటకును కూడ కొన్ని గోటులుండెను. జనుల కెంత ధనావశ్యకత కలిగినను, యా సభలవారు నూటికి ౫ మొదలు ౭ వరకు మాత్రమే వడ్డీ గైకొనుచుండినట్లు గాన్పించును. అనగా ఒకప్పుడు ఈ వర్తకగోష్ఠులే, యీ పనినిగూడ నిర్వర్తింపుచుండెను ఈ నిగమసభలవద్ద ప్రజలు తమ సొమ్మును శాశ్వతముగను భద్రముగను దాచుకొనుచుండిరి. వీరు తరతరముల వరకు అసలు నివ్వకయే, వడ్డినిమాత్రమునిచ్చుచుండిరి. ఇట్టి నిగమసభలనేకములు నేటి గుంటూరు జిల్లాలోని భట్టిప్రోలు స్థూపమునందు దొరికిన ప్రాకృత శాసనములందును, బొంబాయి రాజధానియందు దొరికిన ఋషభదత్తుని గోవర్ధన శాసనమందును పేర్కొనబడినవి దేశమునందెట్టి, రాజకీయ విక్రాంతులు పుట్టుచుండినను, యీనైగమముల వలనను, గోష్ఠులవలనను వర్తకము మొదలయినవి నిర్విఘ్నముగా సాగుచుండుట తటస్థించెను.

శాతవాహనుల కాలమున ఆంధ్రమహాసామ్రాజ్య మేర్పడెను. అప్పుడు ఆంధ్రచక్రవర్తులు విదేశములతో రాయబారములు సల్పుచు మైత్రి నెఱపుచు వర్తకులకు విదేశసముద్రవాణిజ్యమునకు తగుప్రోత్సాహమొసంగిరి అట్టి సమయములందు వర్తకులు సాహసికులై విదేశగమనంబు సేయుచు వర్తకమును చేసికొనుచుండిరి. ఇందులకు దృష్టాంతము లనేకములు గలవు వర్తకలాభమువలన గలిగిన ప్రోత్సాహకారణమున మన వర్తకులు ప్రజలు సముద్రాంతర ద్వీపదేశములకు వలసబోవు చుండిరి. ఈ వలసబోవు వాంఛ శాతవాహనుల కాలమున నుదయించి క్రమక్రమముగా పల్లవరాజుల కాలమున రాజకీయ పరిస్థితుల తోడ్పాటునొంది మిక్కుట మయ్యెను మన దేశమునకు పదునాఱవ శతాబ్దాంతమున వర్తకముచేయు తలంపుతో నింగ్లాండు దేశమునుండి యేతెంచినట్టి తూర్పు ఇండియా వర్తక సంఘము వంటి వర్తక శ్రేణులెన్నియో, క్రీస్తుశకారంభమునకు పూర్వమునుండి, విదేశములకు బోవుచు,వలసలు స్థాపించి క్రమముగా రాజ్యములు నిర్మింపగలిగియుండెను. ఈ ప్రయత్న ఫలములన్నియు, మనదేశములో నాఱవశతాబ్దముతో నంతరించి పోయెను. ఇందులకు కారణము బౌద్ధమత వినాశము. ఆంధ్రదేశపువర్తకపు రేవులనుండి,

చీనా, జపాను, బర్మా, సయాం, కాంబోడియా, జావా, బోర్నియో, సుమత్రా, దేశద్వీపాదులకు వలసబోయిన, మన పూర్వులు, మాతృదేశముతో సంబంధమున్నంతవరకు తమ జాతీయ వ్యక్తిత్వమును గాపాడుకొనిరి కాని కడపటి దేశములందు, మాతృదేశసంబంధమును మరచిపోయి తమ ప్రత్యేకత్వమును గోల్పోయిరి చరిత్రయందిపుడువారి సాహసకృత్యములు దప్ప వేరేమియు వినవచ్చుట లేదు ఆయా దేశములందు మనపూర్వుల సంప్రదాయాదులు భాషయందును, నాగరికతయందును, లిపియందును గానుపించుచున్నవి. మరియు మన పూర్వుల సాహసికజీవనమును, పూర్వపుటౌన్నత్యమును మరచిపోయిన మనకు స్మరణకు దెచ్చుచున్నది

పూర్వకాలపు టాంధ్రరాజులు, వర్తకులు వర్తకసంఘములు సాహసముతో విదేశముల కరుగుచు వర్తకము చేయుచు, దేశమునకు లాభమును సమకూర్చుచుండ, తమచేతనైనంతవఱకు తదభివృద్ధికి సహాయులగుచు బోషించుచుండిరి రేవులయందు దోపిడిగాండ్రవలనను, సముద్రపుదరిని ఓడదొంగలవలనను, దుర్నీతిగల రాజకీయోద్యోగుల వలనను వర్తకమున కవరోధము గలుగకుండ నెప్పటి కప్పటి కప్పుడు శాసనముల ప్రకటించి అభయమొసంగి యుండిరి. శాతవాహనుల తరువాత, పల్లురాజులు చాళుక్యుల కాలములయందు వర్తకపరిస్థితులెట్లు మారుచుండినవో దెలిసికొనుట కంతగా ఆధారములు గన్పట్టవు. కాని మొత్తముమీద క్రీస్తు శకారంభ కాలపు పరిస్థితులే, కొద్దిగా మార్పు చెందుచుండినట్లూహింపవచ్చును

రాజులు వర్తకుల సౌకర్యముకొరకు అమ్మకమునకు ఇతర దేశపు అమూల్యములైన వస్తువులలో చాలభాగము వారే కొనుచుండిరి. రేవులందును, యితర పట్టణములందును, దేశమునందు రాజబాటలు కాలిత్రోవలురస్తాలందు వర్తకుల కడ సుంకముల దీసికొనుచు అచ్చుటచ్చుట సేనల నిలిపి ప్రజలకు వర్తకమునకు ముఖ్యముగ నావశ్యకమయిన శాంతిని చేకూర్చియుండిరి. వర్తకులకడ నీకాలపు వృత్తిపన్ను, రాబడి పన్ను మొదలగు పన్నులువంటి పన్నులు పూర్వపు రాజులును, మండలేశ్వరులను, గూడ గైకొనుచుండినట్లు గానుపించును

వర్తకుల కభయశాసనములిచ్చి పోషించిన ప్రభువులనేకులు గలరు వారి అభయశాసనములన్నియు మనకు లభింపని కారణమున అప్పటి కాలపరిస్థితులు పూర్తిగా దెలియరావు అయినను కాకతిగణపతిదేవుడు, అనపోతరెడ్డి, అనవేమారెడ్డి, రెండవ హరిహరరాయ మహారాయల శాసనములు మాత్రము కొన్ని మనకు లభించినవి.

ఈ శాసనములందు గానబడు మన పూర్వపు రాజుల యొక్క ఆర్థిక, వర్తక, రాజనీతి చాల పరిశీలింప దగ్గది. పూర్వపు రాజులెల్లరు ''వర్తకము బాగుగా సాగుచుండవలెను విశేషముగ లాభము వర్తకులకు రావలెను. అందు మూలముగా దేశము భాగ్యవంతము గావలెను '' అను తలంపు తోడ కట్టుబాట్లను చేయుచు వచ్చిరి సుంకాదాయవిధానము, చాలవరకు నిప్పటి రక్షక పద్ధతి ననుసరించి యుండెను కాని యందు రాజులు, దేశపరిస్థితులను పూర్తిగాగ్రహించుచు నెప్పటికేది ప్రస్తుతమో అప్పటికారీతి రక్షణ పద్ధతియో, స్వేచ్ఛాపద్ధతియో రాజనీతి నడిపించుటయు కలదు అట్లుగావించిన వారిలో కొండవీటి అనపోతారెడ్డి యగ్రగణ్యుడు అతడట్లే సుంకమును నిర్ణయించుచు వచ్చెను.

ఈ ఆర్థిక నీతిరహస్యమును తరువాత కాలపు రాజులు మన దురదృష్టవశమున మరచిపోయిరి పదునైదవ శతాబ్దమునందు మన వెర్రిరాజులు దేశక్షేమము నెరుంగక గొప్పకొరకై స్వదేశ వర్తకుల ప్రోత్సహించుట మాని, విదేశ వర్తకులకు విశేష సదుపాయములు గలుగజేయుచు, తుదకు స్వదేశవర్తకులను విధ్వస్తము గావించి యుండిరి. అట్లు దారిచూపినవారిలో ప్రథములు విజయ నగర చక్రవర్తులు వీరు దేశీయ వర్తకులకు పూర్వపురాజులవలె ప్రోత్సాహమివ్వక బుడతకీచులకు సదుపాయములు గలిగించుచు విదేశస్థులీదేశమున సుస్థిరముగా బాదుకొల్పుటకు అవకాశ మిచ్చియుండిరి తుట్టతుదకు వారిమూలమున చిరస్థాయిగ మనదేశమునకు పారతంత్ర్య మాపాదింపజేసి దాస్యముపెట్టించిరి. ఈ పద్ధతిని మనహిందూరాజులకడనుండి మహమ్మదీయ ప్రభువులు నేర్చుకొనిరి. అట్లగుటవలన ౧౭, ౧౮ శతాబ్దములందు, యింగ్లీషు, ముందు పరాసు, బుడతకీచు వర్తకులక్రింద మన సుప్రసిద్ధవైశ్యకుటుంబములకు జెందివారిలో ననేకులు స్వాతంత్ర్య వర్తకమును విడనాడి దుబాసులుగ పనిచేయవలసినవారైరి. ఇందువారి తప్పేమియులేదు. దేశహితమెరుగని రాజులు, కేవలమెల్ల వేళలందు కవి, బ్రాహ్మణుల స్తోత్రపాఠములకులోనై, విషయలంపటులయి పూర్వ సంప్రదాయములను మరచియుండి, రాజ్యపాలనము సేయుచుండ ఆంధ్రవర్తక సంఘములకు నిట్టి దౌర్భాగ్యస్థితి వాటిల్లినది పూర్వపు రాజనీతిజ్ఞులరహస్యములను గ్రహించినవారగుటచే ఆర్థికనీతి, రాజనీతి ననుసరించియే నడుపుచు వచ్చిరి అంతదూరము పోనేల! ఇప్పటి ఇండియా ప్రభుత్వమునందలి రాజనీతిగూడ సామ్రాజ్యవర్తకపు ఆర్థికనీతి ననుసరించియే, మన దేశము, వినాశకరముగనున్నను, నడుపబడుచున్నది

అనుబంధం : 3

## ప్రాచీనాంధ్రులు : వారి వలసరాజ్య చిహ్నాలు

మనపూర్వుల చారిత్రవైభవం తలుచుకున్నప్పుడు ఆ కాలమంతా స్వప్నంలా గుంటుంది ప్రాచీనాంధ్రులు సముద్రాలు దాటి వలసరాజ్యాలు స్థాపించారు అంటే అందులకు ప్రబలమైన తార్కాణాలు నేటికీ మనభాషలో, సారస్వతంలో నిలిచి ఉన్నాయి, చూడండి. ఒక ఉదాహరణం : సముద్రయానం చేసేవారికష్టాలు తెలియచేసే మాట ఒకటి మనభాషలో నిలిచి పోయింది 'ఈ ఓడ ఈ తవాయి దాటితే చూద్దాము.' తవాయికి నేడు ఇట్లా ఇంకో అర్థం వచ్చింది కాని అసలు తవాయి సముద్రం అవతల, బర్మాలో ఉండే ఒక రేవు పట్నం అక్కడకు సముద్రం దాటి వెళ్లడం, తరువాత తవాయి రేవుదాటి వెళ్లడం పూర్వకాలంలో చాలా చిక్కులతో కూడిన ఓడ ప్రయాణం అయి ఉండేది

మనదేశం సముద్రతీరాన్ని చేరి ఉండడం, కృష్ణా గోదావరిలాంటి మహానదులు ఉండడం ఆంధ్రులకు పూర్వము సాహసం, శక్తి, ఉత్సాహం కలిగించాయి అదిగాకుండా ఆనాడు మహాసామ్రాజ్యాలు వైభవంతో విస్తరించి ఉండడంచేత ధనానికి, ధనికులకు లోటు లేకుండా ఉండేది పూర్వం మనవాళ్ల తూర్పున ఉన్న సముద్రాన్ని మహోదధి అని పిలిచేవారు. దానికి దక్షిణంగా ఉండే సముద్రాన్ని రత్నాకరం అనేవారు. ఈ రెండు పేర్లు అన్వర్థకమైన పేర్లే సుమండీ రత్నాకరంలో పగడాలు, ముత్యాలు దొరికేవి రత్నాకరానికి అవతల సింహళ ద్వీపం ఉండేది అక్కడ రత్నాలకు అప్పటికి ఇప్పటికి కొదువలేదు భయంకరమైనది కాబట్టి తూర్పు సముద్రాన్ని మనవాళ్లు మహోదధి అన్నారు

భరతఖండంలో ఉన్న అన్ని ప్రాంతాల వారిలోను మొదటినుంచి చాలా నాగరికులయినవారు ఆంధ్రజాతీయులు

క్రీ పూ.చాలా శతాబ్దాలనుండి ఆంధ్రులు నాగరికులై ధనవంతులై యుండడంచేతను, వారికి సాహసం ఉత్సాహం ఎక్కువగా ఉండడంచేతను సముద్రాన్ని అంటి వారిదేశం వ్యాపించి ఉండడంచేతను సముద్రయానానికి ప్రాచీనాంధ్రులే మొదట దారితీశారు ఇది క్రీ.పూ 7,8 వందల సంవత్సరముల నాటి మాట. ఇంకా ప్రాచీనమంయితే అయియుండవచ్చును అటు అరేబియాదేశము మొదలుకొని తూర్పున చీనాదేశము వరకు ఉండే

సముద్రతీరాన్ని అంటివుండే రాజ్యాలనీ సీమలనీ ఆంధ్రవ్యాపార ముఖ్యులు పెద్దపెద్ద ఓడలలో వెళ్లి, అక్కడ దొరికే వస్తుసామగ్రిని కొనితెస్తూ, ఇక్కడ దొరికే వస్తువులను అక్కడికి తీసుకొని పోతూ వ్యాపారం సాగించేవారు. అయితే తూర్పు సముద్రతీరము ననుసరించి ఉండే ద్వీపాలు, దేశాలు ఆంధ్రులను, వారితరువాత ఇతర భారతీయులను ఆకర్షించినట్లు పశ్చిమ దేశములు ఆకర్షించలేదు

వర్తకం చేసుకోవడానికి బయలుదేరిన సాహసికులతో ఆయా కొత్త ద్వీపదేశాంతర పట్టణములు చూచి, అక్కడ వీలుగా ఉన్నచో వలసపోయి ఉందామని ఆవేశం ఆంధ్రులకు మొదట కలిగింది. ఆంధ్రుల అధినివేశ రాజ్యస్థాపనము ఒక్కసారిగా, ఒక్కనాడు సాగలేదు. అది క్రమంగా, నెమ్మదిగా, కొన్ని శతాబ్దములపాటు సాగింది; కాని రాజులదృష్టి ఆకర్షించకుండా మాత్రం సాగింది. వారిపోషణ అసలేలేదు కాని ఐచ్ఛకంగా సాగింది.

బౌద్ధం వెల్లివిరిసి బ్రాహ్మణధర్మాన్ని ఈ దేశమునుండి వెళ్లగొట్టినవాడు బ్రాహ్మణులు, తాపసులు సముద్రం దాటి వ్యాపారులు చూచివచ్చిన దూర దేశాలకు వలస పోయారు. అందుచేతనే వలసరాజ్యాలలో బౌద్ధం కంటె ముందు బ్రాహ్మణమతమే వ్యాపించినట్లు కనబడుతుంది. ఈ దేశంలో బ్రాహ్మణధర్మం మళ్లీ విజృంభించి, బౌద్ధమతాన్ని దేశంనుండి తరిమివేసిననాడు బౌద్ధమతం ముందుగా బ్రాహ్మణమతం వలస పోయిన దేశాలకే పోయి తలదాచుకొన్నది. ఆంధ్రదేశంనుండి పోయిన బ్రాహ్మణ, బౌద్ధ మతాలు జావా బలిద్వీపాలలోను, సయాం, కాంబోడియా, అన్నాందేశాలలోను నేటికి కూడా కనిపిస్తున్నవి. అంతెందుకు, సయాంలో కనపడే బ్రాహ్మణ సంప్రదాయములు, అన్నాం లేక చంపాదేశాలలో కనపడే మహాయానబౌద్ధ సంప్రదాయాలు, జావా సుమత్రా బలిద్వీపాలలో కనపడే బ్రాహ్మణ సంప్రదాయాలు, దేవాలయాలు, శిల్పము, సంగీతము, నృత్యం, నాట్యం మొదలయినవన్నీ కూడా ప్రాచీనాంధ్రుల సాహసకృత్యాలని తలపునకు తెస్తున్నాయి. మనదేశం నుండి మన నగరాలపేర్లు అమరావతి, శ్రీ విజయపురం, సింహపురం, మహేంద్రగిరి ఇత్యాదులు ఆయావలస రాజ్యాలకు పోయి వెలిశాయి. మనదేశం నుండి శిల్పము, చిత్రలేఖనం, సంగీతం, దేశభాషలు, సంస్కృతం, లిపి, ఆచార వ్యవహారాలు ఒకటేమిటి, అన్నీ ఆదేశాలకు ద్వీపాలకు పాకిపోయినవి. ఆ దేశాలు నేడు మనం చూడబోయినట్లయితే ప్రాచీనాంధ్ర వైభవం స్మరణకు వస్తుంది.

ప్రాచీనాంధ్రులు మహోదధిని దాటి, తవాయి దాటి, సువర్ణభూమి అనే పెగూ చేరి, కొన్ని శతాబ్దము లయినతరువాత అక్కడ ఒక రాజ్యంకూడా

స్థాపించారు. ఆరాజ్యం స్థాపించిన రాజవంశమువారిని తలైంగులంటారు, బర్మాదేశచరిత్రలో. తలైంగులంటే తెలుగుదేశమువారే! కృష్ణా గోదావరీ తీరవాసులే! ఎప్పుడు వలసపోయినారో మాత్రం తెలిపే ఆధారాలు లేవుగాని బర్మాచరిత్ర తలైంగులు చాలా గొప్పవారని మాత్రం తెలుపుతుంది

తలైంగులు రాజ్యంస్థాపించడానికి పూర్వం ఆంధ్రులు తవాయిదేశం దాటి, మలయా ద్వీపకల్పం దాటి, సుమత్ర, జావా, బలిద్వీపములు దాటి, అచ్చటచ్చట వర్తకస్థానములు ఏర్పాటుచేసుకొని, సముద్రతీరాన్ని అంటుకునే ఉన్న సయాం, కాంబోడియా, అన్నాం మొదలైన దేశాలలో వలసలు స్థాపించుకోగలిగారు. ఇందులో విశేషం ఏమిటంటే, ఈ ద్వీపాంతరదేశాలలో వలసరాజ్యాలు స్థాపించింది మొట్టమొదట ప్రాచీనాంధ్రులని మాత్రం స్పష్టమవుతున్నది

ప్రాచీనాంధ్రులు ఆయాద్వీపాంతర దేశములలో ఉన్న అనాగరక ప్రజలకు తమ విజ్ఞానం, నాగరికత, మతము మొదలయినవి అలవరిచి, అక్కడ దొరికే మంచి వస్తువులు, భోగ్యవస్తువులను మన దేశానికి తీసుకువచ్చారు. ఇతర రాజ్యాలకు వ్యాపారార్థమై తీసుకొనిపోయి, లాభాలు గడించి దేశానికి అఖండమైన ధనకనకవస్తువాహన సంపత్తిని చేకూర్చారు. వలసరాజ్యాలను ఇంచుమించుగా ఆంధ్రభూఖండములను చేశారు ఆంధ్రులు అధినివేశ భూఖండాల నుండి బంగారము, సుగంధ ద్రవ్యములు, ఏనుగులు, దంతము, రత్నాలు, పవడములు, ముత్యాలు, గంధసారము, కర్పూరము, చీనిచీనాంబరములు – ఇంకేవేవో అమూల్యము లయినవాటిని తెస్తూ వుండేవారు. ఈ అన్నింటి కేమిగాని, ఆంధ్రులకు నేటివరకు మిక్కిలి ప్రీతికరములయిన రెండు వస్తువులు ఆ వలసరాజ్యాలనుండి తేబడినవి కలవు ఆంధ్రులలో దనాసరీగోంగూర రుచి యెరుగనివారుండరు ఈ దనాసరిగోంగూర ఎక్కడిదో తెలిస్తే మీ రాశ్చర్యపడతారు పెగూ దేశమునకు తూర్పుగా, సయాంకు పశ్చిమంగా తెనాస్సరిం అనే ఒకదేశం ఉంది మ్యాపు చూస్తే కనబడుతుంది. ఈ తెనాస్సరింనుండి వచ్చిన గోంగూరయే దనాసరి గోంగూర అని తోస్తుంది మనం అప్యాయంగా వాడుకునే అల్లం, శుంఠి మలయాద్వీపకల్పము దాటినతరువాత కనిపించే సముద్రాంతర ద్వీపములనుండి కొనిరాబడినవే చూడండి. ఈ లాగే జాళువ, బంగారం, కుందనము, హేమం – ఇత్యాది స్వల్పభేదములుగల బంగారంకూడా ఈవలసరాజ్యలనుండి కొనిరాబడినదా అని తోస్తూ ఉంటుంది. ఈ వలసదేశాలతో సంబంధం పూర్తిగా వదలిపోకపోయినా ఆంధ్రులు పదునాలుగు, పదునైదు, పదునారు శతాబ్దాల వరకు సముద్రయానం చేస్తూ,

సముద్రాంతర ద్వీపదేశాలతో వర్తకం చేస్తూ అక్కడనుండి సరకులు తెస్తూ ఉండేవారని శ్రీనాథుని హరవిలాసంలోని ఉపోద్ఘాత పద్యాలు చాటుతూనే ఉన్నాయి

నేడు జావా, బలిద్వీపాలకు పోయి, మనం చూచివచ్చినట్లయితే ప్రాచీనాంధ్రుల ప్రతిభ అక్కడ స్పష్టంగా కనిపిస్తుంది మనదేశం నుంచి ఆ వలస రాజ్యాలలోకి క్రీ పూ.రెండు మూడు వందల సవత్సరములకు పూర్వము ఆంధ్రులు తమనాగరికతను, విజ్ఞానాన్ని తీసుకొనిపోయి, అక్కడ పాదుకొల్పినట్లు కనబడుతుంది. మన పురాణాలు అందులో ముఖ్యంగా ఆంధ్రులకు ప్రీతికరములయిన రామాయణ, మహాభారతాదులు జావా, బలిద్వీపాలలో జనులను ఆకర్షించి నేటిదాకా నిలిచిపోయినాయి. మన ప్రాచీన వేంగీలిపి ఆ దేశంలోకి ప్రాకింది మన ప్రాచీన పౌరాణిక బ్రాహ్మణమతం ఆ దేశంలోకి వ్యాపించింది మన ప్రాచీనరాజుల పేర్లవంటి పేర్లు ఆరాజ్యాలలో కనిపిస్తాయి. అంతేకాదు, మన ప్రాచీనాంధ్రుల సంగీతాది లలితకళలన్నీ మనం అయితే మరచిపోయినవి ఆ దేశంలో నేటివరకు ప్రాచీనరూపాలతోనే వైభవంగా వెలుగుతున్నాయి. మన ప్రాచీన సంగీతంలో ఉపయోగించిన వాయిద్యాలు కొన్ని వాళ్ల దేశంలో కనబడతాయి మన యక్షగానాలవంటి వీథినాటకాలు అక్కడికి ప్రాకిపోయాయి మన ప్రాచీనుల నాట్యం- చూడండి-గొండ్లి, గంతు, చిందు కురవంజి మొదలయిన నృత్యవిశేషములు కొద్దిపాటి భేదాలతో ఆ ద్వీపాలలో నిలచివున్నాయి అక్కడ 'వయాంగ్' అంటారు తోలుబొమ్మలాటను. ఆ తోలుబొమ్మలాటలో రామాయణ, భారతకథలు ఆడుతారు - మనదేశంలో పాటలు పాడినట్లు పాడి, అంతా మనదేశంలోలాగే. ఆ తోలుబొమ్మలాట మనదేశంనుంచి అక్కడికి పోయింది. అక్కడ నూత్నశోభ గడించింది. మన తోలుబొమ్మలాటకీ, వాళ్ల తోలుబొమ్మలాటకీ చాలా సంబంధం వున్నది ఇక్కడ పాడే రాగాలకీ అక్కడి రాగాలకీ ఏమయినా సంబంధమున్నదేమో పరిశోధన చేయాల్సివుంది

జావాద్వీపమునకు మన పూర్వులు సువర్ణ ద్వీపం అనేవారు సువర్ణ ద్వీపములోను, దానిని చేరియున్న బలిద్వీపములోను ప్రాచీనాంధ్రుల వలస రాజ్యముల ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నవి ఈ ద్వీపాలు దాటిపోతే కనిపించేది సయాందేశము. దీనిని మనవారు శ్యామ అని అనేవారు ఈ శ్యామదేశానికి తొలుత వచ్చిన ఆంధ్రులు మంజీర నదియొడ్డుననున్న ప్రాంతమున నుండిన నాగులు మంజీర దివితాలూకాలో కృష్ణానదికి సమీపంగా పూర్వం ప్రవహించిన

ఒక చిన్న ఉప్పుటేరు పాయ. దానివడ్డున వుండిన పట్నాన్ని కూడా మంజీర అనేవారు. మంజీరనది నేడు మురికికాలవ అయిపోయింది మంజీరపట్టణము నేడు మాజేరు అయింది నేటివరకు మాజేటివారు సుప్రసిద్ధ వైశ్యకుటుంబము వారేకదా!

శ్యామ దేశములో నిలిచియున్న బ్రాహ్మణమతము మన దేశమునుండి గొనిపోబడినదే. దీనికి ఉత్తరంగా కాంబోజదేశమున్నది ఈ దేశానికి ఆంధ్రభూమికి ఉండిన సంబంధం కాంబోజరాజు చరిత్రములో ఉన్నట్లు కనిపిస్తుంది కాంబోజానికి నేటి పేరు కాంబోడియా. అక్కడవున్న అంకోరువాటు దేవాలయం చూస్తే మన అమరావతీ శిల్పము ఇక్కడ మళ్లీ వెలసి, సౌరభం వెదజల్లిందా అని అనిపిస్తుంది అమరావతీ శిల్పానికి, అంకోరువాటు దేవాలయ శిల్పానికి ఎంతో సామ్యం ఉంది. ఆంధ్రుల శిల్పం సముద్రాలు దాటి వచ్చి నూతనశోభ గడించింది యీ అంకోరువాటు దేవాలయములందు ఇది ఒక్కటే చాలు ఆంధ్రదేశానికి, కాంభోజదేశానికి కొన్ని శతాబ్దాలు ఎడతెగని సంబంధం ఉండిందని ఋజువు చేయడానికి. కాంభోజదేశానికి ఉత్తరాన్ని అన్నాం, ఇండోచైనా రాజ్యాలున్నాయి. వీటికి పూర్వపు పేరు చంపాదేశం ఇచ్చట మొదట వలస స్థాపించింది ఆంధ్రదేశీయులు క్రీ.శ. 248లో చండవర్మ అనేరాజు ఆంధ్రదేశాన్నుంచి వచ్చిన ఒక వర్తకునివలన మాతృభూమి గురించి అంతా విని, ఆంధ్రదేశం ఏలుతూవుండే రాజుకు రాయబారం పంపించాడు ఈ రాయబారం వెళ్లిరావడానికి నాలుగేండ్లు పట్టింది. ఆ రాయబారం వచ్చేటప్పటికి ఆంధ్రదేశంలో ఇక్ష్వాకువంశీయుడైన వాసిష్ఠీపుత్ర బాహుబల శాంతమూల మహారాజు రాజ్యంచేస్తూ ఉండేవాడు. అతని రాజధాని ఇపుడు నాగార్జుని కొండదరిని శిధిలావస్థయందున్న విజయపురి అనే మహాపట్నం అక్కడ దొరికిన శాసనం వొకటి బౌద్ధ ఉపాసిక బోధిశ్రీ అనే ఆమె వ్రాయించినది చూస్తే చీనాదేశం మొదలుకొని కాశ్మీరం వరకు ఉండే నానాదేశాలవారు వర్తకులు, మతవ్యాపకులు, తీర్థవాసులు ఆంధ్రదేశానికి తరచుగా వస్తూపోతూ ఉండేవారని స్పష్టమవుతుంది. అంతేకాదు, చంపాదేశంలో కనబడే ప్రాచీనలిపి, ఆంధ్రదేశంలో ఆకాలంలో, అనగా క్రీ.శ. ఒకటి, రెండు శతాబ్దాల నాటి ప్రాచీన బ్రాహ్మీలిపి

చంపాదేశాని కుత్తరంగా ఉండే రాజ్యానికి పూర్వపుపేరు యవనదేశం. ఈ దేశంలో కూడా ప్రాచీనాంధ్రులు వలసస్థాపించారు, మహాయానబౌద్ధం వ్యాపింపచేశారు. చంపా, యవనదేశాలలో నేటివరకు నిలిచియున్న మహాయాన బౌద్ధానికి ప్రాచీన ఆంధ్రదేశంలో వెలిగిన మహాయాన బౌద్ధానికి ఎంతో సన్నిహితమైన సంబంధం కనిపిస్తుంది.

ప్రాచీనాంధ్రుల వలస రాజ్యస్థాపన చరిత్ర వ్రాయడానికి చాలా ఆటంకాలున్నాయి అసలు గ్రంథం అంతా పరాసుభాషలో ఉన్నది కాబట్టి ముందు పరాసుభాష రావాలి. ఆగ్రంథాలు చదవాలి. తరువాత వలందు భాషాజ్ఞానం సంపాదించాలి. అందులో వ్రాయబడిన జావా, బలి, సుమత్రా మొదలయిన ద్వీపాల ప్రాచీన వైభవమంతా తెలుసుకోవాలి. బర్మా మొదలు అన్నాం వరకువున్న సముద్రద్వీపాలను దేశాంతర పట్టణములను అక్కడి వాటి ప్రాచీన శోభను చూచిరావాలి. అప్పుడు గ్రంథాలు మనభాషలో వ్రాయాలి. ఆభాగ్యం ఎన్నడయినా కలిగితే బాగుండును.

ఇంకోవిషయం చెప్ప మరిచిపోయాను. ఫిలిప్పైను దీవులలో మాట్లాడే భాషలో తెలుగుమాటలు – ఇంచుమించుగా నేడు తెలుగుదేశంలో ఉన్న వ్యవహారంలోనే – 190 వరకు ఉన్నాయట. ఫిలిప్పైను భాషానిఘంటువు దొరికితే బాగుండును పరిశీలించడానికి

ప్రాచీనాంధ్రులు తాము ఇతర జాతుల దగ్గరనుండి నేర్చుకోదగిన విజ్ఞానం లేకపోవడంచేత, తమ విజ్ఞానాన్ని నాగరికతను వ్యాపింపచేశారు వారు. తమ భూమివంటి కమ్మని భూమి, తమ విజ్ఞానం వంటి గొప్ప విజ్ఞానం, తమ మతంవంటి మతం, తమ నాగరికతవంటి నాగరికత ఆకాలంలో లేవని నిరూపించారు. వాటి చిహ్నాలు నేటికి తూర్పు సముద్రపు దేశాంతరములందు, దీవులందు నిలిచి ఉన్నాయి. వారు సృష్టించిన మహాసామ్రాజ్యమును మనం తలుచుకొని ఆనందించగలము కాని, ఆ వైభవం అంతా కాలగర్భంలో లీనమయిపోయింది. కాలమంతా తారుమారయిపోయింది. ఆంధ్రజాతిని ఆనాడావేశించిన ఉత్సాహ, సాహస, శక్తులు నేడు కానరావు. వాటి నన్నిటిని కదలించివేసిన కాలప్రభావాన్ని ఎవరు గుర్తించ గలరు? దాని కొకనమస్కారము. ప్రాచీనాంధ్రుల సత్కీర్తి కొక నమస్కారము.

( ఆకాశవాణి, మద్రాసు సౌజన్యంతో భారతి, ఆగస్టు 1939)

# నా కీ గ్రంథరచనయందు దోడ్పడిన గ్రంథములు


Ancient India as Described in Classic Literature - McCrindle.
Archaeological Survey of India - (New Imperial Series) XV.
Bombay Gazetteer
Buddhist India - Rhys Davids
Buddhist Records of the Western World - Beal.
Christian Topography - Cosmos.
Coins of Southern India - Sir W Elliot.
Commerce of the Ancients - Dr. Vincent
Dharmasutra - Baudhayana.
" - Gauthama.
Early History of the Deccan - Bhandarkar
" Indica - Vincent A Smith.
Epigraphical Reports (Madras).
Epigraphia Indica - Vol III, XVI
Fragments - Orme.
Geographical Account of Countries round the Bay of Bengal,A
-Thomas Bowery. (Haklyut Society Publication )
Geography - Ptolemy
Godavary District - Morris
Grammar of the Dravidian Languages - Caldwell
Guide to Sanchi - Marshall.
History of Burma - Sir A.P Phayre.
" India - Elphinstone.
" Indostan - Orme
" Orissa - Hunter
" Pegu - Phayre.
Imperial Gazetter Vol. II.
Indian Antiquary
India in XV Century
Indian Architecture

Indian Scultpture and Painting - Havell
Indika - Ctesias (McCrindle.)
Intercourse between the East and the West - Rawlinson
Indian Shipping & Maritime Activity from the Earliest times, A History of - Mukherjee.
Itsing - Takakasu
Jatakas (Six Volumes) Cowell Edn.
Krishna District Gazetteer.
Life in Ancient India - Miss.Spier
Mahavamso - Turmor
Manual of Budhism - Hardy.
Marco Polo (Yule's Translation)
Natural History - Pliny.
Numismata Orientalia - Sir. W. Elliot.
Origin of the Indian Brahmi Alphabet - Buhler
Periplus of the Erythroean Sea.
Sanchi & its Remains - Maisely.
Tamils Eighteen Hundred years ago, The - V.K Pilley
Thirty years in British India - Bevan
Travels of Hieun Tsiang.
Yuktikalpataru - Bhoja Nripati.
ఆంధ్రుల చరిత్రము (మూడు భాగములు) - చిలుకూరి వీరభద్రరావు
క్రీడాభిరామము - వల్లభామాత్యుడు.
కాశీఖండము - శ్రీనాథుడు
శివరాత్రి మహాత్మ్యము ,,
హరవిలాసము ,,
హరివంశము - ఎఱ్ఱాప్రగడ.

## BIBLIOGRAPHY

*Journals :*

Indian Antiquary, Bombay, Vol XIII, XIX, and XLVIII.

Journal of Royal Asiatic Society, (J R A S), London, 1896

Asiatic Society Journal (A S J.), Calcutta

Quarterly Journal of Mythic Society, Bangalore, Vol II

*Books and Articles :*

Archeological Survey of India, New Imperial Series, Vol XV

Baudhayana Dharmasutra

Beal,S , Buddhist Records of the Western World, London

Bevan, H., Thirty years in British India, Vol I

Bhandarkar, D R , Early History of the Deccan

Bhoja Nripati, Yuktikalpataru.

Bigandot Bishop, Life of Godama

Birdwood, Industrial Arts of India

Bombay Gazetteer, vol I, part I, and vol XIV

Bowerey, Thomas, A Geographical Account of the Countries round the Bay of Bengal, (Hakluyt Society, London?), 1905.

Buhler George, 1898, On the Origin of Indian Brahmi Alphabet.

Burnell, South Indian Paleography

Butterworth,A., & Venugopal Chetty, 1905, Nellore District Inscriptions, vol I, Madras

Caldwell Robert , A Comparative Grammar of the Dravidian or South-Indian Family of Languages (1856, revised 1875, revised by Wyatt, J L & Pillai, T R 1913)

Cocks, S W , A short History of Burma

Cosmos, Christian Topography

Cowell (Ed.), Jatakas (six volumes)

Cunningham, Ancient Geography of India

Cunningham, Bhilsa Topes

Dubreuil, G J , Ancient History of the Deccan

Early Records of British India

Elliot, Sir H , History of India vol. II

Elliot Walter, Numismata Orientala, Coins of Southern India.

Elphinstone, History of India

Epigraph No III-A, 1909

Epigraphia Birmica, vol II

Epigraphia Indica vol III and XII

Epigraphical Reports, Madras, 1910

Fergusson Dr , Tree and Serpent Worship (in India)

Ferguson James, History of Indian & Eastern Architecture, London, 1910

Fytche Lt Gen , Note on 'Mon', Burma, vol I

Gauthama Dharmasutra

Griffiths J , The Paintings in Buddhist cave-temples of Ajanta

Hardy, A Manual of Buddhism.

Havel, E B , Indian Sculpture and Painting, 1908, London.

Hunter, History of Orissa, vol I.

Imperial Gazetteer, New edn., vol II (Oxford, 1908)

Itsing, Takakasu

Krishna District Gazetteer

Leggee, Fah-ian

Local Records vol 9,42 (unpublished ?)

Maisey, Gen F C , 1892, Sanchi and its Remains, London

Major R.H , 1858, India in the Fifteenth Century, Hakluyt Society, London

Marsedan, Asiatic Researches, vol II,IV

Marsedan? Mission Life, May 1867

Marshall, Sir John, A Guide to Sanchi

McCrindle, 1901, Ancient India as Described in Classical Literature, Westminister

- Indika-Catesias

Morris, Henry, Godavary District Gazetteer

Mukherjee, R.K , Indian Shipping and Maritime Activity from the Earliest Times

Orme, Fragments

Orme, History of Indostan, vol I

Periplus of the Erythrean Sea

Phayre, Sir Arthur P , History of Burma

- History of Pegu, A S J 1873
- History of the Burma Race, A S J No 1 and No 2, 1868

Pilley, V K , The Tamils Eighteen Hundred years ago

Pliny, Natural History, vol XII

Ptolemy, Geography

Rawlinson, H G , Intercourse between India and the Western World

Rhys Davids, T.W , 1903, Buddhist India

Spier Mrs , Life in Ancient India.

Smith Vincent A , 1904, Early History of India, 3rd edn , Oxford

- Commerce of the Ancients, vol II

Tavernier, John B., 1678, Voyages, part II, Book I, London

Thurston, Coinages of the East India Company

Travels of Hieun Tsiang

Turnour, Mahavamso

Wheeler Talbois, History of India

Yule, Travels of Marco Polo, vol II.

# పద సూచిక


అజంతా 19
అడ్డిబా (రేవుపట్టణం) 12, 14, 35
అద్దంకి 77
అనపోతారెడ్డి 79-84
అనవేమారెడ్డి / అనవేముడు 82, 83
అబుల్ ఫీడా 72
అబ్దుల్ రజాక్ 92
అభయ శాసనము 62,67,69-71,79-81
అమరావతి 12,17,19,36,40,45
అరబ్బులు 26,29,31,38,91-93
అరాకాను 62,95
అరిష్ట శాతకర్ణి 41
అరీలియస్ 32
అర్జునుడు 8
అరేబియా 23,25,29,34,92,93
అరేబియా సముద్రము 31,93
అల్లాడ వేమారెడ్డి, వీరారెడ్డి 88
అలెగ్జాండరు 27
అలెగ్జాండ్రియా 30
అశ్వనీదేవతలు 7
అశోకుడు 30
అస్సీరియా 29
అంగిరీజాలు చూ ఇంగ్లీషువారు
అదిత్యుడు 43,55
అనాము 39,42
అపస్తంబుడు 8,9
అఫ్రికా 2,7,25
ఆయుర్వేద వృక్ష శాస్త్రము 3
ఆరమ్సు 96
అర్మజా (చూ మయాస్ హోర్మజ్) 24,25,95
ఆర్మీనియనులు 97
ఆర్యులు/ఆర్యజాతి 8,25
అల్ ఇద్రిసి 72
అల్బట్రస్ 99
ఆసియా 20,32
ఆంధ్ర చరిత్రకారులు చూ. వీరభద్రరావు
ఆంధ్ర భృత్యులు 19
(ప్రాచీన) ఆంధ్ర నాణెములు 20,21,33,34,62
ఆంధ్ర (మహా) సామ్రాజ్యము 17,19,27,29,30,33,36,39-43,45,46,51
ఇమ్మడి తిక్కరాజా 64
ఇసుకపల్లి 101
ఇంగ్లాండు 96
ఇంగ్లీషు (వారు/వర్తకులు)/ అంగిరీజాలు 22,91, 94, 95, 97,98,100
ఇంజరము 99
ఈజిప్టు/ప్తు (ఐగుప్త) 20,22,24,26,28-30,32,34
ఉత్తర కోసల 12
ఋగ్వేదము 7
ఎగుమతి వస్తువులు 13,23,24,26,31,32,97
ఎఱ్ఱసముద్రము 96
ఎఱ్ఱాప్రగడ 78,79
ఎలియటు, సర్ వాల్టరు 52
ఎల్ఫిన్‌స్టన్ 51,55
ఐరావతి (నది) 47,48

ఐరోపా/యూరోపు ఖండము 23
ఐరోపియనులు/యూరోపియనులు 24,98-100
ఓడ దొంగలు 25,60,70,90,92
ఓడలరేవు (బెండమూరులంక) 91,99
ఓరుగల్లు 66,75
ఔత్తరాహులు 8,9
కటకశాల 26,43
కటికర్దమ 38,40
కన్నగర 38,40
కన్నింగుహాము, జనరలు 35,36
కన్హేరి గుహలు 18,19
కప్పలి 87
కమలనాభామాత్యుడు 74, 75
కర్ణాటక (చక్రవర్తులు/రాజులు/రాజ్యము) 82,84,88,91-94
కలకత్తా 98
కలప/కళ్ళి జాతులు 3
కలింగట్టు పరణి 63
కళాసులు 103
కళ్యాణపురము 41
కళ్ళికోట 26, 91-93
కళింగ (దేశము/రాజ్యము) 11-15, 34-36,40,46,51-56,60,93,100
కళింగనగరము 40,56
కళింగ పట్టణము 91,100
కళింగులు/కాళింగులు 14,19, 20,45
కాకతీయ (రాజ్యము/వంశము) 62,64,66,72,75,77
కాకినాడ 99
కాక్సు, యస్ డబ్ల్యు 48
కాటయవేమారెడ్డి 88
కాయి-జావాలిపులు 54
కాయిల్ (రేవుపట్టణము) 100
కార్లీ (గుహ) 19,43
కాల్పట్టణము 15, 60,74,75,101
కాల్డువెలు 26
కాళీపట్టణము 74,75
కావేరి (నది/రేవుపట్టణము) 15, 26, 38
కాశీ 13
కాశీఖండము 88
క్రాఫర్డు 56
క్లాడియస్ 30
కియో కొహిపియా జిల్లా 62
క్రీడాభిరామము 69,75
క్వీడా 95
కుతుబుశాహీ 93,94
కుమారగిరి రెడ్డి 82, 85,86,88
కురుంబా 52, 60
కులోత్తుంగ (చోళదేవుడు) 63,64,99
కుషానులు, కుషాను (చక్రవర్తులు/సామ్రాజ్యము) 29, 34
కూడూరు 26, 36,38-40,43,60
కృష్ణా (నది/మండలం) 1, 11, 14, 36-40,45,47,48,55, 63,71, 73,74,89,91,101
కృష్ణా పట్టణము /కొల్లిత్తురై/గండగోపాలపట్టణము 64, 65
క్లుప్తశుల్కము 69-71,82
కెటమరాన్ 96
కెన్నడీ 25
కేవు 10,103
కొచ్చి 95
కొట్టిస్ 38,40
కొడ్డూర 39

కొత్తపట్టణము, క్రొత్తపట్టణము 40,74
కొళ్ళం 100
కోడూరు 39
కోమటి వేమారెడ్డి 88
కోరి అగ్రము 35,36
కోరంగి 35,36,91,98,99
కోషకారాణములు 7
కంచి/కాంచి పట్టణము/పురము 19, 29, 46,52,54,60
కాంబోడియా (చంపకదేశము) 20,38,39,42,45,47, 52,56,61
క్లింగులు 52,54
కొంటకొప్పెల 39
కొండవీడు 78,82,85,88,90,93

గజపతులు 88,90
గణపతిదేవుడు 66,67,70-72, 79-83
గద్యానము (వరహా) 69
గ్రిఫ్ఫిత్సు 19
గ్రీకు భాష 24
గ్రీకు (లు) 22,26,29,31,37
గ్రీసు 20,24,29,32,34
గుడివాడ 33
గుప్త (సామ్రాజ్యము) 19
గుప్టీలు 103
గూడూరు 39,64
గొయరిస్ 36, 37
గోదావరి (నది/మండలం) 1,14,35 -38, 41,45,47,48,51,55, 73,91,97-99
గోల్కొండ 89,92-96
గోవా 87,92
గౌతమ శాక్యముని 18
గౌతమీపుత్ర (యజ్ఞశ్రీ) శాతకర్ణి 19, 20,33,42
గౌతముడు 8,9
గంగానది 13,14,29,34,35, 42, 51,87
గుంటూరు మండలము 37,66
గుండ్లకమ్మ (నది) 40

ఘూర్జరదేశము 41
ఘూర్జరులు 20,43
ఘంటసాల 36,38,39,60

చాళుక్య (యుగము/కాలము/ రాజ్యము/రాజులు/వంశము) 59-61, 66,100
(పూర్వ) చాళుక్యులు 50,57, 59-64,67,99
(ప్రాచీన) చిత్రకళా (శిల్ప) ప్రదర్శనము 2,17-20
చీనా/చైనా 2,7,20,23,25, 29,32, 38,39,42,47,53- 56,61, 63,72,86,87,91,93,95,96
చూళపూర్ణుడు 12
చెడుబా (నది/రేవుపట్టణము) 62
చోటంగి 87
చోళమండల (తీర)ము 15,30,34, 35,38,41,72,95
చోళు/డులు (తమిళ/తెలుగు/రేనాటి/ వెలనాటి) 60-64,99
చంద్రశ్రీ శాతకర్ణి 33

జపాను 2,38,61,72
జాక్సను 25
జాయవ నాయకుడు/దేవుడు 70,71
జావా/జవ/యవ 2,7,19,20, 38,39,42,43,45,47,49, 52-56,72

జెడ్రోసియా 25
జ్యేష్ఠ శాతకర్ణి 41
జైనమతము 59
జోగు 87
జాంజిబారు 73
జాంపియా, జాంబో 54

టాలెమీ, ఫైలోడెల్ఫస్ 30
టావెర్నియరు, జాను బాప్టిస్టా 94,95
టిన్నా 37
టెనేసరి 95
టెహరాన్ 87
టైబీరియస్ సీజరు 32
టోలమీ 27,28,37-40,98
ట్రింకోమలి 98

డామస్కసు 72
డిగ్రైన్సు ఓలోనాచెన్ 42
డూబ్రీలు 39
ఢిల్లీ 94

తటోను 47,48,50
తపూసా, పాలికాట్ 12
తరుణానగరము 86,87
తలైంగ్/తైలింగ్ 48-52
తవాయి 86,87
తాగర 40
తామ్రలిప్తి 11,14,15,30,34,53
తాళ్ళరేవు 91,97-99
తిప్పయ (సెట్టి), అవచి 85,86
తిలకసుందరి 36
త్రిలింగ (దేశ)ము 48,49,77
తుగ్రుడు 7
తురుష్కులు 22,77,78,88,90,94
తండేలు 103

దత ధాతువంశము 11,17
దక్షిణదేశీయులు, దాక్షిణాత్యులు 8,9,54
దక్షిణా పథము/ దక్షిణ హిందూ దేశము/స్థానము 8,20,24-26, 29-34,39-41,48,49
దానార్ణవుడు 61
ద్రావిడ జాతులు/భాషలు 25, 26,54
దిగుమతి వస్తువులు 23, 86
దిఘనికయ 14
దివిలి 101
దేవగిరి 41
దేవరాయ వొడయలు 83,84
దంతకుమారుడు 11,12,14,17
దంతపురము 11,14,35,36
దొంతికుఱ్ఱు 36

ధరణికోట 11,12,17,33,45
ధర్మరాజా 7,8
ధర్మశోకుడు 11
ధర్మసూత్రములు, గౌతమ/బోధాయన 8,9
ధాన్యకటకము 35, 40

నకులుడు 7,8
నఖూదా 103,104
నరసన్నపేట 36
నరసాపురము 91,97,98
నరసింహవర్మ, మహామల్ల 61
నాగరాజా(లు) 12,17
నాగావళి (నది) 36
నాగులదేశము, నాగులు 12,18

నాణెములు, పురాతన 2,20,33
నీలపల్లి 99
నెయింగ్గైనా 38,40

నెల్లూరు (ప్రాంతం/మండలం) 33,40,60,64,74,77, 88,101
నైలునది 30
నౌక, విశేష తరగతి/జాతి 4
నౌక, సామాన్య తరగతి/జాతి 4
నౌకానిర్మాణము 2,3,6,19,22, 41,73,97
నౌకానిర్మాణ శాస్త్రము 2,3,14
నౌకా పరిశ్రమ 3
నౌకా యుద్ధము/యుద్ధ నౌకలు 5,7,41,61
నౌకా లక్షణములు 3,4
నౌకాశ్రయము 1,14,22,27, 35-38,41,60,61,65,90, 95,97-99
నంగెగడ్డ / నంగెడ్డ 70, 71
నిందాయము 103

ప్రతాపరుద్రుడు 69,74,75
ప్రతిష్ఠాన పురము, నగరము (పైఠాన్) 35, 41
పరాసులు 22,91,94,97,100
పల్లవ యుగము/సామ్రాజ్యము 19,45,57,59
పల్లవులు 46,50,52-54,60-63
పశ్చిమ సముద్రము 12,19,29,46
పారశీక (దేశము/సామ్రాజ్యము) 13,23-25,29,34,92,95
పారశీక సింధుశాఖ 24,25,30, 87,91,97
పారశీకులు 26,29,38,91,97
పారిసు 23
పాలీ(భాష/వాఙ్మయము/ సారస్వతము)/బౌద్ధ సారస్వతము 2,6,10, 11,22, 25,35,47
పాలూర 26,38,40
ప్రాచీనవస్తు పరిశోధన శాఖ 2
పినాకిని (పెన్న నది) 1,12,14, 35,37, 38,40,52,63
పుదుక (పుదుచ్చేరి) 38
పులుమావి 33,42,46
పూడిమెడక 101
పూర్ణవర్మ 54,55
పూర్వసముద్రము 19,29
పూర్ణుడు 12,14
పెగూ (దక్షిణ బర్మా) చూ సువర్ణ భూమి 45,47, 50,51, 52,61,87,95
పెదకోమటి వేమారెడ్డి 85
పెరిప్లసు గ్రంథకారుడు 27,28,33, 35, 37,38,40,41,98
పేరుపాలెము 101
పైశాచీ (భాష) 49
ప్లినీ 27,28,30,31,33,35,37,98
పాపీయ (నీరోచక్రవర్తి) 31
పొలోమిన్ 42
పండువానగరము 87
పాంబన్ జలసంధి 87
పుంజారి 104

ఫ్రయరు, డాక్టరు 96,97
ఫాహియాను 53
ఫ్రాన్సు 95
ఫినీషియనులు 22, 26
ఫెయిరు, సర్ ఆర్థరు 47-52
ఫెర్గూసన్ 12, 35,36,45
ఫ్లెమింగ్హాము, సర్ అలెగ్జాండరు 18
ఫైట్చీ, లెఫ్టినెంటు జనరల్ 48

బర్మా 12,20,32,35,38, 39, 42, 47-52, 55,61-64, 72, 87,96,97

బర్నెలు 54
బలిద్వీపము 56
బవేరు జాతకకథ 13
బహమనీ/ భామినీ రాజ్యము/ సుల్తానులు 38,77,88-94
బాపట్ల 37, 66
బాబిలోను 13,23-25,29
బాలసూరు 97
బ్రాహ్మణ మతము 6,45,46,59
బ్రిటీషు (ప్రభుత్వము/ ప్రభువులు/ వారు) 3,97
బుడతకీచులు 22,92,94,97,100
బుద్ధగట 51
బూలరు, జార్జి 6,8
బృహత్ఫాలాయనులు 39,40,50
బెయిటనుబర్గు 54
బెరినికా 30
బోర్నియో/ భరణి 20,38,45,47, 55,56,72
బౌద్ధభిక్షువు 15,43,45,52,53,55
బౌద్ధమతము 1,6,11,12,43, 45,46,50,52,53,55-57, 63,100
బోధి 99,105
బోధాయనుడు 8,9
బౌరి, తామసు 95-98
బంగాళము/ వంగదేశము (బెంగాలు) 23,38,73,87,95
బంగాళాఖాతము 12,27,31,47, 51,55,95
బొంబాయి 18

భరత ఖండము/ వర్షము 1,20-22, 24, 29,30,43,45,51-53
భరతసంతతి (భారతజాతి/ భారతీయులు) 2,3,22
భరుకచ్ఛ (బ్రోచ్) 13,15,24,25, 30,34,35,37,40,41
భీమేశ్వర పురాణము 74
భుజ్యుడు 7
భోజపురము 56
భోజన్నవతి 3,4,5,13
భండార్కరు 33,56
భండారి 103

మక్కా, మదీనా 93-96
మగధ (దేశము/ సామ్రాజ్యము) 6,11,12,23,42
మచిలీపట్టణము/ మసూలా/ బందరు/ మచిలీ బందరు 37-39,89, 91-97
మధ్యధరాసముద్రము 29
మన్ (జాతి/ భాష/ రాష్ట్రము/ లిపి) 47-50
మనార్పా 38,40
మనుమసిద్ధి 64
మనువు/ మనుస్మృతి 9,10
మయూస్ హార్మజ్/ హురుమంజి 30, 86, 87,95
మలగ 31,73
మలబారు/ మాబారు 30,37,41, 72,73
మలయభాష
మలాకా (ద్వీపకల్పము) 39,42,52, 55, 56,61,95
మల్లారెడ్డి 78,79
మహమ్మదు కుతుబుశాహి 94
మహాజనక జాతకము 13
మహానది 38
మహాభారతము 7,8
మహావంశము 11,12,36

మహాసేనము 56
మహేంద్రగిరి 35
మాధవాయిపాలెం 98
మానిల్లా (మనీలా) 95
మామళ్ళపురము 61,105
మారిస్ 97
మార్సెడను 52
మార్కోపోలో 70-73
మాలిము/ మాలెం 98,103,104
మాళవదేశము 19
మాసీ, లెఫ్టినెంటు 18
ముఖర్జీ, రాధాకుముద 10,18,19,33
ముజిరిస్ (రేవుపట్టణము) 30
మెగాస్థనీసు 27
మె(/మ)డగాస్కరు 2,95
మెయిస్లీ, జనరలు 18
మైసాలియా/ మసాలియా/
వైసోలియా/ మోసలపురము (చూ.మోటుపల్లి) 26,36,37, 38, 40,66
మైసోలస్/ మయిసోలస్ 37-40
మోటుపల్లి/ ముకుళపురము/ దేశ్యుయ్య కొండ/ వేలానగరము 37,38, 61,66,67,70-72,78-80, 82-85, 88-93
మోల్మేను/మోల్‌మేన్ 97,98
మౌర్య సామ్రాజ్యము 29

యజ్ఞశ్రీశాతకర్ణి 33,34
యాజ్ఞవల్క్య సంహిత 10
యానాము 99
యుక్తికల్పతరు 3,4,14
యూదులు 22

రాచకొండ 77,90
రాజమహేంద్రవరము 35,65,88,90
రాజరాజనరేంద్రుడు 62,63
రామాయణము 7
రామ్రి ద్వీపము 62
రాలిన్సను 34,41
రాష్ట్రకూటులు 59
రీ, అలెగ్జాండరు 20,34
రుద్రమదేవి/ రుద్రాంబిక 70,72
రూక 69,71,84,85
రెడ్డి ప్రభువులు/ రాజులు/ రాజ్యము 65,77-79,83-85,88,90,91,93
రైసు డేవిడ్సు 25
రోబెక్, ఎబినీజా 99
రోమక నాణెములు 20,32-34
రోమక/ రోమను/ రోము (నగరము/ దేశము/ సామ్రాజ్యము) 2,20, 23,24,27-34,42,45
రోమకులు/ రోమనులు 22, 26-32, 35
రంగం/ రంగూను 97,98

లిమూరిక్ 41
లోహిత సముద్రము 7
లండను 23

వజ్రాలదిన్నె 11-14
వజ్రంగులు/ వజ్రపువనివారు 3,13
వర్తకస్థానము 1,7,11,22, 26, 35-37, 39, 41,48,55, 56, 60,65,66, 78,95,99
వలందులు 22,94,97,100
వాతాడ 101
వాసిష్ఠీపుత్రశ్రీపులమావి 19
విజయనగర (సామ్రాజ్య)ము 83,85, 88-92
విజయ రాజకుమారుడు 11
వినయ పిటకము 12
విమల, తమల 50
విశాఖపట్టణము 77,88,91,99,101

విష్ణుకుండినులు 50
వీరభద్రరావు, చిలుకూరి 34,37,53
వీరేశలింగంపంతులు, కందుకూరి ,74,75
వెనీషియనులు 22
వెలమనాయకులు 77,90
వేమారెడ్డి, దేసటి 78
వేమారెడ్డి, (దేసటి)పోలయ 78-81, 83
వంగవోలు 77
వంశధార (నది) 1,14,100
వింధ్యపర్వతము 8
వేంగి (పురము/దేశము/రాజ్యము) 39,40,46,51,53,54,56,60,66,93
శక్తివర్మ, మొదటి 62
శాతవాహనులు 17,46,50,51
శాలివాహన శకము 56
శివరాత్రి మహాత్త్యము 88
శివాజీ 66
శ్రీకాకుళ (నగర)ము 11,12,36
శ్రీ త్రిభువనదేవ చక్రవర్తి (కియాన్‌జిట్టా) 63,64
శ్రీనాధుడు 74,85-88
శ్రీభోజనగరము 56
శూర్పరాగ/సోపార/సూరతు 12,13, 15,24,25,30,34,40,41,92
శ్రేణులు 43
శంబలదీవి 101
శాంతమహాసముద్రము 7
శృంగళద్వీపము 100
సముద్దవణిజ జాతకము 13
సయామవు 20,32,35,39,45, 47,56,61,62,95
సరంగు 103
సాలంకాయనులు 50
సాల్సెట్టి (ద్వీపము) 18
సాళువవంశము 92
సిద్ధయదేవమహారాజా 70
సిరియను(లు) 33, 97
సిల్లా 31
స్మిత్తు, విన్సెంటు 20,32,33,42
సుగ్రీవుడు 7
సుపట్టణము 26,38
సుప్పర జాతకము 13
సుమత్రా/సువర్ణ ద్వీపము 2,7,20, 38,42,45,47,49,52-56,72,95
సువర్ణపురి (సువమ) 12
సువర్ణభూమి (దక్షిణబర్మా) 13, 47, 48,50
సుషింగ్ షిహ్ 63
సూత్ర కారులు/యుగము సారస్వతము 8-10,14
స్యూయెలు, రాబర్టు 20,32
సూలియామ్ 72
స్టూవర్టు, కోహెను 54
స్మృతికర్త(లు) 9,10
స్ట్రేబో 30
సంఖ జాతకము 13
సంస్కృత(హైందవ)వాఙ్మయము/ సారస్వతము 2,6,17,22,25
సాంచీ 17-19
సింధు (నది) 29,30
సింహపురము 34,36
సింహళ (ద్వీప)ము 11-15,18, 20,30,34-37,47,51,53, 86,95
సుంకవము 9,60,69,71,75, 81-84,92
సుందర శాతకర్ణి 41
హరవిలాసము 85
హరివంశము 78,79

హరిహరరాయలు, రెండవ 82,83,85
హవుటను, క్రిస్టొఫరు 95
హిప్పాలను 28,31,37,41
హీబ్రూ 25,26,34
హిందూ - చైనా 20
హిందూదేశము 1,2,8,5,11,18, 20,22-25,27,29-31,33, 42,45,47-50,53,55,56, 62,87,94-96
హిందూ మహాసముద్రము 2,14,27, 28,31,37,51,55,73
హిందూ/హైందవ నావికులు/నౌకలు 4,14,47
క్షాత్రప భూమకుడు 41
క్షాత్రప సహపాలుడు 41
క్షేమ విధానకరణము 10

★★★

# Occasional Papers

**in language and literature**

**Budaraju Radhakrishna**

**ISBN: 81-7443-007-5**
**Demmy 800 166 pages HB** **Rs.200/-**

The book is a collection of selected papers and articles which were previously published elsewhere Almost half of them relate to Telugu language and literature in particular Even so, they contain theoretical discussions which are equally relevant to other Indian languages

The problems faced in creating technical terminologies discussed in some papers have a bearing on the socio-linguistic aspects of modernization of the developing languages of India in the fields of instruction and administration Discussions pertaining to diglossia as a socio-linguistic phenomenon provide insights into the concept and accounts for the various theories

The author tries to present linguistic and literary problems alongside of theoretical constraints and offers practical solutions with down-to-earth philosophy.

**Contents :** Homomorphy and Semantic Restrictions in Telugu, Is Negative a Tense in Telugu ?, Role of Poetry in Language Teaching; Some Rare Alternations in Telugu Dialects, Methodological Contribution of Telugu Dialect Dictionaries, Grammatical Theories and Lexicography in Telugu, Grammar Teaching in Telugu, Contributions of European Scholars to Telugu Grammar and Lexicography, Language Movements in Telugu, Language Surveys in India, Language Use in Administration of Law; Terminology, etymology and Linguistics, Diglossia in Telugu, Study of Diglossia and Telugu Situation, Diglossia and Related Concepts, Place Names and Literature, Telugu Language and Literature, India a Literary Area - Unsolved Problems in Literary Trends

## GANDHI IN THE TWENTY FIRST CENTURY
### An Alternative Approach to Development

Editor VASANT KUMAR BAWA

ISBN : 81-7443-009-1
Demy 8 vo., XVIII + 106 Pages, H.B. Rs. 125/-

"This valuable study of Mahatma Gandhi's thought is a product of a seminar held at Hyderabad attended by scholars administrators and social activists The great merit of this book is that it focusses not only on the theoretical and historical perspective, but on the possibilities of integrating Gandhiji's ideas into the political, social and economic framework today

B R NANDA, Historian

This is a very timely publication We find that the relevance of Gandhiji's teaching and message is increasing day by day Gandhiji provided answers to the contemporary development problems such as increasing rich-poor divide, feminisation of poverty, environment degradation and jobless economic growth This book contains answers to many of these questions

M S. SWAMINATHAN, Scientist

The application of science and technology has brought about vast changes in human society during the present 20th century. Today there is large-scale poverty in the midst of abundance Consumerism has taken hold of the society where more and more material possession is the human goal It is the greed of the few which has brought about the vast disparity between the rich and the poor Gandhiji warned that there is enough in nature to meet the needs of every individual but not to satisfy the greed of the people He warned against the development of a consumerist society.

Moreover, environmental pollution has become a threat to the very existence of humanity It is in this context, Gandhian philosophy of economic development and social welfare becomes relevant. I hope many will take advantage to go through this book to understand the Gandhian approach to the economic and social development.

C SUBRAMANIAM, Bharat Ratna

**Gandhi in the 21st Century** is a book which updates the Mahatma and provides guidelines for a better future of humanity through a new paradigm which is a revival of *Small is Beautiful* Schumacher called Gandhi the greatest economist of the century who silhouetted an economic approach where the human being matters

If India's billion humans struggling for survival are to win they must experiment with the ideas the book presents

V R. KRISHNA IYER, Jurist

# మా ప్రచురణలు

ఆధునిక వ్యవహారకోశం

- బూదరాజు రాధాకృష్ణ  రూ 100/-

వంతెన (కథా సంకలనం)

- ఉషారాణి భాటియా  రూ 50/-

పురాణ నామచంద్రిక

- యెనమంద్రం వెంకటరామయ్య  రూ. 95/-

కావ్యాత్మ

- శేట్లూరి వెంకటరాఘవయ్యంగారు  రూ. 70/-

ప్రాకృత గ్రంధకర్తలూ ప్రజాసేవానూ

- పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి  రూ. 30/-

పోరాటాల బాటలో... అనుభవాలు, జ్ఞాపకాలు

- యస్ వి కె ప్రసాద్, సుగుణ  రూ. 40/-

ఆంధ్ర వాఙ్మయ సూచిక

- కాశీనాధుని నాగేశ్వరరావు  రూ. 480/-

సంస్కృతాంధ్ర నిఘంటువు

- వెత్సా వెంకటశేషయ్య  అచ్చులో

మాధవ నిదానము

- ఆంధ్రవాఖ్య పండిత డి గోపాలాచార్యులు  అచ్చులో

**Random Writings**

- Dr Raj Bahadur Gour  Rs 250/-

**Occasional Papers** in language and literature

- Budaraju Radhakrishna  Rs 200/-

**Gandhi in the Twenty First Century**

An Alternative Approach to Development

- Ed Vasant Kumar Bawa  Rs 125/-

సుందరయ్య విజ్ఞాన కేంద్రం
A C.No. [illegible]
-500032

PRACHEENAANDHRA NAUKAJEEVANAMU
*Bhavaraju Venkata Krishna Rao*

నౌకాయానంతో
తెలుగు తేజం
నలుదిక్కులా ప్రసరించినకాలానికి-

తెలుగు నాగరికత
ననలుసాగి
ద్వీపద్వీపాంతరాల్లో నాటుకుని
పట్టంకట్టుకున్న స్వర్ణయుగానికి-

నౌకానిర్మాణ నైపుణ్యంలో
విదేశవ్యాపారదక్షతలో
ఆద్యులుగా అనన్యులుగా
నిలిచిన తెలుగువారి
కీర్తి పతాకకు **దర్పణం**

రెండువేల సంవత్సరాల
మన నౌకా జీవన చరిత్రను
సాక్ష్యాధారాల సమన్వయంతో
సాక్షాత్కరింపజేసే
ఏకైక అక్షర నీరాజనం.

ISBN : 81-7443-012-1